సత్యమేవ జయతే


# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 361

బుధవారం 13-9-2023

'నా అక్కలూ..చెల్లెళ్లు... తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'


SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




## లంకను గెలిచి..

ఆసియా కప్ టోర్నీలో భారత జట్టు ఫైనల్లోకి ప్రవేశించింది. సూపర్–4 దశలో శ్రీలంకతో జరి గిన మ్యాచ్‌లో భారత్ 41 పరుగుల తేడాతో విజయం సాధించింది. రోహిత్ 53 పరు గులు చేయగా.. కుల్దీప్ 4 వికెట్లు తీసి సత్తా చాటాడు.

12 లో




## లాభాల స్వీకరణ

ఇంట్రాడేలో 412 పాయింట్లు పెరిగి 67,539 వద్ద జీవిత కాల గరిష్టాన్ని నమోదు చేసిన సెన్సెక్స్ చివరికి 94 పాయింట్ల లాభంతో 67,221 వద్ద ముగి సింది. నిఫ్టీ 114 పాయింట్లు ఎగసి 20,110 వద్ద కొత్త ఆల్‌టైం హైని అందుకుంది.

13 లో



## వారికి కొత్త యూనిఫామ్..

కొత్త భవనంలో పార్లమెంట్ ప్రత్యేక సమావే శాల నేపథ్యంలో ఉద్యోగుల యూనిఫామ్‌ను మార్చాలని కేంద్రం నిర్ణయించింది.

వివరాలు 6లో ►




## జీ20 ఖర్చు రూ.4,100 కోట్లా!

జీ20 సదస్సు కోసం కేంద్రం రూ.4,100 కోట్ల ఖర్చు చేయడంపై కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలు మండిపడ్డాయి.

వివరాలు 6లో ►



## మణిపూర్‌లో మళ్లీ హింస

మణిపూర్‌లోని కాంగ్‌పోక్పి జిల్లాలో ముగ్గురు గిరిజనులను మంగళవారం కొందరు సాయుధులు తుపాకులతో కాల్చిచంపారు.

వివరాలు 6లో ►



## రష్యా గడ్డపై కిమ్ జోంగ్ ఉన్

ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ పటిష్ట భద్రత మధ్య బుల్లెట్‌ప్రూఫ్ రైలులో మంగళవారం రష్యాకు చేరుకున్నారు.

వివరాలు 6లో ►

## న్యూస్‌రీల్

### ఏపీ జైళ్ల శాఖ అన్ని రాష్ట్రాలకు ఆదర్శం



'రాష్ట్ర ప్రభుత్వం జైళ్ల శాఖలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఏపీ జైళ్ల శాఖ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. ఖైదీలకూ కార్పొరేట్ వైద్యం, నైపుణ్య శిక్షణ ఇవ్వడం మంచి ఆలోచన' అని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.

వివరాలు 3లో ►

### నేడు అల్పపీడనం!



బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడనుంది. అనంతరం ఇది మరింత బలపడనుంది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తాలో అనేక చోట్ల, దక్షిణ కోస్తాలో కొన్నిచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

వివరాలు 3లో ►



# ఇల్లు కాదు జైలే..

## ఇంటి వద్ద కంటే అక్కడే భద్రత ఎక్కువ

## బాబుకు జైలే భద్రం

### చంద్రబాబుకు ఏసీబీ కోర్టు స్పష్టీకరణ

- 'హౌస్ రిమాండ్' పిటిషన్ కొట్టివేత.. ఏ చట్టంలోనూ దీనిపై నిర్దిష్ట ప్రస్తావన లేదని వ్యాఖ్య
- సుదీర్ఘ వాదనలను సహనంగా ఆలకించిన కోర్టు
- ఇరుపక్షాలతో సందేహాల నివృత్తి అనంతరం తీర్పు




- రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో పూర్తిస్థాయి భద్రత
- ఆయనకే ప్రత్యేకంగా పూర్తి బ్లాక్ కేటాయింపు
- సాయుధ సిబ్బందితో భద్రత.. సీసీ కెమెరాల్లో పర్యవేక్షణ.. ప్రత్యేక వైద్య బృందం.. న్యాయస్థానానికి నివేదించిన జైళ్ల శాఖ

10 లో

సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ఏసీబీ కోర్టులో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. తనను జైలులో కాకుండా హౌస్ రిమాండ్ (ఇంటి వద్ద)లో ఉంచాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం కొట్టి వేసింది. హౌస్ రిమాండ్‌కు సంబంధించి ఏ చట్టంలో కూడా ఎలాంటి నిర్దిష్ట ప్రస్తావన లేదని స్పష్టం చేసింది. అందువల్ల హౌస్ రిమాండ్ విషయంపై విచారణ జరిపే పరిధి ఈ కోర్టుకు (ఏసీబీ కోర్టు) లేదని పేర్కొంది. అంతేకాక హౌస్ రిమాండ్‌లో ఎందుకు ఉంచాలనేందుకు చంద్రబాబు సరైన కారణాలను తమ ముందుంచలేదని తెలిపింది. హౌస్ రిమాండ్ విషయంలో న్యాయస్థానాన్ని పిటిషనర్ ఒప్పించలేకపోయారని, భద్రత విషయంలో ఇంటి వద్ద కంటే జైలు వద్దే ఎక్కువ భద్రత ఉంటుందన్న అభిప్రాయాన్ని ఏసీబీ కోర్టు వ్యక్తం చేసింది. ప్రత్యేక భద్రతా దళం (ఎస్‌పీజీ) భద్రత ఉన్న వ్యక్తికి అదే స్థాయిలో ఇంటి వద్ద భద్రత కల్పించడం సాధ్యం కాకపోవచ్చునంది. చంద్రబాబు భద్రత కోసం జైలులో పూర్తిస్థాయి చర్యలు తీసుకున్నామన్న

మిగతా 2వ పేజీలో ►



## బ్రహ్మోత్సవాలకు సీఎం వైఎస్ జగన్‌కు ఆహ్వానం

2 లో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సాలకట్ల బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, మంత్రి కొట్టు సత్యనారాయణ, ఈవో ధర్మారెడ్డి

## బాబుతో కుటుంబసభ్యుల ములాఖత్

- రాజమండ్రి జైల్లో కలిసిన భార్య భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి
- చంద్రబాబు కట్టించిన బిల్డింగ్‌లోనే ఆయన్ని కట్టిపడేశారన్న భువనేశ్వరి.. నంబర్ వన్ సౌకర్యాలు లేవని ఆవేదన
- బాబు భద్రతపై ఆందోళన

- వివరాలు 10లో

## పింఛన్లు 65,98,138

- గత నాలుగేళ్లలో ఇచ్చిన కొత్త పింఛన్లు ఏకంగా 28.26 లక్షలు
- పింఛన్లు తీసుకుంటున్న ప్రతి పది మందిలో నలుగురికి కొత్తగా మంజూరైంది జగన్ ప్రభుత్వంలోనే..
- అవ్వాతాతల పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం రికార్డు.. నేడు కొత్తగా మరో 1.93 లక్షల మందికి మంజూరు

2 లో



సోలార్ డ్రయ్యర్లలో ఎండు చేపలు

# చేపా చేపా ఇక ఎండాల్సిందే..

## ఎండు చేపల తయారీలో ఆధునిక పద్ధతులు

- సోలార్ డ్రయ్యర్ల ద్వారా ఎండబెట్టే ప్రక్రియ
- వీటి వినియోగంపై మత్స్యకారులకు శిక్షణ
- వాతావరణ ఇబ్బందులకు చెక్
- ప్రభుత్వ సబ్సిడీ..రుణ సదుపాయం

పిఠాపురం: చేపల్ని ఎండబెట్టడానికి మునుపటి కష్టాలు పోయాయి. రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిన డ్రయ్యర్లతో ఎంచెక్కా ఎండతో పనిలేకుండా ఎండబెట్టుకోవచ్చు. ఎండు చేపల తయారీలో ఎన్నో ఇబ్బందులు. వాటిని ఊరబెట్టడం ఒక ఎత్తయితే ఆరబెట్టడం మరో ఎత్తు. పగలు ఎండినా రాత్రి వేళల్లో మంచు ఎక్కువగా ఉంటే ఎండిన చేపలు మళ్లీ మెత్తబడిపోతాయి. ఒక్కోసారి అకాల వర్షాలు పెద్ద ఆటంకంగా తయారవుతాయి. ముఖ్యంగా వర్షాకాలంలో ఎండ తక్కువగా ఉండడం వల్ల చేపలు ఎండడానికి ఎక్కువ రోజులు పడుతుంది. తీరా ఎండలో కాస్సేపు ఎండినా వర్షం పడిందంటే ఎండు చేపలను కాపాడుకోడానికి మత్స్యకారులు పరుగులు తీయాల్సిందే. ఇదంతా గతం..సాంప్రదాయ పద్ధతుల్లో కాకుండా ఎండు చేపల కోసం ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం సోలార్ డ్రయ్యర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటిపై మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్నారు ఫుడ్ ప్రోసెసింగ్ అధికారులు.

### ఏమిటీ సోలార్ డ్రయ్యర్

సోలార్ డ్రయ్యర్ ద్వారా నాణ్యత కోల్పోకుండా తక్కువ సమయంలో చేపలను ఎండబెట్టుకోవచ్చు. ఎండిన చేపలను ఎక్కువ రోజులు నిల్వ ఉండే విధంగా ..నాణ్యత ప్రమాణాలు లోపించకుండా ప్యాకింగ్ చేసుకునే అవకాశం కూడా ఇందులో ఉంది. మత్స్యకారులు ఈ డ్రయ్యర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారు. కరెంటుతో పని లేకుండా చేపలను ఎండబెట్టుకోడానికి ఇవి ఉపయోగకరంగా ఉంటాయి. తక్కువ స్థలంలో ఎక్కువ చేపలను ఆరబెట్టుకోడానికి వీలు కలుగుతుంది. ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ అండ్ మైక్రో ఫుడ్ ప్రోసెసింగ్ ఎంటర్‌ప్రైజస్ ద్వారా మత్స్యకారులకు 35 శాతం రాయితీ, 65 శాతం రుణ సదుపాయంపై వీటిని ప్రభుత్వం అందించనుంది. 80 కేజీల నుంచి 500 కేజీల చేపలు ఎండబెట్టుకుని ప్యాకింగ్ చేసుకునేలా మిషన్లు అందుబాటులోకి వచ్చాయి.

### చిన్న జాగా చాలు

గతంలో ఎండు చేపలు ఆరబెట్టు కోవడానికి సముద్రపు ఒడ్డున పెద్దగా ఖాళీ స్థలు ఉండేవి. రానురానూ సముద్ర కోత వల్ల ఖాళీ స్థలాలు లేకుండా పోయాయి. దీంతో మత్స్యకారులు ఎండు చేపల తయారీకి స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సోలార్ ఎండు చేపల తయారీ విధానం లో కలిసొచ్చింది. చిన్న జాగా ఉంటే చాలు 500 కేజీల వరకు ఎండు చేపలను తయారు చేసుకునే వీలు కలుగుతుంది.

### ఒక్క రోజులోనే ఎండుతాయి

సాధారణంగా ఎండు చేపల తయారీ అంటే రోజుల తరబడి ఉంటుంది. చేపలను ఉప్పులో ఊరబెట్టి ఎండబెడిగే ఐదు రోజుల నుంచి వారం రోజులు పడుతుంది. అది కూడా ఎండలు బాగా ఉంటేనే సాధ్యమవుతుంది. వర్షాలు, మబ్బులు ఉన్న సమయంలో ఈ చేపల తయారీ నిలిచిపోతుంది. ఇలాంటి బాధలకు సోలార్ యంత్రం చెక్ పెడుతుంది. మబ్బులున్నా చిన్నపాటి ఎండ ఉన్నా ఎక్కువ వేడి ఉత్పత్తి అవ్వడం వల్ల 24 గంటల్లోనే చేపలు పూర్తిగా డ్రై అయిపోతాయి. దీంతో సమయం ఆదా అవ్వడంతో పాటు కూలీల ఖర్చు తగ్గుతుంది. డిమాండ్‌కు తగ్గట్టుగా రోజూ ఎండు చేపలు సరఫరా చేసే అవకాశం ఉంటుంది.

### ప్రత్యేక ప్యాకింగ్

ఇప్పటి వరకు ఎండు చేపలను తాటాకు బుట్టలలో ప్యాకింగ్ చేసే వారు. దీనివల్ల వర్షాల సమయంలో రవాణా చేసేటప్పుడు చేపలు తడిసి పాడైపోయేవి. మత్స్యకారులు నష్టాలను చవి చూసే వారు. ఇప్పుడు ఎండిన చేపల రంగు మారకుండా నాణ్యత కోల్పోకుండా ప్రత్యేకంగా ప్యాకింగ్‌చేసుకునే మిషన్లు కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటి ద్వారా ఆకర్షణీయమైన కవర్లలో ఎండు చేపలను ప్యాకింగ్ చేస్తున్నారు. కొనుగోలుదారులను ఆకర్షిస్తున్నారు. దీనివల్ల అమ్మకాలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఎగుమతులకు ఆస్కారం కలుగుతుంది.



### ఇబ్బందులు ఉండవు

"ఎండు చేపల తయారీకి చాలా ఇబ్బందులు పడేవాళ్లం. పచ్చి చేపలు తెచ్చి ఉప్పులో ఊరబెట్టి నాలుగైదు రోజల తరువాత బయటకు తీసి ఆరబెట్టేవాళ్లం. కనీసం వారం రోజులైనా ఎండ కాస్తేనే అవి ఎండుతాయి. మధ్యలో వాన పడితే మళ్లీ అన్ని రోజులు ఎండబెట్టాల్సిందే. ఇలా చాలా సార్లు నష్టాల పాలయ్యేవాళ్లం. సోలార్ డ్రయ్యర్ల వల్ల పెద్దగా ఎండతో పని లేక పోగా తక్కువ స్థలంలో చేపలు ఎండబెట్టుకోవచ్చు. తద్వారా ఇబ్బందులు తొలగుతాయి. ఈ పద్ధతి బాగున్నట్టు కనిపించింది.

– కారే చిట్టెమమ్మ, ఎండు చేపల వ్యాపారి, ఉప్పాడ, కొత్తపల్లి మండలం

### 150 యూనిట్లు ఏర్పాటు లక్ష్యం

"జిల్లాలో అతి ప్రధానమైన ఆహారంలో ఎండు చేపలు ఒకటి. వాటిని ఆరోగ్యకర పద్ధతుల్లో తయారు చేయడానికి ఏపీ ఫుడ్ ప్రోసెసింగ్ సోలార్ డ్రయ్యర్ల వినియోగంపై మత్స్యకారులకు శిక్షణ ఇస్తోంది. ఇప్పటివరకు ఐదు యూనిట్లు ఏర్పాటయ్యాయి.150 మత్స్యకార మహిళా సంఘాలతో 150 యూనిట్ల ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. సోలార్ డ్రయ్యర్ రూ. 2 లక్షలు, ప్యాకింగ్ మిషన్‌తో కలిపి అయితే రూ.5 లక్షలు వ్యయమవుతుంది. ప్రతి రెవిన్యూ డివిజనుకు ఒక రిసోర్సు పర్సన్‌ను నియమించాం. వీరు మత్స్యకారులకు సోలార్ డ్రయ్యర్ల వినియోగం, ప్యాకింగ్, వ్యాపార మెళుకువలు చెప్పి సహకారం అందిస్తారు.

– మారుతి, ఏపీఫుడ్ ప్రొసెసింగ్ సొసైటీ జోనల్ మేనేజర్, కాకినాడ

# వరిలో డ్రోన్ల సాయం

సాక్షి, భీమవరం: రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సాగు ఖర్చులను తగ్గించి వ్యవసాయాన్ని పండుగ చేసే సంకల్పంతో సాంకేతిక సాయం అందిస్తుంది. వరి సాగులో కూలీల కొరత, పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తూ అండగా నిలుస్తున్నారు. గ్రామాల్లో సైతం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచడమేగాక తక్కువ ధరకు రైతులకు విక్రయించే ఏర్పాట్లు చేశారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను సబ్సిడీపై అందిస్తూ రైతులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు.

### 5.60 లక్షల ఎకరాల్లో వరిసాగు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 5.60 లక్షల ఎకరాల్లో వరి సాగుచేస్తుండగా ఎక్కువ మంది కౌలు రైతులే. వరిసాగులో కూలీల కొరతను అధిగమించడానికి ఇప్పటికే వరినాట్లు, కోత యంత్రాలతోపాటు, దుక్కుదున్నడం, గట్టు లంకలు వేయడం, వరిగడ్డిని కట్టలు కట్టడం వంటి పనులకు యంత్రాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ట్రాక్టర్లు, వరికోతయంత్రాలు, టార్పలిన్లు, స్ప్రేయర్లు వంటి వాటిని ప్రభుత్వం దాదాపు 40 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తుంది.

### సబ్సిడీపై డ్రోన్లు

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు మరింత అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం డ్రోన్లతో పైరుపై పురుగుమందులు పిచికారీకి కార్యాచరణ రూపొందించింది. ఒక పంట కాలంలో ఎకరం విస్తీర్ణంలో పురుగు మందు స్ప్రేయర్లతో పిచికారి చేయాలంటే దాదాపు రూ.3 వేలకు పైగా ఖర్చవుతుంది. అదే డ్రోన్ సహాయంతో చేయిస్తే కేవలం రూ.1,350కే పూర్తవుతుంది.



- డ్రోన్లతో పురుగు మందుల పిచికారీ.. రూ.12 లక్షల డ్రోన్‌పై 40 శాతం సబ్సిడీ
- 50 శాతం బ్యాంకు రుణం మంజూరు
- ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 40 గ్రూపుల ఎంపిక



### 40 శాతం ప్రభుత్వ రాయితీ

డ్రోన్ ఖరీదు సుమారు రూ.12 లక్షలు కాగా దీనిలో ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుంది. 50 శాతం బ్యాంకు రుణం ఇస్తారు. ఐదుగురు రైతులు ఒక గ్రూప్‌గా ఏర్పడి కేవలం 10 శాతం సొమ్ము చెల్లిస్తే సరిపోతుంది.

### లాంఫామ్‌లో శిక్షణ

డ్రోన్ల వినియోగానికి ప్రత్యేక శిక్షణ అవసరం. విమానాలు ప్రయాణించే ప్రాంతాల్లో డ్రోన్లను వాడితే విమాన ప్రయాణానికి ఇబ్బందులుంటాయి. అందువల్ల డ్రోన్లు నిర్వహించేవారికి సివిల్ ఏవియేషన్ అనుమతి తప్పనిసరి. దీంతో డ్రోన్స్ వినియోగంపై రైతు గ్రూపులో ఒకరికి లామ్ ఫామ్‌లో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో 29 గ్రూపులను ఎంపిక చేయగా వారికి శిక్షణ కూడా పూర్తయ్యింది. డ్రోన్ సహాయంతో ఎకరం విస్తీర్ణంలో కేవలం 10 నిమిషాల్లో పిచికారీ చేయొచ్చు. డ్రోన్ వల్ల సమయం, సొమ్ము ఆదా కావడమేగాక పురుగుల మందు కూడా దుర్వినియోగం కాదు.

### సాగు ఖర్చు తగ్గుతుంది

"వరి సాగులో డ్రోన్ల వినియోగం వల్ల సాగు ఖర్చు తగ్గుతుంది. వరిపైరుపై పురుగుమందులు స్ప్రేయర్‌తో పిచికారి చేయించడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. డ్రోన్ల వల్ల అలాంటి ఇబ్బందులుండవు. సాగు ఖర్చు, సమయం ఆదా అవుతుంది. డ్రోన్ల నిర్వహణకు ఇప్పటికే శిక్షణ అందించారు.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

### కూలీల కొరతకు చెక్

"వరిసాగులో డ్రోన్ల వినియోగం ద్వారా కూలీల కొరత లేకుండా ఉంటుంది. పైరుపై పురుగుమందు పిచికారీకి ఇద్దరు మనుషుల అవసరమవుతుంది. దీనివల్ల ఖర్చు పెరిగి ఇబ్బందులకు గురవుతున్నాం. డ్రోన్ల ద్వారా పిచికారి చేయిస్తే త్వరగా పని చేసుకోవచ్చు. డ్రోన్ల సేవలు రైతులందరికీ అందుబాటులోకి వచ్చేలా వ్యవసాయ శాఖాధికారులు కృషిచేయాలి.

– కాపకాయల సత్యనారాయణ, రైతు, పంజా వేమవరం

### డ్రోన్ వినియోగంపై శిక్షణ తీసుకున్నా

"వరి పైరుపై పురుగు మందు పిచికారి చేయడానికి డ్రోన్ల వాడకానికి విజయవాడ డీఆర్‌జీవో సెంటర్‌లో 10 రోజులు శిక్షణ తీసుకున్నా. నేను బీటెక్ చదివి ఉద్యోగంలో చేరినా వ్యవసాయంపై మక్కువతో జాబ్‌కు రిజైన్ చేసి డ్రోన్ వినియోగానికి అయిదుగురు సభ్యులు గ్రూప్‌గా ఏర్పడ్డాం. డ్రోన్‌తో కేవలం పురుగు మందుల పిచికారి చేయడమేగాక ఎరువులు చల్లే విధంగా ఏర్పాటు చేసుకోవచ్చు.

– యర్రింకి అనంత్‌రామ్, భీమవరం

## క్లుప్తంగా...

### బ్రహ్మోత్సవాలకు సీఎం జగన్‌కు ఆహ్వానం

సాక్షి,అమరావతి/తిరుమల: తిరుమలలో ఈ నెల 18 నుంచి 26 వరకు జరగనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సీఎం జగన్‌ను టీటీడీ ఆహ్వానించింది. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి కలిసి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను, శ్రీవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. అనంతరం సీఎంకు వేద పండితులు ఆశీర్వచనమిచ్చారు.

### ఈఎన్‌సీని సందర్శించిన గవర్నర్ నజీర్



గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు గౌరవ వందనం చేస్తున్న నేవీ సిబ్బంది

దొండపర్తి(విశాఖ దక్షిణ): తూర్పు నావికాదళం ప్రధాన కార్యాలయాన్ని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ సందర్శించారు. ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం నేవీ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఐఎన్ఎస్ శివాలిక్ నౌకను సందర్శించారు. యుద్ధ నౌక ప్రత్యేకతలతో పాటు తూర్పు నావికాదళంలో కార్యకలాపాలను నేవీ అధికారులు గవర్నర్‌కు వివరించారు.

### 'ఆయుష్మాన్‌భవ'పై కేంద్ర మంత్రి సమీక్ష



కేంద్ర మంత్రి సమీక్షలో మంత్రి విడదల రజిని, అధికారులు

సాక్షి, అమరావతి: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఆయుష్మాన్‌భవ కార్యక్రమం క్యాంపెయిన్‌ను ప్రారంభించనున్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాల వైద్య శాఖ మంత్రులతో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుక్ మాండవీయ మంగళవారం వర్చువల్‌గా సమీక్షించారు. ఈ సమీక్షలో మంగళగిరిలో వైద్య శాఖ ప్రధాన కార్యాలయం నుంచి రాష్ట్ర మంత్రి విడదల రజిని, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్ పాల్గొన్నారు. పలు ఆరోగ్య కార్యక్రమాల్లో సంతృప్త స్థాయిలో సేవల్ని అందించేందుకు ఆయుష్మాన్‌భవ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర, జిల్లా స్థాయిల్లోని అన్ని ఆస్పత్రుల్లో ప్రారంభ వేడుకలు చేపడతారు.

### రైల్వే ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు

రైల్వేస్టేషన్ (విజయవాడపశ్చిమ): విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, జరగబోయే ప్రమాదాలను నివారించడంలో కృషిచేసిన విజయవాడ రైల్వే డివిజన్‌కు చెందిన నలుగురు ఉద్యోగులు 'జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ' అవార్డులు అందుకున్నారు. మంగళవారం జోనల్ హెడ్ క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో జీఎం అరుణ్ కుమార్ జైన్ విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంల వర్చువల్ సమావేశంలో సేఫ్టీ అవార్డులను ప్రకటించారు.

**అవార్డులు పొందిన వారు వీరే..**

ఎల్‌పీఎం విధులు నిర్వర్తిస్తున్న ఎం.వేణు, సీనియర్ టెక్నిషియన్ జి.దుర్గాప్రసాద్, బాపట్లలో ట్రాక్ మెయింటెనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరావు, ఒంగోలులో సీ అండ్ డబ్ల్యూలో టెక్నిషియన్‌గా పనిచేస్తున్న ఓ.అనిల్‌కుమార్ 'జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్' అవార్డుకు ఎంపికయ్యారు. విజయవాడ డీఆర్ఎం మంగళవారం తన కార్యాలయంలో సిబ్బందికి అవార్డులను అందజేశారు. ఏడీఆర్ఎంలు శ్రీనివాసరావు, శ్రీకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### ఆంధ్రా రైతుకు జాతీయ అవార్డు



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నందం రఘువీర్

సాక్షి, అమరావతి: కృష్ణా జిల్లా పెనమలూరుకు చెందిన అభ్యుదయ రైతు నందం రఘువీర్‌కు జాతీయ మొక్కల జన్యు రక్షకునిగా అవార్డు దక్కింది. మంగళవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధీనంలోని స్వతంత్ర సంస్థ అయిన ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్ అథారిటీ సంస్థ రెండేళ్లకోసారి ఈ రంగంలో విశేష సేవలందించే రైతులు, సంస్థలకు వివిధ కేటగిరీల్లో అవార్డులను ప్రదానం చేస్తోంది. 2023–25 సంవత్సరానికి సంబంధించి అత్యంత అరుదైన విత్తనాలను సంరక్షిస్తున్న కేటగిరీలో రఘువీర్‌కు జాతీయ మొక్కల జన్యు రక్షకుని అవార్డు (ప్లాంట్ జినోమ్ సేవియర్ ఫార్మర్) వరించింది.

# పింఛన్లు @ 65,98,138



**గత నాలుగేళ్లలో ఇచ్చిన కొత్త పింఛన్లు ఏకంగా 28.26 లక్షలు**

- పింఛన్లు తీసుకుంటున్న ప్రతి పది మందిలో నలుగురికి కొత్తగా మంజూరైంది సీఎం జగన్ ప్రభుత్వంలోనే
- అవ్వాతాతల పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం రికార్డు
- నేడు కొత్తగా మరో 1.93 లక్షల మందికి మంజూరు
- మంగళవారం సాయంత్రం నుంచే మొదలైన పంపిణీ
- ఈ నెల 14 తేదీ వరకు పంపిణీ కార్యక్రమం పొడిగింపు
- ఇప్పటికే సెప్టెంబర్ 1న కొత్తగా 1.48 లక్షల పింఛన్లు మంజూరు
- రెండు విడతలూ కలిపి ఈ నెలలో మంజూరైన కొత్త పింఛన్లు 3,42,452

సాక్షి, అమరావతి: అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వివిధ రకాల చేతి వృత్తిదారులకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా మరో 1,93,680 మందికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంగళవారం కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది. దీంతో రాష్ట్రంలో ప్రతి నెలా అందజేసే పింఛన్ల సంఖ్య రికార్డు స్థాయిలో 65,98,138కి చేరింది. కొత్తగా మంజూరైన వారికి ఈ నెల నుంచే పింఛన్ డబ్బులు పంపిణీ చేసేందుకు వీలుగా ఈ నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని 14వతేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో ఏఎండీ ఇంతియాజ్ తెలిపారు. కొత్త పింఛన్ల మంజూరుకు అదనంగా అవసరమయ్యే నిధులను కూడా అన్ని గ్రామ, వార్డు సచివాలయాల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని, చాలా చోట్ల మంగళవారం సాయంత్రం నుంచే కొత్త పింఛన్‌దారులకు నగదు పంపిణీ ప్రారంభమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ నెలలో కొత్తగా పింఛన్ మంజూరైన 1,93,680 మంది లబ్ధిదారులలో 95,653 మంది అవ్వాతాతల వృద్ధాప్య పింఛన్లున్నాయి. 40,058 మంది వితంతువులు, 29,858 మంది దివ్యాంగులు, 6,861 మంది డప్పు కళాకారులు, 4,763 మంది మత్స్యకారులు, 2,844 మంది కల్లుగీత కార్మికులు, 4 వేల మంది హెచ్ఐవీ బాధితులు కాగా మిగిలినవి ఇతర పింఛన్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**ఈ నెలలో కొత్తగా 3,42,452 మందికి పింఛన్లు...**

ఎప్పటిమాదిరిగానే ఈ నెల ఒకటో తేదీనే ప్రభుత్వం పింఛన్ల పంపిణీ ప్రారంభించే సమయంలో 1,48,772 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేసింది. అప్పటికే పింఛన్లు పొందుతున్న వారితో కలిపి సెప్టెంబరు ఒకటో తేదీన ప్రభుత్వం మొత్తం 64,04,458 మంది లబ్ధిదారులకు పింఛన్ల మొత్తాన్ని విడుదల చేసింది. తాజాగా రెండో విడతగా మంగళవారం మంజూరు చేసిన 1,93,680 మంది కొత్త లబ్ధిదారులతో కలిపి ఈ నెలలో రెండు విడతల్లో మొత్తం 3,42,452 మందికి ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేయడం గమనార్హం.

**ఒక్క నెలలో పింఛన్లకు రూ.1,819.02 కోట్లు..**

సెప్టెంబరు ఒకటో తేదీన మొత్తం 64,04,458 మందికి పింఛను డబ్బుల పంపిణీకి రూ.1,764.83 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. తాజాగా కొత్తగా మంజూరు చేసిన వారితో కలిపి ఈ నెలలో మొత్తం 65,98,138 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం మొత్తం రూ.1,819.02 కోట్లను సెప్టెంబర్‌లో విడుదల చేసింది. ఈ నెలలో రెండు విడతలతో పాటు కొత్తగా పింఛన్లు మంజూరు చేసిన 3,42,452 మంది లబ్ధిదారుల కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.96.12 కోట్ల చొప్పున అదనంగా ఖర్చు చేసేందుకు ముందుకొచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

**నాలుగేళ్లలో 28.26 లక్షల కొత్త పింఛన్లు**

రాష్ట్రంలో ప్రస్తుతం పింఛన్లు పొందుతున్న ప్రతి పది మందిలో నలుగురుకి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాతే కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. జగన్ సీఎం అయ్యాక 28,26,884 మందికి ప్రభుత్వం కొత్తగా పింఛన్లు మంజూరు చేసినట్లు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు గణాంకాలతో వెల్లడిస్తున్నారు. గత ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ల కోసం సరాసరిన రూ.400 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా ఇప్పుడు సీఎం జగన్ ప్రభుత్వం సెప్టెంబరు నెలలో ఏకంగా రూ.1,819 కోట్లు వెచ్చించడం గమనార్హం. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత గత నాలుగేళ్లుగా లంచాలు, వివక్షకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంతృప్త స్థాయిలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్న విషయం తెలిసిందే. అవ్వాతాతలతో పాటు దివ్యాంగులకు ఏ చిన్న కష్టం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ల సొమ్మును అందజేస్తున్నారు.





సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న సీఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

# లండన్ పర్యటన ముగించుకుని ఏపీకి చేరుకున్న సీఎం జగన్

**ఎయిర్‌పోర్ట్‌లో ఘనస్వాగతం**

సాక్షి,అమరావతి/విమానాశ్రయం (గన్నవరం): లండన్‌పర్యటన ముగించుకుని ఏపీకి తిరిగివచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు మంగళవారం గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. విమానాశ్రయంలో సీఎంకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రులు జోగి రమేష్, కారుమూరి, విశ్వరూప్, సీఎస్ జవహర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ జాషువా, విజయవాడ సీపీ రాణా, ఎంపీలు బాలశౌరి, నందిగం సురేష్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాస్, కొలుసు పార్థసారథి, మల్లాది విష్ణు, వల్లభనేని వంశీమోహన్, కైలే అనిల్‌కుమార్, విజయవాడ తూర్పు ఇన్‌ఛార్జ్ దేవినేని అవినాష్, తదితరులున్నారు. అనంతరం సీఎం రోడ్డు మార్గం ద్వారా తాడేపల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్నారు.

# దేశంలోనే నంబర్–1 బ్యాంక్ ఆప్కాబ్

- 2020–22కు అవార్డులు
- కృష్ణా, వైఎస్సార్ డీసీసీబీలనూ వరించిన పురస్కారాలు

సాక్షి, అమరావతి: సహకార బ్యాంకుల్లో ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ బ్యాంక్ (ఆప్కాబ్) సత్తా చాటుకుంది. సహకార రంగంలో దేశంలోనే నంబర్–1 బ్యాంకుగా ఎంపికైంది. 2020–21, 2021–22 సంవత్సరాలకు జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి అవార్డులు దక్కించుకుంది. కాగా.. 2020–21 సంవత్సరానికి కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (కేడీసీసీబీ), 2021–22 సంవత్సరానికి వైఎస్సార్ జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (వైడీసీసీబీ) మొదటి స్థానంలో నిలిచి అవార్డులు పొందాయి. ఏటా జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన రాష్ట్ర అపెక్స్ బ్యాంకులతో పాటు జిల్లా కేంద్ర సహకార బ్యాంకులకు జాతీయ సహకార బ్యాంకుల సమాఖ్య (నాఫ్‌స్కాబ్) అవార్డులను ప్రదానం చేస్తోంది. 2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాలలో అత్యుత్తమ పురోగతి సాధించిన బ్యాంకులకు అవార్డులు ప్రకటించింది. ఆప్కాబ్ 2020–21లో రూ.30,587.62 కోట్లు, 2021–22లో రూ.36,732.43 కోట్ల టర్నోవర్‌తో జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. రెండేళ్లపాటు వరుసగా రూ.238.70 కోట్లు, రూ.246.81 కోట్ల లాభాలను ఆప్కాబ్ ఆర్జించింది.

# ఎరువుల అక్రమ రవాణాకు చెక్

**వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ హరికిరణ్**



సాక్షి, అమరావతి: రాష్ట్రానికి కేటాయించిన ఎరువులు ఇతర రాష్ట్రాలకు అనధికారిక రవాణా జరగకుండా అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ శాఖ స్పెషల్ కమిషనర్ చేవూరు హరికిరణ్ వెల్లడించారు. మంగళగిరిలోని వ్యవసాయ కార్యాలయం నుంచి జిల్లా, మండల వ్యవసాయ అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. సరిహద్దు జిల్లాల నుంచి ఇతర రాష్ట్రాలకు ఎరువుల రవాణా జరుగుతున్నట్టు గుర్తించామన్నారు. దీనికి అడ్డుకట్ట వేసేందుకు వ్యవసాయ, పోలీస్ శాఖలతో సంయుక్త బృందాలను ఏర్పాటు చేశామన్నారు. విజిలెన్స్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) సహకారంతో సరిహద్దు ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. కేటాయింపుల మేరకు రాష్ట్రానికి వచ్చే ప్రతి ఎరువు బస్తాను ఐఎఫ్ఎంఎస్ ద్వారా రికార్డు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎరువుల నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు.

**ముమ్మరంగా వ్యవసాయ పనులు**

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని హరికిరణ్ చెప్పారు. గ్యాప్ సర్టిఫికేషన్ కోసం ఖరీఫ్ సీజన్‌లో జిల్లాకు 50 మంది రైతులతో 26 రైతు ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇలా ఎంపిక చేసిన 1,300 మంది రైతులతో ఏర్పాటు చేసిన ఎఫ్‌పీవోలతో అవగాహనా ఒప్పందాలు చేసుకోవాలన్నారు. ఏపీ స్టేట్ ఆర్గానిక్ ఉత్పత్తుల సర్టిఫికేషన్ అథారిటీ (ఏపీఎస్ఓపీసీఏ) రిజిస్ట్రేషన్‌తో సేంద్రియ పద్ధతిలో సాగు చేసే పంటలకు ఎఫ్‌పీవోలతో అగ్రిమెంట్ చేయించి ఆయా ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని సూచించారు. పంట వేసిన నెల రోజులకు జియో రిఫరెన్సింగ్ ద్వారా ఈ–క్రాప్ నమోదు చేయాలన్నారు.

# వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరం విశాఖ

- నీతి ఆయోగ్ సీఈఓ సుబ్రహ్మణ్యం వెల్లడి
- నీతి ఆయోగ్ పైలట్ నగరాల జాబితాలోనూ స్థానం



సమావేశంలో మాట్లాడుతున్న నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.వి.ఆర్.సుబ్రహ్మణ్యం

దొండపర్తి(విశాఖ దక్షిణ): దేశంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖపట్నం ఒకటని నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(సీఈవో) బి.వి.ఆర్.సుబ్రహ్మణ్యం అన్నారు. అందుకే నీతి ఆయోగ్ పైలట్ నగరాల జాబితాలో ముంబై, సూరత్, వారణాసితో పాటు విశాఖకు స్థానం కల్పించినట్లు చెప్పారు. మంగళవారం విశాఖలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ, పరిశ్రమల శాఖ అధికారులతో వివిధ అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇక్కడి సహజవనరులతో పాటు రైల్వే, పోర్టు కనెక్టివిటీలు, విమానాశ్రయం విశాఖపట్నం అభివృద్ధికి మరింత దోహదపడుతాయన్నారు. విజన్ ఫర్ ఆంధ్రప్రదేశ్, నగర అభివృద్ధి కోసం ఆర్థిక ప్రణాళికలు తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ విశాఖ అభివృద్ధి ప్రణాళికలను వివరించారు. నగర ప్రణాళిక, పర్యాటకం, విద్య, ప్రజారోగ్యం, ఈ–గవర్నెన్స్ తదితర అంశాలపై సాధించిన ప్రగతిని తెలియజేశారు. బీఆర్‌టీఎస్ నెట్‌వర్క్, నగరవ్యాప్తంగా మంచినీటి సరఫరా వ్యవస్థ వివరాలను వివరించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా బీచ్ రోడ్డులో సోలార్ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే పరిశ్రమలు, విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాల పరిస్థితులను తెలియజేశారు. విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ ఎం.అంగముత్తు మాట్లాడుతూ.. ఒడిశా, తెలంగాణ, కర్ణాటకకు సంబంధించిన పలు ఎగుమతులు, దిగుమతులు కూడా విశాఖ కేంద్రంగానే జరుగుతున్నాయని పేర్కొన్నారు. విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సభ్యులు పార్థసారధి, పరిశ్రమల శాఖ జీఎం సి.హెచ్.గణపతి, టూరిజం ఆర్‌డీ శ్రీనివాసరావు, సీపీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు కాదు జైలే..

▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రభుత్వ వాదనను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది.

**మాకేవీ కారణాలు చెప్పాల్సిన అవసరం లేదు..**

తనను జైలులో కాకుండా హౌస్ రిమాండ్‌లో ఉంచేలా ఆదేశాలు ఇవ్వాలంటూ మాజీ సీఎం చంద్రబాబు ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం రోజు సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, సీఐడీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న ఏసీబీ కోర్టు తన తీర్పును వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం న్యాయస్థానం తన నిర్ణయాన్ని వెలువరించింది. హౌస్ రిమాండ్ పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు తీర్పు వెలువరించింది. కొట్టివేయటానికి కారణాలు ఏమిటో కూడా కోర్టు వివరించింది. ఈ సమయంలో చంద్రబాబు తరఫు న్యాయవాది జోక్యం చేసుకుంటూ తమకేమీ కారణాలు వివరించాల్సిన అవసరం లేదని పేర్కొనగా, కారణాలను వెల్లడించాల్సిన బాధ్యత తమపై ఉందని కోర్టు స్పష్టం చేసింది. హౌస్ రిమాండ్ పిటిషన్ తిరస్కరణకు కారణాలను వివరించింది.



**జ్యుడీషియల్, పోలీసు రిమాండ్ మాత్రమే ఉన్నాయి..**

మాజీ సీఎం చంద్రబాబు కోరుతున్న హౌస్ రిమాండ్ అసాధారణ అభ్యర్థన అని సోమవారం వాదనల సందర్భంగా అదనపు అడ్వొకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి కోర్టుకు నివేదించారు. ఈ ప్రస్తావన ఏ చట్టంలో కూడా లేదని, అందువల్ల హౌస్ రిమాండ్ మంజూరు చేయడానికి వీల్లేదని వాదించారు. చంద్రబాబుకు ప్రస్తుతం ఉన్న భద్రత కంటే జైలులో ఇంకా ఎక్కువ భద్రత ఉందని వివరించారు. జైలులో చంద్రబాబు భద్రతకు అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. జైలులో చంద్రబాబు భద్రతకు వచ్చిన ముప్పేమీ లేదని తెలిపారు. చట్టంలో కేవలం జ్యుడీషియల్ రిమాండ్, పోలీసు రిమాండ్ మాత్రమే ఉన్నాయని కోర్టుకు నివేదించారు. ఏసీబీ కోర్టు తీర్పు సందర్భంగా ఈ వాదనలను పరిగణనలోకి తీసుకుంది.

**బెయిల్ పిటిషన్ అంటూ హల్‌చల్..**

మాజీ సీఎం చంద్రబాబు తరఫున బెయిల్ పిటిషన్ దాఖలు చేస్తున్నానంటూ ఏసీబీ కోర్టులో మంగళవారం ఓ న్యాయవాది హడావుడి సృష్టించారు. చంద్రబాబు తరఫున ఓ టీడీపీ కార్యకర్త పేరుతో తాను బెయిల్ పిటిషన్ దాఖలు చేస్తున్నట్లు ఆ న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ పిటిషన్‌పై విచారణ జరపాలని కోరారు. అయితే చంద్రబాబు వకాలత్ ఇవ్వకుండా ఆయన తరఫున ఎలా బెయిల్ పిటిషన్ దాఖలు చేస్తారని కోర్టులో ఉన్న న్యాయవాదులు చర్చించుకున్నారు. ఆ న్యాయవాది తీరును గమనించిన న్యాయస్థానం ఈ విషయాన్ని చంద్రబాబు తరఫున గత మూడు రోజులుగా వాదనలు వినిపిస్తున్న న్యాయవాదుల దృష్టికి తెచ్చింది. చంద్రబాబు ఎలాంటి బెయిల్ పిటిషన్ దాఖలు చేయలేదని వారు కోర్టుకు తెలియచేయడంతో ఆ విషయాన్ని అక్కడితో వదిలేసింది.

**సుదీర్ఘ వాదనలు.. సందేహాల నివృత్తి తరువాతే తీర్పు**

మాజీ సీఎం చంద్రబాబు దాఖలు చేసిన హౌస్ రిమాండ్ పిటిషన్‌పై ఇరుపక్షాల సుదీర్ఘ వాదనలను ఏసీబీ కోర్టు ఎంతో ఓపికగా విన్నది. దాదాపు మూడు గంటలకు పైగా చంద్రబాబు పిటిషన్‌పైనే విచారణ జరిపింది. ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలు వినిపించేందుకు ఎంత సమయం తీసుకున్నా వారిని ఏ దశలోనూ కోర్టు నిలువరించలేదు. అటు చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది వినిపించిన ప్రతీ వాదననూ సావధానంగా ఆలకించింది. ఆయన కోర్టు దృష్టికి తెచ్చిన ప్రతీ తీర్పునూ నిశితంగా పరిశీలించింది. వాటి విషయంలో తనకున్న సందేహాలను సైతం ఏసీబీ కోర్టు నివృత్తి చేసుకుంది. అలాగే సీఐడీ తరఫు న్యాయవాది చేసిన వాదనలను సైతం అదే రీతిలో ఆలకించింది. సీఐడీ న్యాయవాదిని కూడా ప్రశ్నించి తన సందేహాలను ఏసీబీ కోర్టు నివృత్తి చేసుకుంది. చివరకు సీఐడీ న్యాయవాది వాదనలతో ఏకీభవిస్తూ తీర్పును వెలువరించింది. చంద్రబాబుకు హౌస్ రిమాండ్ ఎందుకు ఇవ్వడం లేదో కోర్టు హాలులోనే చాలా స్పష్టంగా వివరించింది. తమకేమీ కారణాలను చెప్పాల్సిన అవసరం లేదని చంద్రబాబు తరఫు న్యాయవాది గట్టిగా వ్యాఖ్యానించినా కూడా, తన బాధ్యత మేరకు కారణాలను వెల్లడిస్తున్నట్లు స్పష్టం చేసింది. గత మూడు రోజులుగా చంద్రబాబు తరఫు న్యాయవాదులు వరుసగా పిటిషన్ల మీద పిటిషన్లు వేస్తున్నా, తీవ్రమైన పని భారం ఉన్నప్పటికీ అన్ని పిటిషన్లను ఏసీబీ కోర్టు చాలా ఓపికగా విచారించింది. ఎక్కడా కూడా ఎలాంటి తొందరపాటుకు ఆస్కారం లేకుండా విచారణ జరుపుతూ వస్తోంది. న్యాయవాదులతో, ఇతరులతో (చంద్రబాబుకు చెందిన వ్యక్తులు) కోర్టు హాలు కిక్కిరిసిపోయినప్పటికీ ఏ దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా ఏసీబీ కోర్టు తన బాధ్యతలను నిర్వర్తించింది.

# ఉత్తమ ఉపాధ్యాయులకు మంత్రి సత్కారం



అవార్డు గ్రహీతలతో మంత్రి బొత్స, విద్యాశాఖ ఉన్నతాధికారులు

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా జాతీయ స్థాయి పురస్కారాలు అందుకున్న ఏపీకి చెందిన ఉపాధ్యాయులు డాక్టర్ ఎం.ఉమాగాంధీ, ఎస్.అంజనేయులు, ఎం.భాస్కరరావులను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సత్కరించారు. మంగళవారం సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో వీరిని సన్మానించి, విద్యాభివృద్ధికి మరింత కృషి చేయాలని, అందరికీ ఆదర్శప్రాయంగా నిలవాలని కోరారు. అవార్డు గ్రహీతలు ఉమాగాంధీ విశాఖ జిల్లా శివాజీపాలెం ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, అంజనేయులు అన్నమయ్య జిల్లా రాయచోటి మండలం మాసాపేటలో ఎస్ఆర్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్నారు. ఈయన చదువుకున్న చోటే పాఠాలు చెప్పడం విశేషం. భాస్కరరావు నెల్లూరులోని కొండాయపాళెం నగర పాలక సంస్థ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్, కమిషనర్ సురేష్ కుమార్, ఇన్‌ఫ్రా కమిషనర్ కాటమనేని భాస్కర్, ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి, సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య, ఏపీ టెట్ జేడీ డాక్టర్ మేరీ చంద్రిక పాల్గొన్నారు.

# ఏం కష్టమొచ్చిందో..?

**వ్యవసాయ బావిలో పడి కుమార్తెతో కలిసి దంపతుల ఆత్మహత్య**



మృతులు మొహిసుద్దీన్, భార్య నిషా, కుమార్తె జహీదా (ఫైల్)

కొత్తవలస: ఆ కుటుంబానికి ఏం కష్టమొచ్చిందో తెలియదు. ఆరోగ్యం, ఆర్థికంగా బాగానే ఉన్నా... ఊరు కాని ఊరు వచ్చి కుమార్తెతో కలిసి దంపతులిద్దరూ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన విజయనగరం జిల్లా కొత్తవలస మండలం చింతలపాలెం గ్రామ సమీపంలో మంగళవారం చోటుచేసుకోంది. పోలీసులు, స్థానికులు, మృతుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

విశాఖపట్నంలోని షిప్పింగ్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూ ఆ జిల్లాలోని మర్రిపాలెం సమీపంలోని ఎఫ్‌సీఐ కాలనీలో నివసిస్తున్న మహ్మద్ మొహిసుద్దీన్ (46), ఆయన భార్య సంషినిషా (38), కూతురు ఫాతిమా జహీదా (17)లు చింతలపాలెం సమీపంలోని వ్యవసాయ బావిలోదూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతులు చింతలపాలెం గ్రామ సమీపంలో గతంలో కొంత భూమిని కొనుగోలు చేశారు. ఈ భూమిని చూసేందుకు క్యాబ్‌ను బుక్‌చేసుకుని ఇంటి నుంచి సోమవారం వచ్చారు. సాయంత్రం వరకు ఆ ప్రాంతంలో తిరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ఏ సమయంలో బావిలో దూకారో తెలియరాలేదు. బావిగట్టుపై మృతుడికి చెందిన సెల్‌ఫోన్, తమ బంధువులకు సంబంధించిన ఫోన్ నంబర్లు రాసిన కాగితం, ఇతర వస్తువులు ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. బావిలోకి చూడగా మృతదేహాలు తేలియాడడం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో సీఐ ఎస్.చంద్రశేఖర్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ దొరికిన ఆధారాలతో ఫోన్ చేసి మృతుడు మొహిసుద్దీన్ కొడుకు మహ్మద్ ఆలీకి సమాచారం అందించారు. మృతుల కటుంబ సభ్యులు, బంధువులు ఘటనా స్థలానికి చేరుకొని మృతులను గుర్తించారు. ఆలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించినట్టు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. మృతురాలు జహీద విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. కొడుకు ఆలీ ఎంబీఏ చదువుతున్నాడు.

**ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ**

ఘటనా స్థలాన్ని విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు సందర్శించారు. క్లూస్ టీమ్‌తో క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని కోణాల్లోనూ పరిశీలిస్తున్నట్టు ఆయన తెలిపారు. మృతుల సెల్‌ఫోన్‌లను ఓపెన్ చేసి కాల్‌డేటాను సేకరిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు.

## నేడు అల్పపీడనం!

**ఆపై బలపడే అవకాశం.. రెండురోజులు వర్షాలు**

**సాక్షి, విశాఖపట్నం:** బంగాళాఖాతంలోని మధ్య భాగాలకు ఆనుకుని ఉన్న ఉత్తర బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో పశ్చిమ మధ్య బంగాళాఖాతానికి సమీపంలో వాయవ్య బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడనుంది. అనంతరం ఇది మరింత బలపడి పశ్చిమ వాయవ్య దిశగా దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాల మీదుగా పయనిస్తుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మంగళవారం రాత్రి నివేదికలో తెలిపింది. మరోవైపు నైరుతి ఉత్తరప్రదేశ్ నుంచి ఉపరితల ఆవర్తనం ప్రాంతం వరకు మరో ద్రోణి పయనిస్తోంది. వీటి ఫలితంగా రానున్న రెండురోజులు ఉత్తరకోస్తాలో అనేకచోట్ల, దక్షిణకోస్తాలో కొన్నిచోట్ల, రాయలసీమలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఉత్తరకోస్తాలో ఒకటిరెండు ప్రాంతాల్లో భారీవర్షాలు కురవవచ్చని పేర్కొంది. కోస్తాంధ్రలో గంటకు 40–45, గరిష్ఠంగా 55 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా ఉంటుందని.. మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని హెచ్చరించింది.

## ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను విజయవంతం చేద్దాం

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి**



**సాక్షి, అమరావతి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు బీజేపీ చేపట్టనున్న వివిధ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సూచించారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ జిల్లాల అధ్యక్షులు, ఇన్‌చార్జిలు, వివిధ మోర్చాల రాష్ట్ర అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. కాగా, పురందేశ్వరి పేరిట ఫేక్ లెటర్, బీజేపీ రాష్ట్ర శాఖ అధికారిక ట్విట్టర్ ఖాతా పేరుతో నకిలీ ఖాతాలను సృష్టించి అసత్యాలు ప్రచారం చేస్తున్నవారిపై బీజేపీ లీగల్ సెల్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## చంద్రబాబు అరెస్ట్ సక్రమమే

**ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్**



**సీతమ్మధార(విశాఖ ఉత్తర):** చంద్రబాబు అరెస్ట్ సక్రమమేనని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ అన్నారు. మంగళవారం విశాఖపట్నంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబును మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌తో పోల్చడం దారుణమన్నారు. చంద్రబాబు అరెస్ట్ అయినా ప్రజలతో పాటు టీడీపీ కార్యకర్తల్లోనూ ఎలాంటి స్పందన లేదన్నారు.లోకేశ్ పాదయాత్రలో అందరూ 'చెల్లింపు నటులే'నని చెప్పారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగిస్తానని తెలిపారు.

# చంద్రబాబు స్కిల్డ్, ఆర్గనైజ్డ్ క్రిమినల్

**వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి**

**ఆదాయానికి మించిన ఆస్తులపై చంద్రబాబు విచారణ కోరాలి**

**కేసులన్నింటిలో శిక్ష పడితే చంద్రబాబు జీవితాంతం జైల్లోనే గడపాలి**



మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి, పక్కన బాలినేని, మంత్రి ఆదిమూలపు, ఎంపీ మాగుంట

**సాక్షి ప్రతినిధి, ఒంగోలు:** ''చంద్రబాబు స్కిల్డ్ క్రిమినల్.. ఆర్గనైజ్డ్ క్రిమినల్ కూడా.. ఈ మాట సీఎం వైఎస్ జగన్ గతంలోనే చెప్పారు. ఇప్పటికి రుజువైంది. చంద్రబాబు నేర ప్రవృత్తితో అటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు నూతన ఆంధ్రప్రదేశ్‌ను కూడా సర్వనాశనం చేశాడు. రాష్ట్ర రాజకీయాలను భ్రష్టు పట్టించి, సామాన్యుడికి రాజకీయాలను దూరం చేసిన దుర్మార్గుడు'' అని దక్షిణ కోస్తా జిల్లాల వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి ధ్వజమెత్తారు. రెండు రోజుల పాటు ప్రకాశం జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్షలు నిర్వహించిన తరువాత మంగళవారం ఒంగోలులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు జీవితం అంతా నీచ, నేర, కుట్ర రాజకీయాలేనంటూ ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మండిపడ్డారు. చంద్రబాబు అరెస్ట్ తర్వాత టీడీపీ పిలుపునిచ్చిన బంద్‌కు రాష్ట్ర ప్రజలు అస్సలు స్పందించలేదన్నారు. టీడీపీ శ్రేణుల్లో కూడా స్పందన కరువైందన్నారు. రిమాండ్‌లో ఉన్న చంద్రబాబుకు చెందిన హెరిటేజ్ సంస్థను కూడా మూసేయకుండా వాళ్ల వ్యాపారం వాళ్లు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల్లో సానుభూతి సంపాదించడం కోసం చంద్రబాబు ఇతర రాష్ట్రాల్లోని నేతలను ఇక్కడకు రప్పించుకోవడానికి తాపత్రయపడుతున్నారని మండిపడ్డారు. అయితే చంద్రబాబును అరెస్ట్ చేసినప్పటి నుంచి ఎల్లో మీడియా మాత్రం ఆయన సచ్ఛీలుడని, సౌమ్యుడని, మహానాయకుడు, అంతర్జాతీయ నాయకుడని, ఉదార స్వభావుడని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తోందన్నారు. దానిలో వాళ్లు విఫలం అయ్యారని చెప్పారు. చంద్రబాబు స్వతహాగా నేర స్వభావం, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తి అన్నారు. విద్యార్థి దశ నుంచే ఎస్వీ యూనివర్సిటీలో చేసిన నీచరాజకీయాలు, అకృత్యాలు చంద్రబాబు స్వభావాన్ని తెలుపుతాయన్నారు.

**డబ్బుంటేనే రాజకీయాలనేది బాబు సిద్ధాంతం**

డబ్బుంటేనే రాజకీయాలు అనే సిద్ధాంతాన్ని నమ్మిన వ్యక్తి చంద్రబాబు అని విజయసాయిరెడ్డి విమర్శించారు. అందుకే సీమెన్స్ కంపెనీ పేరుతో రాష్ట్ర ప్రజల సొమ్మును అప్పనంగా కాజేశాడని ధ్వజమెత్తారు. మల్టీ నేషనల్ కంపెనీ పేరు చెప్పి రూ. 370 కోట్లు తన బినామీ కంపెనీల అకౌంట్లలో వేసుకున్న తీరును సీఐడీ కోర్టు ముందు పెట్టిందన్నారు. ఈ విషయంలో లోకేశ్ అనుచరుడు కిలారు రాజేష్ కీలక భాగస్వామి అని చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఉద్దేశించిన ప్రజాధనాన్ని సొంత ఖాతాల్లో వేసుకున్నారని తెలిపారు. రాజకీయాలను భ్రష్టు పట్టించిన వ్యక్తి చంద్రబాబేనని చెప్పారు. కాదని ఎవరైనా అంటే ఎలాంటి చర్చకైనా సిద్ధమని చెప్పారు. రాజకీయాలను సామాన్యులకు దూరం చేసిన దుర్మార్గుడు చంద్రబాబు అని విమర్శించారు. అవినీతిలో చంద్రబాబు, రామోజీరావులది విడదీయరాని బంధమన్నారు. చంద్రబాబు తప్పులను కప్పిపెట్టి ఆయనో విజనరీ అంటూ రామోజీ ప్రచారం చేసేవాడన్నారు. ఇద్దరూ కలిసి రాజకీయాలను భ్రష్టు పట్టించారని చెప్పారు. అవినీతిలో రామోజీరావు పాత్రపై కూడా విచారణ జరపాలన్నారు. బాబు నీతిమంతుడని భావిస్తే.. ఆదాయానికి మించిన ఆస్తులపై విచారణ కోరాలని విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. కేసులన్నింటిలో శిక్ష పడితే చంద్రబాబు జీవితాంతం జైలు నుంచి బయటకు రాలేడని తెలిపారు. కాగా, ప్రకాశం జిల్లాలో మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి నాయకత్వంలో పార్టీని ముందుకు తీసుకుపోతామని ఈ సందర్భంగా ప్రకటించారు.

## బీసీల సాధికారతకు సీఎం జగన్ ప్రాధాన్యత

**రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని**



**సాక్షి, అమరావతి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ వర్గాల సాధికారతకు అన్ని విధాలుగా ప్రాధా న్యత ఇస్తున్నారని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పిస్తేనే బీసీలకు రాజ్యాధికారం దక్కుతుందని అభిప్రాయపడ్డారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏపీ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమం పోస్టర్లను మంగళగిరిలోని తన కార్యాలయంలో మంగళవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు పాలించిన కేంద్ర ప్రభుత్వాలన్నీ బీసీలకు ఏ రంగంలో కూడా జనాభా ప్రకారం వాటా ఇచ్చే దిశగా చర్యలు తీసుకోలేదన్నారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారేశ్, నాయకులు మహిధర్, మణికంఠ పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం నూతన కార్యవర్గం



అధ్యక్షుడు పోసింరెడ్డి సునీల్ రెడ్డి



కోఆర్డినేటర్ వేములకొండ తిరుపతిరావు

**సాక్షి, అమరావతి:** వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం నూతన రాష్ట్ర కమిటీని పార్టీ నియమించింది. సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ అధ్యక్షుడిగా పోసింరెడ్డి సునీల్ రెడ్డి (నెల్లూరు) నియమితులయ్యారు. కోఆర్డినేటర్లుగా వేములకొండ తిరుపతిరావు (ఎన్టీఆర్), ముకుందపురం ప్రతాప్‌రెడ్డి (అనంతపురం), సంగిరెడ్డి రోసిరెడ్డి (ప్రకాశం), ఆసమ్‌కుమార్ స్వామిరెడ్డి (వైఎస్సార్), జోనల్ ఇన్‌చార్జిలుగా తమ్ములూరి జగదీష్ (విశాఖ), బద్దుకొండ మణిదీప్ (విజయనగరం), సవరం కిషోర్ (పశ్చిమ గోదావరి), గొడ్డేటి వెంకట సుబ్బయ్య (నెల్లూరు), బత్తల సుధీర్‌రెడ్డి, మంజునాథ్ యాదవ్ (అనంతపురం)ను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా సివలంక రవికాంత్, సంపతి మధుసూదన్ (విశాఖ), పడాల సాయిరత్నకిషోర్ రెడ్డి (పశ్చిమ గోదావరి), మందపాటి హరీష్‌రెడ్డి (గుంటూరు), పూసపాటి జగన్మోహన్‌రెడ్డి (నెల్లూరు), కొప్పుల గిరిధర్ రెడ్డి (వైఎస్సార్), కొప్పుల భాస్కరరెడ్డి (చిత్తూరు), హరిప్రసాద్ చౌదరి (అనంతపురం)ని నియమించారు. కార్యదర్శులుగా 18 మంది, సహాయ కార్యదర్శులుగా 14 మంది నియమితులయ్యారు.

## ఏపీ జైళ్ల శాఖ అన్ని రాష్ట్రాలకు ఆదర్శం

**జైళ్ల శాఖ 8వ జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్**



ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, చిత్రంలో హోంమంత్రి తానేటి వనిత తదితరులు

**దొండపర్తి(విశాఖదక్షిణ)/ఆరిలోవ(విశాఖ తూర్పు)/కొవ్వూరు:** ఆంధ్రప్రదేశ్ జైళ్ల శాఖ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ డెవలప్‌మెంట్, ఏపీ జైళ్లశాఖ సంయుక్తంగా విశాఖపట్నంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న అన్ని రాష్ట్రాల జైళ్ల అధిపతుల 8వ జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జైళ్ల శాఖలో నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ప్రధానంగా వర్చువల్ విధానంలో కోర్టు కేసుల విచారణను ప్రారంభించిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందిందని చెప్పారు. ఖైదీలను దండించడానికే కాకుండా జైళ్లలో వారి సంక్షేమానికి కూడా చర్యలు తీసుకోవడం మంచి పరిణామమని ప్రశంసించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఖైదీలకు కార్పొరేట్ వైద్యంతోపాటు శిక్ష పూర్తయిన అనంతరం వారి జీవనోపాధికి ఉపయోగపడేలా నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుండటం మంచి ఆలోచన అని అన్నారు. ఇటువంటి సంస్కరణలతో ఖైదీల్లో పరివర్తనతోపాటు పునరావాసానికి అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ జనరల్ బాలాజీ శ్రీవాత్సవ్, రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్తా, అన్ని రాష్ట్రాల జైళ్ల అధిపతులు పాల్గొన్నారు.

**జైలులో చంద్రబాబుకు పూర్తి భద్రత: హోంమంత్రి వనిత**

రాజమండ్రి కేంద్ర కారాగారంలో చంద్రబాబుకు పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు హోం మంత్రి తానేటి వనిత చెప్పారు. జైలులో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు ఉన్నాయని, అక్కడ చంద్రబాబుకు ఎలాంటి ప్రాణహాని లేదని స్పష్టంచేశారు. ఆయన భద్రత పూర్తి బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. చంద్రబాబు కుంభకోణాలు వరుసగా బయటపడుతున్నప్పటికీ ఇంకా ఆయన నిప్పు అంటూ ప్రజలను నమ్మించాలని టీడీపీ నేతలు, పచ్చమీడియా అష్టకష్టాలు పడుతున్నట్లు ఎద్దేవా చేశారు. ఇన్ని కుంభకోణాలకు పాల్పడిన బాబు నిప్పా? అని ప్రశ్నించారు. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. స్కామ్‌లన్నీ బయటపడితే టీడీపీ ఉనికి కోల్పోతుందనే భయంతో లోకేశ్, బాలకృష్ణ, పవన్‌కళ్యాణ్ ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని ధ్వజమెత్తారు.

## ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు ఏ-1, నేను ఏ-2

**టీడీపీ జిల్లా సమావేశంలో మాజీ మంత్రి నారాయణ**

**నెల్లూరు సిటీ:** ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో చంద్రబాబు ఏ1 (ప్రధాన నిందితుడు)గా ఉండగా, తాను ఏ2గా ఉన్నానని మాజీ మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. మంగళవారం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా టీడీపీ ఇన్‌చార్జిలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నప్పుడు తానే రింగ్ రోడ్డును డిజైన్ చేశానన్నారు. ఇందులో 2001లో తన భార్య పేరు మీద కొన్న 40 సెంట్ల స్థలం కూడా పోయిందని చెప్పారు. చంద్రబాబుపైన, తనపైన తప్పుడు కేసులు పెట్టారని తెలిపారు. తనపై వివిధ వ్యవహారాలకు సంబంధించి 7 నాన్‌బెయిలబుల్ కేసులు ఉన్నాయన్నారు. అందులో మూడింట్లో బెయిల్ తెచ్చుకున్నానని చెప్పారు.

## ఇన్నర్ రింగ్ రోడ్డు భూ దోపిడీ కేసులో బెయిల్ ఇవ్వండి

**హైకోర్టులో చంద్రబాబు పిటిషన్.. నేడు విచారణ**

**సాక్షి, అమరావతి:** అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ డిజైన్ల ముసుగులో సాగిన భూ దోపిడీపై సీఐడీ 2022లో నమోదు చేసిన కేసులో బెయిల్ కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం తేలేంత వరకు సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కోరారు. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ భూ దోపిడీపై నమోదు చేసిన కేసులో పీటీ వారెంట్ కోరుతూ సీఐడీ విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో చంద్రబాబు ముందు జాగ్రత్త చర్యగా హైకోర్టులో ఈ బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు బుధవారం విచారణ జరపనుంది.

## చంద్రబాబును అరెస్ట్ చేస్తే పవన్ హంగామా ఎందుకో!

**కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు**



**సాక్షి, అమరావతి:** అవినీతి కేసులో చంద్రబాబును అరెస్ట్ చేస్తే జనసేన అధినేత పవన్‌కల్యాణ్ హంగామా చేయడం ఎందుకోనని కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి (శేషు) ఎద్దేవా చేశారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు అరెస్ట్‌పై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసినంత హంగామా టీడీపీ నేతలు, కుటుంబ సభ్యులు కూడా చేయలేదన్నారు.పథకం ప్రకారం రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టేందుకు పవన్‌ను రంగంలోకి దింపాడన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు అనే బాధ్యతను మరిచి టీడీపీ కార్యకర్త మాదిరిగా పవన్ వ్యవహరించాడని ఎద్దేవా చేశారు. నడిరోడ్డు మీద పడుకుని పవన్ కల్యాణ్ పడిన తాపత్రయం చూస్తే ప్యాకేజీ స్టార్ అనేది మరోసారి బలంగా చెప్పుకున్నట్టు అయ్యిందన్నారు.

# ఆరోగ్య అభయం!

**ప్రజారోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. ఆస్పత్రుల్లో అత్యాధునిక వసతులు.. పరికరాలను సమకూర్చింది. అవసరాలకు తగ్గట్టు వైద్యసిబ్బందిని నియమించింది. రోగులకు 24/7 సేవలందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తుల సమగ్ర వివరాలను సేకరించేందుకు ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'కు శ్రీకారం చుట్టింది. వలంటీర్ల ద్వారా పక్కాగా సర్వే చేయించేందుకు సన్నద్ధమవుతోంది. అనంతరం హెల్త్ క్యాంపులు నిర్వహించి బాధితులకు చికిత్సలందించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది.**



### ఇంటింటికీ వెళ్లి వ్యాధిగ్రస్తుల గుర్తింపు

- హెల్త్ క్యాంపుల ద్వారా పక్కాగా చికిత్స
- జగనన్న ఆరోగ్య సురక్ష అమలుకు పకడ్బందీ చర్యలు
- 15 నుంచి క్షేత్రస్థాయిలో వలంటీర్ల సర్వే
- మళ్లీ రంగంలోకి ఫ్రంట్‌లైన్ వారియర్స్
- 30 నుంచి వైద్యశిబిరాల నిర్వహణ
- ఉచితంగా పరీక్షలు, మందుల పంపిణీ

**సాక్షి, తిరుపతి డెస్క్:** ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణ అమలు చేస్తోంది. కోవిడ్ సమయంలో విశేష సేవలందించిన ఫ్రంట్‌లైన్ వారియర్స్‌ను మళ్లీ ముందుకు తీసుకువస్తోంది. ఇంటింటికీ ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించి, వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పక్కాగా సర్వే చేపట్టి వ్యాధుల కట్టడికి ఈ నెల 15వ తేదీ నుంచి ఆపరేషన్ ప్రారంభించనుంది. సర్వే పూర్తయిన తర్వాత ఈ నెల 30వ తేదీ నుంచి అన్ని మండల కేంద్రాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది.

**విప్లవాత్మకమైన మార్పులు**

రాష్ట్రం వైపుగా యావత్ దేశం చూసేలా ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చింది. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు అనే సంస్కరణలు ప్రవేశపెట్టింది. గ్రామీణప్రాంతాల్లోని వారికి సైతం ఆధునిక చికిత్సలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించింది. ఆరోగ్యశాఖలో వేలాది ఖాళీ పోస్టులను భర్తీ చేసింది. పీహెచ్‌సీలను అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దింది. రోగుల వద్దకే వైద్యం అందించేలా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను పకడ్బందీగా అమలు చేస్తోంది. ఈ క్రమంలోనే జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట మరో బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది. పట్టణాలు, పల్లెల్లో ప్రతి ఇంటికీ వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించి, మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టింది. ఇంటింటి సర్వేలో డెంగీ, మలేరియా, యూరిన్, బీపీ, మధుమేహం, హిమోగ్లోబిన్, గర్భిణులకు అవసరమైన పరీక్షలు చేయనున్నారు.

**హెల్త్ క్యాంపులు ఇలా..**

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఈ నెల 30వ తేదీ నుంచి మండలాల వారీగా మెగా వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఇవి ప్రారంభం కావడానికి ముందే ప్రజల ఆరోగ్య నివేదికలు సిద్ధంగా ఉంటాయి. రోగి పేరు నమోదు.చేయగానే మొత్తం సమా చారం తెలుస్తుంది. అధునాతన పరికరాలతో వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేస్తారు. పరీక్షలు, మందులను ఉచితంగానే అందిస్తారు. శిబిరాల్లో 162 రకాల మందులు, 18 రకాల సర్జికల్ వస్తువులు అందుబాటులో ఉంచుతున్నారు. ముఖ్యంగా మధుమేహం, క్యాన్సర్, గుండె, కిడ్నీ వాధులుతో బాధపడేవారు, గర్భిణులకు మెరుగైన వైద్యం సేవలు అందించనున్నారు. వైద్యశిబిరాలకు ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి స్పెషలిస్ట్ డాక్టర్లు హాజరవనున్నారు. మొత్తం ప్రక్రియను డీఎంహెచ్‌ఓ, ఆరోగ్య శ్రీ కో–ఆర్డినేటర్, తహసీల్దార్, ఎంపీడీఓ, పీహెచ్‌సీ వైద్యులు, సీడీపీఓ, ఎంఈఓలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

**ఉమ్మడి జిల్లా సమాచారం**

| | |
|---|---|
| జిల్లా ఆస్పత్రి 01 | టీచింగ్ ఆస్పత్రులు 02 |
| సీహెచ్‌సీలు 15 | పీహెచ్‌సీలు 108 |
| ఏరియా వైద్యశాలలు 07 | ప్రైవేట్ హాస్పిటళ్లు 3వేలకు పైగా |
| హెల్త్ క్లినిక్‌లు 903 | నిత్యం ఓపీ కేసులు 10వేలకు పైగా |

**సేవలందించే ఫ్రంట్‌లైన్ వారియర్స్ సమాచారం**

| | |
|---|---|
| స్పెషలిస్ట్ వైద్యులు 549 | మెడికల్ ఆఫీసర్లు 258 |
| హెల్త్ అధికారులు 902 | ఏఎన్‌ఎంలు 1,333 |
| ఆశ వర్కర్లు 3.247 | వలంటీర్లు 21,417 |



**ప్రక్రియ ఇలా..**

- జిల్లావ్యాప్తంగా ఈ నెల 15వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రారంభిస్తారు
- సర్వేలో భాగంగా వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళతారు
- ప్రజల ఆరోగ్య సమస్యలపై సమగ్ర సమాచారం సేకరిస్తారు
- స్మార్ట్ ఫోన్ ఉన్న వ్యక్తులతో ఆరోగ్యశ్రీ సిటిజన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తారు.
- క్యాంపు వివరాలను తెలియజేస్తారు.
- అలాగే ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సైతం ఇంటింటికి వెళ్లనున్నారు.
- ఆయా కుటుంబాల్లోని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.
- పరీక్ష ఫలితాల ఆధారంగా వారి వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.
- ఈమేరకు విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పీహెచ్‌సీల్లో మందులు అందజేస్తారు.

### వ్యాధుల కట్టడి



సీజనల్ ప్రభావం, జీవనశైలిలో మార్పుల కారణంగా వివిధ వ్యాధులు విజృంభిస్తున్నాయి. వీటిలో కొన్ని బయటపడకుండా అంతర్గతంగానే వ్యాప్తి చెందుతున్నాయి. చాలా మందికి అవగాహనలోపంతో పరీక్ష చేయించుకోవడం లేదు. బీపీ, మధుమేహం వ్యాధులను ముందుగా గుర్తించక ఇతర రోగాలు కూడా సోకుతున్నాయి. అందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కింద ప్రజల ఆరోగ్య స్థితిగతుల సమాచారం సేకరించి, చికిత్స అందిస్తాం. తద్వారా వ్యాధులను కట్టడి చేస్తాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తాం.

– రవిరాజు ఇన్‌చార్జి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

# కోర్టుల సంఖ్య పెంచాలి

**హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే హైదరాబాద్ నుంచి వర్చువల్ ద్వారా హుజూర్‌నగర్ అదనపు జిల్లా కోర్టు ప్రారంభం**

**హుజూర్‌నగర్:** పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించడానికి కోర్టుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ అదనపు జిల్లా కోర్టును హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హుజూర్‌నగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు తమ కేసుల కోసం జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించటానికి పడుతున్న వ్యయప్రయాసలను దృష్టిలో పెట్టుకుని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యుల విజ్ఞప్తి మేరకు హుజూర్‌నగర్‌కు జిల్లా అదనపు న్యాయస్థానాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు. మారుమూల గ్రామాల ప్రజల సౌకర్యార్థమే అదనపు జిల్లా కోర్టు మంజూరు చేశామని, ఇక్కడ జిల్లా కోర్టు ప్రారంభమైనందున ఈ ప్రాంత వాసులకు సౌకర్యంగా ఉండటమే కాకుండా సత్వర న్యాయం లభించడానికి మార్గం సుగమమైందన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వినోద్ కుమార్, జస్టిస్ లక్ష్మణ్, సూర్యాపేట పోర్టుపోలియో జడ్జి జస్టిస్ శ్రీ సుధా, జస్టిస్ సుజన తదితరులు వర్చువల్‌గా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్, జిల్లా కలెక్టర్ వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## పీవీ సింధు సక్సెస్‌పై పరిశోధనకు ఓయూ డాక్టరేట్

**ఉస్మానియా యూనివర్సిటీ:** ప్రపంచ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు సక్సెస్‌పై పరిశోధనకు వ్యాయామ విద్య (ఫిజికల్ ఎడ్యుకేషన్)లో జంగం పాండుకు ఓయూ పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కోనాయిపల్లి గ్రామానికి చెందిన పాండు ఓయూ వ్యాయామ విద్య సీనియర్ అధ్యాపకుడు ప్రొ.సత్యనారాయణ పర్యవేక్షణలో 'పీవీ సింధు–హర్ అచీవ్‌మెంట్స్ అండ్ కాంట్రిబ్యూషన్స్ ఇన్ ఇండియా–బ్యాడ్మింటన్ గేమ్– ఎ స్టడీ' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ అందుకున్నారు.

## కస్తూర్బా విద్యార్థినులకు ఫుడ్‌పాయిజన్

**120 మందికి అస్వస్థత**

**ఖలీల్‌వాడి(నిజామాబాద్):** నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో 120 మంది విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ అయింది. సోమవారం రాత్రి స్కూల్‌లో అన్నం, పప్పు, వంకాయకూర వంట చేశారు. రాత్రి భోజనం చేసిన తర్వాత 11.30 గంటలకు విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు, కడుపునొప్పి ప్రారంభమైంది. దీంతో పాఠశాల సిబ్బంది పిల్లలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే 84 మంది విద్యార్థినుల పరిస్థితి విషమించడంతో అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా, భీమ్‌గల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 36 మందిలో 16 మంది విద్యార్థినుల పరిస్థితి అలాగే ఉండటంతో వారిని మంగళవారం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భీమ్‌గల్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి 20 మంది విద్యార్థినులను మంగళవారం మధ్యాహ్నం డిశ్చార్జి చేశారు. నిజామాబాద్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీహన్మంతు పరామర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, విద్యాశాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఘటన పై మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. ఫుడ్ పాయిజన్ ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో కలెక్టర్ ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేశారు. ఈ బృందం వంట సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకుంది. రాత్రి చేసిన వంటకాల శాంపుల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు.



తాను సమర్థుడిని అని అనుకున్నవాడు సమర్థుడు.
– బౌద్ధ ధర్మం



సాక్షి
బుధవారం, 13 సెప్టెంబర్ 2023

# వ్యూహాత్మక స్నేహబంధం

కొన్నిసార్లు అంతే... కీలక పరిణామాలన్నీ కొద్ది వ్యవధిలో జరిగిపోతుంటాయి. ఢిల్లీలో జీ20 సదస్సు ముగియగానే మరో ముఖ్యపరిణామం సంభవించింది. సోమవారం భారత ప్రధాని మోదీ, సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్‌ల సహ అధ్యక్షతన భారత – సౌదీ అరేబియా వ్యూహాత్మక భాగస్వామ్య మండలి (ఎస్పీసీ) తొలి శిఖరాగ్రస్థాయి సమావేశం జరిగింది. విస్తృత చర్చల అనంతరం రెండు దేశాలూ తమ వాణిజ్య, రక్షణ బంధాలను విస్తరించుకోవాలని నిర్ణయించాయి. భారత్‌లో ఒక రోజు పర్యటనకు వచ్చిన సౌదీ యువరాజుతో జరిగిన ఈ కీలక నిర్ణయం దీర్ఘకాలిక ప్రభావం చూపగలిగేది. ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న రెండు పెద్ద ఆర్థికవ్యవస్థల మధ్య పెరుగుతున్న సహకారం మధ్యప్రాచ్య – హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి, సుస్థిరతలకు కీలకం. అందుకే, ఈ సమావేశం అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది.

జీ20లో కీలక 'ఇండియా– మధ్యప్రాచ్యం– యూరప్ ఆర్థిక నడవా' (ఐఎంఈసీ) ప్రకటించిన వెనువెంటనే... ఆ నడవాలో భాగమయ్యే సౌదీతో భారత బంధాల విస్తరణ శుభపరిణామం. రెండు దేశాల మధ్య ఎస్పీసీ 2019 అక్టోబర్‌లో భారత ప్రధాని, రియాద్ పర్యటనలోనే ఏర్పాటైంది. బ్రిటన్, ఫ్రాన్స్, చైనాల తర్వాత సౌదీ అలాంటి భాగస్వామ్యం కుదుర్చుకున్న నాలుగో దేశం ఇండియానే! సరిగ్గా ఏడాది క్రితం 2022 సెప్టెంబర్‌లో మన వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ సౌదీ వెళ్ళి, ఎస్పీసీ మంత్రిత్వ స్థాయి సమావేశానికి హాజరయ్యారు. అప్పట్లోనే సౌదీలో మన రూపే కార్డ్ వినియోగం సహా అనేక అంశాలు ప్రధాన సహకార అంశాలుగా చర్చకు వచ్చాయి. సోమవారం రెండు దేశాల నేతల మధ్య చర్చలు అందుకు కొనసాగింపు.

నిజానికి, కొన్నేళ్ళుగా భారత, సౌదీల బంధం బలపడుతోంది. విభిన్న సాంస్కృతిక, చారిత్రక నేపథ్యాలున్న రెండు దేశాలూ వాణిజ్యం నుంచి సాంస్కృతికం దాకా బాంధవ్యాలు పెట్టుకుంటున్నాయి. ద్వైపాక్షిక బంధాలు పటిష్ఠం కావాలంటే సాంస్కృతిక సంబంధాలు కీలకం. అందులోనూ రెండు దేశాలూ అడుగులు వేశాయి. సౌదీలో పవిత్ర మక్కా నగరానికి మనదేశం నుంచే ఏటా వేల మంది హజ్ యాత్ర సాగిస్తుంటారు. భారత్ నుంచి ఏటా 1.75 లక్షల మందికి పైగా హజ్ యాత్రికులకు అవకాశం కల్పిస్తూ, ఈ ఏడాది మొదట్లోనే సౌదీ ఒప్పందం కుదుర్చుకుంది. ఒక దేశం నుంచి చరిత్రలో ఎన్నడూ లేనట్టు ఇంత భారీ సంఖ్యలో యాత్రికుల్ని అనుమతిస్తామంటూ సౌదీ కోటా ఇవ్వడం విశేషం. అలాగే, ఆ రాజ్యంలో అత్యధిక ప్రవాసుల సంఖ్య కూడా మనదే! 22 లక్షల మందికి పైగా భారతీయ ప్రవాసులు సౌదీలో ఉన్నారు. ఇవన్నీ భారత్, సౌదీలను మరింత సన్నిహితం చేస్తున్నాయి. ప్రవాసులంతా తమ దేశంలో భాగమేననీ, వారిని సొంత పౌరులలా కడుపులో పెట్టుకుంటామనీ సౌదీ యువరాజు తాజా పర్యటనలోనూ స్పష్టం చేయడం విశేషం.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మన రెండు దేశాలూ ప్రధానమైనవి. భారత్‌కు నాలుగో అతి పెద్ద వాణిజ్య భాగస్వామి సౌదీయే! ఇక, సౌదీకి రెండో అతి పెద్ద వాణిజ్య భాగస్వామి భారత్ అని 2022 లెక్క. మన ముడిచమురు దిగుమతుల్లో 18 శాతం పైగా అందిస్తున్నది ఈ అరబ్బు రాజ్యమే. కలసి ప్రగతి బాటలో సాగాలనే లక్ష్యంతో ఇరు దేశాలూ డిజిటల్ పేమెంట్స్, రక్షణ ఉత్పత్తులు, ఇంధనం, ప్రాథమిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం లాంటి రంగాల్లోనూ వాణిజ్య అవకాశాలను అన్వేషిస్తూ వచ్చాయి. సౌదీ యువరాజు, భారత ప్రధాని సహా ఉన్నతస్థాయి వ్యక్తులు కొద్దికాలంగా జరుపుతున్న పర్యటనలు ఈ బంధాన్ని బలోపేతం చేస్తున్నాయి. దానికి తగ్గట్టే ఇరుదేశాలూ తమకు ఉమ్మడి అంశాలైన తీవ్రవాదంపై పోరు, ప్రాంతీయ భద్రత, ఆర్థిక సహకారంపై దృష్టి సారిస్తున్నాయి.

సోమవారం నాటి చర్చల్లో మహారాష్ట్ర తీరంలో నిర్మించనున్న 5 వేల కోట్ల డాలర్ల విలువైన వెస్ట్ కోస్ట్ రిఫైనరీ ప్రాజెక్ట్‌ను వేగవంతంగా అమలు చేయాలని ఇరుదేశాలూ నిర్ణయించాయి. అందుకు ఓ సంయుక్త సత్వర కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానించాయి. ఇంధనం, రక్షణ, సెమీకండక్టర్, అంతరిక్ష రంగాల్లో ముమ్మర సహకారానికి వీలున్నట్టు గుర్తించాయి. డిజిటలీకరణ, పెట్టుబడులు సహా వివిధ రంగాల్లో సహకారాన్ని పెంచుకొనేందుకు 8 ఒప్పందాలపై సంతకాలూ చేశాయి. వాస్తవానికి, భారత్, సౌదీల మధ్య సత్సంబంధాల విస్తరణ కేవలం రెండు దేశాలకే కాక, మధ్యప్రాచ్యం – హిందూ మహాసముద్ర ప్రాంతం అంతటికీ కీలకం. ఈ ప్రాంతంలో సుస్థిరత, ఆర్థికాభివృద్ధి, భద్రతకు తోడ్పడుతుంది. అందుకే భారత్ సైతం ఒకపక్క వ్యూహాత్మకంగా ఇజ్రాయిల్‌తో బంధాన్ని పదిలంగా చూసుకుంటూనే, ఇతర అరబ్ దేశాలతో మాటామంతీ సాగిస్తోంది.

సౌదీతో మన వ్యూహాత్మక ప్రయోజనాలూ అనేకం. చైనాను మినహాయిస్తే, పాకిస్తాన్‌పై ఒత్తిడి చేయగల ఏకైక దేశం సౌదీనే. అందువల్లే, పాక్‌తో దానికున్న సంబంధాలకు అతీతంగా మన దేశమూ అరబ్బు రాజ్యంతో బలమైన బంధం పెట్టుకుంటోంది. ఇటీవలే ఇరాన్‌తో శత్రుత్వానికి స్వస్తి పలికిన సౌదీ జొహాన్స్‌బర్గ్ సదస్సులో 'బ్రిక్స్'లో సైతం సభ్యత్వం తీసుకుంది. ఆ పరిణామాల తర్వాత ప్రిన్స్ పర్యటనగా ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. 2019 ఫిబ్రవరిలో భారత్ సందర్శించిన సౌదీ ప్రిన్స్ ఇప్పుడు మళ్ళీ రావడం, ఈసారి భారత– జీసీసీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పైనా దృష్టి పెట్టడానికి ఇరుపక్షాలూ అంగీకరించడం గమనించదగ్గవి. మొత్తానికి, ఈ బంధం వేగంగా పరిణతి చెందుతోంది. తగ్గట్టే మధ్యప్రాచ్యంపై భారత విధానమూ వివిధ రూపాలు తీసుకుంటోంది. సరికొత్త వ్యూహాత్మక కూటమికి పురుడుపోస్తోంది. సౌదీతో స్నేహంలో తాజా భేటీ మరో ముందడుగు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.చతుర్దశి తె.4.03 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి అమావాస్య, **నక్షత్రం:** మఖ రా.2.35 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** ప.1.17 నుండి 3.04 వరకు, **దుర్ముహూర్తం:** ప.11.31 నుండి 12.21 వరకు, **అమృత ఘడియలు:** రా.11.55 నుండి 1.42 వరకు.

**సూర్యోదయం :** 5.50
**సూర్యాస్తమయం:** 6.03
**రాహుకాలం :** ప.12.00 నుండి 1.30 వరకు
**యమగండం :** ఉ.7.30 నుండి 9.00 వరకు

# భారత ఏఐ మోడల్ ఎలా ఉండాలి?

**కృత్రిమ మేధ విప్లవాన్ని అమెరికాలో పెద్ద టెక్నాలజీ కంపెనీలు ముందుకు తోస్తుంటే, చైనాలో అది ప్రభుత్వ మద్దతుతో సాగుతోంది. మరి ఈ విషయంలో భారత్ ఏం చేయాలి? భారతీయ కంపెనీలు, ప్రభుత్వం చేతులు కలిపితే స్థానికంగానే లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) ఒకదాన్ని తయారు చేయడం కష్టమేమీ కాదు. కాకపోతే వీటికి పాశ్చాత్య దేశాల మాదిరిగా పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరించాలా, చైనా తరహాలో ప్రభుత్వ నియంత్రణలో ఈ ఎల్ఎల్ఎంలను ఉంచాలా? అన్నది ముందు నిర్ణయించుకోవాలి. మనం మూడో మార్గం అనుసరించడం మేలు. ఇటీవలి కాలంలో భారతదేశం ప్రపంచానికి పరిచయం చేసిన మార్గమే ఇది. భారత్ తన జనరేటివ్ ఏఐని ప్రజల మంచి కోసం ఉపయోగించాలి. అందరి డిజిటల్ హితం కోసం దాన్ని 'జన్ ఏఐ' మోడల్‌గా తీర్చిదిద్దాలి.**

వీడియోలు సృష్టించడంలో ఛాట్‌జీపీటీకి ఉన్న సామర్థ్యం ప్రపంచాన్ని విపరీతంగా ఆకట్టుకోవడమే కాదు... పది కోట్ల మంది దాన్ని వినియోగించేలా చేసింది. 'ద లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్' (ఎల్ఎల్ఎం), అలాగే జనరేటివ్ ఏఐకి శక్తినిచ్చే విషయాలన్నీ... ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ వంటివాటిని సమూలంగా మార్చేసే అద్భుత టెక్నాలజీలనడంలో సందేహం లేదు. అందుకే గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ కృత్రిమ మేధను 'ఫైర్'(మంట) అని వర్ణిస్తే, మైక్రోసాఫ్ట్ అధినేత సత్య నాదెళ్ల సమూల మార్పునకు నాందిగా అభివర్ణించారు. మరోవైపు గోల్డ్‌మాన్ శాక్స్ లాంటి సంస్థలు జనరేటివ్ ఏఐ కారణంగా రానున్న దశాబ్ద కాలంలో ప్రపంచ స్థూల జాతీయోత్పత్తికి కనీసం ఏడు లక్షల కోట్ల డాలర్ల మొత్తం చేరుతుందని అంచనా వేస్తోంది. అయితే ఈ సానుకూల అంశాలతోపాటు ఉద్యోగాలు కోల్పోవడం, మానవ ప్రమేయం తగ్గిపోవడం వంటి కొన్నింటిపై ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. ఏఐ సూపర్ ఇంటెలిజెన్స్‌తో మనిషికి ముప్పు అన్న భావన కూడా పెరుగుతోంది. అలాగే వివక్ష, పర్యావరణ నష్టం, ప్రజాస్వామ్యానికి ముప్పు వంటి అంశాలూ చాలామందికి ఆందోళన కలిగిస్తున్నాయి.

ప్రస్తుతానికి జనరేటివ్ ఏఐ విషయంలో కార్యకలాపాలు ఎక్కువగా అమెరికా, చైనాల్లోనే జరుగుతున్నాయి. రెండింటిలోనూ వ్యవస్థల నిర్మాణం, ప్రపంచాన్ని చూసే దృష్టి పూర్తిగా వేరు. అమెరికాలో పెద్ద టెక్ కంపెనీలు ఏఐ విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తూండగా, చైనా భిన్నమైన మార్గంలో ప్రయాణిస్తోంది. చైనా కంపెనీలు ప్రభుత్వంతో కలిసి సొంత జనరేటివ్ ఏఐ మోడళ్ల తయారు చేస్తున్నాయి. సమాచారం, సందర్భాలు రెండింటినీ పరిగణనలోకి తీసుకునేలా చైనా తన జనరేటివ్ ఏఐ మోడళ్లను నిర్మిస్తోంది. ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలు ఎవరికివారు తమదైన రీతిలో వ్యవహరిస్తున్నారు. అది కూడా పరిమితమైన పరిధిలో. జనరేటివ్ ఏఐ నైతికంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించేలా దాన్ని నియంత్రించడంపై యూరోపియన్ యూనియన్ దృష్టి పెట్టింది. యునైటెడ్ కింగ్‌డమ్ కూడా ఏఐ ఆధారిత పరిపాలన విషయంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండాలని లక్ష్యిస్తోంది.

### భారత్ స్థానమెక్కడ?

అంతా బాగానే ఉంది కానీ... ఏఐ ఆధారిత ప్రపంచంలో భారత్ స్థానమెక్కడ? మేమూ సొంతంగా ఎల్ఎల్ఎం ప్లాట్‌ఫామ్స్ సిద్ధం చేసుకుంటామని ఈ మధ్యకాలంలో కొన్ని ప్రకటనలు వచ్చాయి. హడావుడి కూడా కనిపించింది కానీ... ఛాట్‌జీపీటీ సృష్టికర్త, ఓపెన్ ఏఐ సీఈవో సామ్ ఆల్ట్‌మన్ వీటిపై తన అభ్యంతరాలను స్పష్టం చేశారు. అయితే, భారతీయ కంపెనీలు, ప్రభుత్వం చేతులు కలిపితే స్థానికంగానే లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ఒకదాన్ని తయారు చేయడం పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. భారతీయ భాషలు, కాంటెక్స్ట్‌తో




కూడిన సమాచారాన్ని అందివ్వడం ద్వారా ఈ ఎల్ఎల్ఎంను వినూత్నంగా తీర్చిదిద్దవచ్చు. కానీ ఇలాంటి ప్రయత్నం చేసేముందు మన లక్ష్యం, ఉద్దేశం ఏమిటన్నది స్పష్టం చేసుకోవడం చాలా ముఖ్యం. పాశ్చాత్య దేశాల మాదిరిగా పెట్టుబడిదారీ విధానాన్ని అనుసరించాలా? లేక చైనా తరహాలో ప్రభుత్వ నియంత్రణలో ఈ ఎల్ఎల్ఎంలను ఉంచాలా? అన్నది తేల్చుకోవాలి.

మాకైతే మూడో మార్గం మేలని అనిపిస్తోంది. ఇటీవలి కాలంలో భారతదేశం ప్రపంచానికి పరిచయం చేసిన మార్గమే ఇది. చాలా సాహసోపేతమైందే కావచ్చు. కానీ భారత్ తన జనరేటివ్ ఏఐని ప్రజల మంచి కోసం ఉపయోగించాలి. డిజిటల్ పబ్లిక్ గుడ్ కోసమన్నమాట. దీన్ని ప్రజల కోసం 'జన్ ఏఐ' లేదా 'జెన్ ఏఐ' అని పిలుచుకుందాం.

### సామాజిక వృద్ధి కోసం...

భారత్ సృష్టించిన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎంతటి ఘన విజయం సాధించిందో మనందరికీ తెలుసు. 'ఇండియా–స్టాక్' ఆధారంగా మొత్తం జనాభా స్థాయిలో డిజిటైజేషన్ సాధ్యం చేయగలిగాం. ఫలితంగా 140 కోట్ల మందికి డిజిటల్ బయోమెట్రిక్ గుర్తింపులు, యూపీఐతో సులభతర చెల్లింపులు, ఆధార్ గుర్తింపులు, ప్రపంచంలోనే అతిపెద్ద టీకా కార్యక్రమం వంటి ఘనతలు ఎన్నింటినో సాధించగలిగాం. ఈ డిజిటల్ టెక్నాలజీల ఆధారంగా నిర్మించిన సేవల పుణ్యమా అని ఆరోగ్య రంగం కూడా ప్రజలకు మరికొంచెం చేరువైంది. లాజిస్టిక్స్, ఈ–కామర్స్, ప్రభుత్వ సబ్సిడీల వంటివి సులువైపోయాయి. దేశాద్యంతం సర్వసామాజిక వృద్ధి కూడా సాధ్యమైంది. ఇండియా స్టాక్ ద్వారా అందరికీ అందుబాటులో ఉన్న ఏపీఐల ఆధారంగా అసంఖ్యాకమైన స్టార్టప్‌లు వినూత్నమైన సేవలను భారతీయ పౌరులకు అందుబాటులోకి తేగలిగాయి. ఇండియా స్టాక్ ఇప్పటికే సింగపూర్, ఫ్రాన్స్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలకు విస్తరించే ప్రయత్నాల్లో ఉంది. ఇతర దేశాలు కూడా ఈ వరుసలో ఉన్నాయి. నిజానికి భారత్ తన జీ–20 అధ్యక్ష స్థానాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా డిజిటల్ పబ్లిక్ గుడ్, ఇండియా స్టాక్‌లను ప్రపంచం మొత్తానికి వ్యాపించేలా చేస్తోంది.

### అంతరాలు తొలగేలా...

ఇండియా స్టాక్ అసలైన సామర్థ్యం పౌరులందరికీ డిజిటల్ సేవలు అందించడం ద్వారా నిరూపితమైంది. పైగా ఇది అందరికీ అందుబాటులో ఉండటం వల్ల కంపెనీలు, స్టార్టప్‌లు దానికి ఎప్పటికప్పుడు విలువను జోడించేందుకూ అవకాశం ఏర్పడింది. జనరేటివ్ ఏఐని కూడా ఇదే పద్ధతిలో అభివృద్ధి చేయాలని మేము భావిస్తున్నాం. ఇండియా 'భారత్‌ఎల్ఎల్ఎం' పేరుతో సొంత జనరేటివ్ ఏఐ మోడల్‌ను తయారు చేసుకోవచ్చు. ఇండియా స్టాక్ ద్వారా సమాచారాన్ని అందివ్వడం ద్వారా మనకు మాత్రమే ప్రత్యేకమైన సమస్యలకు పరిష్కారాలు వెతకవచ్చు. ఇండియా స్టాక్‌పై ఇంకో పొర మాదిరిగా కొన్ని ఎల్ఎల్ఎంల సమాహారంగా జన్ ఏఐని ఏర్పాటు చేయవచ్చు. దీన్ని ప్రజాసేవలో భాగంగా అందరికీ అందివ్వడం కీలకం. తద్వారా డిజిటల్ అంతరాన్ని తొలగించవచ్చు. జనాభా మొత్తానికి లాభాలు అందించవచ్చు. ఆధార్, యూపీఐ మాదిరిగా అన్నమాట. వ్యక్తిగత గోప్యత, వివక్ష వంటి ఏఐ సంబంధిత ఆందోళనలకు సమాధానం వెతికేందుకు కూడా ఈ ప్రయత్నం ఉపకరిస్తుంది. వైయక్తిక గోప్యత విషయంలో పాశ్చాత్యుల ఆలోచన దీని కంటే భిన్నమైంది. సమష్టితనం, సామాజిక గోప్యత, నమ్మకం వంటి భారతీయ దృక్పథాలను వాడుకుంటూ ఈ పని చేయవచ్చు.

సానుకూల ప్రభుత్వం, ప్రపంచానికి నేతృత్వం వహిస్తున్న మన ఐటీ కంపెనీలు, ఐఐటీల వంటి సంస్థలు కలిసికట్టుగా ఈ 'జన్ ఏఐ'ని సుసాధ్యం చేయగలవని మేము విశ్వసిస్తున్నాం. ఆ తరువాత భారతీయ కంపెనీలు భారత్‌ఎల్ఎల్ఎం నుంచి నిర్దుష్ట, లోపాలు సరిదిద్దిన ఎల్ఎల్ఎంలను అభివృద్ధి చేయవచ్చు. అందరికీ అందుబాటులో ఉండే ఏపీఐల సాయంతో స్టార్టప్‌లు కూడా ఎల్ఎల్ఎంలను వాడుకోవచ్చు. డిజిటల్ టెక్నాలజీలో ఇప్పుడున్న రెండు విప్లవాత్మకమైన విషయాలను భారత్ ఇలా జోడించవచ్చు. అంటే జనరేటివ్ ఏఐ, డిజిటల్ పబ్లిక్ గుడ్‌లను మేళవించడం అన్నమాట. తద్వారా ప్రపంచంలోని అన్ని జన్ ఏఐ మోడళ్లకు నమూనాగా భారతీయ మోడల్‌ను నిలబెట్టవచ్చు.

– జస్‌ప్రీత్ బింద్రా, టెక్ విస్పరర్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్; సుధీర్ తివారీ, థాట్‌వర్క్స్ ఇండియా డిజిటల్ ఇంజినీరింగ్ సెంటర్ గ్లోబల్ హెడ్ ('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!




## సోషల్ మీడియా

### అదే గొప్ప



ప్రతి ఒక్కరూ బ్రహ్మాండమైనది ఏదో సాధించనక్కర్లేదు. కొంతమందిమి ఊరకే అలా శ్వాస తీసుకుంటూ, మన జీవితాల్ని విశ్రాంతిగా బతికితే చాలు.

– సాదియా అహ్మద్, డిజిటల్ జర్నలిస్ట్

### వర్గ వాదం



మీ అస్తిత్వాన్ని ఎలాగైనా ప్రకటించుకోండి. కానీ 'వర్గం' విషయంలో గుడ్డిగా ఉంటే మాత్రం, మీరు విఫలమైనట్టే లెక్క. ప్రపంచవ్యాప్త రాజకీయాల్లో అంతటా ఉండేదీ, అందరికీ వర్తించేదీ... వర్గం ఒక్కటే!

– సూరజ్ యెంగ్డే, అంబేడ్కర్‌వాది

### అంతా రివర్స్



నాయకుల గురించిన మన తీర్పు వారు బయటికి ఎలా కనబడుతున్నారనే విషయం ఆధారంగా 95 శాతం, వారి విధాన నిర్ణయాల ఆధారంగా 5 శాతం ఉంటుంది. కానీ ఇది వ్యతిరేకంగా ఉండాలి కదా! చూపుల కంటే విధానాలు ముఖ్యం!!

– పర్మీందర్ సింగ్, వ్యాపారవేత్త

### దేశం తీరు



వేరే దేశాల్లో అయితే ఫుట్‌బాల్ క్రీడాకారులను వారి ప్రతిభ ఆధారంగా కోచ్‌లు ఎంపిక చేస్తారు. ఇండియాలో మాత్రం, వారిని 'జ్యోతిష్యుడి సలహా' మీద తీసుకుంటారు. (ఇటీవల వచ్చిన ఒక వార్తాకథనం ప్రకారం) దానికోసం ఆయనకు పది లక్షలు చెల్లిస్తారు. ఏమైనా నమ్మశక్యంగా ఉందా?

– అద్వైద్, హిస్టారియన్

### కొత్త నిర్ణయం



పాఠశాలల్లో బాలికలు నిఖాబ్ ధరించడాన్ని నిషేధిస్తూ ఈజిప్ట్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త విద్యాసంవత్సరం సెప్టెంబర్ 30 నుంచి ఇది అమల్లోకి వస్తుందని వార్త. చూశారా... మరో పాశ్చాత్య ఇస్లామోఫోబిక్ దేశం ముస్లింల పట్ల వివక్ష చూపుతోంది. అరెరె... మర్చేపోయా... ఇది ఈజిప్ట్ కదా!

– రిద్వాన్ అయ్‌దేమిర్, యాక్టివిస్ట్

### దేశానికి మచ్చ



ఒకప్పుడు కెనడా అంటే వివాదాలకు అతీతంగా ఉండే దేశం. అలాంటిది ప్రధాని జస్టిన్ ట్రూడో హయాంలో ఆ దేశం ఎంతలా మారిపోయింది! గద్దెనెక్కడానికి ఆయన ఖలిస్తానీ తీవ్రవాదులతో చేతులు కలిపారు. కానీ అది ఎంత మూల్యానికి? కెనడా మీద ఉన్న ఉన్నత భావమే ఇప్పుడు పోయింది.

– సునందా వశిష్ట్, రాజకీయాంశాల వ్యాఖ్యాత

### ఒకే చదువు



ఒక దేశం – ఒక ఎన్నిక; ఒక దేశం – ఒక పన్ను... ఇలాగే ఒక దేశం – ఒక కటాఫ్ ఎందుకు ఉండకూడదు? 90 శాతం మార్కులు వచ్చినప్పటికీ జనరల్ విద్యార్థులకు ఎందుకు సీటు రాదు? మరోవైపున 20–30 శాతం మార్కులతో రిజర్వుడువాళ్లకు సీట్లు ఎలా వస్తున్నాయి?

– అనురాధా తివారీ, రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమకారిణి

## ఇన్ బాక్స్

# ప్రకృతి హితంగా...

ప్రతి రోజూ తమ ఆరోగ్యం కోసం సమయం కేటాయించ లేనివారు అనారోగ్యం కోసం చాలా సమయాన్ని చాలా రోజులు త్యాగం చేయక తప్పదు. మారుతున్న జీవన శైలి అనేక రుగ్మతలకు దారి తీస్తోంది. బీపీ, డయాబెటిస్, కార్డియోవాస్కులర్ సమస్యలు వంటివాటి బారిన పడుతున్నారు. మితాహారం, కాలానుగుణ ఆహారం ఆరోగ్యానికి కీలకం. అసంక్రమిత వ్యాధుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతోంది. దీనిని నివారించడానికి ఏమాత్రం ఖర్చు కాకుండా మన ఆరోగ్యాన్ని 'ప్రకృతి వైద్యం' ద్వారా నయం చేసుకోవచ్చు.

ఎలాంటి శారీరక శ్రమ లేకుండా ఆరోగ్యంగా ఉండాలనుకుంటే అత్యాశే అవుతుంది. కష్టతరమైన పనులు చేసేవారు, రైతులు, కూలీలు, హెవీ మోటార్ డ్రైవర్లు, నిర్మాణ కార్మికులు, హమాలీలు, శరీర కష్టం చేసే వారు ప్రత్యేకంగా వ్యాయామం చేయాల్సిన అవసరం లేదు. ఇంట్లో ఎవరి పనులు వారు చేసుకుంటే వ్యాయామం చేసే అవసరం తగ్గుతుంది. రోజువారీ పనులను నడక, సైకిల్ ద్వారా చేసుకుంటే సహజంగానే వ్యాయామం లభిస్తుంది. ఏ వ్యాయామం అయినా క్రమం తప్పకుండా చేయాలి. వ్యాయామం ఏదైనా ఒక్కటే నియమం, 'శక్తికి మించి వ్యాయామం చేయకూడదు'. మిట్ట మధ్యాహ్నం ఎండలో వ్యాయామం చేయకుంటే మంచిది.

నిత్య జీవితంలో రోజూ చేసే పనులు శారీరక శ్రమకు లింక్ చేయడం మంచిది. ఒబేసిటీ, బీపీ, మధుమేహ నియంత్రణకు వ్యాయామం చాలా అవసరం. అలాగే మనం ఇంట్లో కూర్చుని యోగ పైసా ఖర్చు లేకుండా చేసుకోవచ్చు. యోగాసనాలు శరీరానికి, మెదడుకీ ఎంతగానో మేలు చేస్తాయి.

ప్రకృతివైద్య సిద్ధాంతంలో, అనారోగ్యం అనేది ఆరోగ్యానికి భంగం కలిగించే ప్రక్రియగా, సహజ వ్యవస్థల సందర్భంలో ఆ తర్వాత కోలుకునే ప్రక్రియగా పరిగణించబడుతుంది. పేలవమైన పోషణ, దీర్ఘకాలిక ఒత్తిడి వంటి అనేకమైన విషయాలు ఆరోగ్యానికి ఎక్కువగా భంగం కలిగిస్తాయి. వీటిని గుర్తించడం, తగ్గించడం ద్వారా ఆరోగ్యాన్ని పునరుద్ధరించడం ప్రకృతి వైద్యుల లక్ష్యం.

– డా॥ ఎం. అఖిల మిత్ర, గౌతమ బుద్ధ అభివృద్ధి సమాఖ్య

# అంతర్జాతీయ యవనికపై మెరిసిపోతూ...

అభిప్రాయం



డా॥ పెద్దిరెడ్డి నరేందర్ రెడ్డి

భారతదేశం సార్వభౌమ దేశంగా అన్ని రంగాలలో సుస్థిర అభివృద్ధి సాధించిన దేశంగా స్వాతంత్ర్య అమృతోత్సవ ముగింపు సంబరాల్లో ఉంది. కరోనా మహమ్మారి మూలంగా ప్రపంచంలోని అగ్ర రాజ్యాలు సైతం కుదేలైనాయి. కానీ భారత్ మాత్రం అన్ని రంగాలలో సుస్థిర అభివృద్ధిని సాధిస్తూ 3.7 ట్రిలియన్ డాలర్ల పరిమాణంతో ప్రపంచంలోనే ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం ముదావహం. ఇదే సమయంలో అంతర్జాతీయంగా దేశ ప్రాముఖ్యం పైపైకి దూసుకుపోతుండడమూ గర్వించదగిన సంగతి.

ఇటీవలి ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, 2045 సంవత్సరానికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవించనున్నది. గడిచిన తొమ్మిదేండ్లలో కేంద్రం పెద్దనోట్ల రద్దు, జీఎస్టీని ప్రవేశపెట్టడం, ద్రవ్యోల్బణాన్ని అరికట్టడం; 'డిజిటల్ ఇండియా', 'మేక్ ఇన్ ఇండియా'లను ప్రవేశ పెట్టడం; వ్యవసాయిక, పారిశ్రామిక విధానాలలో మార్పుల వంటి విప్లవాత్మక నిర్ణయాల వలన అభివృద్ధి సాధ్యమయింది.

2014 మే నెలలో నరేంద్ర మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి విదేశీ విధాన రూపకల్పనలో అనేక మార్పులను తీసుకువచ్చారు. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తొలినాళ్ళలో 'సార్క్' (దక్షిణాసియా) దేశాలతో సంబంధాలను మెరుగు పరచటానికి చర్యలు తీసుకున్నారు. చైనా అక్రమ సైనిక చొరబాట్లను ఎప్పటికప్పుడు ఆయన నాయకత్వంలో దేశం తిప్పి కొట్టింది. 'సర్జికల్ స్ట్రైక్స్' నిర్వహించటం ద్వారా పాకిస్తాన్‌లోని తీవ్రవాదుల స్థావరాలను కూల్చివేసింది. తదుపరి పశ్చిమాసియా దేశాలతో సంబంధాలను పటిష్ఠ పరచడానికి మోదీ ప్రయత్నించారు. ముఖ్యంగా యూఏఈతో చేసుకున్న 'సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం – 2022' ఇరుదేశాల ఆర్థికాభివృద్ధికి మెరుగైన బాటలు వేసింది.

ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా దేశాలతో భారత్ సంబంధాలను మెరుగు పరచటంలో మోదీ ప్రభుత్వం నూతన ఒరవడికి నాంది పలికింది. అమెరికా అధ్యక్షులు ఒబామా, ట్రంప్‌ల కాలంలోనూ, ఇప్పటి బైడెన్ హయాంలోనూ అమెరికాకు భారత్ 'వ్యూహాత్మక భాగస్వామి'గా




చాలా దగ్గరయింది. మెక్సికో, కెనడా, బ్రెజిల్, అర్జెంటీనా తదితర దేశాలతోనూ మోదీ నాయకత్వంలో భారత్ ఎనర్జీ, అంతరిక్ష పరిశోధన, రక్షణ, సైబర్ సెక్యూరిటీ, స్కిల్ డెవలప్‌మెంట్, రైల్వేస్ తదితర రంగాలకు సంబంధించి ద్వైపాక్షిక ఒప్పందాలను చేసుకుంది. ఇటీవల దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్ బర్గ్‌లో ఆగస్టు 22 నుండి 24 వరకు నిర్వహించిన 'బ్రిక్స్' సదస్సులోనూ సభ్య దేశాలయిన బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా దేశాలతో అనేక వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంది భారత్. రష్యా, జపాన్, జర్మనీ, ఇటలీ, తదితర దేశాలతో భారత్ మొదటి నుంచి అవినాభావ సంబంధాలు కల్గి వుంది. అవి ఇప్పుడు మరింత బలపడ్డాయి.

మోదీ నాయకత్వంలో భారత్ అంతర్జాతీయ యవనికపై తనదైన ముద్రవేసింది. 2023లో జీ20కి భారత్ అధ్యక్షత్వాన్ని ప్రధాని మోదీ 'ప్రజల అధ్యక్ష పదవి'గా అభివర్ణించారు. జీ20 అధ్యక్ష బాధ్యతల్లో భాగంగా సహకార సమాఖ్య వాదాన్ని భారత్ విభిన్న నమూనాలలో ప్రదర్శించింది. సదస్సులో పాల్గొన్న అన్ని సభ్య దేశాలూ వివిధ అంశాలకు సంబంధించి 'న్యూఢిల్లీ సంయుక్త లీడర్స్ డిక్లరేషన్' పేరుతో ప్రకటన చేశాయి. ఉగ్రవాదాన్ని అంతమొందించటం, శిలాజ, ఇంధనాల వాడకం తగ్గింపు, అవినీతిపై పోరు, వాణిజ్య సంబంధాల బలోపేతం, 'భారత్–గల్ఫ్– యూరప్– మహారైల్ పోర్ట్ కారిడార్ నిర్మాణం' వంటివి ఆ ప్రకటనలో భాగంగా ఉన్నాయి. ఈ సందర్భంగా ఆఫ్రికన్ యూనియన్ ఛైర్మన్ విజ్ఞప్తి మేరకు భారత్ ఆఫ్రికన్ యూనియన్ సభ్యత్వం తీసుకుంది. ఈ సందర్భంగా భారత్, అమెరికా అధినేతలు మోదీ, జోబైడెన్‌ల మధ్య ద్వైపాక్షిక ఒప్పందం జరిగింది. అలాగే ఐక్యరాజ్య సమితిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ అనేక దేశాల మద్దతును కూడగట్టింది. ఈ వేదిక ద్వారా అమెరికా, బ్రిటన్‌లు భారత్‌కు ఐరాసలో శాశ్వత సభ్యత్వం కోసం మద్దతు ప్రకటించటం గర్వించదగిన విషయం.


ఇటీవలి 'చంద్రయాన్–3', 'ఆదిత్య ఎల్–1' ప్రయోగాలు కూడా శాస్త్ర సాంకేతిక రంగంలో భారత్ శక్తి సామర్థ్యాలను ప్రపంచానికి మరోసారి వెల్లడించాయి. దేశానికి అంతర్జాతీయంగా మరింత గౌరవం ఇనుమడించింది.

వ్యాసకర్త ఓయూలో పోస్ట్ డాక్టోరల్ ఫెలో

# భగవన్నామ స్మరణ

మనిషి తాను చేయవలసిన పనిని సకాలంలో చేసినప్పుడే భగవంతుడూ సరైన సమయంలో ఆదుకుంటాడు.

భగవంతుడి అనుగ్రహం లభించడానికి సమయ సందర్భాలు ఉంటాయి. అందుకు తగిన పుణ్యం చేసి ఉండాలి. సమయం వచ్చినప్పుడు అది లభిస్తుంది. మనం చేయవలసిందల్లా భగవన్నామ స్మరణే. దేవుణ్ణి నోరారా కీర్తించాలి. ఆలయానికి వెళ్ళి ఆయన్ని దర్శించి నమస్కరించాలి. అప్పుడప్పుడైనా




గురువుగారి వద్దకు వెళ్ళి వారి ఉపదేశం వినాలి. సన్మార్గంలో నడవాలి. ఇవన్నీ చేయడానికి దేవుడు మనకీ జన్మ ఇచ్చాడు. అయితే మనం అవన్నీ మరచిపోయి ఏవేవో చేస్తూ ఈ పుట్టుకను వృథా చేసుకుంటూ ఉంటాం.

జీవితకాలంలో ఏ క్షణానికి ఆ క్షణమే ముఖ్యం. ఒక నిమిషాన్ని వదులుకుంటే అది మళ్ళీ తిరిగి రాదు. రోజులు గడిచేకొద్దీ మన ఆయువు తగ్గుతోందన్న సత్యాన్ని తెలుసుకోవాలి. చెయ్యవలసిన మంచిని చెయ్యకుండా సాగిపోతుంటాం. ఒకరు ఎప్పుడూ 'శంభో శంకరా, శంభో శంకరా' అని స్మరిస్తూ ఉంటారు. అంత్యదశలోనూ ఆయన నోటంట ఈ మాట వస్తుంది. ఆయనకు ముక్తి లభిస్తుంది. చివరి క్షణంలోనూ భగవంతుడు జ్ఞాపకమొచ్చి ఆ నామాన్ని పలకడం అపూర్వం. నిజానికి చివరి క్షణాల్లో చాలా మందికి జ్ఞాపకశక్తి క్షీణిస్తుంది. మాటలు రావు. కళ్ళు కనిపించవు. ఇక భగవంతుడి నామాన్ని ఎలా ఉచ్చరిస్తారు! కనుక ఆరోగ్యం బాగుండి వయసులో ఉన్నప్పుడే భక్తి మార్గంలో నడవాలి.

– యామిజాల జగదీశ్

# ఎత్తయిన నడకమార్గాల కోసం ప్రణాళిక

**ఏపీ వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ మధుసూదన్‌రెడ్డి వెల్లడి**


మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

**తిరుమల:** యాత్రికుల భద్రతతో పాటు వన్యప్రాణుల సంరక్షణ కూడా ముఖ్యమేనని, తిరుమల నడకమార్గాల్లో ఎత్తయిన నడకమార్గాల ఏర్పాటుకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఏపీ వైల్డ్ లైఫ్ చీఫ్ వార్డెన్ మధుసూదన్ రెడ్డి చెప్పారు. క్రూరమృగాలు దగ్గరకు రాకుండా ఈ మార్గాలను సురక్షిత జోన్లుగా మార్చడమే ప్రభుత్వం, టీటీడీ లక్ష్యమన్నారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. యాత్రికులకు జంతువులు తారసపడకుండా చేపట్టాల్సిన ప్రణాళికలపై టీటీడీ అధికారులతో చర్చించినట్లు తెలిపారు. ఏడో మైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు 20 రియల్ టైమ్ హై–ఫై కెమెరాలు, మరో 300 కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేశామన్నారు. మరో 500 అధునాతన సిమ్ బేస్డ్ రియల్ టైమ్ కెమెరా ట్రాప్‌లను కొనుగోలు చేసి ఏర్పాటు చేస్తామన్నారు. అలిపిరి నడకమార్గంలోని దుకాణాల్లో ఆహార వ్యర్థాలను పడేస్తుండడం వల్ల వాటి కోసం జంతువులు వస్తుంటాయని చెప్పారు. జంతువుల కోసం చిరుతలు, ఎలుగుబంట్లు ఇటువైపు వస్తున్నాయని, ఈ కారణంగా ఆహారపదార్థాలు విక్రయించే దుకాణాలపై ఆంక్షలు విధించామని చెప్పారు. ముఖ్య అటవీ సంరక్షణాధికారి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు



**రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ):** సికింద్రాబాద్ డివిజన్‌లోని మాకుడి–సీర్పూర్ టౌన్ సెక్షన్ మధ్యలో విద్యుదీకరణతో మూడవ లైన్ నిర్మాణ పనుల కారణంగా ఆ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేయంతో పాటు, మరికొన్నింటిని దారి మళ్లించి నడపనున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న ధనాపూర్–సికింద్రాబాద్ (03225), 22న హైదరాబాద్–గోరఖ్‌పూర్ (02575), 23న హైదరాబాద్–రక్షౌ ల్ (07051), 24న సికింద్రాబాద్–ధనాపూర్ (03226), గోరఖ్‌పూర్–హైదరాబాద్ (02576), 26న రక్షౌ ల్–హైదరాబాద్ (07052) రైళ్లను రద్దు చేశారు. ఈ నెల 22 నుంచి 25 వరకు ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–అహ్మదాబాద్ (12656) రైలును పెద్దపల్లి, నిజామాబాద్, పూర్ణా, అకోలా మీదుగా దారి మళ్లించారు. అదే విధంగా ఈ నెల 22 నుంచి 25 వరకు యశ్వంత్‌పూర్–హజరత్ నిజాముద్దీన్ (12649) రైలును, అలాగే ఈ నెల 18, 19, 21, 23, 24, 25 తేదీల్లో హజరత్ నిజాముద్దీన్–యశ్వంత్‌పూర్ (12650) రైలును బళ్లారి, గుంతకల్లు, వాడి, మన్మడ్, ఖాండ్వా, ఇటార్సీ స్టేషన్‌ల మీదుగా దారి మళ్లించారు.

# అక్టోబర్ నుంచి ధర్మ ప్రచార వారోత్సవాలు

**ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి**



**సాక్షి, అమరావతి:** దేవదాయ శాఖ పరిధిలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 6 (ఏ) కేటగిరిలోని 115 ఆలయాల ఆధ్వర్యంలో ఆయా ఆలయాల పరిధిలో ధర్మ ప్రచార వారోత్సవాలను నిర్వహించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన ధర్మ ప్రచార పరిషత్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది వరకు దఫాల వారీగా ఆయా ఆలయాల్లో పరిధిలోని గ్రామాల్లో ప్రవచనాలు, హరికథలు, భక్తి సంగీతం, కూచిపూడి నృత్యాలు, భజనలు, కోలాటాలు, పారాయణలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ఈ వారోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. వాటితో పాటు సామూహిక ఉచిత కుంకుమ పూజలు, అభిషేకాలు, సరస్వతీ హోమాలు, గోపూజలు, కల్యాణోత్సవాలు ఏర్పాటు చేయాలని, నగర– గ్రామ సంకీర్తన, శోభాయాత్రలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లోని చిన్నారులకు సంప్రదాయ వేషాలు, పాఠశాల విద్యార్థులకు పురాణ పాత్రలు, భగవద్గీతపై వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, కమిషనర్ ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బాబు అరెస్ట్‌పై 29 గ్రామాల్లో స్పందనేది?

**1,080వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు**



**తాడికొండ:** రాజధానిని సింగపూర్‌లా అభివృద్ధి చేసి ఉంటే.. బాబు అరెస్టుపై 29 గ్రామాల్లో ప్రజాస్పందన ఎక్కడుందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ప్రశ్నించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 1,080వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడారు. అమరావతి పేరుతో గ్రాఫిక్స్ మాయాజాలం చేసిన చంద్రబాబు ఈ ప్రాంత ప్రజలను నిలువునా మోసం చేశాడన్నారు. ఒక ఎకరం ఆస్తి ఉన్న చంద్రబాబు వేల కోట్లు ఎలా సంపాదించాడో విచారణ చేసి అవినీతి ధనాన్ని కక్కించాలన్నారు. బాబుకో న్యాయం సామాన్యుడికో న్యాయం అన్నట్లుగా కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేయడం హాస్యాస్పదమని, తప్పు చేసి జైలు పాలైన వారికి శిక్షలు లేకుండా సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లా వర్క్ ఫ్రం హోం అడగడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఆర్థిక ఉగ్రవాది చంద్రబాబుపై ఉన్న 27 కేసుల్లో స్టేలు తొలగించి పూర్తిస్థాయి విచారణ చేయాలన్నారు. బహుజనులకు అన్యాయం చేసినందుకే బాబు జైలు పాలయ్యాడని ధ్వజమెత్తారు. నాయకులు కారుమూరి పుష్పరాజ్, మాదిగాని గురునాథం, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

# మాచ్‌ఖండ్‌లో నిలిచిన విద్యుత్ ఉత్పత్తి



**ముంచంగిపుట్టు (అల్లూరి సీతారామరాజు జిల్లా):** ఆంధ్ర, ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. విద్యుత్ కేంద్రానికి చెందిన టీపీ డ్యాం వద్దగల సారంగమార్గంలో ఇన్‌టెక్‌గేట్ చైన్ తెగిపోయింది. విద్యుత్ కేంద్రానికి ప్రమాదమని భావించిన ప్రాజెక్టు అధికారులు వినియోగంలో ఉన్న ఆరు జనరేటర్ల నుంచి మంగళవారం సాయంత్రం ఆరుగంటలకు విద్యుత్ ఉత్పత్తిని నిలిపేశారు. దీంతో గంటకు 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి నష్టం కలుగుతోంది. బుధవారం ఉదయం పునరుద్ధరణ పనులు చేపడతామని అధికారులు తెలిపారు.

# దుర్గమ్మ సేవలో జస్టిస్ వెంకటరమణ



**ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ):** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.వెంకటరమణ మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన జస్టిస్ వెంకటరమణ దంపతులకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న న్యాయమూర్తి దంపతులను వేదపండితులు ఆశీర్వదించగా, ప్రధాన అర్చకుడు భద్రీనాథ్‌బాబు ప్రసాదాలు అందజేశారు.

# రొయ్య రైతుల సమాఖ్య ఆవిర్భావం

**సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా భాస్కరరాజు, సుబ్బరాజు**


ఏపీపీఎఫ్ఎఫ్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న వడ్డి రఘురామ్, మోహనరాజు తదితరులు

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ రొయ్య రైతుల సమాఖ్య (ఏపీ పీఎఫ్ఎఫ్) ఆవిర్భవించింది. విజయవాడలో మంగళవారం జరిగిన రాష్ట్ర రొయ్య రైతుల సమావేశంలో జాతీయ రొయ్య రైతుల సమాఖ్యకు అనుబంధంగా దీనిని ఏర్పాటు చేశారు. ఏపీ ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) కో–వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ సమక్షంలో నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. సమాఖ్య అధ్యక్షునిగా కె.భాస్కరరాజు (కృష్ణా), ప్రధాన కార్యదర్శిగా జీవీ సుబ్బరాజు (పశ్చిమ గోదావరి), ఉపాధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వరరావు (కృష్ణా), ఆర్.నానిరాజు (అంబేడ్కర్ కోనసీమ), ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి.గోపీనాథ్ (ప్రకాశం), కోశాధికారిగా వై.వెంకటానందం (అంబేడ్కర్ కోనసీమ), సహాయ కార్యదర్శులుగా ఇ.ఇమ్మానియేల్ (బాపట్ల), యు.రాంబాబు (పశ్చిమ గోదావరి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమాఖ్య గౌరవ అధ్యక్షునిగా అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్, సలహాదారులుగా జాతీయ రొయ్య రైతుల సమాఖ్య అధ్యక్షుడు ఐపీఆర్ మోహనరాజు, శ్రీనాథ్‌రెడ్డి, నాగభూషణం, సీహెచ్ సూర్యారావు, డీవీ లక్ష్మీపతిరాజు వ్యవహరిస్తారు. గతంలో ఎన్నడూలేని విధంగా గడిచిన నాలుగేళ్లుగా ఆక్వా రంగానికి, ఆక్వా రైతులకు అన్ని విధాలుగా చేయూతనిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏపీ రొయ్య రైతుల సమాఖ్య నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది. కాగా, రొయ్యల స్థానిక వినియోగం పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రాన్ ఫెస్టివల్స్‌కు జిల్లా రొయ్య రైతు సంఘాల ఆధ్వర్యంలో ఉచితంగా రొయ్యలు సరఫరా చేయాలని నిర్ణయించారు.

# ఆగమోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం


ఆనంద నిలయంపై విమాన వేంకటేశ్వరస్వామి వద్ద శుద్ధి చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన

**తిరుమల:** తిరుమల శ్రీవారి ఆలయంలో సెప్టెంబర్ 18 నుంచి 26 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం నాడు ఆలయ శుద్ధి చేపట్టడం ఆనవాయితీ. ఉదయం 6–11 గంటల వరకు ఆనందనిలయం, బంగారువాకిలి, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా చేశారు. ఈ సమయంలో మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పారు. శుద్ధి అనంతరం సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేకపూజ, నైవేద్యం కార్యక్రమాలను నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. టీటీడీ చైర్మన్ భూమన, ఈవో ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు సుబ్బరాజు, తిప్పేస్వామి, సీవీఎస్వో నరసింహ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా గురుప్రసాద్



**కర్నూలు కల్చరల్:** దేవదాయ శాఖ కర్నూలు జోన్ (ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాలు) డిప్యూటీ కమిషనర్‌గా పట్టెం గురుప్రసాద్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎఫ్ఏసీ డీసీగా విధులు నిర్వహించిన రాణా ప్రతాప్ స్థానంలో గురుప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం రాత్రి దేవదాయశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ మేరకు ఆయన విధుల్లో చేరారు. వైఎస్సార్ జిల్లాకు చెందిన ఈయన ప్రస్తుతం విజయవాడ కనదుర్గమ్మ దేవస్థానం డిప్యూటీ ఈవోగా ఉన్నారు. కర్నూలులో ఎఫ్ఏసీ డీసీగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేవాలయాల ఆస్తుల పరిరక్షణ, ఆలయాలలో వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు.

# ఈఎన్‌టీ ప్రొఫెసర్ రవికి బంగారు పతకం

**స్వరపేటిక పెరాలసిస్ శస్త్ర చికిత్సపై ప్రజెంటేషన్‌కు లభించిన గౌరవం**


గోల్డ్‌మెడల్ అందుకుంటున్న జీజీహెచ్ ఈఎన్‌టీ విభాగాధిపతి డాక్టర్ కొణిదె రవి

**లబ్బీపేట(విజయవాడ తూర్పు):** స్వరపేటిక పెరాలసిస్ వ్యాధిని అత్యాధునిక శస్త్ర చికిత్స ద్వారా సరి చేయడంపై ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాల, ప్రభుత్వాస్పత్రి ఈఎన్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ కొణిదె రవి చేసిన ప్రజెంటేషన్‌కు గోల్డ్‌మెడల్ లభించింది. నెల్లూరులో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు జరిగిన ఆంధ్రప్రదేశ్ స్థాయిలో చెవి, ముక్కు, గొంతు వైద్యుల సదస్సుకు దేశంలోని పలు ప్రాంతాల నుంచి నిష్ణాతులైన ఈఎన్‌టీ వైద్యులు 400 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈఎన్‌టీ విభాగంలో అరుదైన వ్యాధులు, అందుబాటులోకి వచ్చిన అత్యాధునిక శస్త్ర చికిత్సలపై ప్రజెంటేషన్స్, విశ్లేషణలు, చర్చా కార్యక్రమాలు నిర్వహించారు. స్వరపేటిక పెరాలసిస్‌కు గురైన రోగులకు శస్త్ర చికిత్సతో సరిచేసిన విధానంపై డాక్టర్ కొణిదె రవి ప్రజెంటేషన్ చేశారు. దీనికి గాను బంగారు పతకం లభించింది. విజయవాడ ప్రభుత్వాస్పత్రి ఈఎన్‌టీ విభాగాధిపతిగా డాక్టర్ కొణిదె రవి సారథ్యంలో ఎన్నో అరుదైన శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయి సదస్సులో బంగారు పతకం పొందడంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ తదితరులు డాక్టర్ రవిని ప్రత్యేకంగా అభినందించారు.

# పునరుత్పత్తి వ్యవస్థపైనా ప్లాస్టిక్ పంజా!

**బీపీఏ రసాయనంతో మగపిల్లల పునరుత్పత్తి వ్యవస్థపై దుష్ప్రభావం!**
**ఎన్ఐఎన్ పరిశోధనలో విస్మయకర వాస్తవాలు**

**సాక్షి, హైదరాబాద్:** పర్యావరణానికి చేటు చేస్తున్న ప్లాస్టిక్ వాడకాన్ని వెంటనే నిలిపివేసేందుకు మరో కారణం దొరికింది. కొన్ని రకాల ప్లాస్టిక్‌ల తయారీలో వినియోగించే బిస్ఫినాల్–ఏ రసాయనం గర్భంలోని మగపిల్లల పునరుత్పత్తి వ్యవస్థపై కూడా ప్రభావం చూపవచ్చునని హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) నిర్వహించిన పరిశోధన ద్వారా స్పష్టమవడం దీనికి కారణం. బీపీఏ అని క్లుప్తంగా పిలిచే ఈ రసాయనం గర్భస్థ పిండాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో తెలుసుకునేందుకు ఎన్ఐఎన్ శాస్త్రవేత్తలు ఎలుకలపై కొన్ని ప్రయోగాలు చేశారు. ప్రమాదకరమైన ఈ రసాయనం ప్లాస్టిక్స్‌లో మాత్రమే కాకుండా ఫుడ్ కంటెయినర్లు, ఇతర వినియోగ వస్తువుల్లోనూ ఉంటుంది. హార్మోన్ వ్యవస్థపై ఇది దుష్ప్రభావం చూపుతుందని కూడా చాలాకాలంగా తెలుసు. తాజా పరిశోధనలో మాత్రం ఇది గర్భస్థ పిండాలు ఈ రసాయన ప్రభావానికి లోనైతే పుట్టిన తరువాత వారి వృషణాల పనితీరు, మరీ ముఖ్యంగా వీర్య వృద్ధికి సంబంధించిన ప్రక్రియల్లో సైతం ప్రతికూల మార్పులకు కారణమవుతున్నట్లు గుర్తించారు. ఈ అధ్యయనం కోసం ఎన్ఐఎన్ శాస్త్రవేత్తలు గర్భంతో ఉన్న ఎలుకలు కొన్నింటిని తీసుకుని రెండు గుంపులుగా విడదీశారు. ఒక గుంపులోని ఎలుకలను 4 నుంచి 21 రోజులపాటు బీపీఏ ప్రభావానికి లోనయ్యేలా చేశారు. రెండో గుంపులోని ఎలుకలను మాత్రం సాధారణ స్థితిలో ఉంచారు. బీపీఏ ప్రభావానికి లోనైన గుంపులోని ఎలుకలకు పుట్టిన మగ ఎలుకలను పరిశీలించినప్పుడు శుక్రకణాల సాంద్రత తగ్గడం, అక్కడ ఉత్పత్తి అయ్యే ఫుఫా ప్యాటీ యాసిడ్ల మోతాదు తగ్గడం వంటివి గుర్తించారు. ఈ మార్పులు కాస్తా శుక్రకణాల ఎదుగుదలపై చెడు ప్రభావం చూపింది. ఈ మగ ఎలుకలు పునరుత్పత్తి చేయగల స్థాయికి చేరుకున్నప్పుడు నాణ్యమైన వీర్యాన్ని ఉత్పత్తి చేసే అవకాశాలు తక్కువని ఈ పరిశోధనలకు నేతృత్వం వహించిన శాస్త్రవేత్త సంజయ్ బాసక్ తెలిపారు. మగపిల్లలు పిండస్థాయిలో బీపీఏ ప్రభావానికి లోనైతే పునరుత్పత్తి వ్యవస్థపై దీర్ఘకాలిక ప్రభావం ఉంటుందని తాము నిరూపించగలిగామని ఆయన చెప్పారు. ఇతర మార్గాల ద్వారా (చర్మం, శ్వాస, నోరు) బీపీఏ ప్రభావానికి గురైనా ఇలాంటి ఫలితాలే ఉంటాయా లేదా? అన్నది పరిశీలించి నిర్ధారించుకోవాలని అప్పుడే ఒక స్పష్టమైన అంచనాకు రావచ్చునని ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.హేమలత తెలిపారు. అయితే గర్భిణులు లేదా గర్భధారణ ప్రయత్నాల్లో ఉన్నవారు వీలైనంత వరకూ బీపీఏ రసాయనానికి దూరంగా ఉండటం మంచిదని, బీపీఏ ఉన్న వస్తువులు వాడకపోవడం మేలని డాక్టర్ సంజయ్ బాసక్ సూచించారు.

● తెలంగాణ

# వైద్య విద్యార్థుల సస్పెన్షన్ ఎత్తివేయాలి

**గాంధీ ఆస్పత్రి (హైదరాబాద్):** గాంధీ వైద్య కళాశాల వైద్య విద్యార్థులపై సస్పెన్షన్‌పై పునరాలోచించాలని కోరుతూ వైద్య విద్యార్థులు ప్రిన్సిపాల్ కార్యాలయాన్ని ముట్టడించి శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. గాంధీ వైద్య కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడిన పదిమంది వైద్య విద్యార్థులను ఏడాది పాటు సస్పెండ్ చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో గాంధీ వైద్య విద్యార్థులు మంగళవారం ధర్నా నిర్వహించారు. గాంధీ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, చిలకలగూడ సీఐ మట్టంరాజులు వైద్య విద్యార్థులతో పలుమార్లు చర్చలు జరిపారు. ఢిల్లీలోని యూజీసీ యాంటీ ర్యాగింగ్ సెల్‌కు ఫిర్యాదు అందిన నేపథ్యంలో.. అక్కడి ఉన్నతాధికారుల సూచన మేరకు గాంధీ వైద్య కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ జరిపిన అంతర్గత విచారణలో ర్యాగింగ్ జరిగినట్లు నిర్ధారణయిందని అధికారులు వివరించారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ తీర్మానం మేరకే చర్యలు చేపట్టామని, ఇది డీఎంఈ నిర్ణయం కాదని స్పష్టం చేశారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చట్టప్రకారం పోలీస్ కేసులు నమోదు చేయాలని, విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందనే ఉద్దేశంతో ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని ఓ అధికారి పేర్కొన్నారు. డీఎంఈ, గాంధీ ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి ప్రస్తుతం అందుబాటులో లేరని, బుధవారం ఆయనతో సమావేశం ఏర్పాటు చేస్తామని వైస్ ప్రిన్సిపాల్ నచ్చజెప్పడంతో విద్యార్థులు ధర్నా విరమించి, తరగతులకు హాజరయ్యారు.

# ప్రీతి మృతి కేసులో సైఫ్ వాదనలు వినండి

**కాకతీయ మెడికల్ కాలేజీకి హైకోర్టు ఆదేశం**

**సాక్షి, హైదరాబాద్:** వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతి కేసులో సస్పెన్షన్‌కు గురైన సీనియర్ విద్యార్థి ఎంఏ సైఫ్ అలీ వాదన వినాలని కాకతీయ మెడికల్ కాలేజీని హైకోర్టు ఆదేశించింది. ఆ తర్వాత అతనిపై సస్పెన్షన్ ఎత్తివేయాలా? వద్దా? అనేదానిపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. 'వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో ధరావత్ ప్రీతి ఎండీ అనస్థీషియా విద్యార్థినిగా 2022 చేరింది. రెండో సంవత్సరం చదువుతున్న సైఫ్ ఆమెను ర్యాగింగ్ చేస్తూ వేధింపులకు గురిచేశారు. ఈ విషయాన్ని ప్రీతి మాకు కూడా చెప్పింది. అనస్థీషియా హెడ్‌ను, ప్రిన్సిపాల్‌ను కలసి ఫిర్యాదు చేశాం. అయినా వారు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 21న సైఫ్ తన స్నేహితులతో కలసి ప్రీతికి విషపూరిత ఇంజక్షన్ ఇచ్చారు. ఎంజీఎం ఆస్పత్రి, అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించినా చికిత్స పొందుతూ ప్రీతి మృతి చెందింది. దీనికి కారకులైనవారిపై కఠినచర్యలు తీసుకోవాలి'అని ఆమె తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసులో భాగంగా సైఫ్‌ను అధికారులు అరెస్టు చేయడమే కాకుండా సస్పెండ్ చేశారు. అయితే తన వాదనలు కూడా వినకుండా సస్పెండ్ చేశారని, ఇది చట్టవిరుద్ధమని పేర్కొంటూ సైఫ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2023లో ఏప్రిల్ 28, మే 23, జూన్ 2న ఈ మేరకు వినతిపత్రం సమర్పించినా అధికారులు పట్టించుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తన సస్పెన్షన్ కొట్టివేస్తూ ఆదేశాలివ్వాలని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సూరేపల్లి నందా విచారణ చేపట్టారు. ఈ మేరకు సైఫ్ వాదనలు విని నిర్ణయం తీసుకోవాలని అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు.

# బీజేపీ ప్రచార నిర్వహణకు 300 కాల్ సెంటర్లు

**దేశవ్యాప్తంగా 10 జోన్ల ఏర్పాటుకు కసరత్తు**
- లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ సమాయత్తం
- తెలంగాణ–ఏపీ జోన్ ఇన్‌చార్జిగా అమిత్ థాకర్

**సాక్షి, న్యూఢిల్లీ:** రానున్న లోక్‌సభ ఎన్నికల ప్రచార నిర్వహణకు బీజేపీ భారీగా ఏర్పాట్లు చేస్తోంది. దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, ప్రచార అంశాలను రూపొందించడం, ఓటర్లను ఆకట్టుకునే కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యాలుగా 300 కాల్ సెంటర్లు ఏర్పాటు చేస్తోంది. దేశాన్ని 10 జోన్లుగా విభజించించి, ప్రతి 27 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకటి చొప్పున కాల్ సెంటర్‌ను నిర్వహించనుంది. అక్టోబర్ నుంచి ఎన్నికల తేదీ వరకు ఓటర్లకు సరైన ప్రచార అంశాలను అందించడంతోపాటు వారితో నిత్యం సంబంధాలు కలిగి ఉండేలా ఈ కాల్‌సెంటర్లు సహాయపడనున్నాయి. ఓటర్లకు నిత్యం ఫోన్ చేసి పార్టీ పనితీరుపై వారి అభిప్రాయాలను సేకరించడంతోపాటు పార్టీ లక్ష్యాలను, మేనిఫెస్టో అంశాలను వారికి వివరించేలా సెంటర్లు పనిచేస్తాయని బీజేపీ కీలక నేత ఒకరు తెలిపారు. పది జోన్లకు ఒకరు చొప్పున ఇన్‌చార్జ్‌లనియామకాలను పూర్తి చేసిన పార్టీ అధిష్టానం తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ జోన్ ఇన్‌చార్జిగా గుజరాత్ ఎమ్మెల్యే అమిత్ థాకర్‌ను నియమించింది. మధ్యప్రదేశ్–ఛత్తీస్‌గఢ్ జోన్‌కు బిహార్ బీజేపీ నేత దేవేశ్ కుమార్, ఉత్తరప్రదేశ్–ఉత్తరాఖండ్ ఇన్‌చార్జిగా ఢిల్లీ బీజేపీ ఉపాధ్యక్షుడు రాజీవ్ బబ్బర్‌ను నియమించారు. ఈ నేతలు కేంద్ర కార్యాలయంలో ఉండే ఐదుగురు ముఖ్యనేతలతోపాటు ఆయా రాష్ట్రాల పరిధిలో ఏర్పాటు చేసే కాల్‌సెంటర్ల ఇన్‌చార్జ్‌లను కలుపుకుని ప్రచార కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు.

# వి'జ్ఞాన'మస్తు ఓం 'ప్రథమ్'

- విద్యా ప్రమాణాల పెంపునకు ప్రభుత్వం కృషి
- పునాది తరగతులకు ప్రత్యేక బోధనకు చర్యలు
- ఎఫ్ఎల్ఎన్ ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ


విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించే తీరును ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

**బాపట్ల అర్బన్:** శ్రద్ధగా వినడం.. చక్కగా చదవడం.. అందంగా రాయడం.. సరళంగా మాట్లాడడం.. ప్రాథమిక భావనలను అర్థం చేసుకోవడం.. వంటి విద్యాభ్యసన, భాషా సామర్థ్యాలను చిన్నారుల్లో పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం విద్యా ప్రణాళికలు అమలుచేస్తోంది. చిన్న వయసులోనే చదువులకు గట్టిపునాది వేసేలా ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)కు శ్రీకారం చుట్టింది. దీనిలోభాగంగా సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌పర్మేషన్ (సాల్ట్) అమలుకు పూర్వ ప్రాథమిక, ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు.

**మండలానికి ముగ్గురు టీచర్ల ఎంపిక**

ప్రథమ్ సంస్థ ద్వారా మండలానికి ముగ్గురు టీచర్ల చొప్పున మొత్తం 75 మందిని జిల్లా రిసోర్స్‌పర్సన్లుగా (డీఆర్పీలు)గా ఎంపిక చేసి శిక్షణ పూర్తిచేశారు. వీరంతా త్వరలో మండలాలకు వెళ్లి ఉపాధ్యాయులందరికీ శిక్షణ ఇస్తారు.

**జ్ఞాన జ్యోతి జ్ఞాన ప్రకాష్ గా విభజన**

ఎఫ్ ఎల్ ఎన్ అమల్లో భాగంగా పూర్వ ప్రాథమిక విద్యను జ్ఞాన జ్యోతిగా, ప్రాథమిక విద్య (తరగతి1, 2)ను జ్ఞానప్రకాష్ గా విభజించారు. జ్ఞాన జ్యోతి విభాగంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయలకు 120 రోజులు, జ్ఞాన ప్రకాష్ విభాగంలోని ఎస్‌జీటీలకు 60 రోజుల శిక్షణ ఉంటుంది. ఏడాదికి 20 రోజుల వంతున మూడేళ్లపాటు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. 20 రోజులలో తొలి ఆరు రోజులు ఆఫ్‌లైన్, మిగిలిన 14 రోజులు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తారు. ప్రస్తుతం ప్రాథమిక విద్యకు సంబంధిం చిన జ్ఞాన ప్రకాష్ బోధన చేసే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు డీఆర్పీలకు తర్ఫీదు ఇస్తున్నారు.

**కొత్త విద్యావిధానంలో భాగంగా....**

నూతన విద్యావిధానం 2020లో భాగంగా ప్రభుత్వం పలు విద్యా సంస్కరణలను ప్రవేశ పెట్టింది. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే క్రమంలో ఎర్లీ చైల్డ్ సెంటర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)ను ప్రవేశపెట్టారు. ఇందులో ప్రీ ప్రైమరీ–1, ప్రీ ప్రైమరీ–2ను అమలు చేస్తున్నారు. ప్రీ ప్రైమరీ –1లో 3 నుంచి 4 ఏళ్ల చిన్నారులకు, ప్రీ ప్రైమరీ –2లో 4–5 ఏళ్ల చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేస్తారు. ప్రీ ప్రైమరీలోనే పాఠశాల సంసిద్ధతా కార్యక్రమాలను అమలు చేస్తారు. ఐదేళ్లు నిండిన చిన్నారులకు ప్రైమరీ తరగతులు నిర్వహిస్తారు. ప్రీ ప్రైమరీ, ప్రైమరీలో 1, 2 తరగతులకు ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా 2026–27 విద్యా సంవత్సరానికి రెండో తరగతి నుంచి మూడో తరగతికి వెళ్లే విద్యార్థులందరూ ఆయా తరగతుల అభ్యసనా సామర్థ్యాలను ఖచ్చితంగా కలిగి ఉండాలి.

# మర్యాదతో మరింత ఆదరణ

- డ్రైవర్లు, కండక్టర్లకు నిపుణులతో కౌన్సెలింగ్
- వారంలో ఒక రోజు జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో నిర్వహణ
- ఫిర్యాదుల నేపథ్యంలో ఆర్టీసీ ఉన్నతాధికారుల చర్యలు

**సాక్షి, విశాఖపట్నం:** ప్రయాణికుల పట్ల సిబ్బంది మర్యాదగా వ్యవహరించడంపై ఆర్టీసీ అధికారులు ఫోకస్ పెడుతున్నారు. పాసింజర్ల మన్ననలు పొందడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకోసం ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి పట్ల కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు దురుసుగా ప్రవర్తిస్తున్నారని, ఏకవచనంతో సంబోధిస్తున్నారని, బస్సులు సక్రమంగా ఆపడం లేదని, దురుసుగా సమాధానం చెబుతున్నారని.. ఇలా పలు ఫిర్యాదులు ఆర్టీసీ కంప్లయింట్ సెల్‌కు అందుతున్నాయి. ఈ ఫిర్యాదులను ఆర్టీసీ యాజమాన్యం సీరియస్‌గా తీసుకుంది. ఇకపై కండక్టర్లు, డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా మెలిగేలా చర్యలు చేపట్టింది. ఇందుకోసం కంప్లెయింట్ సెల్‌కు అందిన ఫిర్యాదుల ఆధారంగా సంబంధిత కండక్టర్లు, డ్రైవర్లకు ప్రతి మంగళవారం కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించింది. ఆర్టీసీ జోన్–1కు సంబంధించి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఈ కండక్టర్లు, డ్రైవర్లకు విజయనగరం జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ ప్రక్రియకు మంగళవారం నుంచే శ్రీకారం చుట్టారు. ఉదయం రెండు గంటలు, మధ్యాహ్నం రెండు గంటల చొప్పున ఆర్టీసీలో ఎంపిక చేసిన అధికారులతో పాటు బయట నుంచి నిపుణులు, లెక్చరర్లు, అడ్వకేట్లను కూడా రప్పించి వారితో సుహృద్భావ వాతావరణంలో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా మెలగాలని, వారు అడిగిన ప్రశ్నలు, సందేహాలకు దురుసుగా కాకుండా సామరస్యంగా సమాధానం చెప్పాలని, చిరాకు ప్రదర్శించకుండా మాట తీరు గౌరవప్రదంగా ఉండాలని, వారిని ఏకవచనంతో సంబోధించవద్దని, ప్రయాణికుల మన్ననలు పొందాలని సూచిస్తున్నారు. ఈ కౌన్సెలింగ్ ద్వారా వీరి ప్రవర్తనలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు. ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్ల వ్యవహారశైలి ప్రయాణికులపై ప్రభావం చూపుతుందన్న భావనకు అధికార్లు వచ్చారు. కౌన్సెలింగ్ ద్వారా వీరు ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మెలిగితే ఆర్టీసీపై ప్రయాణికుల ఆదరణ మరింత పెరుగుతుందని, ప్రైవేటు ఆపరేటర్ల వైపు మళ్లే అవకాశం ఉండదని వీరు భావిస్తున్నారు.

# వలకు చిక్కిన సీ హార్స్!


మత్స్యకారులకు దొరికిన సీ హార్స్

**సాక్షి, విశాఖపట్నం:** అత్యంత అరుదైన సీ హార్స్ మత్స్యకారుల వలలకు చిక్కుతున్నాయి. విశాఖ తీరంలో అప్పుడప్పుడు ఇవి దర్శనమిస్తున్నాయి. ఇవి రెండు మూడు అంగుళాల సైజులో రొయ్యలను పోలి ఉంటాయి. ఇవి రొయ్యల్లో కలిసిపోతుండడం వల్ల మత్స్యకారులు వీటిని పెద్దగా పట్టించుకోరు. తాజాగా మంగళవారం విశాఖ మత్స్యకారుల వలకు ఇవి దొరికాయి. నగరంలోని ఒక వ్యక్తి సాయంత్రం హార్బర్‌లో రొయ్యలను కొనుగోలు చేశాడు. ఇంటికి తెచ్చి చూడగా రొయ్యలతో పాటు ఈ సీ హార్స్ కూడా అందులో ఉన్నట్టు కె.విజయ్‌కుమార్ అనే వ్యక్తి గుర్తించారు. దొరికిన సీ హార్స్‌ను తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టడంతో ఈ విషయం బయట పడింది. కాగా సముద్ర గుర్రంగా పిలిచే ఈ చిన్న చేపలు (సీ హార్స్) ప్రపంచ వ్యాప్తంగా ఉష్ణమండల, సమశీతోష్ణ జలాల్లో కనిపిస్తాయి. వీటికి వంకర మెడలు, పొడవైన గొంతు, తల, శరీరం నిటారుగా ఉండి తోక వంకరగా ఉంటుంది. ఈ జంతువులకు నోట్లో పళ్లుండవు. పగడపు దిబ్బలు, మడ అడవులు వంటి ప్రాంతాల్లో నివశిస్తాయి. నిట్టనిలువుగా నిలిచి ఈదుతాయి. మగ సముద్రపు గుర్రాలు తమ శరీరం ముందు భాగంలో సంతానాన్ని పొదగడానికి అనువైన ఒక సంచి వంటి అరను కలిగి ఉంటాయి. జతకట్టే సమయంలో ఆడ చేప గుడ్లను ఈ మగ చేప సంచిలోకి విడుస్తుంది. అప్పుడు మగ చేప వాటిని అంతర్గతంగా ఫలదీకరణ చేసి పిల్లలు గుడ్లలో నుంచి బయటకు వచ్చాక వాటిని నీటిలోకి విడుదల చేస్తుందని మత్స్యశాఖ జిల్లా అధికారి జి.విజయ 'సాక్షి'కి చెప్పారు. విశాఖ ప్రాంత సముద్ర జలాల్లో సీ హార్స్‌ల ఉనికి అరుదు అని తెలిపారు.

● తెలంగాణ

# ఖనిజాన్వేషణ, విపత్తు నిర్వహణపై జీఎస్ఐటీఐ, ఇస్రో ఒప్పందం

**సాక్షి, హైదరాబాద్:** దేశంలోని ప్రకృతి వనరుల సమర్థ వినియోగంలో భాగంగా హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (జీఎస్ఐటీఐ), భారత అంతరిక్ష పరిశోధన సంస్థలు ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఖనిజ వనరులు, ప్రకృతి విపత్తుల నిర్వహణ విషయాల్లో తగినంత మంది సిబ్బంది అందుబాటులో ఉండేలా చేసేందుకు ఈ ఒప్పందం ఉపయోగపడుతుంది. ఐదేళ్లపాటు అమల్లో ఉండే ఈ ఒప్పందంలో భాగంగా జీఎస్ఐటీఐ ఖనిజాన్వేషణలో అత్యాధునిక రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీ, డిజిటల్ ఇమేజ్ ప్రాసెసింగ్, జీఐఎస్, ప్రకృతి విపత్తుల నిర్వహణ, జియో ఇన్ఫర్మేటిక్స్ వినియోగం వంటి విషయాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జీఎస్ఐటీఐ తరఫున డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మాథ్యూ జోసెఫ్, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఎర్త్ అబ్జర్వేషన్ అప్లికేషన్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ జే.వి.థామస్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.

## క్లుప్తంగా...

### ఎట్టకేలకు స్వదేశానికి పయనమైన ట్రూడో

న్యూఢిల్లీ: కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో ఎట్టకేలకు తన విమానంలో స్వదేశానికి తిరుగుపయనమయ్యారు. జీ20 శిఖరాగ్రంలో పాల్గొనేందుకు ట్రూడో శుక్రవారం ఢిల్లీకి చేరుకున్నారు. ఆదివారమే ఆయన తిరిగి వెళ్లాల్సి ఉంది. విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో రెండు రోజులుగా ఆయనతోపాటు, కెనడా ప్రతినిధి బృందం ఢిల్లీలోనే ఉండిపోయింది. మంగళవారం మధ్యాహ్నం సాంకేతిక నిపుణులు విమానంలో లోపాన్ని సరిచేశారు. ప్రధాని కార్యాలయం అధికారులు విమాన ప్రయాణానికి ఓకే చెప్పారు. దీంతో మంగళవారం మధ్యాహ్నం ట్రూడో తిరిగి స్వదేశానికి బయలుదేరారు. కెనడా ప్రధాని ట్రూడోకు మధ్యాహ్నం 1.10 గంటలకు విమానాశ్రయంలో వీడ్కోలు పలికినట్లు కేంద్రమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ సామాజిక వేదిక 'ఎక్స్'లో తెలిపారు.

### జీ20 అతిథులకు ఘనమైన కానుకలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో రెండు రోజులపాటు అట్టహాసంగా జరిగిన జీ20 సదస్సు శిఖరాగ్ర సదస్సుకు కూటమి దేశాల అధినేతలు, ప్రతినిధులు హాజరయ్యారు. భారత ప్రభుత్వం వారికి ఘనమైన కానుకలు అందించింది. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే హస్త కళాకృతులు, వస్తువులు, ఉత్పత్తులను కానుకలుగా అందించినట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. కశ్మీరీ కుంకుమ పువ్వు, నీలగిరి టీ పొడి, అరకు కాఫీ, కశ్మీరీ శాలువాలు, సుందర్బన్స్ తేనె, జిఘ్రానా అత్తర్ నూనె, జీ20 స్మారక నాణేలతో కూడిన చిన్న పెట్టెలు, శీషాం చెక్క పెట్టెలు, డార్జిలింగ్ టీ ఆకులు, ఖాదీ స్కార్ఫ్‌లు తదితరాలను జీ20 అతిథులకు బహూకరించినట్లు తెలియజేశారు.

### నిఫా వైరస్ కలకలం.. ఇద్దరు మృతి

న్యూఢిల్లీ: ప్రమాదకర నిఫా వైరస్ బారినపడి కేరళలో ఇద్దరు చనిపోయినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ చెప్పారు. కోజికోడ్‌కు చెందిన ఇద్దరు జ్వర లక్షణాలతో చనిపోయారని, నిఫా వైరసే కారణమని పరీక్షల్లో తేలిందని చెప్పారు. మృతుల్లో ఒకరి బంధువుకు ఇవే లక్షణాలు కనిపించడంతో ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన ఐసీయూలో చికిత్స అందిస్తున్నారన్నారు. ఆ రాష్ట్రానికి చెందిన మరో నలుగురి శాంపిళ్లను సేకరించి పుణేలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపించారన్నారు. నిఫా వైరస్ వ్యాప్తిని ఎదుర్కోవడంలో రాష్ట్ర ప్రభుత్వానికి సాయపడేందుకు కేంద్ర అధికారుల బృందాన్ని అక్కడికి పంపించామన్నారు. ముందు జాగ్రత్తగా ప్రజలు మాస్కులు ధరించాలని కోజికోడ్ ఆరోగ్య శాఖ కోరింది.

అమెరికాకు వ్యతిరేకంగా చేతులు కలిపిన రష్యా, ఉత్తర కొరియా.. త్వరలో పుతిన్, కిమ్ భేటీ

ఉత్తర కొరియా నుంచి ఆయుధాలు సమకూర్చుకోనున్న రష్యా

బదులుగా ఆహార ధాన్యాలు, అత్యాధునిక టెక్నాలజీ బదిలీ



కరడుగట్టిన నియంతగా పేరుగాంచిన ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ప్రత్యేక రైలులో మిత్రదేశం రష్యా చేరుకున్నారు. రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో కిమ్ భేటీకి రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. నేడో రేపో చర్చలు జరగనున్నాయి. అగ్రరాజ్యం అమెరికాపై ఉన్న ఉమ్మడి శత్రుత్వం వల్ల రష్యా–ఉత్తర కొరియా సన్నిహితంగా మారాయని చెప్పొచ్చు. రెండు దేశాలూ అంతర్జాతీయ సమాజం నుంచి తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కొంటున్నాయి. రష్యా, ఉత్తర కొరియాలను దుష్ట దేశాలుగా అమెరికా అభివర్ణిస్తోంది. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర కొరియా పట్ల కొంత ఉదారంగానే వ్యవహరించారు. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ మాత్రం కిమ్ పట్ల కఠిన వైఖరి అవలంబిస్తున్నారు. ఈ నేపథ్యంలో కిమ్–పుతిన్ తాజా సమావేశంపై ప్రపంచమంతటా ఆసక్తి నెలకొంది. ఈ భేటీ వల్ల ప్రపంచ భౌగోళిక–రాజకీయ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకోవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. - సాక్షి, నేషనల్ డెస్క్

# ఎవరికెంత లాభం!

### ఆయుధమే కీలకం..

పుతిన్–కిమ్ భేటీతో ఎవరికి ఎంత లాభం? అనేదానిపై చర్చ మొదలైంది. కిమ్ రాజ్యంలో భారీస్థాయిలో ఆయుధ పరిశ్రమ వర్ధిల్లుతోంది. ఆయుధాల ఉత్పత్తి సామర్థ్యం అధికంగా ఉంది. మరోవైపు ఉక్రెయిన్‌పై సుదీర్ఘ కాలంగా యుద్ధం కొనసాగిస్తున్న రష్యా వద్ద ఆయుధ నిల్వలు నిండుకున్నాయి. పైగా ఉక్రెయిన్ నుంచి ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. అమెరికా సహా పశ్చిమ దేశాలు ఇస్తున్న ఆయుధాలతో ఉక్రెయిన్ సైన్యం రష్యాపై విరుచుకుపడుతోంది. రష్యాకు ఇతర దేశాల నుంచి ఇప్పటికిప్పుడు ఆయుధాలు అందే పరిస్థితి లేదు. అందుకే ఉత్తర కొరియా నుంచి ఆయుధాల సేకరణపై పుతిన్ దృష్టి పెట్టారు. ఉత్తర కొరియా నుంచి రష్యాకు ఆయుధాల ఎగుమతిపై ఇరుదేశాల నడుమ ఇప్పటికే ఫలవంతమైన చర్చలు జరిగినట్లు అమెరికా అనుమానిస్తోంది. తుది ఒప్పందం కోసమే కిమ్ రష్యాకు వెళ్లినట్లు చెబుతోంది. అయితే, దీనిపై రష్యా ఇప్పటిదాకా అధికారికంగా స్పందించలేదు. ఆయుధాల కొనుగోలును నిర్ధారించలేదు. కానీ, రక్షణ రంగంలో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని రష్యా, ఉత్తర కొరియా తీర్మానించుకున్నాయని చెప్పడానికి ఎన్నో దృష్టాంతాలు కనిపిస్తున్నాయి. రష్యా రక్షణ శాఖ మంత్రి సెర్గీ షోయిగు ఈ ఏడాది జూలైలో ఉత్తర కొరియాలో పర్యటించారు. అక్కడ ఆయుధాల ప్రదర్శనను తిలకించారు. ఆయుధాల ఫ్యాక్టరీలను సైతం సందర్శించినట్లు వార్తలొచ్చాయి. ఉత్తర కొరియాతో కలిసి ఉమ్మడిగా సైనిక విన్యాసాలు చేపడతామని సెర్గీ ప్రకటించారు. అప్పట్లో సెర్గీకి కిమ్ జోంగ్ ఉన్ 'టూర్ గైడ్'గా పనిచేశారు. దగ్గరుండి తమ ఆయుధాలను చూపించారు.

### సంతకాన్ని రద్దు చేసుకుంటే!

ఉత్తరకొరియా నుంచి ఆయుధాలు చేతికి అందిన తర్వాత ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి యుద్ధం మొదలవుతుందని పుతిన్ సంకేతాలిస్తున్నారు. అమెరికా కనుసన్నల్లో నడుస్తున్న ప్రపంచ క్రమం(వరల్డ్ ఆర్డర్) మారుతుందని అంటున్నారు. తమ లక్ష్య సాధనకు ఉత్తర కొరియాతో సైనిక సహకారం సైతం కుదుర్చుకోవాలని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా, అణ్వస్త్ర ప్రయోగాలు కొనసాగిస్తున్న ఉత్తర కొరియాపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఇటీవల ఆంక్షలు విధించింది. ఉత్తర కొరియాతో ఎవరూ ఆయుధ వ్యాపారం చేయరాదని ఆదేశించింది. ఈ తీర్మానంపై రష్యా కూడా సంతకం చేసింది. తమ సంతకాన్ని రద్దు చేసుకొనే అవకాశం లేకపోలేదని అధికార వర్గాలు తాజాగా తేల్చిచెప్పాయి. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశమైన రష్యా వెనక్కి తగ్గితే ఉత్తర కొరియాపై ఆంక్షలు బలహీనమవుతాయి. అప్పుడు ఉత్తర కొరియా నుంచి యథేచ్ఛగా ఆయుధాలు కొనుగోలు చేసుకోవచ్చు.

### ప్రతిఫలం అదేనా?

రష్యా సంగతి సరే మరి ఉత్తరకొరియాకు దక్కే ప్రయోజనమేంటి? రష్యాకు ఆయుధాలు ఇచ్చి, తిరిగి పొందే ప్రతిఫలం ఏమై ఉంటుంది? కిమ్ రాజ్యంలో ప్రస్తుతం తీవ్ర ఆహార కొరత వేధిస్తోంది. పౌష్టికాహారం అనేది కలలో మాటగా మారింది. అందుకే మానవతా సాయం పేరిట రష్యా నుంచి భారీగా ఆహార ధాన్యాలను తీసుకోవాలని కిమ్ ప్రభుత్వం నిర్ణయానికొచ్చింది. అలాగే సైన్యానికి ఉపయోగ పడే శాటిలైట్లు, అణ్వస్త్ర సహిత జలాంతర్గాములు తయారు చేసే అత్యాధునిక టెక్నాలజీ ఉత్తర కొరియా వద్ద లేదు. ఇలాంటి సాంకేతికతలో రష్యా ముందంజలో ఉంది. ఆయుధాలకు ప్రతిఫలంగా ఈ టెక్నాలజీని రష్యా నుంచి సొంతం చేసుకోవాలని కిమ్ ప్రభుత్వం నిర్ణయానికొచ్చినట్లు సమాచారం. అందుకు పుతిన్ సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. స్థూలంగా చెప్పాలంటే పుతిన్ తనకు అవసరమైన ఆయుధాలను ఉత్తర కొరియా నుంచి తీసుకుంటారు. బదులుగా ఆహార ధాన్యాలు, ఆధునిక టెక్నాలజీని కిమ్‌కు అందజేస్తారు. ఇద్దరికీ లాభమేనన్న మాట! ఇక ఒప్పందాలపై సంతకాలు చేయడమే మిగిలి ఉంది.

### ట్రంప్‌పై కేసులు రాజకీయ ప్రేరేపితం

వ్లాడివోస్తోక్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఉన్న క్రిమినల్ కేసులన్నీ రాజకీయంగా ప్రతీకారం తీర్చుకునేందుకు పెట్టినవేనని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ చెప్పారు. అమెరికా వ్యవస్థల పతనానికి ఇది నిదర్శనమన్నారు. అలాంటి దేశం ఇతరులకు ప్రజాస్వామ్యంపై పాఠాలు చెప్పడం మానేయాలన్నారు. అమెరికా అధ్యక్ష పదవిలో ఎవరున్నా రష్యా పట్ల ఆ దేశ వైఖరిలో పెద్దగా మార్పులేవీ రావని కూడా మీడియా సమావేశంలో పుతిన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. 2024లో అమెరికాలో అధ్యక్ష ఎన్నికలు జరుగనుండగా ఆయనీ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. 2024 అధ్యక్ష ఎన్నికలకు గాను ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ నుంచి బలమైన పోటీదారుగా ఆయన కొనసాగుతున్నారు. ట్రంప్ సైతం రష్యాకు, పుతిన్‌కు సానుకూలంగా మాట్లాడుతుంటారు. మళ్లీ అధ్యక్ష పదవి చేపట్టిన పక్షంలో ఉక్రెయిన్ సంక్షోభాన్ని కొద్ది రోజుల్లోనే పరిష్కరిస్తానని కొద్ది రోజుల క్రితమే ట్రంప్ అన్నారు.

# రష్యా గడ్డపై కిమ్

సియోల్: ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ మంగళవారం రష్యాలో అడుగు పెట్టారు. పటిష్టమైన భద్రత మధ్య విలాసవంతమైన బుల్లెట్ ప్రూఫ్ రైలులో సుదీర్ఘంగా ప్రయాణించి రష్యాకు చేరుకున్నారు. ఆయన ఆదివారం మధ్యాహ్నం ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్‌యాంగ్ నుంచి రైలులో బయలుదేరారు. ఉత్తర కొరియా సరిహద్దుకు సమీపంలో రష్యా భూభాగంలో ఉన్న వ్లాదివోస్తోక్ నగరానికి ఉత్తర దిక్కున 60 కిలోమీటర్ల దూరంలోని ఉసురియస్క్ అనే ప్రాంతానికి ఈ రైలు చేరుకున్నట్లు దక్షిణ కొరియా వార్తా సంస్థ వెల్లడించింది. ఈ ప్రాంతంలో కొరియన్ల జనాభా చెప్పుకోదగ్గ సంఖ్యలోనే ఉంది. అయితే, కిమ్ గమ్యస్థానం ఏమిటన్నదానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో కిమ్ సమావేశం కాబోతున్నారు. ఈ భేటీ ఎప్పుడు, ఎక్కడ జరుగుతుందనేది ఇంకా తెలియరాలేదు. 2019లో ఇరువురు నేతలు వ్లాదివోస్తోక్‌లోనే సమావేశమయ్యారు. ఈసారి కూడా భేటీ అక్కడే జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కిమ్ రష్యాకు చేరినట్లు క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ నిర్ధారించారు. పశ్చిమ దేశాల ఆంక్షల వల్ల ఒంటరిగా మారిన కిమ్ జోంగ్ ఉన్ రష్యా సహాయాన్ని అర్థిస్తున్నారు.



ఉసురియస్క్‌కు చేరుకున్న కిమ్



కిమ్ ప్రయాణించిన బుల్లెట్ ప్రూఫ్ రైలు

# పార్లమెంట్ ఉద్యోగులకు కొత్త యూనిఫామ్!

### భారతీయత ఉట్టిపడేలా డ్రెస్‌లు

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు సమయం సమీపిస్తోంది. ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకూ ఐదురోజులపాటు ఈ సమావేశాలు పార్లమెంట్‌లో నూతన భవనంలో జరుగుతాయి. మొదటి రోజు పాత భవనంలోనే సమావేశం నిర్వహించి, రెండో రోజు (ఈ నెల 19న) వినాయక చవితి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి, కొత్త భవనంలోకి లాంఛనంగా అడుగుపెడతారు. కొత్త భవనానికి తరలివెళ్తున్న నేపథ్యంలో పార్లమెంట్ ఉద్యోగులు, సిబ్బంది ధరించే యూనిఫామ్‌ను మార్చాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అసలు సిసలైన భారతీయత ఉట్టిపడేలా ఈ దుస్తులు ఉంటాయని సమాచారం. నెహ్రూ జాకెట్లు, ఖాకీ రంగు ప్యాంట్లు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) నిపుణులు ఈ యూనిఫామ్‌లను డిజైన్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు ధరించే నెహ్రూ జాకెట్ ముదురు గులాబీ రంగులో కమలం పువ్వు డిజైన్‌తో ఉంటుందని సమాచారం. ఉభయ సభల మార్షల్స్ డ్రెస్‌ను కూ డా మారుస్తున్నారు. వారు మణిపురి తలపాగాలు ధరిస్తారు.



సెక్యూరిటీ సిబ్బంది ధరించే సఫారీ సూట్లలోనూ మార్పులుంటాయి. సైనికులు ధరించే డ్రెస్ లాంటిది వారికి ఇవ్వబోతున్నారు.

### ఎన్నికల గుర్తు ముద్రించడం ఏమిటి?: కాంగ్రెస్

పార్లమెంట్ సిబ్బంది యూనిఫామ్‌పై 'కమలం'ను ముద్రించబోతున్నారంటూ వచ్చిన వార్తలపై కాంగ్రెస్ పార్టీ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. జాతీయ జంతువు పులి, జాతీయ పక్షి నెమలి బొమ్మ కాకుండా కమలం గుర్తు ముద్రించడం ఏమిటని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. బీజేపీ ఎన్నికల గుర్తు కాబట్టే కమలాన్ని ముద్రిస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు.

# జీ20 నిర్వహణకు రూ.4,100 కోట్లా

- బడ్జెట్ కేటాయింపులు రూ.990 కోట్లు
- ఖర్చేమో 300 శాతం ఎక్కువ
- మోదీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శలు

న్యూఢిల్లీ: జీ20 శిఖరాగ్ర భేటీని కేంద్ర ప్రభుత్వం విజయవతంగా నిర్వహించింది. అగ్రరాజ్యం అమెరికా సహా ప్రపంచదేశాలు భారత్‌పై ప్రశంసలు కురిపించాయి. ప్రపంచ స్థాయి నేతగా ప్రధాని మోదీ మరోమారు తన స్థానాన్ని పదిలం చేసుకున్నారు. ఇదే సమయంలో, జీ20 భేటీ కోసం బడ్జెట్ కేటాయింపులకు ఏకంగా 300 శాతం ఎక్కువగా రూ.4,100 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేయడంపై కాంగ్రెస్, టీఎంసీ వంటి ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. 'ఇంత డబ్బు ఎక్కడికి పోయింది? మోదీ వ్యక్తిగత ప్రచారం కోసమే ప్రభుత్వం ఇన్ని కోట్లను ఖర్చుచేసింది. ఈ సొమ్మును బీజేపీ ఎందుకు చెల్లించకూడదు? అని పేర్కొన్నాయి. జీ20 భేటీ నిర్వహణ ఖర్చుల వివరాలను ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. ఈ నెల 4న కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి కొన్ని వివరాలను సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఉంచారు. జీ20 సదస్సు జరిగిన ప్రాంతంలో అభివృద్ధి పనులకు రూ.4,110.75 కోట్లు ఖర్చయినట్లు ఆమె పేర్కొన్నారు. ఇందులో అత్యధికంగా రూ.3,600 కోట్లను ఇండియా ట్రేడ్ ప్రమోషన్ ఆర్గనైజేషన్(ఐటీపీవో) పేరుతో ఖర్చయ్యాయి. మొత్తం ఖర్చులో ఇది 88 శాతం. ప్రగతి మైదాన్‌లోని ఐటీపీవో సముదాయం నిర్మాణానికైన వాస్తవ వ్యయం రూ.3,600 కోట్లు. దీనికే జీ20 శిఖరాగ్రం సందర్భంగా భారత్ మండపం అనే పేరు పెట్టారు. ఇది శాశ్వత నిర్మాణం, జీ20 బడ్జెట్‌తో దీనికి సంబంధం లేదు. 2017లో ఈ భవనం నిర్మాణానికి బడ్జెట్‌లో కేటాయింపులు రూ.2,254 కోట్లు కాగా, రహదారులు, టన్నెళ్ల నిర్మాణానికి మరో వెయ్యి కోట్ల వరకు ఖర్చు చేసినట్లు అంచనా. ఈ రెండింటిని కలుపుకుంటే భారత్ మండపం అభివృద్ధి వ్యయం రూ.3,200 కోట్లు దాటింది. రహదారులు, టన్నెళ్లు పోను భారత్ మండపం కాంప్లెక్స్ అభివృద్ధికి రూ.2,700 కోట్లు వెచ్చించినట్లు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(పీఐబీ) జూలై 26న ప్రకటించింది. వీటన్నిటినీ బేరీజు వేసుకుంటూ జీ20 నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం రూ.4,100 కోట్లు దుబారా ఖర్చు చేసిందంటూ ప్రతిపక్షాలు విమర్శలు సంధిస్తున్నాయి. ఈ విమర్శలపై చార్టెర్డ్ అకౌంటెంట్ గోపాల్ కేడియా 'ఇండియా టుడే'తో మాట్లాడుతూ శాశ్వత మౌలిక వసతుల కల్పనకైన ఖర్చును జీ20 నిర్వహణ వ్యయంతో కలిపి చెప్పడం సరికాదన్నారు. ఈ నిర్మాణాలు భవిష్యత్తులో జరిగే మరెన్నో కార్యక్రమాలకు ఉపయోగించుకునేందుకు వీలుందన్నారు. జీ20 షెర్పా అమితాబ్ కాంత్ ప్రతిపక్షాల విమర్శలకు స్పందిస్తూ.. బడ్జెట్‌లో కేటాయించిన రూ.990 కోట్ల కంటే చాలా తక్కువగా జీ20 శిఖరాగ్రానికి ఖర్చు చేసినట్లు చెప్పారు. పూర్తి వివరాలను ప్రభుత్వం త్వరలోనే విడుదల చేస్తుందన్నారు.

## 'రాజద్రోహం'పై పిటిషన్లు రాజ్యాంగ ధర్మాసనానికి..

న్యూఢిల్లీ: రాజద్రోహం(ఐపీసీ 124ఏ) రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లన్నిటినీ అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి రెఫర్ చేస్తున్నట్లు సుప్రీం కోర్టు తెలిపింది. వలస పాలన కాలం నాటి ఐపీసీ, సీఆర్‌పీసీ, ఎవిడెన్స్ యాక్టుల స్థానంలో రూపొందించిన మూడు బిల్లులను నెల క్రితం కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. వీటిలో రాజద్రోహం చట్టం రద్దు వంటివి కూడా ఉన్నాయి. ప్రస్తుతం శిక్షాస్మృతికి మార్పులు చేపడుతున్నందున రాజ్యాంగ ధర్మాసనానికి ఈ పిటిషన్ల బదిలీ వాయిదా వేయాలన్న కేంద్రం వినతిని మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని ధర్మాసనం తోసిపుచ్చింది.



గుహ నుంచి మార్క్‌ను నిపుణుల బృందం సురక్షితంగా బయటకు తీసుకొస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్లో) మార్క్

# టర్కీ గుహ నుంచి సురక్షితంగా..

ఇస్తాంబుల్: టర్కీలోని ఓ గుహలో అనారోగ్యంతో చిక్కుకుపోయిన అమెరికా గుహాన్వేషకుడిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అమెరికాలోని న్యూయార్క్‌కు చెందిన మార్క్ డికే(40)గుహాన్వేషణ రంగంలో నిపుణుడు. టర్కీలోని టారస్ పర్వతాల్లో ఉన్న అత్యంత లోతైన మోర్కా గుహల సముదాయం మ్యాప్‌ను రూపొందించే బాధ్యతలను ఆయన తీసుకున్నారు. ఇందులో భాగంగా ఎంతో ఇరుగ్గా, నిట్టనిలువుగా అనేక వరుసలుగా ఉండే గుహ లోపలికి ప్రవేశించారు. సుమారు 3 వేల అడుగుల లోతులో ఉండగా మార్క్ ఈనెల 2న అనారోగ్యం పాలయ్యారు. జీర్ణాశయంలో రక్తస్రావం కారణంగా అక్కడే బేస్ క్యాంపులో కదల్లేని స్థితిలో ఉండిపోయారు. విషయం తెలుసుకున్న టర్కీ స్పెలియోలాజికల్ ఫెడరేషన్ ఆయన్ను కాపాడేందుకు అంతర్జాతీయ సాయం అర్థించింది. వివిధ దేశాలకు చెందిన సుమారు 190 మంది నిపుణులు ఆయన్ను కాపాడేందుకు తరలివచ్చారు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 9.37గంటలకు ఆయన్ను బయటకు సురక్షితంగా తీసుకువచ్చినట్లు టర్కీ స్పెలియోలాజికల్ ఫెడరేషన్ తెలిపింది. మార్క్ అనారోగ్యానికి కారణాలు తెలియాల్సి ఉంది.

## ప్రధాని మోదీకి ఖలిస్తానీ నేత హెచ్చరిక

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, హోం మంత్రి అమిత్ షా, ఎన్ఎస్ఏ అజిత్ దోవల్‌లకు కెనడాలో సిఖ్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) వ్యవస్థాపకుడు గురుపత్వంత్ సింగ్ పన్నూ తీవ్ర హెచ్చరికలు చేశాడు. భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ కెనడాలోని సర్రే, వాంకోవర్‌లలో వేర్పాటువాదులు రెఫరెండం నిర్వహించిన విషయం తెలిసిందే. అంతకుముందు, పన్నూ సుమారు 5 వేల నుంచి 7 మంది వరకు పాల్గొన్న సమావేశంలో భారత్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశాడు. అందుకు సంబంధించిన ఒక వీడియో విడుదలైంది. 'హర్దీప్ సింగ్ నిజ్జర్‌ను చంపిన వారికిదే నా హెచ్చరిక. మిమ్మల్ని ఘోరంగా చంపాలని పిలుపునిస్తున్నాం. మోదీ, జై శంకర్, దోవల్, షా.. మేం మీకోసం వస్తున్నాం' అని పన్నూ హెచ్చరిస్తున్నట్లుగా ఆ వీడియోలో ఉంది. వాంటెడ్ లిస్ట్‌లో ఉన్న నిజ్జర్ ఈ ఏడాది జూన్‌లో సర్రేలో హత్యకు గురైన విషయం తెలిసిందే. భారత వ్యతిరేక శక్తులు కెనడాలో తిష్టవేశాయని స్వయంగా ఆ దేశ ప్రధాని ట్రూడో ఎదుటే ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేసిన రోజే పన్నూ ఈ సమావేశం జరిపారు.

## హిందూయిజంతో ప్రపంచానికే ప్రమాదం: రాజా

చెన్నై: హిందూమతంపై తమిళనాడులోని అధికార డీఎంకే పార్టీ నేతల వివాదాస్పద వ్యాఖ్యల పరంపర కొనసాగుతోంది. ఇటీవల సనాతన ధర్మంపై మంత్రి ఉదయనిధి స్టాలిన్, ఆ పార్టీకే చెందిన ఎంపీ ఎ.రాజా హిందూమతాన్ని హెచ్ఐవీ, కుష్టు వ్యాధితో పోల్చారు. తాజాగా ఎంపీ రాజా మరోసారి హిందూమతంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లుగా ఉన్న వీడియోను తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై తాజాగా విడుదల చేశారు. 'కులమనే ప్రపంచ వ్యాధికి హిందూమతానిదే బాధ్యత. భారత్ కులం ఆధారంగా ప్రజలను విడదీస్తోంది. సామాజిక అస్థిరత, ఆర్థిక అసమానతలను సృష్టించేందుకు కులాన్ని వాడుకున్నారు. విదేశాల్లో ఉంటున్న భారతీయులు హిందూయిజం పేరుతో కులాన్ని వ్యాప్తి చేస్తున్నారు. భారత్‌కే కాదు, ప్రపంచానికే హిందూమతం ప్రమాదకరం'అని ఆయన అన్నట్లుగా ఆ వీడియోలో ఉంది.

## వాళ్ల నాలుక చీరేయాలి.. కళ్లు పెరికేయాలి

సనాతన ధర్మం వ్యతిరేక వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి షెకావత్

జైపూర్: సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడేవారి నాలుక చీరేయాలి, కనుగుడ్లు పెరికివేయాలంటూ కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన వ్యాఖ్యల వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గత వారం రాజస్తాన్‌లోని బర్మేర్ జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో మంత్రి మాట్లాడారు. సనాతన ధర్మానికి వ్యతిరేకంగా తమిళనాడు మంత్రి ఉదయనిధి చేసిన వ్యాఖ్యలను ఆయన ప్రస్తావిస్తూ.. 'ఇటువంటి సవాళ్లను మనం ఎదుర్కోవాలి. సనాతన్‌కు వ్యతిరేకంగా మాట్లాడేవారి నాలుక చీరేయాలి. వారి కళ్లు పెరికివేయాలి. సనాతనధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడుతూ మన చరిత్ర, సంస్కృతులపై దాడికి ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి వారికి అధికారం, పదవులు దక్కనివ్వరాదు'అని పేర్కొన్నారు.

## పీవోకే భారత్‌లో కలుస్తుంది: మంత్రి వీకే సింగ్

జైపూర్: పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) తనంతట తానే భారత్‌లో విలీనమవుతుందని కేంద్ర మంత్రి వీకే సింగ్ పేర్కొన్నారు. దీనికి ఎంతో సమయం పట్టదని కూడా ఆయన అన్నారు. రాజస్తాన్‌లో దుసాలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోదీ సారథ్యంలో రాజధాని ఢిల్లీలో జీ20 శిఖరాగ్రాన్ని విజయవంతంగా నిర్వహించడం ద్వారా భారత్ తన సత్తా చాటుకుందని చెప్పారు.

## మణిపూర్‌లో మళ్లీ హింస.. ముగ్గురు గిరిజనుల హత్య

ఇంఫాల్: మణిపూర్‌లో తాజాగా పెచ్చరిల్లిన హింసాకాండలో ముగ్గురు బలయ్యారు. కాంగ్‌పోక్పి జిల్లా పోస్‌లెన్‌కు చెందిన ముగ్గురు గిరిజనులు మంగళవారం ఉదయం కొండప్రాంత రహదారి మీదుగా లెమకోంగ్ వైపు నడిచివెళ్తుండగా ఇరెంగ్ వద్ద వారిని కొందరు సాయుధులు అడ్డగించారు. ముగ్గురినీ ఆటోమేటిక్ తుపాకులతో కాల్చిచంపారు. తుపాకీ కాల్పుల శబ్దం విన్న వెంటనే భద్రతా సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారు. రక్తం మడుగులో విగతజీవులుగా పడి ఉన్న ముగ్గురు గ్రామస్తులు వారికి కనిపించారు. ఈ దురాగతానికి నిషేధిత ఉగ్రగ్రూపులే కారణమని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# లిబియాలో వరద విధ్వంసం

**2,800 మందికిపైగా మృతి**

- దాదాపు 10,000 మంది గల్లంతు
- డేనియల్ తుపాను ధాటికి వర్షం వల్ల రెండు డ్యామ్‌లు ధ్వంసం
- పలు నగరాలను ముంచెత్తిన వరద నీరు, బురద

కైరో: లిబియాలో భీకర వరదలు పెను విధ్వంసం సృష్టిస్తున్నాయి. ప్రధానంగా తూర్పు లిబియాలోని డెర్నా నగరం, పరిసర ప్రాంతాల్లో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం భారీగా నమోదవుతోంది. కూలిపోయిన ఇళ్ల శిథిలాలను మంగళవారం తొలగిస్తుండగా, వందలాది మృతదేహాలు బయటపడ్డాయి. ఎటు చూసినా శవాల దిబ్బలే కనిపించాయి. వరదల వల్ల 2,800 మందికిపైగా మృతి చెందినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మరో 10,000 మంది గల్లంతయినట్లు తెలియజేశాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే పరిస్థితి కనిపిస్తోంది. కానీ, ఇప్పటిదాకా 1,500 మంది మాత్రమే మరణించారని, 2,000 మంది గల్లంతయ్యారని విమానయాన శాఖ మంత్రి హిషామ్ చికియోత్ ప్రకటించారు. చాలా ఏళ్లుగా నిర్వహణ సరిగ్గా లేని డ్యామ్ కూలిపోవడం వల్ల ఈ ఘోరం జరిగిందని అన్నారు.

**బీభత్సానికి కారణమేంటి?**

మధ్యధరా సముద్రంలో ఏర్పడిన డేనియల్ తుపాను కారణంగా లిబి యాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పై నుంచి వచ్చిన వర్షంనీరు కారణంగా ఆదివారం రాత్రి డెర్నా నగర శివార్లలోని రెండు డ్యామ్‌లు, ధ్వంసం కావడం వల్ల వరద ముంచెత్తినట్లు స్థానికులు చెప్పారు. నగరంలో నాలుగింట మూడొంతుల మేర వరద ప్రభావానికి గురి కావడం గమనార్హం. వరద ధాటికి చాలా ఇళ్లు కూలిపోయాయి. బురద కొట్టుకురావడంతో రహదారులపై రాకపోకలు నిలిచిపోయాయి. ప్రభుత్వ అధికారులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. తూర్పు లిబియాలోని అల్–బైదా, అల్–మర్జ్, సౌస, తోబ్రుక్, తాకెనిస్, అల్–బయాదా, బత్తాహ్, బెంఘాజీ తదితర నగరాలు, పట్టణాల్లో సైతం విధ్వంసం జరిగింది. లోతట్టు ప్రాంతాల్లో బురద మేటలు వేసింది. చాలా ఇళ్లు బురదలో కూరుకుపోయాయి. పెద్ద సంఖ్యలో వాహనాలు కొట్టుకుపోయాయి. వరదల వల్ల తీవ్రంగా నష్టపోయిన లిబియాకు అండగా నిలుస్తామని అమెరికా, టునీషియా, అల్జీరియా, తుర్కియే, యూఏఈ తదితర దేశాలు ప్రకటించాయి.



డ్యామ్ బద్దలవడంతో వరదలో డెర్నా సిటీలో కొట్టుకుపోయిన ఇళ్లు

### అంతర్గత సంఘర్షణలు

లిబియా గత దశాబ్ద కాలంగా అంతర్గత సంఘర్షణలతో అట్టుడుకుతోంది. ప్రభుత్వ పరిపాలన దాదాపు ఆగిపోయింది. మౌలిక సదుపాయాలు దారుణంగా దెబ్బతిన్నాయి. 2011లో దేశంలో తిరుగుబాటు మొదలైంది. అప్పటి పాలకుడు గడాఫీ అనుమానాస్పద స్థితిలో మరణించారు. అనంతరం రెండు ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. తూర్పు ప్రాంతంలో ఒకటి, పశ్చిమాన మరో ప్రభుత్వం అధికారం చెలాయిస్తున్నాయి. సైన్యం కూడా రెండుగా చీలిపోయింది. ఒక్కో వర్గానికి ఒక్కో చీలిక వర్గం మద్దతిస్తోంది. కొన్ని తీవ్రవాద సంస్థలు కూడా ప్రభుత్వాలతో అంటకాగుతున్నాయి. డెర్నా సిటీ ఉన్న తూర్పు ప్రాంతంలో ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ మద్దతు ఉన్న ప్రభుత్వం అధికారంలో కొనసాగుతోంది. రాజధాని ట్రిపోలిలో అంతర్జాతీయ సమాజం గుర్తించిన ప్రభుత్వ ఉంది. ఈ ప్రభుత్వానికి తూర్పు ప్రాంతంపై నియంత్రణ లేనప్పటికీ ఆర్థిక సాయం అందిస్తోంది. వరద సహాయక చర్యలు చేపడుతోంది. లిబియాలో గతంలోనే ఎన్నడూ లేని విపత్కర పరిస్థితి నెలకొన్నాయని తూర్పు పరిపాలనా విభాగం అధినేత హమద్ వ్యాఖ్యానించారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



**వింత చిలుక**
**విచిత్ర ఉడుము**

మంగళవారం బెంగళూరు ప్రెస్‌క్లబ్‌లో అరుదైన రామచిలుక, పెద్ద ఉడుము జాతికి చెందిన ఇగువానా ప్రదర్శన. ఈ నెల 17న పెంపుడు జంతువుల ప్రదర్శన ప్రకటన సందర్భంగా నిర్వాహకులు వీటిని తెచ్చారు

## న్యూస్‌రీల్

### రూ.90 లక్షల విలువైన అంబర్‌గ్రీస్ స్వాధీనం



పట్టుబడిన అంబర్‌గ్రీస్

**యశవంతపుర:** మంగళూరు పణంబూరు సముద్ర తీరంలో కినారె సమీపంలో నిషేధిత తిమింగలం వాంతి పదార్థమైన అంబర్‌గ్రీస్‌ను అమ్ముతుండగా ముగ్గురిని మంగళూరు పోలీసులు అరెస్ట్ చేశారు. ఉడుపి జిల్లా సాలిగ్రామంకు చెందిన జయకర (39), శివమొగ్గ జిల్లా సాగరవాసి ఆదిత్య (25), హావేరి జిల్లా శిగ్గాంవివాసి లోహిత్‌కుమార్ గురప్పనవర్ (39)లు నిందితులు. పణంబూరు బీచ్ వద్ద అమ్ముతుండగా పట్టుకుని 900 గ్రాముల అంబర్‌గ్రీస్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.90 లక్షలు వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. సముద్రంలో తిమింగలాలు కొన్నిసార్లు అరగని ఆహారాన్ని వాంతి చేసుకుంటాయి. దీనికి సౌందర్య సాధనాల పరిశ్రమలో ఉపయోగించడం వల్ల చాలా డిమాండ్ ఉంది.

### నూతన విద్యా విధానాల అమలు: మంత్రి

**శివమొగ్గ:** చిన్నారులను విద్యా స్రవంతిలోకి తీసుకుని రావడానికి ప్రభుత్వ నూతన విద్యా విధానం పథకాలు సహాయపడతాయని విద్యా శాఖ, సాక్షరత శాఖ మంత్రి మధు బంగారప్ప అన్నారు. మంగళవారం శివమొగ్గ జిల్లాలోని సొరబ తాలూకాలో కుబటురుకెరెకు వాయనం సమర్పించి మాట్లాడారు. ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయినవారు చదువుకు దూరమై చెడు అలవాట్లకు అలవాటు పడుతున్నారని, అలాంటివారు మళ్లీ చదువుకునేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.

### కుటుంబ కలహాలతో దంపతుల ఆత్మహత్య



**మైసూరు:** తరచూ కుటుంబ కలహాలతో మనశ్శాంతి కరువైందని ఆవేదన చెందిన దంపతులు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైసూరు నగరంలోని మేటగళ్ళిలో జరిగింది. బీఎం శ్రీనగరలో నివాసం ఉంటున్న తంగవేలు (45), అతని భార్య అలమేలు (42) ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నారు. ఇద్దరూ చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవించేవారు. పది సంవత్సరాలుగా ఇద్దరి మధ్య కలహాలు సాగుతున్నాయి. సోమవారం రాత్రి కూడా ఇద్దరికీ గొడవ కావడంతో విరక్తి చెందిన అలమేలు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది, అది చూసి భర్త పురుగుల మందు తాగి ఆపై ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు చూసి ఇద్దరినీ ఉరి నుంచి దించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మేటగళ్ళి పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

### కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 9 మందికి తీవ్రగాయాలు



నుజ్జయిన కారు

**యశవంతపుర:** కేఎస్ఆర్‌టీసీ బస్- కారు ఢీకొన్న ఘటనలో 9 మంది తీవ్రంగా గాయపడిన ఘటన చిక్కమగళూరు జిల్లా బేలేనహళ్లి గ్రామం వద్ద మంగళవారం ఉదయం జరిగింది. తరికెరె నుంచి భద్రావతికి వెళుతున్న కారును, బెంగళూరుకు వెళుతున్న బస్ ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. కారులో ప్రయాణిస్తున్న 9 మంది గాయపడ్డారు. ప్రమాదంతో జాతీయ రహదారి- 206పై రాకపోకలకు ఇబ్బంది కలిగింది. గాయపడినవారిని శివమొగ్గలోని మెగ్గాన్ ఆస్పత్రికి తరలించారు. బాధితులు భద్రావతివాసులు కాగా, తరికెరెలో ఒక వేడుక చూసుకుని తిరిగి వెళ్తుండగా బస్ ఢీకొట్టింది. తరికెరె పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



# బిట్‌కాయిన్ ప్రకంపనలు

- మళ్లీ విచారణ చేపట్టిన సిద్దు సర్కారు
- ముగ్గురు ప్రధాన నిందితుల ఇళ్లలో సిట్ సోదాలు

**శివాజీనగర:** గత బీజేపీ ప్రభుత్వ హయాంలో సంచలనం సృష్టించిన బిట్‌కాయిన్ కేసులో కాంగ్రెస్ సర్కారు ఆదేశంతో దర్యాప్తు ఆరంభమైంది. ప్రత్యేక విచారణ బృందం- సిట్ అధికారులు విచారణ చేపట్టారు. కోర్టు నుంచి సోమవారం సెర్చ్ వారంట్‌ను తీసుకొని మంగళవారం ఉదయం ప్రధాన నిందితులైన శ్రీకృష్ణ రమేష్ అలియాస్ శ్రీకి, సునీశ్ హెగ్డే, ప్రసిద్ధ్‌ల ఇళ్లలో సోదాలు ప్రారంభించారు. బెంగళూరు సదాశివనగరలో ఉన్న సునీశ్ హెగ్డే, ప్రసిద్ధ్, జయనగరలో ఉన్న శ్రీకి ఇళ్లలో మధ్యాహ్నం వరకు గాలింపు చేపట్టారు. సోదాలపై వివరాలు చెప్పడానికి సిట్ అధికారులు నిరాకరించారు.

**అదనపు డీజీపీ నేతృత్వంలో సిట్**

బిట్‌కాయిన్ కేసులో గతంలో బెంగళూరు సీసీబీ పోలీసులు తనిఖీ చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ సమర్పించిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ విచారణకు అదనపు డీజీపీ మనీష్ కర్బీకర్ నేతృత్వంలో బృందాన్ని నియమించింది. మరింత లోతుగా దర్యాప్తు చేయాలని సూచించింది. బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ తదితరాల కేసులను కూలంకషంగా విచారణ చేయాలంటే సైబర్ క్రైం, ఐటీ నిపుణుల సహాయం కావాలి. ఇందులో ఇజ్రాయెల్ దేశం సహాయం పొందాలని సర్కారు నిర్ణయించింది. ఇదంత సులభం కాదని, అనేక దశల ప్రక్రియ పాటించాల్సి ఉంటుందని నిపుణులు తెలిపారు. క్రిప్టో కరెన్సీ వాలెట్లను ఫ్రీజ్ చేసేంత సాంకేతికత పోలీసుల వద్ద లేదని చెబుతున్నారు. కాబట్టి బిట్ కాయిన్ కేసు పునర్విచారణ వేగంగా సాగడం కష్టమే. మరోసారి ప్రధాన నిందితుల పుట్టుపూర్వోత్తరాలను ఆరా తీస్తున్నారు. గతంలో బిట్ కాయిన్ కేసు వేడి పుట్టించింది. ఇప్పుడు కొత్త విషయాలను వెలికితీసి బీజేపీని ఇరుకున పెట్టాలని సిద్దు సర్కారు సిద్ధమైంది.



ప్రధాన నిందితుడు శ్రీకృష్ణ



### ఏమిటీ బిట్ కాయిన్ కేసు?

మూడేళ్ల కిందట డ్రగ్స్ కేసులో దర్యాప్తు చేసిన పోలీసులకు అంతర్జాతీయ స్థాయిలో హ్యాకర్ శ్రీకి అనే టెక్కీని సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితున్ని విచారించగా బిట్‌కాయిన్ దందా వెలుగు చూసింది. కాటన్‌పేట పోలీస్ స్టేషన్‌లో దీనిపై కేసు నమోదు చేసి సీసీబీ చేపట్టింది. అంతేకాకుండా ప్రభుత్వ ఈ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌ను శ్రీకి హ్యాక్ చేసి నిధులు దోచుకున్నాడని సీఐడీ కేసు నమోదు చేసింది. ఇతని ద్వారా భారీ మొత్తంలో లాభపడ్డారని కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆరోపణలు చేసుకోవడం సంచలనం కలిగించింది.

### సిద్దు సర్కార్ ప్రజాభిమానం కోల్పోయింది : యడ్డి

**శివాజీనగర:** ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రభుత్వం ఇంత తొందరగా ప్రజాభిమానాన్ని కోల్పోతుందని ఎవ్వరూ ఊహించలేదని బీజేపీ మాజీ సీఎం బీ.ఎస్. యడియూరప్ప అన్నారు. మంగళవారం తన ఇంటిలో మీడియాతో మాట్లాడిన ఆయన, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే పర్యటనపై అందరితో చర్చించి తీర్మానిస్తామన్నారు. పొత్తు విషయంపై స్పందిస్తూ లోక్‌సభ ఎన్నికలకు జేడీఎస్‌తో పొత్తు గురించి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా తీర్మానం చేస్తారు. తనకు దీని గురించి తెలియదని స్పష్టం చేశారు.

**నేడు ఢిల్లీకి పయనం**

బుధవారం ఢిల్లీకి వెళ్లి పార్టీ అగ్రనేత, హోంమంత్రి అమిత్ షాను కలుస్తామని, పొత్తుతో పాటు ఇతర విషయాలపై చర్చిస్తామన్నారు. ఇప్పటి వరకు సీట్ల పంపకాలపై చర్చ జరగలేదు. ఢిల్లీకి వెళ్లిన తరువాత తెలుస్తుందన్న ఆయన, జగదీశ్ శెట్టర్ వ్యాఖ్యల గురించి తెలియదు, ఆయన వ్యాఖ్యల గురించి మాట్లాడేందుకు నిరాకరించారు.

### భూకబ్జా కేసు.. సీఎంకు మంత్రి వివరణ

**యశవంతపుర:** యలహంక పరిధిలో భూకబ్జా, కుల దూషణ చేశారని కేసు నమోదైన నేపథ్యంలో యోజనా, సాంఖ్యికశాఖ మంత్రి డీ సుధాకర్ మంగళవారం సీఎం సిద్దరామయ్య, హోంమంత్రి జీ పరమేశ్వర్‌లను కలిసి వివరణ ఇచ్చారు. తరువాత మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో పాతది, ఆ ఘటన జరిగిన రోజు తాను చిత్రదుర్గలో ఉన్నా, కేసుతో నాకు ఎలాంటి సంబంధం లేదని అన్నారు. 2008 నుంచి తనపై అనేక కేసులు వేసి మానసికంగా వేధిస్తున్నారన్నారు. కాగా, దళిత కుటుంబంపై దౌర్జన్యానికి పాల్పడిన మంత్రి సుధాకర్ రాజీనామా చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది.

# మాజీ భార్య నరికివేత

- మామ, మరదలిపైనా దాడి
- ఆపై కొడవలితో వీరంగం
- కాల్పులు జరిపి పట్టుకున్న పోలీసులు
- శ్రీనివాసపురం వద్ద ఘోరం



అంగడి ముందు రాధ మృతదేహం



ఇంట్లో నిందితుడు నాగేష్

**శ్రీనివాసపురం:** విడాకులు ఇచ్చి దూరంగా ఉంటున్న భార్యను మాజీ భర్త ప్రతీకారంతో హత్య చేసిన ఘటన మంగళవారం మధ్యాహ్నం కోలారు జిల్లా శ్రీనివాసపురం తాలూకా నంబిహళ్లి గ్రామంలో చోటు చేసుకుంది. రాధ (33) హతురాలు.

వివరాలు... నాగేష్ అనే వ్యక్తి మొదటి భార్య రాధకు విడాకులు ఇచ్చి మరో పెళ్లి చేసుకుని శ్రీనివాసపురం పట్టణంలో మాంసం వ్యాపారం చేసుకునేవాడు. రాధ చిల్లర అంగడి నడిపేది. అయినప్పటికీ అతడు రాధతో తరచూ మాట్లాడుతూ, గొడవలు పడుతూ ఉండేవాడు. తనతో కలిసి జీవించాలని కోరగా ఆమె ససేమిరా అంది. దీంతో ఏదో ఒకటి తేల్చుకోవాలని ఆమె ఇంటికి వచ్చాడు, రాధతో మాట్లాడుతూనే కొడవలితో ఆమె తల, ఎదపై నరికివేయడంతో అక్కడికక్కడే విగతజీవిగా మారింది. అడ్డువచ్చిన రాధ తండ్రి మునియప్ప, చెల్లెలు పై కూడా దాడి చేయగా మునియప్పకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆయనను జాలప్ప జిల్లా ఆస్పత్రికి తరలించారు.

**సిలిండర్ పేలుస్తానని రచ్చ**

విషయం తెలిసిన శ్రీనివాసపురం పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. ఉన్మాదిగా మారిన హంతకుడు పోలీసులపై కొడవలితో దాడి చేయడానికి యత్నించాడు. ఇంట్లోని గ్యాస్ సిలిండర్ తీసుకు వచ్చి పేల్చి వేస్తానని వీరంగం సృష్టించగా,

చివరకు పోలీసులు నాగేష్ కాలిపై కాల్పులు జరిపి అతన్ని పట్టుకున్నారు. డీఎస్పీ నందకుమార్, ఇన్స్‌పెక్టర్‌లు ఆర్ దయానంద, లోకేష్‌లు పాల్గొన్నారు. ఈ సంఘటనతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

# బీకే హరి.. మౌనంగా ఉండాలి మరి!



- హెచ్చరించిన కాంగ్రెస్ హైకమాండ్?



అసమ్మతీయుడు బీకే హరిప్రసాద్

**శివాజీనగర:** ముఖ్యమంత్రి సిద్దరామయ్య తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకున్నారని, కుల వివక్ష చూపుతున్నారని, బయటి నుంచి పార్టీలోకి వచ్చిన వ్యక్తని పలురకాలు ఆరోపణలు గుప్పిస్తూ వేడి పెంచుతున్న సీనియర్ ఎమ్మెల్సీ బీ.కే.హరిప్రసాద్ కాంగ్రెస్ పార్టీలో సమస్యగా మారారు. ఆయనకు నచ్చజెప్పడం ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్‌కు కూడా సాధ్యపడలేదు. దీంతో ఢిల్లీలో హైకమాండ్ పెద్దలు జోక్యం చేసుకున్నట్లు సమాచారం, ఇకపై బహిరంగ వ్యాఖ్యలు చేయరాదని హరిప్రసాద్‌కు హెచ్చరించినట్లు తెలిసింది.

**గందరగోళం నివారణ కోసం..**

బీకే చేస్తున్న విమర్శలపై పలువురు మంత్రులు సీఎంకు మద్దతుగా నిలిచారు. బీకే మాదిరిగానే మరికొందరు విమర్శలు చేయడం మొదలు పెడితే గందరగోళం చెలరేగి సిద్దరామయ్యకే సమస్యలు తలెత్తవచ్చు. హరిప్రసాద్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, రణదీప్ సుర్జేవాలా, కే.సీ.వేణుగోపాల్‌తో నేరుగా మాట్లాడి సమస్యను చెప్పుకోవచ్చు, కానీ బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని మంత్రి ఎంబీ పాటిల్ అన్నారు. హైకమాండ్ సూచనతోనైనా బీకే మౌనం దాలుస్తారా.. లేదా? అనేది సస్పెన్స్‌గా ఉంది.

# బాలికతో జీపీ అధ్యక్షుని పెళ్లి



ఆధార్‌ను నేరాలకు వాడుకుంటున్న అక్రమార్కులు



- ఆధార్ కార్డులో తప్పుడు వివరాలు
- మైసూరు జిల్లాలో నిర్వాకం

**మైసూరు:** ఆధార్ కార్డులో వయసును పెంచి చూపి మైనర్ బాలికను పెళ్ళి చేసుకున్నాడో ఘనుడు, పైగా అతడు గ్రామ పంచాయతీ అధ్యక్షుడు కావడం గమనార్హం. ఈ సంఘటన మైసూరు జిల్లాలోని నంజనగూడు పట్టణ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నంజనగూడు తాలూకాలోని హాడ్యా గ్రామ పంచాయతీ అధ్యక్షుడు హరీష్‌కుమార్.. 17 సంవత్సరాల బాలికను పెళ్లి చేసుకున్నాడు. బాలిక ఇంకా మేజర్ కాలేదని తెలిసినప్పటికీ, మోసపూరితంగా ఆధారాలు సృష్టించి ఆధార్ కార్డులో వయసును పెంచి అప్‌డేట్ చేశారు. తరువాత ఈ ఏడాది ఫిబ్రవరి 15న నంజనగూడులో ఉన్న కళ్యాణ మండపంలో ఘనంగా వివాహమాడగా బాలిక ఇటీవల గర్భం దాల్చింది.

**కొందరు ఫిర్యాదు చేయడంతో**

పాఠశాల రికార్డుల ప్రకారం బాలిక మైనరేనని, ఆ వివాహం చట్టవిరుద్ధమని కొందరు హరీష్ కుమార్‌పైన ఫిర్యాదు చేశారు. నంజనగూడు శిశు, మహిళా సంక్షేమ అధికారులు గ్రామానికి వచ్చి రికార్డులను పరిశీలించి బాలిక మైనర్ అని నిర్ధారించారు. హరీష్ కుమార్ పైన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

### రెండవ టెర్మినల్ షురూ

**దొడ్డబళ్లాపురం:** పలుసార్లు వాయిదా పడుతూ వచ్చిన కెంపేగౌడ విమానాశ్రయంలోని 2వ టెర్మినల్ సేవలు ఎట్టకేలకు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 10-15 సౌదీ విమానానికి సిబ్బంది స్వాగతం పలికారు.

### ఎర్రచందనం కారు పల్టీ

- ముగ్గురికి గాయాలు, అరెస్టు



ప్రమాదానికి గురైన ఇన్నోవా కారు

**చిక్కబళ్లాపురం:** చిక్కబళ్లాపురం జిల్లా పేరేసంద్ర వద్ద 44వ జాతీయ రహదారిపై సాదలి క్రాస్ వద్ద ఇన్నోవా కారు డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. అందులో తరలిస్తున్న ఎర్రచందనం దుంగలు చెల్లాచెదరుగా పడ్డాయి. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు దుండగులు గాయపడ్డారు.

వివరాలు.. బాగేపల్లి వైపు నుంచి బెంగళూరుకు ఎర్రచందనం దొంగలు నాగరాజు, నాగేంద్ర, శ్రీనివాస్‌లు 24 ఎర్రచందనం దుంగలను ఇన్నోవా కారులో రవాణా చేస్తున్నారు. వేగంగా వస్తూ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. ఎర్రచందనం మొద్దులు బయటపడ్డాయి. పేరేసంద్ర పోలీసులు చేరుకుని ముగ్గురు నిందితులను చిక్కబళ్లాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆస్పత్రిలో నిందితుల విచారణ చేపట్టారు.

# ప్రభుత్వ సేవల్లో తీవ్ర ఆలస్యం

- అందుకే జనం నా వద్దకు పరుగులు
- కలెక్టర్ల భేటీలో సీఎం సిద్దు ఆవేదన



సమావేశంలో సీఎం, మంత్రులు



జిల్లాల్లో పనులు కాక నిత్యం విధానసౌధకు వందలాది మంది వస్తుంటారు

**శివాజీనగర:** నిజాయితీ, పారదర్శకతతో అధికారులు పనులు చేయాలి, ప్రభుత్వ కార్యకలాపాల్లో నిర్లక్ష్యం, జాప్యం సరికాదని, సక్రమంగా పని చేయని అధికారులపై చర్యలు తీసుకొంటానని సీఎం సిద్దరామయ్య హెచ్చరించారు. మంగళవారం విధానసౌధలో జిల్లాల కలెక్టర్లు, జడ్పీ సీఈఓలు, ఇతర ఉన్నతాధికారులతో సీఎం సమావేశం నిర్వహించారు. నిర్లక్ష్యంగా పనిచేస్తూ ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా చేస్తే చూస్తూ మౌనంగా కూర్చోనని హెచ్చరించారు. ప్రజల విన్నపాలకు స్పందించాలని, జిల్లా స్థాయిలోనే పరిష్కారం కల్పించాలని, మీరు స్పందించకపోతే రాష్ట్ర ప్రజలు నా వద్దకు వస్తున్నారని అసంతృప్తి వ్యక్తంచేశారు.

**వారానికి ఒకసారి ఫిర్యాదుల స్వీకారం**

అన్ని జిల్లాల కలెక్టర్లు, జడ్పీ సీఈఓలు, తహసీల్దార్‌లు ప్రజా ఫిర్యాదుల సభలను జరపాలని సీఎం ఆదేశించారు. తాలూకాస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలతో కలసి వారానికి ఒకసారి ఫిర్యాదుల సభ జరిపి ప్రజల సమస్యలకు పరిష్కారం కనిపెట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రజలు చిన్నపాటి సమస్యలకూ నా వద్దకు వస్తారు. ఇలాగైతే మీరు ఉండి ప్రయోజనం ఏమిటని కలెక్టర్లను సీఎం నిలదీశారు. ఇప్పటి నుంచైనా ఫిర్యాదుల సభ జరిపి వారం కాలపరిమితి పెట్టుకొని సమస్యల పరిష్కారానికి దృష్టిపెట్టాలని ఆదేశించారు. ప్రజలు అనవసరంగా డబ్బు ఖర్చు పెట్టుకొని బెంగళూరుకు వచ్చేటట్లు చేయవద్దు. మనమందరం ప్రజాసేవకులమని, రాజులం కాదని తెలుసుకోవాలన్నారు.

**దరఖాస్తులు సత్వర పరిష్కారం కావాలి**

తహశీల్దార్, ఉప విభాగాధికారులు, జిల్లాధికారుల వద్ద ఏళ్ల కొద్దీ అనేక భూ సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి, ఆలస్యం జరిగేకొద్దీ అవినీతి పెరుగుతుంది, దరఖాస్తు స్వీకరించిన మూడు నెలల్లో తహశీల్దార్‌లు అన్నింటినీ పరిష్కరించాలి. ఉప విభాగాధికారులు కనీసం 6 నెలల్లో, కలెక్టర్లు 1 సంవత్సరంలో ఫిర్యాదులను పరిష్కరించాలి. జాప్యం చేస్తే సహించను అని తెలిపారు. కాగా, ఈ భేటీలో డీసీఎం డీకే శివకుమార్, మంత్రులు పాల్గొన్నారు.

### ప్రధాని ఆఫీసు నుంచి స్పందన లేదు: డీకేశి

**శివాజీనగర:** కావేరి వివాదానికి సంబంధించి అఖిలపక్ష బృందం భేటీకి ప్రధాని కార్యాలయం నుండి ఇంతవరకు ఎటువంటి సమాచారం రాలేదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. మంగళవారం విధానసౌధలో విలేకరులతో మాట్లాడిన ఆయన, కావేరి విషయంలో ప్రధాని కార్యాలయానికి లేఖ రాస్తూనే ఉన్నాం. అయితే ఎలాంటి స్పందన రాలేదు. వచ్చేవారం సమయం లభించే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. నది నీటి విషయంలో బీజేపీ, జేడీఎస్ పార్టీలు అనవసరంగా రాజకీయం చేస్తున్నాయి. అధికారం లేకపోవడంతో తమపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తమకు రాష్ట్ర శ్రేయస్సు ముఖ్యమన్నారు. కావేరి జలాశయాల్లో నీరు లేదు. తాగటానికి, పంటలకు సరిపోయే నీరు మాత్రమే ఉందనే విషయాన్ని కావేరి నీటి నిర్వహణా ప్రాధికార దృష్టికి తీసుకొచ్చామని ఆయన తెలిపారు.

## క్లుప్తంగా

### 25 చోరీ బైక్‌ల స్వాధీనం



స్వాధీనపరుచుకున్న చోరీ బైక్‌లతో పోలీసు అధికారులు

కంప్లి: గ్రామాల్లో చోరీలకు పాల్పడిన ద్విచక్ర వాహనాల దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి 25 బైక్‌లను కురుగోడు పోలీసులు స్వాధీనపరచుకున్నట్లు జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన నిందితుడు బళ్లారి శాంతినగర్ నివాసి శ్యాంసుందర్‌ను అరెస్ట్ చేసి అతడి నుంచి బళ్లారి కౌల్‌బజార్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన 3 బైక్‌లతో సహా రూ.17.50 లక్షల విలువ చేసే 25 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ బైక్‌లను నిందితుడు ఓర్వాయి గ్రామానికి చెందిన కరీం అనే వ్యక్తికి తక్కువ ధరకు విక్రయించాడని పోలీసుల దర్యాప్తులో తేలిందని తెలిపారు. ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

### బస్టాండ్ పనుల సత్వర పూర్తికి సూచన

రాయచూరు రూరల్: కొత్త బస్టాండ్ నిర్మాణ పనులను త్వరగా ముగించాలని చిన్న నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసురాజు ఆర్టీసీ అధికారులకు సూచించారు. సోమవారం సిరివారలో బస్టాండ్ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రెండేళ్లు గడుస్తున్నా పనులు జాప్యం కావడాన్ని తప్పుబట్టారు. మంత్రి వెంట మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్, అధికారులున్నారు. కాగా రాత్రి కిల్లే బృహన్మఠంలో శ్రావణ మాస పురాణ ప్రవచన కార్యక్రమంలో మంత్రిని శాంతమల్ల శివాచార్య స్వామీజీ సన్మానించారు.

### మైసూరు వీసీకి హైకోర్టు షాక్

- నియామకం రద్దు

మైసూరు: మైసూరు విశ్వవిద్యాలయం వీసీ ఎస్.కే లోకనాథ్ నియామకాన్ని హైకోర్టు రద్దు చేసింది. ఇంతకుముందున్న వీసీ జీ హేమంత్‌కుమార్ అవధి 2022 నవంబర్ 15కి పూర్తి కావడంతో ప్రొ.హెచ్. రాజశేఖర్‌ను తాత్కాలిక వీసీగా ప్రభుత్వం నియమించింది. తరువాత ప్రొ.లోకనాథ్‌ను వీసీగా సర్కారు నియమించగా, శరత్ అనంత్‌మూర్తి అనే ప్రొఫెసర్ ఇది అక్రమమని హైకోర్టులో కేసు వేశారు. వాదనలు ఆలకించిన జడ్జి జస్టిస్ సంజయగౌడ ధర్మాసనం హేమంత్‌కుమార్ నియామకం చెల్లదని, ఆ స్థానంలో మరొకరిని నియమించాలని ఆదేశాలిచ్చింది.

### మొక్కలతో పచ్చదనం వృద్ధి



మొక్కను నాటుతున్న అధికారులు

హొసపేటె: మన చుట్టుపక్కల ప్రాంతంలో మొక్కలను నాటి పెంచి పోషించి పచ్చదనం, ఉత్తమ వాతావరణాన్ని నెలకొల్పాలని తాలూకా విద్యా శాఖ అధికారి చెన్నబసప్ప తెలిపారు. ఆయన మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సస్యశ్యామల కార్యక్రమాన్ని మొక్కకు నీరు పోసి ప్రారంభించి మాట్లాడారు. హెచ్‌ఎం అక్కమహాదేవి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రైల్లో ప్రయాణికులకు అస్వస్థత

సాక్షి బళ్లారి: బెళగావి జిల్లాలో నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైల్లో పలువురు ప్రయాణికులు అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం జరిగింది. గోవా నుంచి ఢిల్లీకి వెళ్తున్న రైలులో 8 మంది యువకులు స్పృహ తప్పి పడిపోయారు. దీంతో రైల్వే పోలీసులు వారిని బెళగావి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే ఎవరికీ ప్రాణహాని లేదని వైద్యులు విజయ్‌కుమార్ తెలిపారు.

### వార్తా శాఖ సీనియర్ ఏడీగా జడియప్ప



జడియప్పను అభినందిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: బళ్లారి వార్తా శాఖ నూతన సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా జడియప్ప మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఉన్న ఇన్‌చార్జ్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన తుకారాం రావ్ చిత్రదుర్గకు బదిలీ అయ్యారు. జడియప్ప ఇంతకు ముందు వార్తా, ప్రజా సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఆయనను ప్రభుత్వం పదోన్నతి కల్పించి సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్(న్యూస్ అండ్ పబ్లిక్ రిలేషన్స్)గా బళ్లారికి బదిలీ చేసింది.

### బాల కార్మికులకు విముక్తి

హొసపేటె: బాలకార్మికుల రక్షణ టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో తాలూకాలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం దాడులు చేసి ఐదుగురు బాలురను రక్షించినట్లు కార్మిక అధికారి సూర్యప్ప దొంబర్మత్తూరు తెలిపారు. వివిధ శాఖల అధికారుల సహకారంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో గ్యారేజీలు, బేకరీలు, హోటళ్లు, మెకానిక్, పండ్ల, కిరాణా తదితర దుకాణాల్లో అధికారుల బృందం దాడి చేసి ఐదుగురు బాల కార్మికులను పని నుంచి విముక్తి కల్పించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. అంగళ్ల యజమానులపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.

# కందిబేడల ధరలకు రెక్కలు

- కలబుర్గి, బీదర్ జిల్లాల్లో విస్తారంగా పంట సాగు
- త్వరలో రూ.200 దాటుతుందంటున్న వ్యాపారులు



సాక్షి, బళ్లారి: అన్ని రంగాల్లోనూ వ్యాపారుల మాయజాలమే కనిపిస్తోంది. వ్యవసాయ రంగంలో అయితే మరీ దారుణం. రైతులు పంట పండించే వరకే. పంట పండించిన తర్వాత వ్యాపారులదే పైచేయిగా మారుతోంది. ఆరుగాలం కష్టపడి పని చేసి, వేలాది రూపాయలు అప్పులు చేసి పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర కోసం పోరాటాలు చేస్తే, రైతుల వద్ద కొనుగోలు చేసిన వ్యాపారులు, రైతులు వద్ద స్టాక్ లేదని తెలిసిన మరుక్షణమే ధరలను ఆకాశాన్నంటించడం పరిపాటిగా మారింది. కర్ణాటకలో కంది పంటకు పేరొందిన కలబుర్గి, బీదర్ జిల్లాల్లో విస్తారంగా లక్షలాది ఎకరాల్లో కంది పంటను సాగు చేస్తారు. ప్రతి ఏటా ఈ రెండు జిల్లాల్లో దాదాపు 13 లక్షల ఎకరాల్లో కంది సాగు చేస్తారని అంచనా. కళ్యాణ కర్ణాటక జిల్లాల్లోనే పెద్ద ఎత్తున రైతులు కందిని పండించడంతో దేశ, విదేశాలకు కూడా కలబుర్గి కందిని ఎగుమతి చేస్తారు. ఈ రెండు జిల్లాల్లో పండించిన కందిబేడలు తినడం వల్ల పౌష్టికాహారంతో పాటు మంచి ఆరోగ్యం కూడా లభిస్తుందని చెబుతుంటారు. అయితే రైతులు పండించినప్పుడు గిట్టుబాటు ధరల కోసం పెద్ద ఎత్తున పోరాటం చేసినా వారికి కనీసం క్వింటాల్ కందికి రూ.6 వేలు నుంచి రూ.7 వేలు కూడా దక్కలేదు.

**ప్రస్తుతం కిలో ధర రూ.180 దాటిన వైనం**

ఈ రెండు జిల్లాల్లో గత ఏడాది పండించిన కందిని పూర్తిగా విక్రయించేశారు. వ్యాపారుల వద్దకు చేరింది. ఉన్నఫళంగా నెల రోజుల నుంచి కంది బేడలు కొండెక్కిస్తున్నారు. గత ఏడాది ఇదే సమయానికి కంది బేడల ధర రూ.100 నుంచి రూ.120 లోపు మాత్రమే ఉంటే ప్రస్తుతం రూ.170 నుంచి రూ.180ల ధర వరకు కంది బేడలను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో కంది బేడల ధర రూ.200లు దాటే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారంటే వారి చేతుల్లోనే కంది బేడల ధరల మాయజాలం ఉందన్నమాట. కంది బేడల ధర ఏకంగా కిలో రూ.200 దాటితే సామాన్యుడికి కందిపప్పు తినడం కష్టతరంగా మారుతుంది. మంచి బలవర్ధక ఆహారంలో ఒకటైన కందిబేడల ధర కిలో రూ.200 వరకు చేరుకుంటే తాము ఎలా తినాలని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి వర్షాలు కూడా అంతంత మాత్రంగానే కురవడంతో కంది పంట సాగు చేసిన రైతులు కూడా పంట పండుతుందా? లేదా? అని భయాందోళన చెందుతున్నారు.

**వర్ణనాతీతంగా ప్రజల బాధలు**

ఒక వేళ పంట పండినా కంది పంట చేతికొచ్చే సరికి మరో మూడు నెలలు పడుతుంది. కంది పంట పండిన తర్వాత వాటిని ఆరబోసి, కందిని తీసి, బ్యాళ్లు చేసే సమయం మరో నెల రోజులు ఆలస్యం అవుతుంది. ఈ ఏడాది సాగు చేసిన కంది బేడలు మార్కెట్‌కు వచ్చే వరకు వ్యాపారుల దగ్గర ఉన్న కంది ధరను ఎంతకు పెంచినా గత్యంతరం లేక కొనుగోలు చేయాల్సిందేనన్న మాట. కంది బేడల ధర రోజురోజుకు పెరుగుతుండటంతో వినియోగదారుల బాధలు వర్ణించలేని విధంగా ఉన్నాయి. మొన్న రెండు నెలల పాటు టమాటా, కూరగాయల ధరలు కొండెక్కి కూర్చొని పేదలు కన్నీరు కారిస్తే, ప్రస్తుతం కంది బేడల ధరలు పేదలకు కన్నీరు తెప్పిస్తున్నాయి. కంది బేడల ధరలు కిలో రూ.180లు పలుకుతున్నా రైతులకు కిలోకు రూ.60 నుంచి రూ.70లు మాత్రమే దక్కిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది పంట చేతికొచ్చిన తర్వాత తమకు క్వింటాల్ గరిష్ఠ ధర రూ.10 వేలు కూడా దక్కకుండా పంట పండిన తర్వాత మళ్లీ అమాంతంగా తగ్గించేస్తారని రైతులు పేర్కొంటున్నారు.

## 22 ఏళ్లప్పుడు చోరీ..80 ఏళ్లప్పుడు అరెస్ట్.!

- బీదర్ జిల్లాలో ఘటన

సాక్షి,బళ్లారి: ఏదైనా నేరం చేస్తే ఎప్పటికైనా దొరుకుతారనేది నిరూపితమైంది. అయితే తప్పు చేసిన వ్యక్తిని ఏకంగా 58 ఏళ్ల తర్వాత పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు..1965 ఆగస్టు 25న బీదర్ జిల్లా మహాకర్ గ్రామంలో మాణిక్ రావ్ కులకర్ణి అనే వ్యక్తి తన రెండు గేదెలు, ఒక దూడను దొంగిలించారని ఫిర్యాదు చేయడంతో అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన కిశన్ చందర్, గణపతి విఠల్ అనే యువకులను అరెస్ట్ చేసి బెయిల్‌పై విడుదల చేశారు. నిందితుల్లో ఒకడైన గణపతి విఠల్ వయస్సు 22 ఏళ్లు. అయితే కోర్టుకు చెప్పిన సమయానికి హాజరు కాకుండా, ఎన్నిసార్లు వారెంట్లు జారీ చేసినా ఇద్దరు కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ కేసులో ఒక నిందితుడైన కిశన్ చందర్ 2006 ఏప్రిల్‌లో మృతి చెందాడు. మరో నిందితుడి కోసం వారెంట్లు జారీ అవుతూనే ఉన్నాయి. ప్రస్తుతం బీదర్‌కు వచ్చిన ఎస్పీ చెన్నబసవణ్ణ జిల్లాలోని లాంగ్ పెండింగ్ రిపోర్ట్(ఎల్‌పీఆర్) కేసులను సీరియస్‌గా తీసుకుని నిందితులను అరెస్ట్ చేయాలని ఆదేశించారు. ఈ ఎల్‌పీఆర్‌తో 22 ఏళ్ల వయస్సులో రెండు గేదెలను దొంగిలించి కోర్టుకు హాజరుకాకపోవడంతో ప్రస్తుతం 2023 సెప్టెంబర్‌లో 80 ఏళ్ల వయస్సుగల వృద్ధుడైన నిందితుడిని అరెస్ట్ చేయాల్సి వచ్చిందని పోలీసులు తెలిపారు.

## హాస్టల్ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

గంగావతి: కుష్టిగిలోని కొప్పళ రోడ్డులో బీసీఎం విద్యార్థుల హాస్టల్ భవన నిర్మాణానికి కొప్పళ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివరాజ్ తంగడిగి మంగళవారం భూమిపూజ నెరవేర్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం పాటు పడుతోందన్నారు. విద్యార్థులకు ప్రధానంగా వసతి సౌకర్యాన్ని కల్పించే దిశగా కుష్టిగిలో సొంత హాస్టల్ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, కుష్టిగి ఎమ్మెల్యే దొడ్డనగౌడ పాటిల్, బీసీఎం శాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీలు నగరంలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బళ్లారి రేంజ్ ఐజీ లోకేష్‌కుమార్, కొప్పళ జిల్లా ఎస్పీ యశోద, డీఎస్పీ, సీఐ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### ప్రభుత్వంపై పోరాటానికి పొత్తు అనివార్యం

- మాజీ సీఎం బొమ్మై

శివాజీనగర: లోకసభ ఎన్నికలు, జేడీఎస్‌తో పొత్తు విషయం చర్చించే అంశంపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమావేశం నిర్వహించారు. మంగళవారం మల్లేశ్వరంలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం జగన్నాథ భవన్‌లో జరిగిన సమావేశంలో మాజీ సీఎం బొమ్మై మాట్లాడుతూ...ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడుకు నీరు విడిచిపెట్టమని సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించింది. ముందు ఎంత గట్టిగా నిలుస్తారో వేచి చూడాలన్నారు. జేడీఎస్-బీజేపీ పొత్తు విషయానికి స్పందించిన ఆయన, ఇప్పటికే రెండు పార్టీలు ఒక్కటవ్వాలి. ప్రతిపక్ష పార్టీలు ఒక్కటి కావాలని ఉంది. ముందు సాధక బాధకాలపై చర్చించాల్సి ఉంది. రెండు పార్టీల అధినాయకులు తీర్మానం చేయనున్నారని తెలిపారు. రాజకీయ చరిత్రలో అనేక మార్పులు జరిగాయి. ఇలాంటి పద్ధతి లేని ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేపట్టాల్సిన అవసరముందని, పొత్తు అనివార్యమని బొమ్మై సమర్థించుకొన్నారు.

### అక్రమాస్తుల కేసులో తహసీల్దార్ సస్పెండ్

దొడ్డబళ్లాపురం: ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడన్న ఆరోపణల నేపథ్యంలో దేవనహళ్లి తహసీల్దార్ శివరాజ్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆగస్టు 17న లోకాయుక్త పోలీసులు శివరాజ్ ఇల్లు, అతని స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో కలిపి మొత్తం 12 చోట్ల సోదాలు చేసి భారీగా నగదు, విలువైన వస్తువులు, పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 30న లోకాయుక్త వారు కేసు నమోదు చేసుకున్నారు. శివరాజ్ తన ఆదాయానికి మించి 125 శాతం అధికంగా ఆస్తులు కలిగి ఉన్నట్లు గుర్తించారు. దీంతో విచారణ సజావుగా జరగడం కోసం అతన్ని సస్పెండ్ చేయాలని లోకాయుక్త సిఫార్సుల మేరకు సస్పెండ్ చేశారు.

### వాసవీ ఆలయ కార్యవర్గం ఎంపిక

బళ్లారిఅర్బన్: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ పాలక మండలి నూతన కార్యవర్గాన్ని మంగళవారం బెంగళూరు రోడ్డులోని దేవస్థానంలో కమిటీ సభ్యుల సమక్షంలో ఎంపిక చేశారు. 2023 నుంచి 2026 వరకు దేవస్థానం మేనేజింగ్ ట్రస్ట్ అధ్యక్షులుగా గాదెం గోపాలకృష్ణ, పదాధికారులుగా విట్టా కృష్ణకుమార్, అశ్వత్ నారాయణశెట్టి, జయంతి కిషోర్‌కుమార్ జాయింట్ ట్రస్టీలుగా ఎంపికయ్యారు. కాగా నూతన కార్యవర్గాన్ని సభ్యులు, పదాధికారులు అభినందించారు.

### వర్షాల కోసం పూజలు



అలంకరణలో మారికాంబ అమ్మవారు

మాలూరు: తాలూకాలో వానలు బాగా కురిసి రైతులకు మేలు జరగాలని ప్రార్థిస్తూ మంగళవారం దిన్నేరి హారోహళ్లిలోని పురాతన మారికాంబ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణాచారి నేతృత్వంలో ఈ పూజలను నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. మహిళలు ఆరతి తంబిట్టు దీపాలను అమ్మవారికి సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. హెచ్‌టి కెంచప్ప, టి.వెంకటప్ప, వి.నారాయణస్వామి, హెచ్‌ఎస్ నారాయణస్వామి, హెచ్‌ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అర్హులకు ఇళ్లను కేటాయిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

కేజీఎఫ్: నగరంలో నివసిస్తున్న ఎల్‌ఐజీ, ఆర్థికంగా బలహీన వర్గాల వారి కోసం 1979లో కర్ణాటక గృహ మండలి నుంచి ఆశ్రయ పథకంలో భాగంగా మంజూరైన 83 ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందిస్తామని ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. మంగళవారం నగరంలోని మస్కంలో నివాసం ఉంటున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఆమె మాట్లాడారు. 15 ఏళ్ల క్రితం రూ.25 వేలు ఉన్న డిపాజిట్ మొత్తాన్ని నేడు రూ.2 లక్షలు చేశారన్నారు. ఇక్కడ నివాసం ఉంటున్న వారందరూ పేదలు కావడం వల్ల గతంలో నిర్ణయించిన రూ.25 వేలనే డిపాజిట్‌గా తీసుకోవాలని గృహమండలికి విన్నవిస్తున్నట్లు తెలిపారు. నగరసభ సభ్యుడు కోదండ, శాలిని నందకుమార్, కరుణాకరన్, కర్ణాటక గృహ మండలి ఏఈఈ భవ్య, నగరసభ కమిషనర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సరళంగా శ్రీకృష్ణ జయంతి

రాయచూరు రూరల్: నగరంలో మంగళవారం శ్రీకృష్ణ జయంతిని సరళంగా ఆచరించారు. త్రైత సిద్ధాంత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు జరిపి బాలలతో శ్రీకృష్ణుని పాత్రలు వేయించారు. నగర వీధుల గుండా శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగించారు. హిందూ సనాతన ధర్మాలను, త్రైత సిద్ధాంతాలను గురించి ప్రచారం చేశారు.

## ఘనంగా తాయమ్మదేవి జాతర మహోత్సవం



పూర్ణకుంభాలతో భక్తుల ఊరేగింపు



ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గంగావతి: నగరంలోని మురహరినగర్‌లో తాయమ్మదేవి 51వ జాతర మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఎమ్మెల్యే గాలి జనార్దన రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవారికి దేవస్థాన అభివృద్ధికి తన సొంతంగా రూ.15 లక్షలను అందిస్తానని భరోసా ఇచ్చారు. కాగా ఉదయాన్నే అమ్మవారికి పలు అభిషేకాలు, విశేష అలంకరణ పూజలు జరిపారు. అనంతరం అమ్మవారిని మహిళలు కుంభాలతో ఊరేగించారు. కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, మాజీ ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి, మాజీ ఎమ్మెల్సీ హెచ్‌ఆర్.శ్రీనాథ్, దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శి, పదాధికారులు పాల్గొన్నారు.

## జ్ఞానంతో కూడిన విద్య అవసరం



ప్రారంభిస్తున్న యశ్వంత్ భూపాల్ తదితరులు

సాక్షి బళ్లారి: జ్ఞానం అలవర్చుకోవడంతోనే ఉత్తమ సమాజ స్థాపన సాధ్యమని టీఈహెచ్‌ఆర్‌డీ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌జేవీ మహిపాల్ అన్నారు. మంగళవారం ఆయన బీఐటీఎం కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బీఐటీఎం ఇంజినీరింగ్ కళాశాల కళ్యాణ కర్ణాటకలో మంచి పేరు గడించడంతో పాటు ఈ ప్రాంత విద్యార్థులకు బంగారు బాట వేస్తోందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థలు నడుస్తున్నాయన్నారు. వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన కల్పిస్తున్నామన్నారు. కళాశాల అధ్యక్షుడు యశ్వంత్ భూపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు శ్రద్ధ, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ఉత్తమ భవిష్యత్తుకు సంస్థ నాంది పలుకుతుందన్నారు. అమర్‌రాజ్ భూపాల్, వీ.జే.భరత్, డాక్టర్ రాఘవేంద్ర జోషి, డాక్టర్ వి.సి. పాటిల్, డాక్టర్ టి.మాచప్ప, డాక్టర్ సురేష్, డాక్టర్ ఎస్.మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## కోలారు వార్తలు...

## అమరవీరులకు ఘన నివాళి



స్మారకానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కోలారు: వన్యప్రాణులను రక్షిస్తున్న అటవీ శాఖ సిబ్బంది ప్రథమ కర్తవ్యం అని జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి శుక్లాక్ష పాలన్ తెలిపారు. మంగళవారం అటవీశాఖ కార్యాలయంలో జాతీయ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అమరవీరుల స్మారకానికి పుష్పార్చన గావించి మాట్లాడారు. అటవీశాఖ సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి వన్యజీవులను రక్షిస్తున్నారన్నారు. వారి సేవలు శ్లాఘనీయమన్నారు. అటవీ, వన్య జీవుల సంరక్షణ కోసం ఎంతో మంది ప్రాణాలను కూడా కోల్పోయారన్నారు. వారి పేర్లు అటవీ శాఖలో చిరస్థాయిగా నిలిచి పోయాయన్నారు. నేడు అటవీ సంపదను కొంత మంది ఆక్రమించుకుని కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అటవీ సంపదను నాశనం చేయడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయన్నారు. ఫస్ట్ గ్రేడ్ జేఎంఎఫ్‌సీ జడ్జి శ్రీనివాస్ ఎస్‌పాటిల్, కలెక్టర్ అక్రం పాషా, సీఈఓ పద్మ బసవంతప్ప, ఎస్పీ ఎం నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర ప్రయత్నంతోనే విజయం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: నిరంతర ప్రయత్నం ద్వారానే విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధ్యమని జ్ఞాన గంగోత్రి పోటీ పరీక్షల శిక్షణా సంస్థ డైరెక్టర్ ఎన్.సురేష్ తెలిపారు. మంగళవారం చెన్నయ్య రంగమందిరంలో వివేక్ ఇన్ఫోటిక్ పోటీ పరీక్షల శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వివేక రత్న అవార్డు ప్రదాన కార్యక్రమంలో అవార్డును స్వీకరించి ఆయన మాట్లాడారు. అభ్యర్థులు మొదటి నుంచి పరీక్షల కోసం అన్ని విధాలుగా సిద్ధమైతేనే విజయం సాధ్యమని అన్నారు. ఇతర పనులను పక్కన బెట్టి కేవలం పోటీ పరీక్షలకు సిద్ధం కావడంలో విద్యార్థులు నిమగ్నం కావాలన్నారు. సంస్థ డైరెక్టర్ ఎ ప్రమోదకుమార్ మాట్లాడుతూ పోటీ పరీక్షల శిక్షణలో వివేక్ ఇన్ఫోటిక్ సంస్థ అత్యధిక ఫలితాలను సాధించి తనదైన గుర్తింపు పొందిందన్నారు. అనంతరం వివేకరత్న పురస్కృత సురేష్‌ను సన్మానించారు. సంపన్మూల వ్యక్తి ఎస్.కిరణ్‌కుమార్, ఎన్ఆర్ నాగేష్ పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలపై నిరసన



నిరసన తెలియజేస్తున్న జేడీఎస్ కార్యకర్తలు

కోలారు: విద్యుత్ కోతలను ఖండిస్తూ జేడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని బెస్కాం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఎస్ కార్యకర్తలు మాట్లాడుతూ అప్రకటిత విద్యుత్ కోతలతో విద్యుత్ సరిగా సరఫరా కాక రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వం వ్యవసాయ పంప్‌సెట్లకు విద్యుత్ సరిగా సరఫరా చేయకపోతే ఎలా? అని ప్రశ్నించారు. ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తులో జేడీఎస్ ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో జేడీఎస్ నాయకులు సీఎంఆర్ శ్రీనాథ్, జేడీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు బణకనహళ్లి నటరాజ్, తాలూకా అధ్యక్షుడు బాబు మౌని, వక్కలేరి రాము, శ్రీరాం, పాలాక్షగౌడ పాల్గొన్నారు.

### అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రైతు మల్లేశప్ప(ఫైల్)

రాయచూరు రూరల్: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కలబుర్గి జిల్లాలో జరిగింది. చించోళి తాలూకాకు చెందిన మల్లేశప్ప(63) అనే రైతు పంటల సాగు కోసం కర్ణాటక గ్రామీణ బ్యాంక్, ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంక్‌ల్లో రూ.8 లక్షలను అప్పు చేశాడు. అయితే అనావృష్టితో వేసిన పంటలు చేతికందలేదు. దీంతో అప్పుల బాధ తాళలేక చివరికి ఇంటిలోనే విషం తాగాడు. అతనిని కలబుర్గి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు.

### పెట్రోల్ బంక్‌లో కారుకు మంటలు

సాక్షి, బళ్లారి: బెళగావిలోని నెహ్రూ కాలనీలో పెట్రోల్ బంక్‌లో మంగళవారం కారులో మంటలు చెలరేగాయి. శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ సమీపంలోని పెట్రోల్ బంక్‌లోకి ఓ వ్యక్తి కారుతో పెట్రోల్ కోసం రాగా ఉన్నఫళంగా కారులో మంటలు వ్యాపించాయి. వెంటనే సిబ్బంది అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందిని రప్పించడంతో తృటిలో పెనుముప్పు తప్పింది.

### అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

యశవంతపుర: ఎండోసల్ఫాన్ బాధిత యువతిపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి మంగళూరు అడిషనల్ జిల్లా కోర్టు పదేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. వివరాలు... బంట్వాళ తాలూకా పెరువాయి గ్రామానికి చెందిన రాజేశ్ రై 2015 అక్టోబర్ 1న తన తోటలో పనికి వచ్చిన యువతిపై అత్యాచారం చేశాడు. దీనిపై విట్ల పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించారు. ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి ప్రీతి.. ముద్దాయి రాజేశ్ రైకి పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

### భార్య హత్య కేసులో భర్తకు శిక్ష

హుబ్లీ: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భార్యను హత్య చేసిన ముద్దాయికి 3వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ధార్వాడకు చెందిన గణేష్ అనే వ్యక్తి 2020 ఆగస్ట్ 11న రాజీవ్‌గాంధీ నగర్‌లో నిర్మాణ దశలో ఉన్న కట్టడంలో వివాహేతర సంబంధం నెరుపుతున్న వ్యవహారాన్ని పసిగట్టిన అతడి భార్య శిల్పను ఆమె భర్త ఇనుప కడ్డీతో కొట్టి హత్య చేశాడు. కేసు నమోదు చేసుకున్న విద్యాగిరి సీఐ మహంతేష్ కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించారు. కేసు విచారణ చేసిన సదరు కోర్టు న్యాయమూర్తి సుబ్రమణ్య పై మేరకు శిక్ష విధించారు. ప్రశాంత్ తోరగల్ ప్రభుత్వం తరఫున కేసును వాదించారు.

### విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి బుగ్గి

హుబ్లీ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అంగడిలో ఆకస్మికంగా అగ్నిప్రమాదం వాటిల్లి లక్షలాది రూపాయల విలువ చేసే వస్తువులు ఆహుతైన ఘటన మంగళవారం జనతా బజార్‌లో చోటు చేసుకుంది. శివప్ప నాయకకు చెందిన పోలీస్ స్టోర్‌లో ఈ ప్రమాదం వాటిల్లింది. అక్కడ పోలీస్ శాఖకు సంబంధించిన యూనిఫాం తదితర సామగ్రిని తయారు చేసే వారు. సోమవారం అర్ధరాత్రి అంగడిలో ఎవరూ లేని సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. ఘటనపై ఉప నగర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### ప్రతి ఒక్కరికీ అక్షరజ్ఞానం తప్పనిసరి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: సామాజిక న్యాయ సాధనకు ప్రతి ఒక్కరికీ అక్షరజ్ఞానం తప్పనిసరి అని తహసీల్దార్ శిరీన్‌తాజ్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని బీఆర్‌సీ కేంద్రంలో నిర్వహించిన సాక్షరతా దినోత్సవంలో ఆమె మాట్లాడారు. నిరక్షరాస్యత నిర్మూలనలో ఉపాధ్యాయుల పాత్ర ప్రముఖం అన్నారు. బీఈఓ కె భాగ్యలక్ష్మమ్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారిని సాక్షరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర భేష్ అని కొనియాడారు. అనంతరం ఉత్తమ బోధకులను సన్మానించారు. అధికారులు శివమ్మ, జీవీ చంద్రప్ప, చలపతి, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

### అన్యాయాన్ని సహించబోం



మాట్లాడుతున్న ప్రముఖులు

కోలారు: తమ సముదాయానికి చెందిన వ్యక్తికి జరిగిన అన్యాయాన్ని చూస్తూ ఊరుకునేది లేదని వహ్నికుల సముదాయ ప్రముఖులు హెచ్చరించారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో వారు విలేకరులతో మాట్లాడారు. తమ సముదాయానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఎల్‌ఎ మంజునాథ్‌ను ప్రభుత్వం డీసీసీ బ్యాంకు నామినేటెడ్ సభ్యుడిగా నియమించినా ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తన పరపతిని ఉపయోగించి నామినేటెడ్ సభ్యుడి స్థానం నుంచి తొలగించేలా చేశారన్నారు. దీనిపై పోరాటానికి దిగుతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే గెలుపులో వహ్నికుల ప్రజలు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. అలాంటిది తమ సముదాయపు వ్యక్తికి ఎలా అన్యాయం చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే మంజునాథ్‌ను డీసీసీ బ్యాంకు నామినేటెడ్ సభ్యుడిగా పునర్నియామకం చేయాలని డిమాండ్ చేశారు. వేమగల్ మునియప్ప, చిన్నప్ప, లక్ష్మీపతి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మహాదేవపురలో శివపూజలు



కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర మహేశ్వరమ్మ దేవాలయంలోని కల్యాణ మండపంలో మంగళవారం శివపూజ నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మంజుల అరవింద లింబావళి దంపతులు పాల్గొని పూజలు చేశారు. విభూతిపుర మఠానికి చెందిన షడక్షరి బ్రహ్మ మహంత స్వామీజీ పాల్గొని భక్తులను ఆశీర్వదించి ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు.

### పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా పరిధి ఆనేకల్ పట్టణంలోని విధాత విద్యాసంస్థలో మంగళవారం సాహితీవేత్త డాక్టర్. తా.నం. కుమార స్వామి రచించిన చోళ కన్నడ శాసనాలను కన్నడ భాషలో రచించిన పుస్తకాలను పండితులు డాక్టర్. ఆర్.శేష శాస్త్రి విడుదల చేశారు. కార్యక్రమంలో న్యాయ నిపుణుడు పి.వి.కృష్ణమూర్తి, ఎ.వి. వసంత రాజుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

### మొక్కలు నాటిన బీజేపీ నేతలు



మొక్కలు నాటుతున్న ఎన్ఆర్.రమేశ్, ఉమేశ్‌శెట్టి తదితరులు

బనశంకరి: మనదేశం–మనమట్టి అభియాన్‌లో భాగంగా మంగళవారం బెంగళూరు దక్షిణ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఎన్ఆర్.రమేశ్ నేతృత్వంలో బెంగళూరులో చారిత్రక చెరువులైన కెంపాంబుధి, లాల్‌బాగ్‌చెరువు, బేగూరు నాగలింగేశ్వర దేవస్థానాల నుంచి సేకరించిన మట్టిని అమృత కలశాల్లో పెట్టి పూజలు చేశారు. అనంతరం యడియూరు చెరువు ఆవరణలో 50 మొక్కలు నాటిన అనంతరం అమృతవనం అనే పేరుతో కార్యక్రమం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ఉమేశ్‌శెట్టి, బీజేపీ జిల్లా పదాధికారులు, మండల పదాధికారులు, వందలాదిమంది బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### మట్టి సేకరణ

మండ్య: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల జ్ఞాపకార్థం దేశ రాజధాని ఢిల్లీలో అమృత్ ఘాట్‌లో చేపడుతున్న ఉద్యానవనం కోసం మట్టిని సేకరించే కార్యక్రమం చేపట్టారు. నా దేశం, నా మట్టి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండ్య జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సదానంద కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండ్య నగరంలోని గురు రాఘవేంద్ర ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం కుండలో మట్టిని నింపి భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేస్తూ ఇంటింటికి వెళ్లి మట్టిని సేకరించారు.

### బస్సుపై రాళ్లదాడి

యశవంతపుర: తమిళనాడు బస్సులపై రాళ్లు రువ్విన ఘటన బెంగళూరు నగరంలోని మైసూరు రోడ్డు శాటిలైట్ బస్టాండ్ వద్ద జరిగింది. గుర్తు తెలియని దుండగులు భారత్ పెట్రోల్ బంక్‌వద్ద తమిళనాడు ప్రభుత్వ బస్సుపై రాళ్లు విసిరినట్లు డ్రైవర్ గుణశేఖరన్ చామరాజపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒక వైపున అద్దాలు ధ్వంసమయ్యాయి. దాడికి గల కారణాలు తెలియ రాలేదు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు.

### పెన్షన్ పత్రాలు అందజేత



పెన్షన్ ఆదేశ పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్

గౌరిబిదనూరు: ప్రజాప్రతినిధులు ప్రజా సమస్యలపై స్పందించినప్పుడే ప్రభుత్వ సౌలభ్యాలు ప్రజల చెంతకు చేరుతాయని తహసీల్దార్ మహేశ్ పత్రి అన్నారు. మంగళవారం నగరంలోని 11వ వార్డు ఉప్పార కాలనీలో 12 మంది లబ్ధిదారులకు ఆయన స్వయంగా వారి ఇళ్లకే వెళ్లి పెన్షన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా హుదుగూరు జీపీ సభ్యుడు జయణ్ణ మాట్లాడుతూ... రెవెన్యూ శాఖ వెంటనే స్పందించి పెన్షన్లు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నగరసభ సభ్యురాలు పుణ్యవతి జయణ్ణ తదితరులు పాల్గొన్నారు.

### గొంతు కోసి హత్య

మైసూరు: వ్యక్తిని గొంతుకోసి దారుణంగా హత్య చేసిన ఘటన మైసూరు నగరంలోని కేర్గళ్లిలో చోటు చేసుకుంది. హతుడిని కేర్గళ్లికి చెందిన మహదేవ (53)గా గుర్తించారు. పాతకక్షల కారణంగానే హతమార్చినట్లు అనుమానిస్తున్నారు.

# పణంబూర్ బీచ్ చూడాల్సిందే !

- మంత్రముగ్ధులను చేసే ప్రకృతి అందాలు
- బీచ్‌లో ఏటా సాంస్కృతిక వేడుకలు

బనశంకరి: పణంబూర్ బీచ్ కర్ణాటకలో అత్యంత ప్రసిద్ధి చెందిన అందమైన బీచ్‌ల్లో ఒకటి. ఇది కర్ణాటకలోని పశ్చిమతీరంలో ప్రధాన ఓడరేవు నగరమైన మంగళూరులో ఉంది. బీచ్ సమీపంలో ఉన్న పణంబూరు గ్రామం పేరుతో ఈ బీచ్‌కు పేరు వచ్చింది. పణంబూరు బీచ్ టూరిజం డెవలప్‌మెంట్ ప్రాజెక్టు నిర్వహిస్తుంది. పణంబూర్ బీచ్ దాదాపు 1.5 కిలోమీటర్లు పొడవు కలిగి ఉంది. మృదువైన బంగారు ఇసుక, స్పష్టమైన నీలం నీరు, ప్రశాంతమైన అలలకు ప్రసిద్ధి చెందింది. బీచ్ సాపేక్షంగా శుభ్రంగా, చక్కగా నిర్వహిస్తున్నారు. పణంబూర్ బీచ్‌లోని అత్యంత ప్రసిద్ధ ఆకర్షణల్లో ఒకటి వాటర్‌స్పోర్ట్స్. బీచ్ జెట్ స్కీయింగ్, పారాసైలింగ్, బనానా బోట్‌రైడ్‌లు, సర్ఫింగ్‌లతో సహా పలు రకాల వాటర్‌స్పోర్ట్స్ కార్యకలాపాలు అందిస్తుంది. బీచ్‌లో డాల్ఫిన్లను చూసే సదుపాయం కూడా ఉంది. డాల్ఫిన్లు గుర్తించడానికి ఉత్తమ సమయం ఉదయం లేదా సాయంత్రం. వాటర్‌స్పోర్ట్స్ కాకుండా బీచ్‌లో వాలీబాల్, క్రికెట్, ఇతర బీచ్‌గేమ్‌లను ఆడేందుకు కూడా బీచ్ ప్రసిద్ధి. పణంబూరుబీచ్ సందర్శకులతో బాగా ప్రాచుర్యం పొందింది.

**ఏటా ఫెస్టివల్ :**

పణంబూర్‌బీచ్ ఫెస్టివల్ ఏటా జనవరిలో నిర్వహిస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్‌స్టాల్స్, వివిధ పోటీలు ఉంటాయి. ఈ పండుగ వీక్షించడానికి కర్ణాటక నలుమూలలు నుంచి పెద్ద సంఖ్యలో తరలివస్తారు. పణంబూర్ బీచ్ కుటుంబసమేతంగా వెళ్లడానికి అనువైన ప్రదేశం. ఈ బీచ్‌లో అనేక రకాల స్థానిక స్నాక్స్, సీఫుడ్, పానీయాలను విక్రయిస్తూ ఆహారం పానీయాలు దుకాణాలు పుష్కలంగా ఉన్నాయి. పణంబూర్ బీచ్‌లోని సూర్యాస్తమయం ఎంతో అద్భుతంగా అగుపిస్తుంది. బడ్జెట్ హోటళ్లు అందుబాటులో ఉంటాయి.



పణంబూర్ బీచ్‌లో పతంగుల వేడుకలో పర్యాటకుల సందడి



ఎంతో మృదువైన ఇసుక ఈ బీచ్ ప్రత్యేకత



బీచ్‌లో అలలను ఆస్వాదిస్తున్న పర్యాటకులు



బీచ్‌లో సూర్యోదయ అందాలు

# రూ. 2.42 కోట్ల డ్రగ్స్ స్వాధీనం

- 34 మంది డ్రగ్స్ పెడ్లర్ల అరెస్ట్

బనశంకరి: సిలికాన్ సిటీలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న విదేశీ పర్యాటకులతో పాటు 34 మంది అంతర్జాతీయ డ్రగ్స్‌పెడ్లర్లను మంగళవారం సీసీబీ పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.2.42 కోట్ల విలువచేసే డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. సీసీబీ పోలీసులు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో గల విద్యా సంస్థలను దృష్టిలో పెట్టుకుని సేకరించిన సమాచారం ఆధారంగా దాడులు నిర్వహించారు. వివిధ పీఎస్‌ల పరిధుల్లో నమోదైన 24 కేసుల్లో 34 మంది పెడ్లర్లను అరెస్ట్ చేయగా వీరిలో కేరళకు చెందిన 15 మంది, కర్ణాటకకు చెందిన 10 మంది, బిహార్ 4, ఒడిసా ఇద్దరు, అసోం, హర్యానా రాష్ట్రాలకు చెందిన తలా ఒకరితో పాటు నైజీరియా దేశానికి చెందిన డ్రగ్స్‌పెడ్లర్లను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి 37 కిలోల గంజాయి, 167.56 కిలోల ఎండీఎంఏ క్రిస్టల్, 70 ఎల్ఎస్‌డీ స్ట్రిప్స్ 620 ఎక్స్‌టిసిపిల్స్, 495 గ్రాముల చరస్, 84 గ్రాముల హైడ్రోగంజాయి, కొకైన్ 72 గ్రాములు, కిలో 26 గ్రాముల హాశీశ్ ఆయిల్, 30 సెల్‌ఫోన్లు, 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వైట్‌ఫీల్డ్, వర్తూరు, కాటన్‌పేటే, మైకోలేఔట్, ఆర్టీ నగర, బొమ్మనహళ్లి, కెంగేరి, చామరాజపేటే, బయప్పనహళ్లి, రామమూర్తినగర, కొడిగేహళ్లి, కృష్ణరాజపురం, పరప్పన అగ్రహార, గిరినగర, హెబ్బాళ్, కొత్తనూరు, మారతహళ్లి, యలహంక, హుళిమావు, జీజీ.నగర పోలీస్‌స్టేషన్ల పరిధిలో పెడ్లర్లను అరెస్ట్ చేశారు. వీరిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## లో దుస్తుల్లో రూ.12 కోట్ల కొకైన్

- కేఐఏలో కెన్యా మహిళ అరెస్టు

దొడ్డబళ్లాపురం: లోదుస్తుల్లో దాచి అక్రమంగా తరలిస్తున్న రూ.12 కోట్ల విలువైన కొకైన్ సీఐఎస్ఎఫ్ అధికారులు పట్టుకున్న సంఘటన కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి కెన్యాకు చెందిన అచెంగ్ ఓ క్యారోలిన్ అగోలా అనే మహిళను అరెస్టు చేశారు. నిందితురాలు తన లోదుస్తుల్లో 1.02 కేజీల హైగ్రేడ్ కొకైన్ దాచి అక్రమంగా తీసుకువచ్చింది. ఈమె అడిస్ అబాబా నుండి ఇథియోపియన్ ఎయిర్‌లైన్స్ విమానంలో సోమవారం ఉదయం 11–09 గంటలకు వచ్చింది. నిందితురాలి ప్రవర్తనపై అనుమానం రావడంతో ఆమెను క్షుణ్ణంగా పరిశీలించగా కొకైన్ బయటపడింది.

## ముగ్గురు దోపిడీ దొంగలు అరెస్టు

దొడ్డబళ్లాపురం: కారులో వెళ్తున్న సైంటిస్టుపై దాడి, దోపిడీకి యత్నించిన ముగ్గురు నిందితులను మాదనాయకనహళ్లి పోలీసులు అరెస్టు చేసారు. మైలారి, నవీన్, శివరాజ్ పట్టుబడ్డ నిందితులు. ఇదే కేసులో నిందితులుగా భావిస్తున్న సోమ అలియాస్ సోను, కీర్తి అలియాస్ ఉమేశ్ అనే ఇద్దరు పరారీలో ఉన్నారు. గత నెల 24న బెంగళూరు ఉత్తర తాలూకా రావుతనహళ్లిలో న్యానో, సాఫ్ట్ మ్యాటర్ సైన్సెస్ సెంటర్‌కు చెందిన సైంటిస్టు అశుతోష్ కుమార్‌సింగ్ కారులో వెళ్తుండగా నిందితులు దోపిడీకి పాల్పడే ఉద్దేశంతో రాళ్లతో దాడి చేశారు. మాదనాయకనహళ్లి పోలీసులు నిందితులను అరెస్టు చేసారు.

## అంబులెన్స్‌లు వితరణ



భోగనందీశ్వర ఆలయం వద్ద అంబులెన్స్‌లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రదీప్

చిక్కబళ్లాపురం: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ అన్నారు. మంగళవారం ఆయన ఐదు అంబులెన్స్‌లను తన తల్లి పేరుతో అందజేశారు. ఆధునిక వ్యవస్థ ఉన్న ఈ అంబులెన్స్‌లు నియోజకవర్గ ప్రజల కోసం అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. సొంత నిధులతో వీటిని నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయన నంది గ్రామంలోని భోగనందీశ్వర ఆలయంలో అంబులెన్స్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో యలువహళ్లి రమేశ్, నంది అంజనప్ప, అశోక్ సుధా వెంకటేశ్ కుడువతి, నంది గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## అలరించిన ప్రతిభా కారంజి



చింతామణి: విద్యార్థులోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ప్రతిభా కారంజీ వేదికలు దోహదపడుతున్నాయని ప్రభుత్వ ఉద్యోగులు సంఘం తాలూకా అధ్యక్షుడు మునిరెడ్డి అన్నారు. తాలూకాలోని కైవార గ్రామంలో కేపీఎస్ పాఠశాలలో ప్రతిభా కారంజీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది.

## గ్యారెంటీ పథకాలకు 'ఎస్‌సీఎస్‌పీ టీఎస్‌పీ' నిధులు ?

- ప్రతిపక్ష బీజేపీ, దళిత నేతల అభ్యంతరాలు

శివాజీనగర: ఐదు గ్యారెంటీ పథకాల అమలు కోసం సిద్ధరామయ్య ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ ప్రయోజిత (ఎస్‌సీఎస్‌పీ టీఎస్‌పీ) నిధులు వినియోగిస్తోంది. దీంతో ప్రతిపక్ష బీజేపీ, దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికే ఎస్‌సీఎస్‌పీ టీఎస్‌పీ నిధుల నుంచి గ్యారెంటీ పథకాల కోసం నిధులు విడుదల చేసింది. ఇప్పటి వరకు విడుదల అయిన సొమ్ము ఎంత? ఎంత సొమ్ము పంపిణీ అయింది? చూడాలి.

కాంగ్రెస్ ప్రభుత్వం తన 100 రోజుల పాలనలో గ్యారెంటీల అమలు కోసం అధిక ప్రాధాన్యతనిచ్చింది. యువనిధి మినహాయించి మిగిలిన నాలుగు గ్యారెంటీ పథకాలను అమలు పరిచింది. 2023–24లో ఈ పథకాలకు రూ. 30–35 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. వచ్చే సంవత్సరం సుమారు రూ. 50 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా ఉంది.

కొన్ని శాఖలకు నిధులు తగ్గించి, నిధులు మళ్లిస్తారని సమాచారం. ఇందులో ముఖ్యంగా దళిత సామాజిక వర్గానికి రిజర్వు చేసిన ఎస్సీ, ఎస్టీ నిధులు ఈ పథకాలను వినియోగిస్తున్నారు. దీంతో ప్రతిపక్ష బీజేపీ, దళిత నాయకులతో పాటుగా కాంగ్రెస్‌లోని కొందరు ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీనిద్వారా నిధులు దుర్వినియోగం కానుందని ఆరోపించారు. అయితే సిద్దరామయ్య ప్రభుత్వం ఎస్‌సీఎస్ పీటీఎస్ కింద సుమారు రూ.11 వేల కోట్ల నిధులు పంపిణీ చేసింది.

## కొల్హాపురి మహాలక్ష్మీదేవికి విశేష పూజలు



రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవికి మంగళవారం విశేష పూజలు చేశారు. తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, తులసి పూజ, గంధాభిషేకం నిర్వహించారు. అనంతరం మూల విగ్రహానికి బంగారు, వెండి ఆభరణాలతో అలంకరించారు. ఈ సందర్భంగా చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా కర్ణాటక ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## బైక్ దొంగలు అరెస్ట్

యశవంతపుర: ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్‌లను అపహరించిన ఇద్దరిని వివేక్‌నగర పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు హ్యాండిల్ లాక్‌లను విరిచి బైక్‌లను అపహరిస్తున్నారని పోలీసులు తెలిపారు .

## బైక్ ప్రమాదంలో ఒకరి మృతి

క్రిష్ణగిరి: వేపనపల్లి దగ్గర ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో కార్మికునికి తీవ్ర గాయాలేర్పడి మరణించాడు. వివరాల మేరకు వేపనపల్లి సమీపంలోని యానైకాల్‌దొడ్డి గ్రామానికి చెందిన కూలి కార్మికుడు అన్నామలై (40), మిత్రుడు మణిగంటన్‌తో కలిసి గత రెండు రోజుల క్రితం ద్విచక్రవాహనంలో నాచికుప్పం వైపు వెళుతుండగా మరో బైకిస్టు ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన అన్నామలై ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.

## నామఫలకం తొలగించాలని ధర్నా



పైన టిప్పు చిత్రం, పర్షియన్ భాషలో ఉన్న ఫలకం



మాట్లాడుతున్న బీజేపీ నేతలు

మండ్య: కన్నంబాడి ఆణకట్టెలో పర్షియన్ భాషలో ఉన్న నామఫలకంతో ఉన్న శిలాఫలకాన్ని తొలగించాలని డిమాండ్ చేస్తూ మండ్య జిల్లా బీజేపీ కార్యకర్తలు మంగళవారం కలెక్టరేట్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం ఆ పార్టీ అధికార ప్రతినిధి సిటీ మంజునాథ్ ఆధ్వర్యంలో జిల్లా అధికారికి వినతిపత్రం అందజేశబూరు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కన్నంబాడి ఆణకట్టెలో ముఖద్వారంలో పర్షియన్ భాషలో ఉన్న ఫలకంపై టిప్పు సుల్తాన్ ఫొటో ఉందని, దాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

## చాముండేశ్వరిలో నా మట్టి నా దేశం



మట్టి సేకరిస్తున్న దృశ్యం

మైసూరు: నా మట్టి, నాదేశం నినాదంలో భాగంగా మైసూరు జిల్లా నుంచి పవిత్ర మట్టి సేకరణ కార్యక్రమాన్ని విశ్రాంత కమాండర్ సీఎం శ్రీధర్ ప్రారంభించారు. చాముండేశ్వరి నియోజకర్గంలో బీజేపీ కార్యకర్తలు మైసూరు నగరంలోని హినకల్ గ్రామంలో శనేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి మట్టి సేకరణ కార్యక్రమం ప్రారంభించారు.

## పౌర కార్మికుడు దుర్మరణం

యశవంతపుర: రోడ్డు ప్రమాదంలో పౌర కార్మికుడు మృతి చెందిన ఘటన పీణ్యా పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. టీ దాసరహళ్లి రవీంద్రనగరకు చెందిన గంగాధర (49) మృతి చెందారు. మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో విధులకు వెళ్లటానికి దాసరహళ్లి విభాగం చొక్కసంద్రచెరువు రోడ్డు వద్ద రోడ్డు దాడుతుండగా వేగంగా వచ్చిన క్యాంటర్ గంగాధర్‌ను ఢీకొనటంతో అతను అక్కడిక్కడే మృతి చెందారు.

**స్నాచర్ అరెస్ట్**

స్నాచింగ్ కేసులో నందిని లేఔట్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ. లక్షల విలువైన బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 7న నందినిలేఔట్ 4వ బ్లాక్‌లో వృద్ధురాలు నడిచి వెళ్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన దుండగులు చైన్ లాక్కొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

## తెలుగు పోరాట వీరుడు కన్నుమూత



కిష్ణమూర్తి (ఫైల్)

కెలమంగలం: తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ తెలుగు భాషాభివృద్ధి కోసం దివంగత కోదండరామయ్య శిష్యులుగా పలు పోరాటాల్లో పాల్గొన్న బి.ఎం.క్రిష్ణమూర్తి మంగళవారం కన్నుమూశారు. ఈయన కెలమంగలం, హెచ్. శెట్టిపల్లి తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ విరమణ పొందారు. ఆయన మృతికి తెలుగు సంఘాల నాయకులు, తెలుగు భాషాభిమానులు, ఉపాధ్యాయులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## హోసూరు వార్తలు..

# ధరల పెరుగుదలపై ధర్నా



ధర్నాలో సీపీఐ కార్యకర్తలు

కెలమంగలం: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరను పెంచి సాధారణ, మధ్య తరగతి ప్రజలపై ఎనలేని భారాన్ని మోపారని ఆరోపిస్తూ మంగళవారం సీపీఐ నేతలు డెంకణీకోట పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయం ముందు ఆందోళన చేశారు. క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా అధ్యక్షులు, తళి ఎమ్మెల్యే టి. రామచంద్రన్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం గత పదేళ్ల కాలంగా నిత్యావసర వస్తువులను, పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచారని ఆరోపించారు. దీనికి తోడు అన్ని వస్తువులపై 28 శాతం జీఎస్టీ విధించారని, నోట్ల మార్పిడి పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేశారని అన్నారు. మోదీ పదవికి రాజీనామా చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తమిళనాడు నేతపై దాడి చేసిన కేసులో అరెస్ట్





పట్టుబడిన నిందితులు

కృష్ణరాజపురం: వారం క్రితం నగరంలోని కేఆర్‌పురం బాణసవాడిలో ఉన్న ఓ హోటల్ వద్ద తమిళనాడుకు చెందిన రాజకీయ నాయకుడు గురుస్వామిపై హత్యాయత్నం చేసిన కేసులో బాణసవాడి పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. నిందితులను ప్రసన్న, కార్తీక్, వినోద్‌లుగా గుర్తించారు. వీరిని మదురైకి చెందిన గ్యాంగ్‌వార్ బృందానికి చెందిన వారుగా అనుమానిస్తున్నారు. ఇదిలా ఉంటే గురుస్వామి, రాజపాండియన్‌ల మధ్య గ్యాంగ్ వార్ నడుస్తోంది. వీరిపై 20కి పైగా హత్య కేసులు నమోదై ఉన్నట్లు సమాచారం.

## భారీగా గుట్కా స్వాధీనం

హోసూరు: కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి కోయంబత్తూరుకు తరలిస్తున్న గుట్కాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హోసూరు తాలూకా బాగలూరు బస్టాండు సమీపంలో సోమవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఆ మార్గంలో వచ్చిన వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రూ. 8 లక్షల విలువైన గుట్కా పట్టుబడింది.

## సోలార్ కంచె ఏర్పాటుకు ఓకే



అటవీ అధికారికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

హోసూరు: డెంకణీకోట తాలూకా మరగట్ట నుంచి బాలతోటనపల్లి వరకు అటవీ ప్రాంతంలో ఏనుగుల దాడులను నివారించేందుకు సోలార్ కంచె ఏర్పాటు చేయడంపై మంగళవారం వ్యవసాయ సంఘ నాయకుడు దాసప్ప, అటవీ శాఖాధికారులు సమావేశం జరిపారు. రైతులు మాట్లాడుతూ అంచెట్టి రోడ్డులోని మరగట్ట అటవీ ప్రాంతంలో మకాం వేసిన ఏనుగులు ఆహారం వెతుక్కొంటూ తావరకెరె, మలసోణ, గేరెట్టి, గరగూరు, కండగానపల్లి, దిన్నూరు, గొల్లపల్లి, బాలతోటనపల్లి ప్రాంతాల్లో పంటపొలాలను ధ్వంసం చేయడంతో పాటు అటవీ ప్రాంతాల్లో పశువుల మేతకెళ్లే రైతులపై దాడులు చేసి చంపుతున్నాయని వాపోయారు. సోలార్ కంచెను ఏర్పాటు చేసి పంటపొలాలపై ఏనుగుల దాడులను నివారించాలని సూచించారు. అటవీ శాఖాధికారి వాసు మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వానికి వివరించి కంచె ఏర్పాటుకు అనుమతి తీసుకొచ్చినట్లు తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు, చిత్రంలో ఎంపీ సెల్లకుమార్

హోసూరు: హోసూరు, డెంకణీకోట తాలూకాల్లోని గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ఎంపికైన రోగులకు మెరుగైన వైద్యం అందజేసేందుకు తమిళనాడు సరిహద్దు కర్ణాటక రాష్ట్రం అత్తిపల్లి సమీపంలో నిర్వహిస్తున్న ఆక్స్‌ఫర్డ్ ఆస్పత్రికి తీసుకెళ్తున్నారు. అందులో భాగంగా కేఆర్‌సీ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ, ఆక్స్‌ఫర్డ్ ఆస్పత్రి సంయుక్తంగా క్రిష్ణగిరి జిల్లాలోని హోసూరు, తళి, డెంకణీకోట, అంచెట్టి, సూళగిరి, బాగలూరు తదితర ప్రాంతాల్లోని గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తోంది. వైద్య శిబిరాన్ని క్రిష్ణగిరి ఎంపీ సెల్ల కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆక్స్‌ఫర్డ్ సేవలు హర్షదాయకమని, ఈ సేవలను క్రిష్ణగిరి జిల్లాలోని గిరిజన గ్రామాల్లో కూడా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి చైర్మన్ నరసింహరాజు, మెడికల్ ఆఫీసర్ మోహన్, డైరెక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ల జయంతి, రజిని, స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.





# చంద్రబాబుకు వత్తాసుగా తోడు దొంగ

## చంద్రబాబు అరెస్టు దురదృష్టమన్న డిజైన్ టెక్ ఎండీ ఖన్వేల్కర్

- సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఒప్పందం చేయడంలో ఈయనే కీలక వ్యక్తి
- షెల్ కంపెనీల ద్వారా నిధులు కొల్లగొట్టడంలో ఖన్వేల్కర్‌దే ప్రధాన పాత్ర
- సీఐడీతోపాటు నిగ్గు తేల్చిన ఈడీ
- డిజైన్ టెక్ ఆస్తులు రూ.31.20 కోట్లు అటాచ్ చేసిన ఈడీ
- అదే ఖన్వేల్కర్‌తో వీడియో ప్రకటన ఇప్పించిన టీడీపీ

**సాక్షి, అమరావతి :** ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) కుంభకోణాన్ని పక్కదారి పట్టించేందుకు టీడీపీ పడరాని పాట్లు పడుతోంది. రూ.371 కోట్లు కొల్లగొట్టడంలో చంద్రబాబుకు భాగస్వాములైన నిందితులతో పత్రికా ప్రకటనలు ఇప్పిస్తూ ప్రజలను మోసగించేందుకు యత్నిస్తోంది. తాజాగా డిజైన్‌టెక్ కంపెనీ ఎండీ వికాస్ వినాయక్ ఖన్వేల్కర్‌ను టీడీపీ తెరపైకి తీసుకురావడమే ఇందుకు నిదర్శనం. 'అసలు ఏపీఎస్ఎస్‌డీసీ ప్రాజెక్టులో అవినీతే జరగలేదని, తాము రూ.370 కోట్ల మేర సాఫ్ట్‌వేర్ సరఫరా చేశామని, చంద్రబాబును అరెస్టు చేయడం దురదృష్టకరం ' అని ఆయనతో ఓ వీడియో ప్రకటన విడుదల చేయించింది. కానీ, అసలు వాస్తవం ఏమిటంటే ఇదే స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ కంపెనీ ముసుగులో రూ.3,300 కోట్ల ప్రాజెక్టు ఒప్పందం కుదుర్చుకోవడంలో డిజైన్‌టెక్ కంపెనీ ఎండీ వికాస్ వినాయక్ ఖన్వేల్కర్‌నే చంద్రబాబు సాధనంగా చేసుకున్నారు. ఈ కుంభకోణంలో వికాస్ వినాయక్ ఖన్వేల్కర్ పాత్రను సీఐడీ, కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా నిగ్గు తేల్చాయి. ఒప్పందంలో పేర్కొన్నట్టుగా సీమెన్స్, డిజైన్‌టెక్ కంపెనీలు 90శాతం వాటా వెచ్చించకపోయినా, ప్రభుత్వ వాటా 10 శాతం నిధులను జీఎస్టీతో సహా రూ.371 కోట్లను డిజైన్‌టెక్ కంపెనీకే విడుదల చేశారు. ఆ నిధులను డిజైన్‌టెక్ కంపెనీ వివిధ షెల్ కంపెనీల ద్వారా తిరిగి చంద్రబాబుకు చేర్చింది. ఆ విషయాన్ని ఆధారాలతో సహా నిర్ధారించాకే సీఐడీ వికాస్ వినాయక్ ఖన్వేల్కర్‌ను ఈ కేసులో నిందితుడిగా చేర్చి అరెస్టు చేసింది.


PRESS RELEASE
28/4/2023

Directorate of Enforcement (ED) has provisionally attached properties amounting to Rs. 31.20 Crore belonging to M/s Designtech Systems Private Limited (DTSPL) in a money laundering investigation.


ED initiated investigation under the Prevention of Money laundering Act (PMLA), 2002 on the basis of FIR registered by AP CID against M/s Designtech Systems Private Limited and others for cheating the Andhra Pradesh Government by diverting and siphoning off funds in the case of Andhra Pradesh State Skill Development Corporation (APSSDC) Siemens Project which was meant to promote skill development & entrepreneurship in Andhra Pradesh.

Investigation conducted by ED revealed that M/s DTSPL, its director and others diverted the Government funds with the help of shell entities through multi-layered transactions and siphoned off the funds on the strength of bogus invoices under the pretext of supply of materials/services.

Part of the diverted funds was received back by DTSPL its bank accounts. Proceeds of crime in the possession of DTSPL have been traced in the form of fixed deposits. These fixed deposits totaling to Rs 31.20 Crore have been provisionally attached during investigation.

Previously, in the instant case, ED had arrested MD of DTSPL, Vikas Khanvelkar, Suman Bose, Mukul Chandra Agarwal and Suresh Goyal on 04.03.2023. The arrested accused persons are presently in Judicial Custody.

ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి డిజైన్ టెక్ సిస్టమ్స్‌కు చెందిన రూ.31.20 కోట్లను జప్తు చేసినట్లు ఈడీ జారీ చేసిన ప్రకటన


ED
@dir_ed

ED has arrested Soumyadri Shekhar Bose alias Suman Bose, Ex MD of M/s Siemens Industry Software India Pvt Ltd (SISW), Vikas Vinayak Khanvelkar (MD of M/s Designtech Systems Pvt Ltd, Mukul Chandra Agrawal, Ex Financial advisor,

5:41 PM · 14/03/23 from Earth · 97.4K Views

204 Reposts 23 Quotes

1,081 Likes 19 Bookmarks

ED @dir_ed · 14/03/23
and authorised signatory of M/s Skillar Enterprises India Pvt Ltd and Suresh Goyal, CA in a money laundering case for diversion and misutilisation of funds. The Hon'ble Special PMLA Court, Visakhapatnam has granted 7 days ED custody till

డిజైన్ టెక్ కంపెనీ ఎండీ వికాస్ వినాయక్ ఖన్వేల్కర్‌తో పాటు నలుగురిని అరెస్టు చేసినట్లు ఈడీ ట్వీట్ ద్వారా జారీ చేసిన ప్రకటన

### కొరఢా ఝుళిపించిన ఈడీ

ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో వికాస్ వినాయక్ ఖన్వేల్కర్ ప్రధాన పాత్ర పోషించారని ఈడీ కూడా తేల్చింది. డిజైన్‌టెక్ కంపెనీతో పాటు ఇతర షెల్ కంపెనీల కార్యాలయాల్లో సోదాలు చేసి కీలక ఆధారాలు సేకరించింది. దాంతో మనీ లాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి వికాస్ ఖన్వేల్కర్‌తోపాటు సీమెన్స్ ఇండియా హెడ్‌గా వ్యవహరించిన సుమన్ బోస్, షెల్ కంపెనీలు, నకిలీ ఇన్వాయిస్‌ల సృష్టికర్తలు, చార్టెడ్ అకౌంటెంట్లు ముకుల్‌చంద్ర అగర్వాల్, సురేశ్ గోయల్‌లను ఈడీ అరెస్టు చేసింది. అంతేకాదు డిజైన్‌టెక్ కంపెనీకి చెందిన రూ.31.20 కోట్లను ఈడీ అటాచ్ చేసింది కూడా. ఏపీఎస్ఎస్‌డీసీ కుంభకోణంలో అంతటి కీలక పాత్ర పోషించిన వికాస్ ఖన్వేల్కర్‌తో అసలు ఆ కుంభకోణమే జరగలేదని టీడీపీ చెప్పించడం విస్మయపరుస్తోంది. ఎందుకంటే ఈ కేసు నిరూపణ అయితే చంద్రబాబు, వికాస్ ఖన్వేల్కర్‌తో పాటు ఇతర నిందితులకు కూడా న్యాయస్థానం కనీసం పదేళ్ల జైలు శిక్ష విధించే అవకాశాలున్నాయి. అందుకే ఈ కేసును పక్కదారి పట్టించేందుకే ఆయనతో ఇలాంటి అవాస్తవ ప్రకటనలు ఇప్పిస్తోందన్నది సుస్పష్టం.

### పేదల కడుపుకొట్టి దోచుకున్న చంద్రబాబు

మంత్రి దాడిశెట్టి రాజా



**తుని రూరల్:** చంద్రబాబు రాష్ట్రంలో పేదల కడుపుకొట్టి అన్ని విధాల దోచుకున్నాడని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా చెప్పారు. ఆయన మంగళవారం కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంటలో విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడానికి ఉద్దేశించిన స్కిల్ డెవలప్‌మెంట్, పేదలు కోసం నిర్మించిన టిడ్కో ఇళ్లు, వైద్యం అందించే ఈఎస్‌ఐ స్కీముల్లో చంద్రబాబు స్కాములకు పాల్పడ్డారని చెప్పారు. రాజధాని భూముల్లో రూ.లక్షల కోట్లు దోచుకున్నాడని పేర్కొన్నారు. ఈఎస్‌ఐ స్కామ్‌లో యనమల రామకృష్ణుడు కూడా ఊచలు లెక్కిస్తాడన్నారు.

### చంద్రబాబు అరెస్టు సక్రమమే: మంత్రి విశ్వరూప్



**అమలాపురం రూరల్:** చంద్రబాబు అరెస్టు సక్రమమేనని, కోర్టు అన్ని సాక్ష్యాలను పరిశీలించి రిమాండ్ విధించిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చెప్పారు. ఆయన మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా భట్నవిల్లిలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అరెస్టుపై ఎవరికీ ఆందోళన లేదని, తప్పు చేసిన వ్యక్తిని శిక్షించక తప్పదన్న ఆలోచనలో రాష్ట్ర ప్రజలు ఉన్నారని చెప్పారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.వి.రమేష్ ఇప్పుడు మాట తప్పారన్నారు. చంద్రబాబు పాలనలో స్కీముల పేరుతో అన్నీ స్కాములేనని చెప్పారు. చంద్రబాబు అవినీతి కేసుల్లో స్టేలు తెచ్చుకుంటూ ఇంతకాలం బతికారని, ఇక శిక్ష అనుభవించక తప్పదని చెప్పారు.

### అవినీతి వల్లే బాబు అరెస్ట్

ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి



**పట్నంబజారు:** అవినీతి జరిగింది కాబట్టే సీఐడీ, సిట్ వంటి దర్యాప్తు సంస్థలు చంద్రబాబును అరెస్టుచేశాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి చెప్పారు. గుంటూరులో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్‌లో జరిగిన తప్పుల అంశంలో ఎవరి బాధ్యత ఎంత ఉందో అంతమేరకు సీఐడీ ముందుకు వెళుతుందని చెప్పారు. సీఐడీ రిమాండ్ రిపోర్టును పరిశీలిస్తే చంద్రబాబు చేసిన తప్పు స్పష్టంగా అర్థమవుతుందని తెలిపారు. టీడీపీ మనుగడ కోసమే బాలకృష్ణ తాపత్రయ పడుతున్నారన్నారు. పవన్‌కళ్యాణ్ మానసిక స్థితి ఎలా ఉందో ఆయన ప్రవర్తన చూస్తేనే అర్థమవుతోందన్నారు.

### ప్రజాధనాన్ని నొక్కేసి జైల్లో ఉండనంటే ఎలా?

ఎంపీ మార్గాని భరత్‌రామ్



**రాజమహేంద్రవరం రూరల్:** స్కామ్‌లలో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు జైల్లో ఉండను.. ఇంటికి పోతాను.. అంటే ఎలా కుదురుతుందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రశ్నించారు. చంద్రబాబు స్కీమ్‌లు, స్కామ్‌లు ఒకటీ రెండూ కాదని చెప్పారు. వేలకోట్ల రూపాయల ప్రజాధనాన్ని అడ్డదార్లలో లూటీ చేశారన్నారు. తీరా పోలీసులకు దొరికిపోయాక తానొక్కడినే కాదు.. ఇంకా చాలామందిని అరెస్టు చేయమంటే అర్థం ఏమిటని ప్రశ్నించారు. ఆయన మంగళవారం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చట్టం ముందు ఎంతటివారైనా ఒకటేనని, ఎవరూ అతీతులు కాదని చెప్పారు.

### ఆంధ్రా మాదిగలకు మంద కృష్ణ అన్యాయం

బ్రహ్మయ్య మాదిగ



**గాంధీనగర్ (విజయవాడసెంట్రల్):** స్కిల్ స్కాంలో చంద్రబాబు అరెస్ట్ అప్రజాస్వామికమంటూ మంద కృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తీవ్రంగా ఖండించారు. ఆంధ్రప్రదేశ్‌లో మాదిగల అస్థిత్వాన్ని అధఃపాతాళానికి తొక్కిన చంద్రబాబుకు మద్దతివ్వడం ప్రజాస్వామ్యమా.. అంటూ నిలదీశారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో బ్రహ్మయ్య మాదిగ మాట్లాడుతూ తెలంగాణలోని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ మాదిగల జీవితాలతో ఆడుకోవాలని కృష్ణ మాదిగ ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. చంద్రబాబు అరెస్ట్ సందర్భంగా టీడీపీ బంద్‌కు పిలుపునిస్తే మంద కృష్ణ మద్దతు ప్రకటించడాన్ని తప్పుబట్టారు.

# చంద్రబాబుతో కుటుంబసభ్యుల ములాఖత్

- రాజమహేంద్రవరం జైల్లో కలిసిన భార్య భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, కోడలు బ్రాహ్మణి
- చంద్రబాబు కట్టించిన బిల్డింగ్‌లోనే ఆయన్ని కట్టిపడేశారన్న భువనేశ్వరి
- నంబర్ వన్ సౌకర్యాలు లేవని ఆవేదన
- భద్రతపై ఆందోళన
- ప్రజల కోసం ఆలోచించే బాబు కోసం పోరాడాలని ప్రజలకు పిలుపు



జైలు వద్ద భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి

**సాక్షి, రాజమహేంద్రవరం:** స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అరెస్టయి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న చంద్రబాబుతో కుటుంబసభ్యులు మంగళవారం సాయంత్రం ములాఖత్ అయ్యారు. బాబును కలిసేందుకు జైలు అధికారులు ముగ్గురికి అనుమతి ఇచ్చారు. దీంతో చంద్రబాబు భార్య భువనేశ్వరి, కోడలు బ్రాహ్మణి తొలుత రాజమహేంద్రవరం విద్యానగర్‌లో లోకేశ్ ఏర్పాటు చేసుకున్న క్యాంప్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి లోకేశ్‌తో కలిసి సాయంత్రం 4 గంటలకు సెంట్రల్ జైల్‌కు సొంత వాహనంలో చేరుకున్నారు. భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి 30నిమిషాలు బాబుతో మాట్లాడారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, బెయిల్, కుటుంబ సభ్యుల యోగక్షేమాలపై మాట్లాడుకున్నట్లు తెలిసింది.

**చంద్రబాబు ఆరోగ్యం బాగానే ఉంది : భువనేశ్వరి**

చంద్రబాబు ఆరోగ్యం బాగానే ఉందని, ధైర్యంగా ఉన్నారని ఆయన భార్య నారా భువనేశ్వరి చెప్పారు. చంద్రబాబుతో ములాఖత్ అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు కట్టించిన బ్లాక్‌లోనే ఆయన్ని కట్టిపడేశారని అన్నారు. ఆయనకు నంబర్ వన్ సౌకర్యాలు కల్పించాల్సి ఉన్నా, ఆ పరిస్థితి అక్కడ లేదన్నారు. బాబు భద్రతపై ఆందోళన కలిగిస్తోందన్నారు. చన్నీళ్లతో స్నానం చేయాల్సి వస్తోందని చెప్పారు. ఆయన్ని విడిచి బయటకు వస్తుంటే తనలో ఏదో భాగం వదిలేసిన భావన కలుగుతోందని అన్నారు. ప్రజలు, రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా ఉండాలని చంద్రబాబు నిరంతరం పనిచేశారన్నారు. అలాంటి వ్యక్తిని జైల్లో చూసి బాధేసిందని, అక్కడ కూడా ప్రజల గురించే ఆలోచిస్తున్నారని అన్నారు. ప్రజల స్వేచ్ఛ, హక్కుల కోసం ఆలోచించే బాబు కోసం పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ పెట్టిన పార్టీ అని, తమ కుటుంబం ఎల్లప్పుడూ ప్రజలు, కేడర్ కోసం నిలడుతుందని అన్నారు. మీడియా సమావేశంలో భువనేశ్వరితో పాటు లోకేశ్, బ్రాహ్మణి కూడా పాల్గొన్నారు.

**చంద్రబాబుతో హైకోర్టు న్యాయవాది భేటీ**

చంద్రబాబును హైకోర్టు న్యాయవాది లక్ష్మీనారాయణ మంగళవారం మధ్యాహ్నం సెంట్రల్ జైలులో కలిశారు. ఇద్దరూ కేసుకు సంబంధించిన విషయాలు చర్చించినట్లు సమాచారం. చంద్రబాబు తరఫున బెయిల్ పిటిషన్ వేయడం, సీఐడీ కస్టడీ కోరిన నేపథ్యంలో న్యాయపరంగా ఏ విధంగా వ్యవహరించాలన్న విషయమై వారు చర్చించినట్లు తెలిసింది.

### స్నేహ బ్లాక్‌కు అదనపు సీసీ కెమెరాల నిఘా

బాబుకు రాజమండ్రి కేంద్ర కారాగారంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఆయన ఉన్న స్నేహ బ్యారక్ వద్ద ప్రస్తుతం ఉన్న వాటితోపాటు అదనపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిఘా పెంచారు. 1 + 4 భద్రత ఇస్తున్నారు. ఇతర ఖైదీలు ఎవరూ అటు వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. జైలు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. చీమ చిటుక్కుమన్నా క్షణాల్లో అధికారులు అక్కడ వాలిపోయేలా ఏర్పాట్లు చేశారు. స్నేహ బ్యారక్ ఎదురుగానే 24 గంటలూ వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈమేరకు వైద్య సిబ్బందికి విధులు కేటాయించారు. జైలు లోపలే కాదు.. ఎలాంటి ఆందోళనలు, హింసాత్మక ఘటనలు జరగకుండా జైలు బయట కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు.

**రెండో రోజు జైలులో ఇలా..**

చంద్రబాబు జైలు జీవితం మంగళవారం రెండో రోజుకు చేరింది. తొలి రోజులాగే రెండో రోజు సైతం వీఐపీ ఖైదీకి అందించే సదుపాయాలన్నీ అందించారు. చంద్రబాబు తొలి రోజు యోగా మాత్రమే చేశారు. మంగళవారం ఉదయం 4 గంటలకే నిద్ర లేచి యోగాతోపాటు వాకింగ్ కూడా చేసినట్లు సమాచారం. అనంతరం మూడు ప్రధాన పత్రికలు తెప్పించుకుని క్షుణ్ణంగా చదివారు. ఆ తర్వాత అల్పాహారం, టీ తాగారు. మధ్యాహ్నం, సాయంత్రం పుల్కా, కర్డ్ రైస్ తీసుకున్నట్లు తెలిసింది.

# చంద్రబాబుకు జైలే భద్రం

- రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో పూర్తిస్థాయి భద్రత
- ఆయనకే ప్రత్యేకంగా పూర్తి బ్లాక్ కేటాయింపు
- సాయుధ సిబ్బందితో భద్రత
- సీసీ కెమెరాల్లో పర్యవేక్షణ
- ప్రత్యేక వైద్య బృందం
- న్యాయస్థానానికి నివేదించిన జైళ్ల శాఖ

**సాక్షి, అమరావతి:** స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో అరెస్టై రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబుకు పూర్తిస్థాయిలో భద్రత కల్పించామని రాష్ట్ర జైళ్ల శాఖ పేర్కొంది. ఆయనకు భద్రతకు ఎలాంటి ముప్పు లేదని స్పష్టం చేసింది. సెంట్రల్ జైల్లో తనకు భద్రత, ఆరోగ్యపరమైన ప్రమాదం ఉన్నందున హౌస్ రిమాండ్‌కు అనుమతించాలని కోరుతూ చంద్రబాబు న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో చంద్రబాబుకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో కల్పించిన భద్రత, వైద్య ఏర్పాట్లను వివరిస్తూ రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ హరీశ్‌కుమార్ గుప్తా లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాచారాన్ని అదనపు అడ్వొకేట్ జనరల్ విజయవాడ ఏసీబీ న్యాయస్థానానికి సమర్పించారు. ఆ వివరాల ప్రకారం రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో చంద్రబాబుకు కల్పించిన భద్రత, వైద్యపరమైన ఏర్పాట్లు ఇలా ఉన్నాయి.



- రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో చంద్రబాబుకు ప్రత్యేకంగా ఒక బ్లాక్‌లో వార్డ్ (గది) కేటాయించారు. ఆ బ్లాక్ ప్రధాన జైలుకు విడిగా ప్రత్యేకంగా ఉంటుంది.
- ఆ బ్లాక్‌ను, చంద్రబాబు ఉండే గదిని పూర్తిగా శానిటైజ్ చేసి శుభ్రపరిచారు.
- చంద్రబాబు ఉండే గది బయట సాయుధులైన సిబ్బందితో భద్రత కల్పించారు. 24 గంటలు భద్రతా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ ప్రాంతానికి అనుమతి లేకుండా ఎవరినీ అనుమతించడం లేదు.
- చంద్రబాబు సమ్మతిస్తేనే ఆయన్ని కలిసేందుకు ఎవరినైనా అనుమతిస్తున్నారు.
- సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌తోపాటు సీనియర్ అధికారులు భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.
- ఆ గది బయట, చుట్టూ సీసీటీవీలు ఏర్పాటు చేసి 24 గంటలు భద్రతను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.
- ఆ ప్రత్యేక గదికి సమీపంలోనే వైద్యబృందం 24 గంటలు అందుబాటులో ఉంది.
- న్యాయస్థానం ఆదేశాలమేరకు చంద్రబాబుకు పూర్తి భద్రత కల్పించి, తగిన వైద్యసేవలను అందుబాటులో ఉంచారు.

# దొంగతనం చేసి పట్టుబడినా బుకాయింపేనా?

పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి



**సాక్షి, అమరావతి:** స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్ పేరుతో ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లు దోచేసిన కేసులో ఏసీబీ కోర్టు టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబుకు రిమాండ్ విధించి జైలుకు పంపినా.. తన తండ్రి అవినీతి చేయలేదంటూ లోకేశ్ సిగ్గులేకుండా బుకాయిస్తున్నారని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మండిపడ్డారు. 'నువ్వు చెబుతున్నట్లుగా నీ తండ్రి నిప్పయితే.. అవినీతికి పాల్పడకపోతే.. మీ అక్రమ ఆస్తులపై సీబీఐ దర్యాప్తు జరిపించాలని కోరుతూ కోర్టులో వేసిన కేసులో స్టే ఎందుకు తెచ్చుకున్నారు' అని లోకేశ్‌ను ప్రశ్నించారు. దమ్ముంటే కోర్టులో తెచ్చుకున్న స్టేను తొలగించుకుని, మీ ఆస్తులపై సీబీఐ దర్యాప్తు జరిపించుకుని నిజాయితీ నిరూపించుకోవాలి అని సవాల్ విసిరారు. ఆయన మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ప్రధాన నిందితుడైన చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీడీపీ సోమవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తే చివరకు హెరిటేజ్ షాపులను కూడా తెరిచే ఉంచారని ఎద్దేవా చేశారు. అవినీతి చక్రవర్తి అయిన చంద్రబాబును కోర్టు జైలుకు పంపడంతో ఇన్నాళ్లకు న్యాయం, ధర్మం గెలిచాయని ప్రజలు సంతోషిస్తున్నారని చెప్పారు. మంత్రి కారుమూరి ఇంకా ఏమన్నారంటే..

- టీడీపీ అధికారంలో ఉన్నప్పుడల్లా చంద్రబాబు ప్రభుత్వ ఖజానాను దోచేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్, ఫైబర్‌గ్రిడ్ స్కామ్, అమరావతి భూకుంభకోణం, అసైన్డ్ భూకుంభకోణం, ఇన్నర్ రింగ్‌రోడ్డు స్కామ్ వంటి అక్రమాలతో ప్రభుత్వ ఖజానాను దోచుకున్నారు.
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక చంద్రబాబు దోపిడీకి అడ్డుకట్ట పడింది. ఇప్పుడు చట్టం తన పని తాను చేసుకుపోతోంది. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌తోపాటు మిగతా అన్ని కేసుల్లోను చంద్రబాబే దోషి.
- లోకేశ్‌కు పార్టీని నడిపే సత్తాలేదు కాబట్టే.. యనమల రామకృష్ణుడు, బాలకృష్ణ పార్టీని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారు.
- లోకేశ్ తనకు అన్నయ్య (పవన్‌కళ్యాణ్) మద్దతు ఉన్నాడని చెబుతున్నాడు. దీన్నిబట్టి చూస్తే పవన్‌కళ్యాణ్.. చంద్రబాబుకు దత్తపుత్రుడేనన్నది తేలిపోతోంది. టీడీపీ, పవన్‌కళ్యాణ్ అంతా కట్టుకట్టుకుని వచ్చినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం.

# నేను ముందుంటా.. తెలుగువాడి పౌరుషం చూపిద్దాం

- ఎమ్మెల్యే బాలకృష్ణ


సెల్ఫీలు దిగుతున్న బాలకృష్ణ

**సాక్షి, అమరావతి/పెనమలూరు/పాత గుంటూరు:** స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కేసు నుంచి చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటపడతారని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు. రాష్ట్రం కోసం ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని, ఇందులో తాను ముందుంటానని, తెలుగువాడి పౌరుషం ఏంటో చూపిద్దామని ఆయన చెప్పారు. మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి కేసులు ఎన్నో చూశామని, ఎవరికీ భయపడే ప్రసక్తే లేదన్నారు.అవినీతి జరిగితే ఆధారాలు చూపించాలని, చార్జిషీట్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. సీఎం కేవలం పాలసీ మేకర్ మాత్రమేనని, అధికారులే అమలు చేస్తారని చెప్పారు. జగన్ ఒక్కరికైనా ఉద్యోగం ఇచ్చారా.. అని ప్రశ్నించారు.

**ప్రజల్లో సానుభూతి వచ్చేలా చూడాలి**

చంద్రబాబు అరెస్టుపై ప్రజల్లో సానుభూతి వచ్చే విధంగా టీడీపీ శ్రేణులు చూడాలని బాలకృష్ణ సూచించారు. కృష్ణా జిల్లా పోరంకితోపాటు గుంటూరులో మంగళవారం నిర్వహించిన టీడీపీ నేతల సమావేశాల్లో బాలకృష్ణ మాట్లాడుతూ ఎన్టీఆర్‌కు నాదెండ్ల భాస్కరరావు వెన్నుపోటు పొడిచినప్పుడు ప్రజల్లో వచ్చిన ఉద్యమం మళ్లీ ఇప్పుడు వచ్చేలా కృషి చేయాలని కోరారు. కాగా, టీడీపీ నాయకులు చంద్రబాబు అరెస్టుపై సానుభూతిని పక్కన పెట్టి బాలకృష్ణతో సెల్ఫీ దిగటానికి ఆరాటపడ్డారు.

# సెల్ఫ్ సర్టిఫికెట్ సైకో బాలకృష్ణ

- మంత్రి ఆర్.కె.రోజా



**తిరుపతి కల్చరల్/తిరుమల:** బాలకృష్ణ మానసిక రోగి, సెల్ఫ్ సర్టిఫికెట్ సైకో అని రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజా విమర్శించారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ హిందూపురం ప్రజల కష్టాలపై ఎన్నిసార్లు పోరాటం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుపై కక్ష సాధింపు కాదని, స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఆయన అడ్డంగా దొరికిపోయారని చెప్పారు. ఆమె మంగళవారం తిరుపతిలోను, తిరుమలలోను మీడియాతో మాట్లాడారు. తప్పు చేసిన చంద్రబాబుకి శిక్షపడాలని రాష్ట్ర ప్రజలంతా భగవంతుడిని ప్రార్థించారని, అందుకే టీడీపీ బంద్‌లో పాల్గొనలేదని చెప్పారు. ఫైబర్‌గ్రిడ్, రాజధాని భూములు.. ఇంకా అనేక స్కామ్‌లలో చంద్రబాబు హస్తం ఉందని, ఇవన్నీ త్వరలోనే బయటకు వస్తాయని, ఆయన శిక్ష అనుభవించక తప్పదని పేర్కొన్నారు. చంద్రబాబు అరెస్ట్‌కు సంబంధించి ఎమ్మెల్యే బాలకృష్ణ, చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ప్రభుత్వంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిపై నిందారోపణలు చేయడం, రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యానించడం సరికాదని చెప్పారు. బాబు వస్తే జాబు వస్తుందని చెప్పి యువతను మోసం చేసిన చంద్రబాబు అధికారాన్ని అడ్డుపెట్టుకుని అడ్డుగోలుగా దోచుకున్నారని తెలిపారు. తన స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు ఎందరినో జైళ్లకు పంపడమేకాక అనేకమందిని హత్య చేయించారని ఆరోపించారు. నందమూరి కుటుంబాన్ని చంద్రబాబు వాడుకున్నట్లు ఎవ్వరూ వాడుకోలేదన్నారు. చంద్రబాబు నీతిమంతుడని, సీబీఐ, ఈడీ విచారణకు సిద్ధమని ఆయన భార్య భువనేశ్వరి ప్రకటించాలని మంత్రి రోజా డిమాండ్ చేశారు.

# బాబుకు చట్టాలు చుట్టాలు కావు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున



**సాక్షి, అమరావతి:** చంద్రబాబు జీవితమంతా అవినీతిమయమని, ఇప్పుడు దొరికిపోయి జైలుకెళ్లారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున విమర్శించారు. ఇంతకాలం వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటూ, తప్పించుకు తిరుగుతున్న ఆయన ఇప్పుడు చట్టానికి చిక్కారని.. న్యాయం గెలిచిందని వ్యాఖ్యానించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం మంత్రి మీడియాతో మాట్లాడారు. చట్టాలు చంద్రబాబుకు చుట్టాలు కావని నిరూపితమైందన్నారు. రాబోయే రోజుల్లో ఆయన ఇంకా అనేక అవినీతి కేసుల్లో విచారణను ఎదుర్కోవాల్సి ఉందని చెప్పారు. చంద్రబాబు జైలుకెళ్తే.. ఆయన గానీ, ఆయన అనుచరులు లేదా ఆయన కొడుకు లోకేశ్ ఏమాత్రం సిగ్గుపడటం లేదన్నారు. టీడీపీ బంద్ అట్టర్‌ఫ్లాప్ అయిందన్నారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్ర ప్రజలకు పూర్తి విశ్వాసం కల్పిస్తున్నారు. భావితరాల భవిష్యత్ కోసం నిరంతర శ్రామికుడిలా పనిచేస్తున్నారు.

**విచారణ కోరే పరిస్థితిలో బాబు లేరు..**

'చంద్రబాబు, ఆయన లాయర్లు, ఎల్లో మీడియా, అచ్చెన్నాయుడుతో సహా అంతా స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు తప్పుచేయలేదని ఎవరూ అనటంలేదు. కేసులో టెక్నికల్ ప్రాబ్లమ్ ఉంది.. గవర్నర్‌కు చెప్పలేదు.. 24 గంటల్లోపు కోర్టులో హాజరుపరచలేదు అని మాత్రమే అంటున్నారు. చంద్రబాబు నిప్పే అయితే.. తన మీద సీబీఐ, ఈడీ ఎంక్వైరీ వేసుకోండని చెప్పే ధైర్యం ఆయనకు లేదు. స్కిల్ స్కామ్‌లో అడ్డంగా దొరికినా ఆయనను ఆకాశానికి ఎత్తుతూ ఎల్లో మీడియాలో పుంఖానుపుంఖాలుగా రాతలు రాస్తున్నారు. అవినీతిని కూడా మంచిగా చూపిస్తున్నారు. ఇక చంద్రబాబు అవినీతి ఊబిలో కూరుకుపోయి జైలుకుపోతే పురందేశ్వరి మాత్రం మరిదిని వెనకేసుకొస్తున్నారు. చంద్రబాబు అరెస్టు కాగానే.. పవన్‌కళ్యాణ్ ఎందుకొచ్చాడో ఎందుకు రోడ్డు మీద పడుకున్నాడో ఆయనకే తెలీదు' అని మంత్రి ఎద్దేవా చేశారు.

# సీఐడీ కేసు కొట్టేయండి

హైకోర్టులో చంద్రబాబు పిటిషన్.. నేడు విచారణ

**సాక్షి, అమరావతి:** మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు హైకోర్టును ఆశ్రయించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి సంబంధించి సీఐడీ తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ ఆయన మంగళవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సీఐడీ నమోదు చేసిన కేసు ఆధారంగా తనకు రిమాండ్ విధిస్తూ ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను సైతం కొట్టేయాలని కోర్టును అభ్యర్థించారు. ఈ వ్యాజ్యం తేలేంత వరకు స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంపై ఏసీబీ కోర్టులో జరుగుతున్న విచారణను నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కూడా కోరారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి బుధవారం విచారణ జరపనున్నారు. మంగళవారం హైకోర్టు విచారణ మొదలు కాగానే చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్ న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి ముందు ఈ వ్యాజ్యం గురించి ప్రస్తావించారు. అవినీతి నిరోధక చట్టం (పీసీ యాక్ట్)లోని సెక్షన్ 17 ఏ ప్రకారం పబ్లిక్ సర్వెంట్‌పై కేసు నమోదు చేయాలన్నా, విచారణ జరపాలన్నా గవర్నర్ నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరని, అలాంటి అనుమతి లేకుండానే కేసు నమోదు చేసి సీఐడీ అధికారులు చంద్రబాబును అరెస్ట్ చేశారని ఆయన కోర్టుకు నివేదించారు. సీఐడీ చట్ట విరుద్ధంగా వ్యవహరించిందన్నారు. అందువల్ల ఈ వ్యవహారంపై అత్యవసరంగా విచారణ జరపాలని, లంచ్‌మోషన్ రూపంలో అత్యవసర పిటిషన్ దాఖలుకు అనుమతినివ్వాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ, ఈ వ్యాజ్యంపై బుధవారం విచారణ జరుపుతానని స్పష్టం చేశారు.

### ఏసీబీ కోర్టు న్యాయమూర్తికి భద్రత పెంపు

**సాక్షి, అమరావతి:** ఏసీబీ కోర్టు న్యాయమూర్తి బి.హిమబిందుకు ప్రభుత్వం భద్రత పెంచింది. స్కిల్ కుంభకోణంపై నమోదైన కేసులో టీడీపీ అధినేత చంద్రబాబుకు రిమాండ్ విధించగా... హౌస్ రిమాండ్ పిటిషన్‌ను తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో న్యాయమూర్తి హిమబిందుకు 4+1 భద్రత కల్పించారు. ఈ మేరకు విజయవాడ సిటీ పోలీసు విభాగం నుంచి భద్రతా సిబ్బంది విధుల్లో చేరారు.

### నేటి నుంచి టీడీపీ రిలే నిరాహార దీక్షలు

**సాక్షి, అమరావతి:** టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఈ నెల 13వ తేదీ నుంచి నియోజకవర్గ కేంద్రాల్లో రిలే నిరాహారదీక్షలు నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ శిబిరాల వద్ద ప్రజల నుంచి అభిప్రాయ సేకరణతోపాటు కార్యకర్తల్లో ధైర్యం నింపే సందేశంతో ఉన్న కరపత్రాలను విస్తృతంగా పంపిణీ చేయాలని సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు.






వాలెంటీనా మిశ్రా

# ఫ్యాషన్ నా పాషన్



**'మనలోని రకరకాల భయాలే అపజయాలకు కారణాలు అంటారు' వాలెంటీనా మిశ్రా. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం వాసి అయిన వాలెంటీనా జాతీయ, అంతర్జాతీయ బ్యూటీ కాంటెస్ట్‌లో పాల్గొనే కిడ్స్, మిస్, మిస్టర్ అండ్ మిసెస్ కి పద్దెనిమిదేళ్లుగా గ్రూమింగ్ సెషన్స్ నిర్వహిస్తున్నారు. మనలోని ఆత్మవిశ్వాసమే కోరుకున్న శిఖరాలను అధిరోహించేలా చేస్తుంది అని చెబుతున్న వాలెంటీనా శాస్త్రీయ నృత్యకారిణి కూడా. ఇద్దరు పిల్లలకు తల్లి. మిస్ అండ్ మిస్టర్ గ్రాండ్ సీ వరల్డ్ బల్గేరియా పోటీలకు వైస్ ప్రెసిడెంట్‌గా, 15 అంతర్జాతీయ పోటీలకు నేషనల్ డైరెక్టర్‌గా, 12 దేశాలలో జరిగిన పోటీలకు 50 కి పైగా పోటీదారులను తీర్చిదిద్దిన వాలెంటీనా మిశ్రా ఫ్యాషన్ నా పాషన్ అంటూ ఆ రంగంలోకి తన పయనాన్ని ఈ విధంగా వివరించారు.**

''పద్దెనిమిదేళ్ల ఈ ప్రయాణంలో ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని కలిశాను. ముఖ్యంగా మహిళలను. ఒక మహిళ మాత్రమే మరో మహిళను శక్తిమంతంగా మార్చగలదు అనేది నేను బలంగా నమ్ముతాను. సుస్మితా సేన్, ఐశ్వర్యారాయ్ బ్యూటీ కాంటెస్ట్‌లో పాల్గొని గెలుపొందిన రోజుల్లో ప్రతి ఒక్క అమ్మాయి తనూ మిస్ ఇండియా, మిస్ యూనివర్స్ కావాలనుకుంది. అలాగే నేనూ అనుకున్నాను. లైట్స్, కెమెరా ఫ్లాష్‌లు, స్టేజ్, చప్పట్ల మోతలు.. ఇవన్నీ అమ్మాయిలకు ఒక అద్భుతంగా ఉంటుంది. నన్ను నేను అలాంటి స్టేజ్‌పైన చూసుకోవాలనుకున్నాను. అదృష్టవశాత్తు చిన్నప్పుడు శాస్త్రీయ నృత్యం నేర్చుకున్నాను. గ్రూప్ సాంగ్ పోటీల్లోనూ చురుగ్గా ఉండేదాన్ని. స్టేజ్ ఫియర్ అస్సలు ఉండేది కాదు. ఇండస్ట్రియల్ రిలేషన్స్ పర్సనల్ మేనేజ్‌మెంట్‌లో డిగ్రీ చేశాను. కానీ, నాకు నచ్చిన రంగం ఫ్యాషన్ అండ్ బ్యూటీ ఇండస్ట్రీ.

**పోటీలు నిర్వహించాను..**

ఫ్యాషన్ ఇండస్ట్రీలో ఉండటం వల్ల గ్రూమింగ్ అవకాశాలు వచ్చాయి. గ్రూమింగ్ అంటే ఒక క్యాట్‌వాక్ ఒక్కటే కాదు, మాట్లాడటం, బాడీ లాంగ్వేజ్, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, వ్యక్తిత్వం, ఐక్యూ లెవల్స్.. అన్నీ కలిసి ఉంటాయి. సాధారణంగా మోడల్స్ 18 నుంచి 25 వరకు ఇండస్ట్రీలో ఉంటారు. ఆ తర్వాత కొత్తవారు వస్తుంటారు. పెళ్లికి ముందు వరకు మెరుస్తారు. ఆ తర్వాత మాయమవుతారు. నా ఎక్స్‌పీరియన్స్‌లో ఇవన్నీ చూశాను. చాలా మందిని కలవడం వల్ల కూడా గ్రూమింగ్ సెషన్స్‌వైపు దారితీసేలా చేసింది. ఫ్యాషన్ ఇండస్ట్రీలో కొనసాగుతూనే గ్రూమింగ్ సెషన్స్ ఇవ్వడం మొదలుపెట్టాను. కేరళలో జరిగే మిస్ సౌత్ ఇండియా, మిస్ క్వీన్ ఆఫ్ ఇండియా ఈ రెండు పోటీలకు గ్రూమర్‌గా నా కెరియర్ స్టార్ట్ చేశాను. అక్కడ నుంచి దేశ, అంతర్జాతీయ పోటీలకు గ్రూమర్‌గా వర్క్ చేస్తున్నాను. నా అనుభవాన్నంతా కలిపి 'డీలా వాలెంటీనా' అని నా సొంత కంపెనీ స్టార్ట్ చేశాను.

**పిల్లలతో కాంటెస్ట్..**

ఈ రోజుల్లో పిల్లలకు ఎక్స్‌పోజర్ చాలా ఎక్కువైపోయింది. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకువస్తుంటారు. చాలా కంప్లైంట్స్ చెబుతుంటారు. కానీ, పిల్లలకు గ్రూమింగ్ చేస్తున్నప్పుడు వారితో నాకు చాలా అద్భుతంగా అనిపించింది. ఇంటర్నేషనల్ పేజెంట్స్‌తోనూ కలిసి వర్క్ చేశాను. ఇండియన్ కిడ్స్, గర్ల్, బాయ్స్‌ని టీమ్స్‌గా ఎంపిక చేసి, 25 దేశాల్లో వారి ప్రతిభను పరిచయం చేశాను. దేశవ్యాప్తంగా వచ్చిన ఎంట్రీల నుంచి కొంతమందిని ఎంపిక చేసుకొని, ముందు ఇంటర్వ్యూ చేసి, షార్ట్ లిస్ట్ చేసుకుంటాం. ఎవరైనా కాన్ఫిడెంట్ కాస్త లో ఉంది అనిపించినా వారిని ప్రిపేర్ చేస్తుంటాను. ప్రతి ఒక్కరిలో కొన్ని నెగిటివ్ పాయింట్స్ ఉంటాయి. వాటిలో సన్నగా లేదా లావుగా ఉన్నాను అనో, రంగు తక్కువ ఉన్నాననో.. ఇలాంటి భయాలను గుర్తించి, వారి ఆలోచనలను పాజిటివ్‌గా మారుస్తుంటాను.

**పెళ్లి తర్వాత...**

నేను ఎప్పుడూ నేర్చుకుంటూ ఉంటాను. నన్ను నేనే కాదు ఎదుటివారిని ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉంటాను. గతం వదిలేయాలి, భవిష్యత్తులో కాకుండా ప్రస్తుతంలో జీవించాలి.. అనుకుంటాను. నాకు 21 ఏళ్ల వయసులో పెళ్లి అయ్యింది. పెళ్లి తర్వాత ఫ్యాషన్ ఇండస్ట్రీ గురించి ఆలోచన అవసరమా.. అనే క్వశ్చన్ మార్క్ వస్తుంది. కానీ, మా అమ్మనాన్నలు, మా వారు నన్ను ప్రోత్సహించారు. మా వారు రవికుమార్ నేవీ ఆఫీసర్. ఇద్దరు పిల్లలు. అబ్బాయి నేషనల్ డిఫెన్స్ అకాడమీలో ఉన్నాడు, మా అమ్మాయి 12వ తరగతి చదువుతంది. తను కూడా కిడ్స్ గ్రూప్‌లో పదేళ్ల వయసు టీమ్‌లో సౌత్ ఆఫ్రికాలో జరిగిన బ్యూటీ కాంటెస్ట్‌లో పాల్గొంది. ఒక వ్యక్తిత్వం సంతరించుకున్నాక ఏమీ చేయలేం అంటారు. కానీ, ఏ దశలోనైనా మానసిక స్థితిని మెరుగుపరుచుకోవచ్చు. ఏ కష్టం లేకుండా రాత్రికి రాత్రి విజయాలు రావు. ఈ పద్దెనిమిదేళ్ల టైమ్‌లో నా ఎక్స్‌పీరియన్స్, హార్డ్ వర్క్‌తోనే సక్సెస్ అయ్యాను.

**నాకోసం కొంత సమయం..**

పిల్లలు, పెద్దలు, ఆడ-మగ ఎవ్వరైనా.. ఫిజిక్‌ను కాపాడుకోవాలంటే అది ఫ్యాషన్ ఇండస్ట్రీయే కానక్కర్లేదు. గ్రూమర్‌గా రాణించనక్కర్లేదు. సెల్ఫ్ కాన్ఫిడెన్స్ లెవల్స్ పెంచుకుంటూ హార్డ్ వర్క్ చేస్తేనే విజయం సొంతం అవుతుంది. ఇంటి పని చేసే గృహిణి అయినా, ఉద్యోగి అయినా తమ కోసం తాము ఓ అరగంట కేటాయించుకోవాలి. ప్రతి ఒక్కరూ తమ కోసం ఏదైనా ఆరుబయట ఆడే ఆటలు, వాక్, యోగా, జుంబా, జిమ్... ఏదైనా చేయండి. ఒక అరగంట చాలు. అలాగే పోషకాహారం తీసుకోవడంలో శ్రద్ధ పెట్టాలి. కూరగాయలు, పండ్లు... ఏవైనా రొటీన్‌గా కాకుండా మార్చుకుంటూ తీసుకోవాలి. మన పొట్ట ఒక బెలూన్. ఎంత తింటే అంత పెరుగుతుంటుంది. బరువు పెరిగాక బాడీని వెనక ఫిట్‌నెస్‌కి తీసుకురావలని కష్టపడేకన్నా ముందే సరైన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది'' అని వివరించారు ఈ బ్యూటీ అండ్ గ్రూమర్.

– నిర్మలారెడ్డి

యూత్ పల్స్

# థర్డ్ ఐ

## ది పవర్ ఆఫ్ క్రియేటివిటీ



**అద్భుత దృశ్యాలను వర్ణించడానికి... 'రెండు కళ్లు సరిపోవు' అంటాం. అద్భుత దృశ్యాలను సృష్టించడానికి రెండు కళ్లతోపాటు మూడోకన్ను కూడా అవసరం. దాని పేరే... క్రియేటివ్ ఐ బూమింగ్ మార్కెట్ యానిమేషన్, వీఎఫ్ఎక్స్‌లో ఇన్వెస్ట్‌మెంట్ పెరగడం ఒక కోణం అయితే, ఉపాధి అవకాశాలు పెరగడం, యువతరం క్రియేటివిటీకి విశాలమైన వేదిక దొరకడం అనేది మరో కోణం...**

ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన ఇరవై ఏడు సంవత్సరాల అభినవ్ భరద్వాజ్ ఫ్యాషన్ బ్లాగర్, డిజిటల్ కంటెంట్ క్రియేటర్. వీఎఫ్ఎక్స్, యానిమేషన్‌లో డిగ్రీ పూర్తి చేసిన అభినవ్‌కు ఎన్నో పురాణ పాత్రలపై అవగాహన ఉంది. ఇరవై సంవత్సరాల వయసులో ఆర్ట్, డిజైనింగ్‌ను కెరీర్‌గా చేసుకున్న అభినవ్ లాక్‌డౌన్ సమయంలో ట్రెండింగ్ టాపిక్స్‌పై లెక్కలేనన్ని డిజైన్‌లను తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో సృష్టించాడు. వాటికి మంచి స్పందన రావడం ఒక ఎత్తయితే పాపులర్ బ్రాండ్‌ల నుంచి అవకాశాలు రావడం మరో ఎత్తు.

'మనకు ఉన్న రెండు కళ్లతోపాటు క్రియేటివ్ ఐ అనే మూడో కన్ను కూడా ఉండాలి. అది ఉన్నప్పుడే బ్రాండ్ డిజైనింగ్ నుంచి సినిమా వీఎఫ్ఎక్స్ వరకు రాణించగలం' అంటాడు అభినవ్.



కలర్స్ నుంచి డ్రెస్సింగ్ సెన్స్ వరకు అతడి యూనిక్ స్టైల్ స్టేట్‌మెంట్‌కు యువతలో ఎంతోమంది అభిమానులు ఉన్నారు. ఆ అభిమానుల్లో బెంగళూరుకు చెందిన శ్రీతేజస్వి ఒకరు. డిగ్రీ రెండోసంవత్సరం చదువుతున్న తేజస్వి వీఎఫ్ఎక్స్‌కు ప్రాధాన్యత ఉన్న చిత్రాలను విడుదలైన మొదటి రోజే చూస్తుంది. ఆ సాంకేతికత గురించి తన అభిప్రాయాలను ఫేస్‌బుక్‌లో రాస్తుంది.

వినోద రంగంలో యానిమేషన్, వీఎఫ్ఎక్స్ టెక్నాలజీకి ఇది బంగారు కాలం. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్ స్టూడియోల సంఖ్య పెరుగుతోంది. ముంబై, చెన్నై, బెంగళూరు... మొదలైన నగరాలు యానిమేషన్ కంపెనీలు, అకాడమీలకు కేంద్రాలుగా మారాయి. మన దేశానికి పెద్ద ఎంటర్‌టైన్‌మెంట్ మార్కెట్ ఉంది. ఒక అధ్యయనం ప్రకారం ఈ రంగంలో 2025 కల్లా 75,000 నుంచి 1,25,000 ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయి.

కమర్షియల్స్, వెబ్ సిరీస్, మూవీస్, ఓటీటీకి హై-క్వాలిటీ మెటీరియల్ కావాలి.

ఈ నేపథ్యంలో యానిమేషన్, వీఎఫ్ఎక్స్‌లకు ప్రాధాన్యత పెరిగింది. యానిమేషన్, వీఎఫ్ఎక్స్ బిజినెస్ కాంబినేషన్ యువతను ఆకర్షిస్తుంది. కొత్త ఆలోచనలకు అవకాశం కల్పిస్తుంది. ఎంటర్‌టైన్‌మెంట్ ఇండస్ట్రీ యానిమేషన్‌కు డిమాండ్‌ను పెంచే కథలను సిద్ధం చేస్తోంది.

'వీఎఫ్ఎక్స్, యానిమేషన్‌లకు గత కొన్ని సంవత్సరాలుగా డిమాండ్ పెరిగింది. అంచనాలకు అందని విధంగా ఈ రంగం చాలా అడ్వాన్స్‌డ్‌గా ఉంది. వీఎఫ్ఎక్స్ అనేది సాంకేతికత మాత్రమే కాదు. అంతకంటే ఎక్కువ. కథాసంవిధానంలో భాగం' అంటున్నాడు వీఎఫ్ఎక్స్ నిపుణుడు రాజీవ్ కుమార్.

స్కూల్ రోజుల నుంచే వీఎఫ్ఎక్స్ అంటే రాజీవ్‌కు ఆసక్తి. అయితే దాన్ని కెరీర్‌గా ఎలా చేసుకోవాలనే దానిపై స్పష్టత ఉండేది కాదు. పుణెలో మాస్ కమ్యూనికేషన్ పూర్తి చేసిన రాజీవ్ ముంబైకి వెళ్లి వీఎఫ్ఎక్స్ ఇండస్ట్రీతో ప్రయాణం మొదలుపెట్టి భారీ విజయం సాధించాడు.

మలయాళ చిత్రం కందిట్టుండు (అది చూడు) బెస్ట్ యానిమేషన్ షార్ట్ ఫిల్మ్‌గా జాతీయ అవార్డ్ గెలుచుకుంది. 25 సంవత్సరాల అదితి క్రిష్ణదాస్ ఈ చిత్రానికి దర్శకురాలు.



**అ కథలు మళ్లీ ఇప్పుడు**

మనకు తరతరాల కథల సంపద ఉంది. అమ్మమ్మలు, నానమ్మల నోటి నుంచి కథలు వినే దృశ్యాలు అరుదై పోయాయి. ఈ నేపథ్యంలో యానిమేషన్‌కు ప్రాధాన్యత పెరిగింది. మరుగున పడిన ఎన్నో కథలను పిల్లలకు ఆకట్టుకునేలా చెప్పవచ్చు. యానిమేషన్ ఫిల్మ్స్ అంటే ఫన్నీ కార్టూన్స్‌ను మాత్రమే కాదు.

– అదితి క్రిష్ణదాస్, డైరెక్టర్

అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్స్ (ఎన్ఐడీ) లో యానిమేషన్ కోర్సు చేసిన అదితి క్రిష్ణదాస్ తొలి చిత్రంతోనే జాతీయ అవార్డ్ అందుకుంది.

విజువల్ ఎఫెక్ట్స్ ప్రొడ్యూసర్‌గా మంచి పేరు తెచ్చుకుంది చెన్నైకి చెందిన ప్రియాంక సుబ్రమణియన్. లండన్ ఫిల్మ్ స్కూల్‌లో చదువుకునే రోజుల్లో ఒక ఫ్రెండ్ ద్వారా మూవింగ్ పిక్చర్ కంపెనీకి తరచు వెళ్లేది. ఇండస్ట్రీ ధోరణులను అర్థం చేసుకోవడం కోసం ఎందరో కళాకారులతో మాట్లాడేది. పుస్తకాలు చదివేది. స్టూడియోలలో అవసరమైన వారికి టీ, కాఫీలు, వోల్డ్ టేప్‌లు, హార్డ్ డిస్కులు అందించేది. వ్యాపారవేత్తల కుటుంబానికి చెందిన ప్రియాంక సొంతంగా ఏదైనా వ్యాపారం చేయాలని కలలు కనేది. వీఎఫ్ఎక్స్ స్టూడియో రూపంలో తన కలను సాకారం చేసుకుంది.

**మీ శక్తి వృథా చేయవద్దు**

వీఎఫ్ఎక్స్ ప్రొడ్యూసర్‌గా ప్రయాణం మొదలుపెట్టిన కొత్తలో ఎన్నో నిద్రలేని రాత్రులు గడపాల్సి వచ్చింది. అప్పుడు పడిన కష్టానికి ఇప్పుడు ఫలితం దక్కింది. యవ్వనంలో ఉన్నప్పుడు ఎంత కష్టమైనా చేసే శక్తి ఉంటుంది. ఆ శక్తి నిరుపయోగం కాకుండా చూసుకోవాలి.

– ప్రియాంక సుబ్రమణియన్
విజువల్ ఎఫెక్ట్స్ ప్రొడ్యూసర్

బ్యూటిప్స్

# పటికతో రోజంతా తాజాదనం

**శరీరం నుంచి రోజంతా దుర్వాసన లేకుండా ఉండాలంటే...**



- స్నానం చేసే నీటిలో పటికముక్కలను వేసి రెండు గంటలపాటు నానబెట్టాలి. పటిక మొత్తం కరిగిన తరువాత ఆ నీటితో స్నానం చేయాలి. స్నానం తరువాత శరీరాన్ని తడిలేకుండా శుభ్రంగా తుడుచుకోవాలి. ఇలా స్నానం చేస్తే రోజంతా దుర్వాసన లేకుండా తాజాగా ఉంటారు. వీలైతే రాత్రంతా పటికను నానబెట్టుకుని ఉదయాన్నే ఆ నీటితో స్నానం చేస్తే మరీ మంచిది.
- అరటిపండు, బ్రకోలి, సిట్రస్ జాతి పండ్లను ఆహారంలో అధికంగా చేర్చుకుంటే... చర్మం జిడ్డుతనం తగ్గి ఆరోగ్యంగా తయారవుతుంది.



# పడుకునే ముందు ముఖం కడుగుతున్నారా?



- రాత్రి పడుకునే ముందు ముఖాన్ని కడుక్కుంటే మీ ముఖం మరింత కాంతిమంతంగా తయారవుతుందని నిపుణులు చెబుతున్నారు. అవేంటో చూసేయండి.
- సాధారణ నీటితో ముఖాన్ని శుభ్రంగా కడిగి, కాటన్ వస్త్రంతో తడిలేకుండా తుడిచి ఆ తరువాత పడుకోవాలి.
- రోజూ పడుకునేముందు ఇలా చేయడం వల్ల ముఖం మీద పేరుకుపోయిన మురికి, మట్టి వదిలి చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.
- చర్మం మీద ఉండే సూక్ష్మ రంధ్రాలు చక్కగా శ్వాసిస్తాయి. దీనివల్ల ముడతలు తగ్గి చర్మం కాంతిమంతంగా, యవ్వనంగా కనిపిస్తుంది.
- మొటిమల ముప్పు తగ్గుతుంది.
- పడుకునే ముందు ముఖాన్ని కడగడం వల్ల చర్మానికి తేమ అంది పొడిబారకుండా ఉంటుంది. పొడిచర్మం ఉన్న వారు రోజూ పడుకునేముందు ముఖం కడుక్కోవడం అలవాటు చేసుకుంటే మంచిది.



**చ**ర్మం మీద ముడతలు, కాలిన గాయాలు, మొటిమలు, బ్లాక్‌హెడ్స్, వైట్ హెడ్స్,గీతలు, మచ్చలు తగ్గాలంటే పచ్చి బంగాళాదుంపను తురిమి ముఖం మీద ప్యాక్‌వేయాలి లేదా మర్దన చేయాలి. ప్రతిరోజూ క్రమం తప్పకుండా నెల రోజులుచేస్తే మంచి ఫలితం ఉంటుంది.



# క్యాన్సర్ రోగులకు సౌకర్యాల వేర్



సుకన్య
సంధ్యారావు

సాధారణంగా రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉన్న వారెవరైనా... 'ఇన్నాళ్లూ పనిచేసి అలసిపోయాం, ఇక విశ్రాంతి తీసుకుందాం' అనుకుంటారు. అయితే సుకన్య, సంధ్యారావులు మాత్రం ఇలా అనుకోలేదు. రిటైర్మెంట్ తరువాత కొత్త వ్యాపారం చేయాలనుకున్నారు. అరవై ఏళ్లకు దగ్గరలో ఉన్నా వారిలోని హుషారు, ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. అక్క సుకన్య ఎమ్మెస్సీ చేసింది. దానికితోడు టీచింగ్, ఫార్మా, ఆడిటింగ్, ఆర్ట్స్ విభాగాల్లో పనిచేసిన అనుభవం ఉంది. టెక్స్‌టైల్ టెక్నాలజీ ఇంజినీర్ జాతీయ అంతర్జాతీయ బ్రాండ్స్‌లో పనిచేసిన అనుభవం వాటికి తోడైంది. అయితే అనుకోకుండా ఎదురైన ఒక సంఘటన వల్ల వారు క్యాన్సర్ రోగులకు ముఖ్యంగా స్త్రీలకు అవసరం అయిన ప్రత్యేక తరహా దుస్తులను రూపొందిస్తూ తమ వైవిధ్యాన్ని కూడా చాటుకుంటున్నారు.

**అత్తయ్య అవస్థలు చూసి...**

దుస్తుల పరిశ్రమలో ఇరవై ఏళ్లపాటు పనిచేసిన సంధ్య తనకు తనే బాస్ కావాలి అనుకునేది. ఈ క్రమంలోనే ఏదైనా దుస్తుల తయారీ కంపెనీ పెడితే బాగుంటుందని అనుకున్నారు అక్కాచెల్లెళ్లు. వీరు ఇలా ఆలోచిస్తున్న సమయంలో... వీరిద్దరికీ ఎంతో ఇష్టమైన వీరి మేనత్తకు రొమ్ము క్యాన్సర్ ఉన్నట్లు తెలిసింది. సుకన్య, సంధ్యలకు మంచి స్నేహితురాలిలా ఉండే మేనత్త క్యాన్సర్‌తో బాధపడడం వారిని కలచి వేసింది.

ఒకపక్క క్యాన్సర్ బాధిస్తుంటే మరోపక్క ఆమె ధరించే దుస్తులు ఆమెకు సౌకర్యంగా లేకపోవడాన్ని ఇద్దరూ గమనించారు. క్యాన్సర్‌తో బాధపడే ఎంతోమంది రోగులు కూడా ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. క్యాన్సర్ రోగులు ధరించడానికి వీలుగా ఉండే దుస్తులు రూపొందిస్తే వందలాది మంది క్యాన్సర్ రోగులకు సాయం చేసినట్లే అనుకుని 'వీకీ వేర్' పేరిట క్యాన్సర్ రోగులకు దుస్తులు తయారు చేయడం ప్రారంభించారు.

**సలహాలు... సూచనలతో...**

ఆంకాలజిస్టులు, క్యాన్సర్ రోగుల సలహాలు, సూచనలు తీసుకుని 2017లో తలకు పెట్టుకునే టోపీని రూపొందించారు. కాటన్‌తో తయారు చేసిన ఈ టోపీని కీమోథెరపీ చేయించుకునేటప్పుడు ధరించడానికి అనుకూలంగా తయారు చేశారు. తరువాత మాస్టెక్టమీ బ్రాలను రూపొందించారు. చర్మానికి సౌకర్యంగా ఉండే బ్రాలను మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇలా క్యాన్సర్ రోగులకు అవసరమైన వాటిని స్వయం సహాయక గ్రూపులతో తయారు చేయిస్తూ సాటి మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. వీరి వీకీ వేర్ ఉత్పత్తులు ఇతర దేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయి.

**రోగులకు ఇలా...**

వీకీ వేర్ ఉత్పత్తులు తయారయ్యాక క్యాన్సర్ రోగులకు టెస్టింగ్ కోసం పంపించి, వారికి అన్నివిధాల సౌకర్యంగా ఉన్నాయన్న నిర్ధారణ అయిన తరువాత మార్కెట్లో విక్రయిస్తున్నారు. క్యాన్సర్ కేర్ ఆసుపత్రుల్లోని డాక్టర్లను కలిసి వీకీ వేర్ గురించి చెప్పడం, క్యాన్సర్‌తో ధైర్యంగా పోరాడుతున్న రోగులకు వాటిని ఇవ్వడం ద్వారా వీకీ వేర్ రోగులకు చేరుతున్నాయి. వీకీ వేర్ వెబ్‌సైట్, సోషల్ మీడియా, ఈ కామర్స్ సైట్ల ద్వారా ఉత్పత్తులు విక్రయిస్తున్నారు సుకన్య, సంధ్యారావులు.

''మీ కలలను ఎప్పటికీ వదులుకోవద్దు. మిమ్మల్ని మీరు నమ్ముకోండి. మీరు కంటోన్న కల మీద నమ్మకం ఉంచండి. అది తీరడానికి సుదీర్ఘ కాలం పట్టవచ్చు. అయినా వెనక్కి తగ్గవద్దు. కలను నిజం చేసుకునే క్రమంలో ఎవరినైనా సాయం అడగడానికి సిగ్గుపడవద్దు. ఇలా నిజాయితీగా ముందుకు సాగితే వ్యాపారం ఏదైనా రాణించగలుగుతారు'' అని సుకన్య, సంధ్యలు యువతరానికి ధైర్యాన్ని నూరిపోస్తున్నారు.

కిచెన్‌టిప్స్



- ఇడ్లీ, దోశ పిండి త్వరగా పాడు కాకుండా ఉండాలంటే... ఇడ్లీ, దోశ పిండికోసం నానబెట్టే పప్పు, బియ్యం, రవ్వలను కడిగేటప్పుడు కొద్దిగా ఉప్పువేసి కడగాలి. ఇలా కడిగి రుబ్బిన పిండి నాలుగైదు రోజులపాటు పులవకుండా ఉంటుంది.
- కిచెన్ షెల్ఫులు,తలుపులు రోజూ శుభ్రం చేస్తున్నా కూడా జిడ్డు పడుతుంటాయి. నెలకొకసారి లీటరు వేడి నీటిలో ఒక టేబుల్ స్పూన్ అమోనియా, రెండు టేబుల్ స్పూన్ల వెనిగర్ కలిపి స్ప్రే బాటిల్‌లో పోసుకుని జిడ్డుగా ఉన్న ప్రదేశాలలో స్ప్రే చేసి తడి పీల్చుకునే పొడి వస్త్రంతో తుడవాలి.

# స్పోర్ట్స్



## భారత బాస్కెట్‌బాల్ జట్టులో ఆర్యన్

ఆసియా కప్ అండర్-16 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టులో తెలంగాణకు చెందిన ఆర్యన్ శర్మకు చోటు లభించింది. ఈ టోర్నీ ఈనెల 17 నుంచి 24 వరకు ఖతర్ రాజధాని దోహాలో జరుగుతుంది. హైదరాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి అయిన ఆర్యన్ శర్మ భారత కోచ్ పీఎస్ సంతోష్ ఆధ్వర్యంలో కీస్టోన్ బాస్కెట్‌బాల్ అకాడమీలో శిక్షణ తీసుకుంటాడు. ఈ టోర్నీలో రాణిస్తే భారత జట్టు వచ్చే ఏడాది జూలైలో తుర్కియేలో జరిగే ప్రపంచకప్ అండర్-17 టోర్నమెంట్‌కు అర్హత సాధిస్తుంది.



## అంకిత రైనా పరాజయం

జపాన్ ఓపెన్ డబ్ల్యూటీఏ-250 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ అంకిత రైనా పోరాటం తొలి రౌండ్‌లోనే ముగిసింది. ఒసాకాలో మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ మొదటి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 181వ ర్యాంకర్ అంకిత 4-6, 2-6తో ప్రపంచ 174వ ర్యాంకర్ మొయుక ఉచిజిమా (జపాన్) చేతిలో ఓడిపోయింది. 80 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో అంకిత తన సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయింది. తొలి రౌండ్‌లో ఓడిన అంకితకు 2,804 డాలర్ల (రూ. 2 లక్షల 32 వేలు) ప్రైజ్‌మనీ లభించింది.

# లంకను గెలిచి...

- ఆసియా కప్ ఫైనల్లో భారత్
- శ్రీలంకపై 41 పరుగులతో విజయం
- రాణించిన రోహిత్, కుల్దీప్
- వెలలాగె ఆల్‌రౌండ్ ప్రదర్శన వృథా

ఆసియా కప్‌లో వరుసగా మూడో రోజూ భారత్‌దే... సోమవారం పాక్‌పై విజయానందాన్ని కొనసాగిస్తూ మంగళవారం కూడా మరో విజయాన్ని టీమిండియా తమ ఖాతాలో వేసుకొని ఫైనల్లోకి అడుగు పెట్టింది. బౌలింగ్‌కు బాగా అనుకూలించిన పిచ్‌పై శ్రీలంక స్పిన్నర్ల ధాటికి తడబడి 213 పరుగులకే పరిమితమైనా... మన బౌలింగ్ బలగంతో ఆ స్వల్ప స్కోరును కూడా కాపాడుకోగలిగింది. కొంత వరకు పోరాడగలిగినా చివరకు లంకకు ఓటమి తప్పలేదు.



కుల్దీప్ యాదవ్

**కొలంబో:** సూపర్-4 దశలో వరుసగా రెండో విజయంతో భారత జట్టు ఆసియా కప్ టోర్నీలో ఫైనల్‌కు అర్హత సాధించింది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 41 పరుగుల తేడాతో శ్రీలంకను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 49.1 ఓవర్లలో 213 పరుగులకే ఆలౌటైంది. రోహిత్ శర్మ (48 బంతుల్లో 53; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా... కేఎల్ రాహుల్ (44 బంతుల్లో 39; 2 ఫోర్లు), ఇషాన్ కిషన్ (61 బంతుల్లో 33; 1 ఫోర్, 1 సిక్స్) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దునిత్ వెలలాగె (5/40) కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శన నమోదు చేయగా, అసలంకకు 4 వికెట్లు దక్కాయి. వరుసగా 14వ వన్డేలోనూ శ్రీలంక జట్టు ప్రత్యర్థిని ఆలౌట్ చేయగా... భారత జట్టు మొత్తం 10 వికెట్లను స్పిన్నర్లకే చేజార్చుకోవడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. అనంతరం లంక 41.3 ఓవర్లలో 172 పరుగులకు ఆలౌటైంది. దునిత్ వెలలాగె (46 బంతుల్లో 42 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), ధనంజయ డిసిల్వా (66 బంతుల్లో 41; 5 ఫోర్లు) రాణించారు. నాలుగు పాయింట్లతో ఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకున్న భారత్ తమ చివరి సూపర్-4 మ్యాచ్‌లో శుక్రవారం బంగ్లాదేశ్‌తో తలపడుతుంది. రెండు పాయింట్లతో ప్రస్తుతం శ్రీలంక, పాకిస్తాన్ సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాయి. ఈ రెండు జట్ల మధ్య గురువారం జరిగే మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఆదివారం జరిగే ఫైనల్లో భారత్‌తో తలపడుతుంది. ఒకవేళ శ్రీలంక, పాకిస్తాన్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయితే మెరుగైన రన్‌రేట్ ఉన్న శ్రీలంక (-0.200) పాకిస్తాన్ (-1.892)ను వెనక్కి నెట్టి ఫైనల్ చేరుతుంది.

**ఆదుకున్న రాహుల్, కిషన్...**

గత మ్యాచ్ తరహాలోనే ఓపెనర్ రోహిత్ జట్టుకు శుభారంభం అందించాడు. శుబ్‌మన్ గిల్ (25 బంతుల్లో 19; 2 ఫోర్లు) కాస్త నెమ్మదిగా ఆడినా రోహిత్ దూకుడుతో భారత్ దూసుకుపోయింది. షనక ఓవర్లో రోహిత్ 4 ఫోర్లతో చెలరేగాడు. తొలి వికెట్‌కు 67 బంతుల్లోనే 80 పరుగులు జతచేరాయి. అయితే వెలలాగె జట్టును దెబ్బ తీశాడు. తన తొలి మూడు ఓవర్లలో అతను వరుసగా గిల్, కోహ్లి (12 బంతుల్లో 3), రోహిత్‌లను అవుట్ చేయడంతో 11 పరుగుల వ్యవధిలో జట్టు 3 వికెట్లు కోల్పోయింది. ఈ దశలో కిషన్, రాహుల్ కలిసి పరిస్థితికి తగినట్లుగా జాగ్రత్తగా ఆడుతూ జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 63 పరుగులు జత చేశాక రాహుల్ వికెట్ కూడా వెలలాగె ఖాతాలో చేరింది. కిషన్‌ను అసలంక వెనక్కి పంపగా, తర్వాతి 16 పరుగుల వ్యవధిలో భారత్ మరో 4 వికెట్లు చేజార్చుకుంది. చివర్లో అక్షర్ పటేల్ (36 బంతుల్లో 26; 1 సిక్స్) కీలక పరుగులు జోడించి స్కోరును 200 దాటించాడు. గత మ్యాచ్ ఆడిన శార్దుల్ స్థానంలో అక్షర్‌ను భారత్ తుది జట్టులోకి తీసుకుంది.

**పోరాడినా...**

శ్రీలంకలాగే మనమూ స్పిన్నర్లతో దెబ్బ కొట్టేందుకు సిద్ధమైనా... దానికి ముందే పేసర్లు వారి పని పట్టారు. బుమ్రా, సిరాజ్ ధాటికి 25 పరుగులకే తొలి 3 వికెట్లు కోల్పోయిన లంక ఆ తర్వాత తక్కువ వ్యవధిలో మరో 3 వికెట్లు చేజార్చుకొని ఓటమి దిశగా పయనించింది. అయితే ఈ దశలో ధనంజయ, వెలలాగె భాగస్వామ్యం లంక విజయంపై ఆశలు రేపింది. భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ వీరిద్దరు పరుగులు సాధించారు. ఏడో వికెట్‌కు ఈ జోడీ 75 బంతుల్లో 63 పరుగులు జోడించింది. ఎట్టకేలకు జడేజా ఈ భాగస్వామ్యాన్ని విడదీయడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది.

## రోహిత్ @10,000



భారత కెప్టెన్ రోహిత్ శర్మ వన్డేల్లో అరుదైన మైలురాయిని అధిగమించాడు. లంకతో మ్యాచ్‌లో రజిత బౌలింగ్‌లో సిక్సర్‌తో 23 పరుగులకు చేరుకోగానే రోహిత్ 10 వేల పరుగులు పూర్తి చేసుకున్నాడు. భారత్ తరఫున ఈ ఘనత సాధించిన ఆరో బ్యాటర్‌గా నిలిచిన రోహిత్ ఓవరాల్‌గా 15వ ఆటగాడు. తన 241వ ఇన్నింగ్స్‌లో తాజా రికార్డు అందుకున్న అతను ఈ జాబితాలో కోహ్లి (205 ఇన్నింగ్స్) తర్వాత రెండో స్థానంలో నిలిచాడు.



వెలలాగె

## స్కోరు వివరాలు

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (బి) వెలలాగె 53; గిల్ (బి) వెలలాగె 19; కోహ్లి (సి) షనక (బి) వెలలాగె 3; ఇషాన్ కిషన్ (సి) వెలలాగె (బి) అసలంక 33; రాహుల్ (సి అండ్ బి) వెలలాగె 39; హార్దిక్ పాండ్యా (సి) మెండిస్ (బి) వెలలాగె 5; జడేజా (సి) మెండిస్ (బి) అసలంక 4; అక్షర్ పటేల్ (సి) సమరవిక్రమ (బి) తీక్షణ 26; బుమ్రా (బి) అసలంక 5; కుల్దీప్ (సి) ధనంజయ (బి) అసలంక 0; సిరాజ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (49.1 ఓవర్లలో ఆలౌట్) 213. వికెట్ల పతనం:** 1-80, 2-90, 3-91, 4-154, 5-170, 6-172, 7-178, 8-186, 9-186, 10-213. **బౌలింగ్:** రజిత 4-0-30-0, తీక్షణ 9.1-0-41-1, షనక 3-0-24-0, పతిరణ 4-0-31-0, వెలలాగె 10-1-40-5, ధనంజయ 10-0-28-0, అసలంక 9-1-18-4.

**శ్రీలంక ఇన్నింగ్స్:** నిసాంక (సి) రాహుల్ (బి) బుమ్రా 6; కరుణరత్నే (సి) గిల్ (బి) సిరాజ్ 2; మెండిస్ (సి) (సబ్) సూర్యకుమార్ (బి) బుమ్రా 15; సమరవిక్రమ (స్టంప్డ్) రాహుల్ (బి) కుల్దీప్ 17; అసలంక (సి) రాహుల్ (బి) కుల్దీప్ 22; ధనంజయ (సి) గిల్ (బి) జడేజా 41; షనక (సి) రోహిత్ (బి) జడేజా 9; వెలలాగె (నాటౌట్) 42; తీక్షణ (సి) (సబ్) సూర్యకుమార్ (బి) పాండ్యా 2; రజిత (బి) కుల్దీప్ 1; పతిరణ (బి) కుల్దీప్ 0; ఎక్స్‌ట్రాలు 15; **మొత్తం (41.3 ఓవర్లలో ఆలౌట్) 172. వికెట్ల పతనం:** 1-7, 2-25, 3-25, 4-68, 5-73, 6-99, 7-162, 8-171, 9-172, 10-172. **బౌలింగ్:** బుమ్రా 7-1-30-2, సిరాజ్ 5-2-17-1, పాండ్యా 5-0-14-1, కుల్దీప్ 9.3-0-43-4, జడేజా 10-0-33-2, అక్షర్ 5-0-29-0.

# గాయత్రి-ట్రెసా జోడీ శుభారంభం

**హాంకాంగ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ**



**కౌలూన్:** హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల డబుల్స్ విభాగంలో భారత నంబర్‌వన్ జోడీ పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన మెయిన్ 'డ్రా' తొలి రౌండ్‌లో గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం 54 నిమిషాల్లో 21-15, 16-21, 21-16తో జిలీ డెబోరా-చెరిల్ సీనెన్ (నెదర్లాండ్స్) జంటపై నెగ్గి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ అప్రియాని రహాయు-సితీ ఫాదియా సిల్వా (ఇండోనేసియా)లతో గాయత్రి-ట్రెసా తలపడతారు. మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ నుంచి మాళవిక బన్సోద్ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందగా... పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ నుంచి కిరణ్ జార్జి, రవి చివరి రౌండ్ మ్యాచ్‌ల్లో ఓడిపోయి మెయిన్ 'డ్రా'కు చేరుకోలేకపోయారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సుమీత్ రెడ్డి-అశ్విని పొన్నప్ప (భారత్) ద్వయం మెయిన్ 'డ్రా'కు చేరింది. క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో సుమీత్-అశ్విని జోడీ 21-15, 21-14తో అల్విన్ మొరాదా-అలీసా (చెక్ రిపబ్లిక్) జంటను ఓడించింది. మహిళల డబుల్స్ క్వాలిఫయింగ్‌లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జోడీ 21-16, 21-14తో సిక్కి రెడ్డి-ఆరతి జంటపై గెలిచి మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది.

# థాయ్‌లాండ్‌తో భారత్ తొలి పోరు

**మహిళల హాకీ**
**ఆసియా చాంపియన్స్ ట్రోఫీ**



**రాంచీ:** భారత్ వేదికగా తొలిసారి జరగనున్న మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీ షెడ్యూల్‌ను మంగళవారం ప్రకటించారు. అక్టోబర్ 27 నుంచి నవంబర్ 5 వరకు జరిగే ఈ టోర్నీకి రాంచీ ఆతిథ్యమివ్వనుంది. భారత్, చైనా, జపాన్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, మలేసియా జట్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి. అక్టోబర్ 27న థాయ్‌లాండ్ జట్టుతో భారత్ తమ టైటిల్ వేటను ప్రారంభిస్తుంది. అనంతరం 28న మలేసియాతో, 30న చైనాతో, 31న జపాన్‌తో, నవంబర్ 2న కొరియాతో భారత్ ఆడుతుంది. రౌండ్ రాబిన్ లీగ్ మ్యాచ్‌లు ముగిశాక టాప్-4లో నిలిచిన జట్లు సెమీఫైనల్ చేరుకుంటాయి. సెమీఫైనల్స్ నవంబర్ 4న, ఫైనల్స్ నవంబర్ 5న జరుగుతాయి. 2010 నుంచి ఇప్పటి వరకు ఆసియా మహిళల చాంపియన్స్ ట్రోఫీ ఆరుసార్లు జరిగింది. భారత్ 2016లో టైటిల్ గెలిచింది. 2010లో మూడో స్థానం పొందగా.. 2013, 2018లో రన్నరప్‌గా నిలిచింది.

## హాలెప్‌పై నాలుగేళ్ల నిషేధం



**లండన్:** డోపింగ్ నిబంధనలను అతిక్రమించినందుకు... రొమేనియా టెన్నిస్ స్టార్, ప్రపంచ మాజీ నంబర్‌వన్ సిమోనా హాలెప్‌పై ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటెగ్రిటీ ఏజెన్సీ (ఐటీఐఏ) నాలుగేళ్ల పాటు నిషేధం విధించింది. 31 ఏళ్ల హాలెప్ 2022 యూఎస్ ఓపెన్ సందర్భంగా డోపింగ్ పరీక్షలో విఫలమైంది. దాంతో ఆమెపై 2022 అక్టోబర్‌లో తాత్కాలిక నిషేధం విధించారు. ఐటీఐఏ ప్యానెల్ విచారణలో హాలెప్ ఉద్దేశపూర్వకంగానే డోపింగ్ నియమావళిని ఉల్లంఘించిందని తేలింది. దాంతో ఆమెపై నిషేధాన్ని అక్టోబర్ 2026 వరకు పొడిగించారు. 2017లో ప్రపంచ నంబర్‌వన్‌గా అవతరించిన హాలెప్ రెండు గ్రాండ్‌స్లామ్ (2018లో ఫ్రెంచ్ ఓపెన్, 2019లో వింబుల్డన్) సింగిల్స్ టైటిల్స్ సాధించింది. మరోవైపు ఐటీఐఏ విధించిన నిషేధాన్ని కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్‌లో సవాలు చేస్తానని హాలెప్ తెలిపింది.

# సినిమా



● రాశీ ఖన్నా



● వరుణ్ తేజ్

## అక్టోబరులో ఆరంభం

వరుణ్ తేజ్ హీరోగా 'పలాస' ఫేమ్ కరుణకుమార్ దర్శకత్వంలో 'మట్కా' చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. మీనాక్షీ చౌదరి, నోరా ఫతేహీ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ అక్టోబరు మొదటివారంలో హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని, ఈ తొలి షెడ్యూల్ దాదాపు ఇరవై రోజుల పాటు హైదరాబాద్‌లోని విభిన్నమైన లొకేషన్స్‌లో జరుగుతుందని సమాచారం. వైజాగ్ నేపథ్యంలో 1958 – 1982 టైమ్ పీరియడ్‌లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా 'మట్కా' చిత్రం తెరకెక్కనుంది. కథానుగుణంగా అప్పటి వైజాగ్‌ను తలపించేలా సెట్‌ను నిర్మించాలనే ఆలోచనలో ఉన్నారట యూనిట్. ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

## పాటలు.. నా సామి రంగ



● నాగార్జున

కొత్త సినిమా కోసం మ్యూజిక్ ఆన్ చేశారు నాగార్జున. కొరియోగ్రాఫర్ విజయ్ బిన్నిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, నాగార్జున హీరోగా నటించనున్న చిత్రం 'నా సామిరంగ'. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి ఈ సినిమాను నిర్మించనున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఆరంభం కానుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ జోరుగా సాగుతున్నాయి. సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి, లిరిక్ రైటర్ చంద్రబోస్, విజయ్ బిన్ని ఈ మ్యూజిక్ సిట్టింగ్స్‌లో పాల్గొంటున్నారు. యాక్షన్ ఫిల్మ్‌గా తెరకెక్కనున్న 'నా సామిరంగ' చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.

## కాస్త ఆలస్యంగా రూల్స్ రంజన్



● నేహా శెట్టి, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'రూల్స్ రంజన్'. రత్నం కృష్ణ దర్శకత్వంలో ఏఎం. రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించిన చిత్రం ఇది. కాగా ఈ సినిమాను ఇటీవల ఈ నెల 28న విడుదల చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ ప్రకటించింది. అయితే అక్టోబరు 6న రిలీజ్ చేయనున్నట్లు మంగళవారం ప్రకటించారు మేకర్స్. మెహర్ చాహల్, 'వెన్నెల' కిషోర్, సుబ్బరాజు, హైపర్ ఆది, 'వైవా' హర్ష కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సంగీతం: అమ్రిష్ గణేష్.

## అమెరికా.. రష్యా యుద్ధంతో...



● సిల్వెస్టర్ స్టాలోన్

యాక్షన్ స్టార్ సిల్వెస్టర్ స్టాలోన్ లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'ఎక్స్‌పెండబుల్స్ 4'. స్కాట్ వా దర్శకత్వం వహించిన అమెరికన్ యాక్షన్ చిత్రమిది. మల్టీ విజన్ మల్టీ మీడియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సమర్పణలో వస్తున్న ఈ సినిమాని తెలుగు, ఇంగ్లిష్, తమిళ, హిందీ భాషల్లో ఈ నెల 22 విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''అమెరికా, రష్యా మధ్య యుద్ధాన్ని నివారించడానికి డేర్-డెవిల్ ది ఎక్స్‌పెండబుల్స్ జట్టు ఏం చేసింది? అనే అద్భుతమైన మిషన్‌తో 'ఎక్స్‌పెండబుల్స్ 4' సాగుతుంది'' అన్నారు మేకర్స్. జాసన్ స్టాథమ్, డాల్ఫ్ లండ్‌గ్రెన్, మేగన్ ఫాక్స్, జాక్సన్, టోనీ జా తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: టిమ్ మారిస్-జోన్స్, సంగీతం: గ్విలేమ్ రౌసెల్.

## అప్పుడు కామెడీ సులభమే - కార్తీక్ రత్నం



'కేరాఫ్ కంచరపాలెం, నారప్ప'.. ఇలా నటుడిగా ఇప్పటివరకూ చాలా ఇంటెన్స్ క్యారెక్టర్స్ చేసిన నేను 'ఛాంగురే బంగారురాజా'లో తొలిసారి ఓ కామెడీ రోల్ చేశాను. కామెడీ చేయడం కష్టం అంటుంటారు. కానీ మంచి స్క్రిప్ట్ ఉంటే కామెడీ చేయడం సులభమేనని నాకు అనిపించింది' అన్నారు కార్తీక్ రత్నం. సతీష్ వర్మ దర్శకత్వంలో కార్తీక్ రత్నం, గోల్డీ నిస్సీ జంటగా నటించిన చిత్రం 'ఛాంగురే బంగారురాజా'. ఫ్రేమ్ బై ఫ్రేమ్ పిక్చర్స్‌తో కలిసి హీరో రవితేజ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా కార్తీక్ రత్నం మాట్లాడుతూ- ''రంగస్థల నటుడిగా వందకుపైగా నాటకాలను ప్రదర్శించాను. మొదటి నాటకానికే నంది అవార్డు వచ్చింది. నాలా ఇండస్ట్రీకి వచ్చే కొత్త వారికి రవితేజ, నానీగార్లే స్ఫూర్తి. అలాంటిది రవితేజగారు నేను హీరోగా నటించిన సినిమాను నిర్మించడం చాలా సంతోషంగా ఉంది. కొన్ని కొండ ప్రాంతాల్లో లభించే విలువైన రంగు రాళ్ల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. ఇందులో మెకానిక్ బంగారు రాజా పాత్ర చేశాను. దర్శకుడు సతీష్‌వర్మగారికి రైటింగే బలం. స్పాట్‌లో ఆయన స్క్రిప్ట్‌ను ఇంప్రూవ్ చేస్తుంటారు. నేను నటించిన 'శ్రీరంగ నీతులు' విడుదలకు సిద్ధంగా ఉంది. అలాగే ప్రకాశ్‌రాజ్, దర్శకుడు ఏఎల్ విజయ్‌లు కలిసి నిర్మిస్తున్న ఓ ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం ఒప్పుకున్నాను. మరో ఎగ్జైటింగ్ ప్రాజెక్ట్‌ను త్వరలోనే ప్రకటిస్తాను'' అన్నారు.

## ప్రేమకు గ్రీన్ సిగ్నల్!

ఉత్తరాది అమ్మాయి రాశీ ఖన్నా హీరోయిన్‌గా దక్షిణాదిలో ఎక్కువ సినిమాల్లో నటించి స్టార్ లిస్ట్‌లో ఉన్నారు. రచ్చ గెలిచిన రాశీ ఖన్నా ఇప్పుడు ఇంట అంటే ఉత్తరాదిలో నటిగా నిరూపించుకోవాలని అనుకుంటున్నట్లున్నారు. ఇప్పటికే సిద్దార్థ్ మల్హోత్రా హీరోగా నటిస్తున్న 'యోధ' చిత్రంలో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. దిశా పటానీ మరో హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం డిసెంబరులో విడుదల కానుంది. తాజాగా రాశీ మరో కొత్త సినిమాకు పచ్చ జెండా ఊపారని బాలీవుడ్ సమాచారం. నూతన దర్శకుడు బోధయన్ రాయ్ హీరో విక్రాంత్ మెస్సీతో ఓ ప్రేమకథా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ కథను ఇటీవల రాశీకి వినిపించారట. ఈ ప్రేమకథతో ప్రేమలో పడ్డారట ఈ బ్యూటీ. దాంతో ఈ సినిమాలో విక్రాంత్ మెస్సీకి ప్రేయసిగా నటించేందుకు రాశీ ఖన్నా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని బీటౌన్ సమాచారం. వీలైనంత త్వరగా షూటింగ్ పూర్తి చేసి, వచ్చే ఏడాది ప్రారంభంలో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటోందట చిత్ర యూనిట్.

## బడ్జెట్ కాదు.. ప్రతిభే బలం - విశ్వక్ సేన్



● విశ్వక్ సేన్, అభయ్ నవీన్

'చరిత్ర సృష్టించే సినిమాలకు బడ్జెట్ ఇంత ఉండాలనే అవసరం లేదని 'పెళ్ళి చూపులు, అర్జున్ రెడ్డి, బలగం, మసూద, ఫలక్‌నుమా దాస్' వంటి ఎన్నో చిత్రాలు నిరూపించాయి. సినిమాకు ఎంత బడ్జెట్ పెట్టామనేది చూస్తుంటారు చాలామంది. కానీ ఆ చిత్రంలో పనిచేస్తున్న వాళ్లు ఎంత ప్రతిభావంతులు అనేది చూస్తే అదే సినిమాకు అసలైన బలం. 'రామన్న యూత్' చిత్రానికి అలాంటి మ్యాజిక్ జరగాలి. ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుంది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. అభయ్ నవీన్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'రామన్న యూత్'. అమూల్య రెడ్డి హీరోయిన్‌గా చేశారు. ఫైర్ ఫ్లై ఆర్ట్స్ సంస్థ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 15న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకకి విశ్వక్ సేన్, నటులు ప్రియదర్శి, తిరువీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''ప్రేక్షకులకు చిన్న సినిమానా? పెద్ద సినిమానా? అనేది తెలియదు. మంచి కథ ఉంటే ఆ చిత్రాన్ని తప్పకుండా చూస్తారు. 'రామన్న యూత్'ని థియేటర్ లో చూసి ప్రోత్సహించాలి'' అన్నారు అభయ్ నవీన్.

## వాస్తవ ఘటనతో...



● ప్రమోద్, అనుశ్రీ

రఘు, ఆర్. ప్రమోద్ హీరోలుగా, అనుశ్రీ, మోహన హీరోయిన్లుగా కొత్త సినిమా ప్రారంభమైంది. పాలిక్ దర్శకత్వంలో భోగి సుధాకర్, రావుల రమేష్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత ప్రసన్న కుమార్ కెమెరా స్విచాన్ చేయగా, నిర్మాత దామోదర్ ప్రసాద్ క్లాప్ ఇచ్చారు. నిర్మాత టి. రామసత్యనారాయణ స్క్రిప్ట్‌ని అందించగా, దర్శకుడు-నటుడు గూడ రామకృష్ణ గౌరవ దర్శకత్వం వహించారు. ''పాలిక్‌గారి దర్శకత్వంలో నేను నిర్మించిన తొలి చిత్రం 'రౌద్ర రూపాయ నమః' చిత్రాన్ని అక్టోబర్‌లో రిలీజ్ చేస్తాం'' అన్నారు రావుల రమేష్. ''ములుగు, వరంగల్, అరకు ప్రాంతాల్లో ఈ మూవీ షూటింగ్ చేస్తాం'' అన్నారు భోగి సుధాకర్. ''1960–1980 మధ్య తెలంగాణలో జరిగిన వాస్తవ ఘటనతో తీస్తున్న ఈ చిత్రంలో లవ్, సస్పెన్స్, థ్రిల్లింగ్ అంశాలుంటాయి'' అన్నారు పాలిక్.

## అందాల రాణి



● సంయుక్తా మీనన్

రవివర్మ కుంచె నుంచి జాలువారిన చిత్రమా.. ఎల్లోరా శిల్పమా.. అన్నట్లుగా విగ్రహం రూపంలో సంయుక్తా మీనన్ ఆకట్టుకున్నారు. మంగళవారం ఈ బ్యూటీ పుట్టినరోజు. ఈ సందర్భంగా 'స్వయంభూ' చిత్రంలో సంయుక్త లుక్‌ని విడుదల చేసింది యూనిట్. ఒక పెద్ద కోట బ్యాక్‌డ్రాప్‌లో, నిండైన ఆభరణాలు, యువరాణిని తలపించే వస్త్రధారణ, చేతిలో పక్షితో సంయుక్త లుక్ ఆకట్టుకునే విధంగా ఉంది. నిఖిల్, సంయుక్తా మీనన్ జంటగా భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న 'స్వయంభూ' ఇటీవల ప్రారంభమైంది. ఇందులో యువరాణి తరహా పాత్రను పోషిస్తున్నారు సంయుక్త. ఈ మూవీలో చేస్తున్న యోధుడి పాత్ర కోసం శిక్షణ తీసుకోవడానికి వియత్నాం వెళ్లారు నిఖిల్. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## నెలాఖరులో వ్యాక్సిన్



● నానా పటేకర్

'ది కశ్మీరీ ఫైల్స్' వంటి హిట్ మూవీ తర్వాత దర్శకుడు వివేక్ రంజన్ అగ్నిహోత్రి తెరకెక్కించిన తాజా చిత్రం 'ది వ్యాక్సిన్ వార్'. నానా పటేకర్, అనుపమ్ ఖేర్, పల్లవి జోషి, సప్తమి గౌడ, పరితోష్ సాండ్, స్నేహ మిలాండ్, దివ్య సేథ్ నటించారు. పల్లవి జోషి నిర్మించారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ అభిషేక్ అగర్వాల్ కూడా ఈ ప్రాజెక్ట్‌లో భాగమయ్యారు. ఈ నెల 28న ఈ చిత్రం విడుదల కానుంది. మంగళవారం హిందీ ట్రైలర్‌ను విడుదల చేశారు. ''భారతదేశపు మొట్టమొదటి బయో-సైన్స్ చిత్రమిది. కోవిడ్ వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేయడానికి శాస్త్రవేత్తలు ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి? అన్నదే ఈ చిత్ర కథ'' అని యూనిట్ పేర్కొంది. కాగా 'వ్యాక్సిన్ వార్' చిత్రం తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గుజరాతీ, పంజాబీ, భోజ్‌పురి, బెంగాలీ, మరాఠీ, తమిళ, కన్నడ, ఉర్దూ, అస్సామీ భాషల్లో విడుదల కానుంది.

**స్టాక్‌ మార్కెట్లు**

| దేశీ సూచీలు | | |
|---|---|---|
| సెన్సెక్స్‌ ▲ | 94 | 67,221 |
| నిఫ్టీ ▼ | 3 | 19,993 |

మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి

| విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు) | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్‌ | 13,833 | ▼ | 85 |
| డోజోన్స్‌ | 34,810 | ▲ | 146 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,528 | ▲ | 31 |
| డాక్స్‌ | 15,715 | ▼ | 85 |
| షాంఘై | 3,138 | ▼ | 6 |
| నికాయ్‌ | 32,776 | ▲ | 309 |

• అమెరికా • బ్రిటన్‌ • జర్మనీ • చైనా • జపాన్‌

**బులియన్‌** రూ.లలో

| ముంబై | | |
|---|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) 58,865 | ▼ | 236 |
| బంగారం (99.5 స్వచ్ఛత) 58,629 | ▼ | 205 |
| వెండి (కేజీ) 70,900 | ▼ | 128 |

**ఫారెక్స్‌ రేట్లు** రూ.లలో

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 82.18 | 83.85 |
| £ | బ్రిటన్‌ పౌండ్‌ | ఎస్‌బీఐ | 102.10 | 105.47 |
| € | యూరో | ఎస్‌బీఐ | 87.47 | 90.58 |
| ¥ | జపాన్‌ ఎన్‌ (100) | ఎస్‌బీఐ | 55.83 | 57.56 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్‌ | ఎస్‌బీఐ | 52.18 | 54.52 |
| S$ | సింగపూర్‌ డాలర్‌ | ఎస్‌బీఐ | 59.96 | 61.90 |
| SAR | సౌదీ రియాల్‌ | థామస్‌కుక్‌ | 21.19 | 22.81 |
| UAE D | యూఏఈ దిర్హామ్‌ | థామస్‌కుక్‌ | 21.71 | 23.50 |
| ¥ | చైనా యువాన్‌ | థామస్‌కుక్‌ | 10.26 | 12.33 |

# జీవితకాల గరిష్టాల వద్ద లాభాల స్వీకరణ

- నిఫ్టీకి నష్టం, సెన్సెక్స్‌కు లాభం
- చిన్న, మధ్య తరహా షేర్లు క్రాష్‌



ముంబై: అధిక వాల్యుయేషన్ల ఆందోళనలతో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తూ గరిష్ట స్థాయిల వద్ద లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా ఆరంభ లాభాల్ని కోల్పోయిన స్టాక్‌ సూచీలు మంగళవారం మిశ్రమంగా ముగిశాయి. ఇంట్రాడేలో 412 పాయింట్లు పెరిగి 67,539 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసిన సెన్సెక్స్‌ చివరికి 94 పాయింట్ల లాభంతో 67,221 వద్ద ముగిసింది. నిఫ్టీ 114 పాయింట్లు ఎగసి 20,110 వద్ద కొత్త ఆల్‌టైం హైని అందుకుంది. చివరికి 3 పాయింట్లు నష్టపోయి 19,993 వద్ద నిలిచింది. యుటిలిటీ, పవర్, టెలికం, రియల్టీ, ఆటో, ఆయిల్‌అండ్‌గ్యాస్, మౌలిక రంగ షేర్లు అమ్మకాలు ఒత్తిడికి లోనయ్యాయి. ఐటీ, బ్యాంకులు, టెక్‌ షేర్లకు స్వల్ప కొనుగోళ్ల మద్దతు లభించింది. చిన్న, మధ్య తరహా షేర్లలో భారీగా లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో బీఎస్‌ఈ స్మాల్‌ క్యాప్‌ సూచీ 4%, మిడ్‌ క్యాప్‌ ఇండెక్స్‌ 3% చొప్పున నష్టపోయాయి. ఇరు సూచీలకు ఈ ఏడాది అతిపెద్ద పతనం కావడం గమనార్హం.

- చివరి రోజు నాటికి ఈఎంఎస్‌ లిమిటెడ్‌ ఐపీఓ 75.28 రెట్లు సబ్‌స్క్రైబ్‌ అయ్యింది. ఐపీఓలో భాగంగా కంపెనీ 1.07 కోట్ల షేర్లను జారీ చేయగా, 81.21 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. రిటైల్‌ ఇన్వెస్టర్ల కోటా 29.79 రెట్లు సబ్‌స్క్రిప్షన్‌ సాధించాయి.

# ఐఫోన్‌ 15 వచ్చేసింది!



**4 వెర్షన్లలో లభ్యం ● ధర 799-1199 డాలర్లు ● యాపిల్‌ వాచ్‌ 9 సిరీస్‌ కూడా ● ఇక టైప్‌-సి కేబుల్‌**



న్యూయార్క్‌: టెక్నాలజీ దిగ్గజం యాపిల్‌ తాజాగా ఐఫోన్‌ 15 మోడళ్ల మొబైళ్లతోపాటు.. 9 సిరీస్‌ స్మార్ట్‌ వాచీని విడుదల చేసింది. ఐఫోన్‌ 15 మోడళ్ల చార్జింగ్‌కు టైప్‌ సీ కేబుల్‌ను ప్రవేశపెట్టింది. దీంతో ఇతర యాపిల్‌ గాడ్జెట్లను సైతం టైప్‌ సీ ద్వారా చార్జింగ్‌ చేసుకునే వీలు కల్పిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. ఐఫోన్‌ 15, 15 ప్లస్‌ మోడళ్లకు ఏ 16 చిప్‌ను వినియోగించింది. వాచీ మోడళ్లకు రీసైకిల్డ్‌ మెటీరియల్‌తో రూపొందించిన విభిన్న స్ట్రాప్స్‌ను ప్రవేశపెట్టింది. ఇక ఐఫోన్‌ 15 ప్రో, 15 ప్రో మ్యాక్స్‌ మోడళ్ల కేసు తయారీలో టైటానియంను వినియోగించింది. ఏ17 చిప్‌ను వినియోగించింది. తద్వారా అత్యంత వేగవంత, మన్నికైన, తేలికపాటి ఫోన్లను రూపొందించినట్లు యాపిల్‌ తెలియజేసింది. ఐఫోన్‌ 15 ధర 799 డాలర్లు, 15 ప్లస్‌కు 899 డాలర్లు చొప్పున నిర్ణయించింది. ఇక ఐఫోన్‌ 15 ప్రో ధర 999 డాలర్లు కాగా, ప్రో మ్యాక్స్‌ ధర 1199 డాలర్లుగా ప్రకటించింది. కొత్త ఐఫోన్‌ మోడళ్లన్నీ 48 ఎంపీ ప్రధాన కెమెరాతో విడుదలయ్యాయి. 6.1, 6.7 అంగుళాల స్క్రీన్‌ పరిమాణంలో ప్రవేశపెట్టింది. స్టోరేజీ 128 జీబీ, 256 జీబీతో విడుదల చేసింది.





# హెరిటేజ్‌ షేరుకు షాక్‌!

- చంద్రబాబు అరెస్టుతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం
- రెండు రోజుల్లో దాదాపు 20% డౌన్‌
- కంపెనీలో ప్రమోటర్ల వాటా 41.58%
- ఇన్వెస్టర్ల సంపద రూ.450 కోట్లకు పైగా ఆవిరి




హైదరాబాద్‌: స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ స్కామ్‌ కేసులో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్ట్‌తో హెరిటేజ్‌ ఫుడ్స్‌ వాటాదారులకు షాక్‌ తగిలింది. చంద్రబాబు కుటుంబం కంపెనీ ప్రధాన ప్రమోటర్‌ కావడంతో షేరు కుప్పకూలింది. శనివారం చంద్రబాబును అరెస్ట్‌ చేసిన తర్వాత రెండు ట్రేడింగ్‌ సెషన్లలో హెరిటేజ్‌ ఫుడ్స్‌ షేరు ధర దాదాపు 19 శాతం క్రాష్‌ అయ్యింది. మంగళవారం ఒక్కరోజే 12.5 శాతం (రూ.32) క్షీణించి రూ.221 వద్ద ముగిసింది. భారీ వాల్యూమ్‌తో (దాదాపు 24 లక్షల షేర్లు చేతులు మారాయి) షేరు పడిపోవడం చూస్తే ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై తీవ్ర ప్రభావం ఉన్నట్లు కనబడుతోందని మార్కెట్‌ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అరెస్ట్‌కు ముందు, అంటే శుక్రవారం (సెప్టెంబర్‌ 8న) ట్రేడింగ్‌ ముగింపు నాటికి షేరు ధర దాదాపు రూ.272 వద్ద ఉంది. షేరు కుప్పకూలడంతో ఇన్వెస్టర్ల సంపద కూడా భారీగా ఆవిరవుతోంది. గత రెండు రోజుల్లో కంపెనీ మార్కెట్‌ క్యాపిటలైజేషన్‌ (విలువ) ఏకంగా రూ.450 కోట్ల మేర కరిగిపోయింది. మంగళవారం ట్రేడింగ్‌ ముగింపు నాటికి ఇది రూ.2,073 కోట్లకు దిగొచ్చింది. కాగా, హెరిటేజ్‌ ఫుడ్స్‌ షేరు ఏడాది గరిష్ట స్థాయి రూ.287 కాగా, కనిష్ట స్థాయి రూ.135గా నమోదైంది. కంపెనీలో ప్రమోటర్లకు (చంద్రబాబు కుటుంబం) సుమారు 41.58 శాతం వాటా ఉంది.

**'ఇన్నర్‌ రింగ్‌ రోడ్డు' అక్రమాల్లో హెరిటేజ్‌...**

చంద్రబాబు హయాంలో జరిగిన కుంభకోణాలపై ఏపీ సీఐడీ విచారణ జోరు పెంచడం, వీటిలో బాబు కుటుంబంతో పాటు హెరిటేజ్‌ కంపెనీకి కూడా ప్రత్యక్షంగా ప్రమేయం ఉన్నట్లు బయటపడటంతో ఇన్వెస్టర్లు బెంబేలెత్తుతున్నారు. ఒకపక్క, 'స్కిల్‌' స్కామ్‌లో ఇప్పటికే చంద్రబాబు అరెస్టయ్యి రిమాండ్‌లో ఉన్నారు. ఇదే తరుణంలో అమరావతి 'ఇన్నర్‌ రింగ్‌ రోడ్డు' ప్రాజెక్టులో సైతం బాబు అండ్‌ కో అందినకాడికి దోచుకున్నారన్న పక్కా ఆధారాలతో సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్‌) చంద్రబాబును విచారించేందుకు పీటీ వారంట్‌ కోసం ఏసీబీ కోర్టును ఆశ్రయించింది. ఈ కేసులోనూ బాబును అరెస్ట్‌ చేసే అవకాశం కనిపిస్తోంది. ఈ స్కామ్‌లో హెరిటేజ్‌ ఫుడ్స్‌ కూడా ఇన్నర్‌ రింగ్‌ రోడ్‌ అలైన్‌మెంట్‌ వెంబడి భూములు కొనుగోలు చేసినట్లు ఇప్పటికే సీఐడీ దర్యాప్తులో వెలికితీయడం గమనార్హం. వీటన్నింటి ప్రభావంతో రానున్న రోజుల్లో హెరిటేజ్‌ ఫుడ్స్‌ ఇన్వెస్టర్లకు కంటిమీద కునుకులేకుండా చేసే అవకాశం ఉందని పరిశీలకులు పేర్కొంటున్నారు. దీంతో షేరు మరింత కుప్పకూలే అవకాశం ఉందనేది వారి విశ్లేషణ.

## యాత్రా ఆన్‌లైన్‌ @ రూ. 135-142

**ఈ నెల 15-20 మధ్య ఐపీవో**

ముంబై: ఆన్‌లైన్‌ ట్రావెల్‌ సర్వీసుల కంపెనీ యాత్రా ఆన్‌లైన్‌ పబ్లిక్‌ ఇష్యూకి రూ. 135-142 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 15న ప్రారంభమై 20న ముగియనుంది. ఐపీవోలో భాగంగా రూ. 602 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1,21,83,099 షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 775 కోట్లు సమీకరించనుంది. కాగా.. ఇటీవల షేరుకి రూ. 236 ధరలో చేపట్టిన రైట్స్‌ ఇష్యూ ద్వారా రూ. 62 కోట్లు సమకూర్చుకుంది. రైట్స్‌లో భాగంగా 26.27 లక్షల షేర్లను జారీ చేసింది. రిటైలర్లు కనీసం 105 షేర్ల(ఒక లాట్‌)కు దరఖాస్తు చేయవలసి ఉంటుంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 150 కోట్లను వ్యూహాత్మక పెట్టుబడులు, ఇతర సంస్థల కొనుగోళ్లు తదితరాలకు వినియోగించనుంది. 2023 మార్చికల్లా కంపెనీ రూ. 380 కోట్ల ఆదాయం సాధించింది.




# ఆర్థిక గణాంకాల ఉత్సాహం..

- జూలై పారిశ్రామికోత్పత్తి వృద్ధి 5.7%
- ఐదు నెలల గరిష్టం
- ఆగస్టులో రిటైల్‌ ద్రవ్యోల్బణం 6.83%



న్యూఢిల్లీ: భారత్‌ ఆర్థిక రంగానికి సంబంధించి మంగళవారం వెలువడిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ఆగస్టు రిటైల్‌ ద్రవ్యోల్బణం, జూలై పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ) కొంత ఊరటనిచ్చాయి. ఆగస్టు వినియోగ ద్రవ్యోల్బణం 6.83 శాతంగా నమోదయ్యింది. అంటే గత ఏడాది ఆగస్టు ధరలతో పోల్చితే తాజా సమీక్షా నెల్లో సీపీఐ బాస్కెట్‌లోని ఉత్పత్తుల ధరలు 6.83 శాతం పెరిగాయన్నమాట. జూలైతో పోల్చితే (7.44 శాతం) ఆగస్టులో ధరల స్పీడ్‌ కొంత తక్కువగా ఉండడం గమనార్హం. ఇక జూలై పారిశ్రామిక ఉత్పత్తి పెరుగుదల 5.7 శాతంగా నమోదయ్యింది. ఇది 5 నెలల గరిష్ట స్థాయి. తాజా సమీక్షా నెల జూలైలో తయారీ, మైనింగ్, విద్యుత్‌ రంగాలు మంచి పనితనాన్ని ప్రదర్శించాయి. ఇదిలాఉండగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌ నుంచి జూలై మధ్య ఐఐపీ వృద్ధి రేటు 4.8%. గత ఏడాది (2022) ఇదే కాలంలో ఈ వృద్ధి రేటు ఏకంగా 10%గా ఉంది. 2021లో కరోనా ప్రభావంతో లో బేస్‌ దీనికి ప్రధాన కారణం.

**జూలైలో మౌలిక రంగం ఓకే...**

కాగా, ఎనిమిది రంగాల భారత్‌ మౌలిక పరిశ్రమ జూలైలో మంచి పనితీరును కొనసాగించింది. 8 శాతం వృద్ధి రేటును నమోదుచేసుకుంది. బొగ్గు, క్రూడ్‌ ఆయిల్, సహజ వాయువు, స్టీల్, సిమెంట్, విద్యుత్, రిఫైనరీ ప్రొడక్టులు, ఎరువుల రంగాలు వీటిలో ఉన్నాయి. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపీ)లో వీటి వెయిటేజ్‌ 40.27 శాతం. ఇక ఏప్రిల్‌ నుంచి జూలై వరకూ మౌలిక పరిశ్రమ వృద్ధి రేటు 6.4 శాతంగా ఉంది.

## దిగొచ్చిన రిటైల్‌ ద్రవ్యోల్బణం

ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షకు ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ ఆధారిత రిటైల్‌ ద్రవ్యోల్బణం జూలైలో 15 నెలల గరిష్ట స్థాయిలో 7.44 శాతం ఉంటే, ఆగస్టులో 6.83 శాతానికి తగ్గింది. ఇదే కాలంలో ఒక్క ఫుడ్‌ బాస్కెట్‌ ద్రవ్యోల్బణం 11.51 శాతం నుంచి 9.94 శాతానికి దిగిరావడం దీనికి ప్రధాన కారణం. ఒక్క కూరగాయల ధరల పెరుగుదల చూస్తే, 2023 జూలైలో పరుగు 37.4 శాతం ఉంటే, ఆగస్టులో 26.14 శాతానికి తగ్గింది. అయితే ఇంకా రేటు ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిత స్థాయి (6 శాతం) ఎగువనే ఉండడం గమనార్హం.



# జాబ్‌ పాయింట్‌

## ఏపీ సివిల్‌ సప్లైస్, ఎన్టీఆర్‌ జిల్లాలో 507 పోస్టులు

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్‌ లిమిటెడ్, జిల్లా కార్యాలయం.. ఎన్టీఆర్‌ జిల్లాలో ధాన్య సేకరణకు సంబంధించి రెండు నెలల కాలానికి ఒప్పంద ప్రాతిపదికన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 507
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్‌ అసిస్టెంట్‌-169, డేటా ఎంట్రీ ఆపరేటర్‌-169, హెల్పర్‌-169.

**అర్హతలు:**
» **టెక్నికల్‌ అసిస్టెంట్‌:** బీఎస్సీ(అగ్రికల్చర్‌/మైక్రో బయాలజీ/బయోకెమిస్ట్రీ /బయోటెక్నాలజీ)/ బీఎస్సీ(బీజెడ్‌సీ)/బీఎస్సీ(లైఫ్‌ సైన్సెస్‌)/డిప్లొమా(అగ్రికల్చర్‌) ఉత్తీర్ణులై ఉండాలి.
» **డేటాఎంట్రీ ఆపరేటర్‌:** ఏదైనా డిగ్రీతో పాటు పీజీ డీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. » **హెల్పర్‌:** ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** టీఏ/డీఈవో పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు,హెల్పర్‌కు 18నుంచి 35ఏళ్ల మధ్య ఉండాలి
» **ఎంపిక విధానం:** అకడమిక్‌ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతల (టీఏ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్‌ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా జిల్లా పౌర సరఫరాల మేనేజర్, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్‌ లిమిటెడ్, గవర్నర్‌పేట, విజయవాడ జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 18.09.2023.
» **వెబ్‌సైట్‌:** ntr.ap.gov.in

## ఏపీ సివిల్‌ సప్లైస్, ప్రకాశం జిల్లాలో 75 పోస్టులు

ఒంగోలులోని ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్‌ లిమిటెడ్, జిల్లా కార్యాలయం.. ప్రకాశం జిల్లాలో ధాన్య సేకరణకు సంబంధించి రెండు నెలల కాలానికి ఒప్పంద ప్రాతిపదికన ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 75
» **పోస్టుల వివరాలు:** టెక్నికల్‌ అసిస్టెంట్‌-25, డేటా ఎంట్రీ ఆపరేటర్‌-25, హెల్పర్‌-25.

**అర్హతలు:**
» **టెక్నికల్‌ అసిస్టెంట్‌:** బీఎస్సీ(అగ్రికల్చర్‌/మైక్రో బయాలజీ/బయోకెమిస్ట్రీ /బయోటెక్నాలజీ)/ బీఎస్సీ(బీజెడ్‌సీ)/బీఎస్సీ(లైఫ్‌ సైన్సెస్‌)/డిప్లొమా(అగ్రికల్చర్‌) ఉత్తీర్ణులై ఉండాలి.
» **డేటాఎంట్రీ ఆపరేటర్‌:** ఏదైనా డిగ్రీతోపాటు పీజీ డీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. » **హెల్పర్‌:** ఎనిమిదో తరగతి నుంచి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** టీఏ/డీఈవో పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు,హెల్పర్‌కు 18నుంచి 35ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** అకడమిక్‌ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతలు (టీఏ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను జతచేసి రిజిస్టర్‌ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా జిల్లా పౌర సరఫరాల మేనేజర్, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్‌ లిమిటెడ్, సంతపేట, ఒంగోలు, ప్రకాశం జిల్లా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 21.09.2023.
» **వెబ్‌సైట్‌:** prakasam.ap.gov.in

## ఏపీ హైకోర్టు లీగల్‌ సర్వీసెస్‌లో ఉద్యోగాలు

అమరావతిలోని ఏపీ హైకోర్టు లీగల్‌ సర్వీసెస్‌ కమిటీ.. డైరెక్ట్‌ రిక్రూట్‌మెంట్‌ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
» **పోస్టుల వివరాలు:** సీనియర్‌ అసిస్టెంట్‌-01, జూనియర్‌ అసిస్టెంట్‌-01, స్టెనో కమ్‌ టైపిస్ట్‌-02, ఆఫీస్‌ సబార్డినేట్‌-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఏడో తరగతి,డిగ్రీ, ఇంగ్లిష్‌ టైప్‌ రైటింగ్‌ హయ్యర్‌ గ్రేడ్‌ సర్టిఫికేట్, ఇంగ్లిష్‌ షార్ట్‌ హ్యాండ్‌ హయ్యర్‌ గ్రేడ్‌ సర్టిఫికేట్.
» **వయసు:** 01.09.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పోస్టును అనుసరించి రాతపరీక్ష, ఇంటర్వ్యూ, స్కిల్‌ టెస్ట్‌ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్‌ ద్వారా.
» **ఆఫ్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 14.09.2023
» **వెబ్‌సైట్‌:** apslsa.ap.nic.in

## ఇండియన్‌ నేవీలో 46 అసిస్టెంట్‌ కమాండెంట్‌ పోస్టులు

ఇండియన్‌ నేవీ ఆధ్వర్యంలోని ఇండియన్‌ కోస్ట్‌ గార్డ్‌.. అర్హులైన స్త్రీ, పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 46
» **పోస్టుల వివరాలు:** జనరల్‌ డ్యూటీ-25, టెక్నికల్‌-20, లా-01.
» **విభాగాలు:** జనరల్‌ డ్యూటీ, టెక్నికల్‌(ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్‌/ఎలక్ట్రానిక్స్‌), లా.
» **అర్హత:** ఖాళీలను అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో డిగ్రీ/ఇంజనీరింగ్‌ డిగ్రీ/లా డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. **వేతనం:** నెలకు రూ.56,100 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** పరీక్షలో మెరిట్‌ ఆధారంగా.
» **పరీక్ష విధానం:** ఇంగ్లిష్, రీజనింగ్, న్యూమరికల్‌ ఎబిలిటీ,జనరల్‌ సైన్స్‌ అండ్‌ మ్యాథమేటికల్‌ ఆప్టిట్యూడ్,జనరల్‌ నాలెడ్జ్‌ నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు రెండు గంటల సమయం ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌ ద్వారా.
» **ఆన్‌లైన్‌ దరఖాస్తులకు చివరితేది:** 15.09.2023
» **వెబ్‌సైట్‌:** joinindiancoastguard.cdac.in

# విద్యారుణం.. ఇలా సులువు!

**విద్యారుణం కోసం ఒకే వేదిక ద్వారా పలు బ్యాంకులకు దరఖాస్తు చేసుకోవచ్చు. రుణ దరఖాస్తు నుంచి మంజూరు వరకూ.. అంతా ఆన్‌లైన్‌లోనే! లోన్‌ మంజూరయ్యాక నిర్దేశిత బ్రాంచ్‌కు వెళ్లి సంబంధిత డాక్యుమెంట్లు సమర్పిస్తే సరిపోతుంది. వీటన్నింటికీ మార్గం వేస్తోంది.. విద్యాలక్ష్మి పోర్టల్‌!! కేంద్ర ఆర్థిక, విద్యా శాఖలు, ఇండియన్‌ బ్యాంక్స్‌ అసోసియేషన్‌ సంయుక్తంగా రూపొందించిన ఈ విద్యాలక్ష్మి పోర్టల్‌ ద్వారా సులువుగా విద్యా రుణాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దేశ విదేశాల్లో ఉన్నత విద్య కోర్సుల విద్యార్థులకు విద్యాలక్ష్మి పోర్టల్‌తో ప్రయోజనాలు, విద్యా రుణం విధి విధానాలపై ప్రత్యేక కథనం..**

యువతలో ఉన్నత విద్యను అభ్యసించాలనే ఆసక్తి పెరుగుతోంది. అదే సమయంలో ఫీజుల భారం నుంచి ఉపశమనం పొందేందుకు ఎడ్యుకేషన్‌ లోన్‌ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. కానీ.. బ్యాంకింగ్‌ సంస్థలు అనుసరించే నిబంధనల కారణంగా దరఖాస్తుకు సుదీర్ఘ సమయం వెచ్చించాలనే అభిప్రాయం నెలకొంది. ఇప్పుడు వీటన్నింటికి ఫుల్‌స్టాప్‌ పెట్టేసి.. వన్‌ స్టాప్‌ సొల్యూషన్‌గా విద్యాలక్ష్మి పోర్టల్‌ ద్వారా విద్యా రుణాలకు ఇంటి నుంచే దరఖాస్తు చేసుకోవచ్చు.

» ఎడ్యుకేషన్‌ లోన్‌కు ఉమ్మడి వేదిక విద్యాలక్ష్మి పోర్టల్‌
» దరఖాస్తు నుంచి మంజూరు వరకు అంతా ఆన్‌లైన్‌లోనే
» నిర్దేశిత ధ్రువపత్రాలు అప్‌లోడ్‌ చేయడం తప్పనిసరి

### కేంద్రం ఆధ్వర్యంలో విద్యాలక్ష్మి

విద్యా రుణాలకు దరఖాస్తు, మంజూరులో విద్యార్థులకు ఎదురవుతున్న సమస్యలకు పరిష్కారంగా కేంద్ర ప్రభుత్వం విద్యాలక్ష్మి పేరుతో ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. అభ్యర్థులు ఈ పోర్టల్‌లో లాగిన్‌ అయి.. కామన్‌ ఎడ్యుకేషనల్‌ లోన్‌ అప్లికేషన్‌ ఫామ్‌ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. దీనిద్వారా గరిష్టంగా మూడు బ్యాంకులకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ఇలా ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను.. అభ్యర్థులు ప్రాథమ్యంగా పేర్కొన్న బ్యాంకులకు పంపిస్తారు. సదరు బ్యాంకులు దరఖాస్తును పరిశీలించి సంతృప్తి చెందితే.. తదుపరి దశలో ఏ బ్రాంచ్‌లో సంప్రదించాలి, ఏ ఏ పత్రాలు తీసుకెళ్లాలి అనే వివరాలను విద్యార్థులకు తెలియజేస్తారు.

### దరఖాస్తు ప్రక్రియ ఇలా

- ముందుగా విద్యాలక్ష్మి పోర్టల్‌లో ఆన్‌లైన్‌ ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలి. ఇందుకోసం లాగిన్‌ ఐడీ, పాస్‌వర్డ్‌ క్రియేట్‌ చేసుకోవాలి.
- ఆ తర్వాత కామన్‌ ఎడ్యుకేషన్‌ లోన్‌ అప్లికేషన్‌ ఫామ్‌ను పూర్తి చేయాలి.
- ఈ దరఖాస్తును పూర్తి చేసుకునే సమయంలో అభ్యర్థులు గరిష్టంగా మూడు బ్యాంకులను ఎంచుకోవచ్చు.
- తర్వాత సదరు బ్యాంకులు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు వివరాలను పరిశీలిస్తాయి.
- నిబంధనలకు అనుగుణంగా రుణ మంజూరుపై నిర్ణయం తీసుకుంటాయి.
- రుణ మంజూరు విషయాన్ని విద్యాలక్ష్మి పోర్టల్‌ లోనే పొందుపరుస్తారు.
- అలా రుణం పొందిన వారు మంజూరు చేసిన బ్యాంకును సంప్రదించాల్సి ఉంటుంది.

### ఉన్నత విద్య కోర్సులు

విద్యా లక్ష్మి పోర్టల్‌ ద్వారా దాదాపు అన్ని రకాల ఉన్నత విద్య కోర్సుల విద్యార్థులకు రుణాల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. సంప్రదాయ డిగ్రీలు మొదలు టెక్నికల్, ప్రొఫెషనల్‌ కోర్సుల వరకూ.. ఇలా పలు రకాల కోర్సుల్లో చేరే విద్యార్థులు రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.

### గుర్తింపు తప్పనిసరి

బ్యాంకులు విద్యా రుణం మంజూరలో నిర్దిష్ట నిబంధనలను అనుసరిస్తున్నాయి. బ్యాంకుల విధి విధానాల ప్రకారం-ఏఐసీటీఈ, యూజీసీ, ఎంహెచ్‌ఆర్‌డీ, ఆల్‌ ఇండియా అసోసియేషన్‌ ఆఫ్‌ యూనివర్సిటీస్‌ గుర్తింపు ఉన్న కళాశాలలు, కోర్సులనే విద్యా రుణ మంజూరులో పరిగణనలోకి తీసుకుంటారు. సదరు గుర్తింపు ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన విద్యార్థులకే విద్యా రుణం లభించే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా కోర్సులో ప్రవేశం ఖరారు చేసుకున్న తీరును కూడా బ్యాంకులు పరిగణనలోకి తీసుకుంటున్నాయి.

### ఎంట్రెన్స్‌లో ప్రతిభ

ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధించి కన్వీనర్‌ కోటాలో సీటు పొందిన వారికే బ్యాంకులు విద్యారుణ దరఖాస్తుకు అర్హత కల్పిస్తున్నాయి. సాధారణంగా మేనేజ్‌మెంట్‌ కోటాలో చేరాలనుకునే వారికి ఈ రుణ దరఖాస్తుకు అర్హత ఉండదు. పలు ప్రైవేట్‌ బ్యాంకులు మేనేజ్‌మెంట్‌ కోటాలో ప్రవేశం పొందిన వారికి కూడా దరఖాస్తుకు అవకాశం కల్పిస్తున్నాయి. కాని ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రం ఎంట్రన్స్‌లో మెరిట్‌ సాధించి ప్రవేశం పొందిన వారికే విద్యా రుణ మంజూరులో ప్రాధాన్యం ఇస్తున్నాయి.




### స్టడీ అబ్రాడ్‌కు రూ.20 లక్షలు

విద్యా రుణాలు స్వదేశంలో కోర్సులో చేరిన వారితోపాటు విదేశీ విద్య అభ్యర్థులకు కూడా అందుబాటులో ఉన్నాయి. మన దేశంలోని ఇన్‌స్టిట్యూట్‌ల్లో అడ్మిషన్‌ పొందిన విద్యార్థులకు గరిష్టంగా రూ.పది లక్షల వరకూ రుణం మంజూరు చేస్తున్నారు. విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశం ఖాయం చేసుకున్న వారికి గరిష్టంగా రూ.20 లక్షల వరకూ లోన్‌ లభిస్తోంది.

### మూడు శ్లాబ్‌ల్లో రుణాలు

- రుణ మంజూరులో బ్యాంకులు మూడు శ్లాబ్‌ల విధానాన్ని అమలు చేస్తున్నాయి.
- శ్లాబ్‌-1 మేరకు రూ.4 లక్షలు రుణ మొత్తంగా నిర్ణయించారు. ఈ శ్లాబ్‌లో విద్యార్థులు ఎలాంటి హామీ ఇవ్వక్కర్లేదు.
- శ్లాబ్‌-2 ప్రకారం-రూ.4 లక్షల నుంచి రూ.7.5 లక్షల వరకు రుణ మొత్తాన్ని కేటాయిస్తున్నారు. ఇందుకోసం తల్లిదండ్రుల హామీ, థర్డ్‌ పార్టీ గ్యారెంటీ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది.
- శ్లాబ్‌-3లో రూ.7.5 లక్షలకు పైగా రుణ మొత్తం ఉంటోంది. ఈ మొత్తానికి సరిపడే కొల్లేటరల్‌ సెక్యూరిటీ(స్థిరాస్తి పత్రాలను)ఇవ్వాల్సి ఉంటుంది.

### మార్జిన్‌ మనీ నిబంధన

విద్యార్థులు రుణ మొత్తంలో కొంత మార్జిన్‌ మనీగా సమకూర్చుకోవాల్సి ఉంటుంది. రూ.4 లక్షల వరకు ఎలాంటి మార్జిన్‌ మనీ అవసరం లేదు. కాని రూ.4 లక్షలు దాటిన రుణ దరఖాస్తులకు స్వదేశంలో చదివే విద్యార్థులు అయిదు శాతం, స్టడీ అబ్రాడ్‌ విద్యార్థులు 15 శాతం మార్జిన్‌ మనీని సమకూర్చుకోవాలి.

### రుణం లభించే వ్యయాలు

ట్యూషన్‌ ఫీజు, హాస్టల్‌ ఫీజు, ఎగ్జామినేషన్‌/లైబ్రరీ/లేబొరేటరీ ఫీజు; విదేశీ విద్య అభ్యర్థులు ప్రయాణ ఖర్చులు, పుస్తకాలు, యూనిఫామ్, ఇతర అకడమిక్‌ సంబంధిత పరికరాల కొనుగోలుకు అయ్యే వ్యయం, కంప్యూటర్‌ కొనుగోలు వ్యయం, కోర్సు పరంగా అవసరమైన స్టడీ టూర్స్, ప్రాజెక్ట్‌ వర్క్స్‌ తదితరాలకు అయ్యే ఖర్చులు, ఇన్‌స్టిట్యూట్‌లు వసూలు చేసే కాషన్‌ డిపాజిట్, బిల్డింగ్‌ ఫండ్, రిఫండబుల్‌ డిపాజిట్‌లకు రుణం మంజూరు చేస్తారు. ఇవి నిర్దేశిత ట్యూషన్‌ ఫీజు మొత్తంలో 10 శాతానికి మించకుండా ఉండాలి. కంప్యూటర్‌ కొనుగోలు వ్యయం, స్టడీ టూర్స్, ప్రాజెక్ట్‌ వర్క్స్‌ కోసం ఇచ్చే మొత్తం ట్యూషన్‌ ఫీజులో 20 శాతానికి మించకుండా ఉంటుంది.

### ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌

ఐబీఏ మార్గనిర్దేశకాల ప్రకారం-గరిష్ట రుణ మొత్తం విషయంలో నిర్దిష్ట నిబంధనలు ఉన్నప్పటికీ.. విద్యార్థులు ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందితే ఆ గరిష్ట రుణ మొత్తాన్ని పెంచే విచక్షణాధికారాన్ని బ్యాంకులకు కల్పించింది. ఉదాహరణకు ఐఐఎంలు, ఐఐటీలు వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్‌లలో రూ.పది లక్షల కంటే ఎక్కువ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఇలాంటి ఇన్‌స్టిట్యూట్‌లలో ప్రవేశం పొందిన వారికి గరిష్ట రుణ పరిమితిలో సడలింపు ఇచ్చే అవకాశం ఉంది.

### అకడమిక్‌ ప్రతిభపై సమీక్ష

విద్యా రుణం మంజూరైన విద్యార్థికి సంబంధించిన ఫీజులను బ్యాంకులు నేరుగా సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌కే పంపుతాయి. ఒకవేళ తొలి దశలో విద్యార్థులు సొంతంగా ఫీజు చెల్లిస్తే సంబంధిత రశీదుల ఆధారంగా ఆ ఫీజును విద్యార్థికి అందిస్తాయి. ఆ తర్వాత దశ నుంచి ఇన్‌స్టిట్యూట్‌కే అందజేస్తాయి. అదే విధంగా రుణ మొత్తాన్ని ప్రతి ఏటా విద్యా సంవత్సరం ప్రారంభలో నిర్దేశిత గడువులోగా ఇన్‌స్టిట్యూట్‌కు పంపిస్తాయి. ఆ క్రమంలో అంతకుముందు సంవత్సరంలో సదరు విద్యార్థి అకడెమిక్‌ ప్రతిభను సమీక్షిస్తున్నాయి. దీని ఆధారంగా మిగతా రుణం మంజూరుపై నిర్ణయం తీసుకుంటున్నాయి.

### ఈ పత్రాలు తప్పనిసరి

విద్యా రుణానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు విద్యాలక్ష్మి పోర్టల్‌లో కొన్ని డాక్యుమెంట్లను అప్‌లోడ్‌ చేయాల్సి ఉంటుంది. అవి..ప్రవేశ ధ్రువీకరణ పత్రం, అకడమిక్‌ అర్హతల సర్టిఫికెట్‌ కాపీలు, కుటుంబ వార్షికాదాయ ధ్రువీకరణ పత్రం, కోర్సు వ్యయానికి సంబంధించి ఇన్‌స్టిట్యూట్‌ల నుంచి అధీకృత లెటర్స్‌.

- పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌: www.vidyalakshmi.co.in/Students/index

## క్లుప్తంగా...

### ఏపీ ఈఏపీసెట్ అర్హులకు బీఎస్సీ నర్సింగ్‌కు అవకాశం

**దరఖాస్తు గడువు ఈ నెల 18**

**సాక్షి, అమరావతి:** ఏపీ ఈఏపీసెట్-2023లో అర్హత సాధించిన విద్యార్థులందరూ బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు వీలు కల్పిస్తూ మంగళవారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో నేషనల్ నర్సింగ్ కౌన్సిల్(ఐఎన్‌సీ) నిర్దేశించిన కటాఫ్ మార్కులు వచ్చిన వారికి మాత్రమే ప్రవేశాల్లో అవకాశం కల్పించారు. అయితే రాష్ట్రంలో విద్యార్థుల నుంచి వస్తున్న వినతులను పరిగణలోకి తీసుకుని ఈఏపీసెట్‌లో అర్హత పొందిన వారందరికీ అవకాశం కల్పించేలా ఐఎన్‌సీకి విశ్వవిద్యాలయం ప్రతిపాదించగా, దానికి ఆమోదం లభించింది. దీంతో అర్హులైన విద్యార్థులు 18వ తేదీ సాయంత్రం నాలుగు గంటల్లోగా https://ugnursing.ysruhs.com వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాల్సిందిగా రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

### రేపటి నుంచి ఇంజినీరింగ్ తుది దశ కౌన్సెలింగ్

**సాక్షి, అమరావతి:** ఈఏపీ సెట్-2023 ఇంజినీరింగ్ ప్రవేశాల్లో భాగంగా గురువారం నుంచి తుది దశ కౌన్సెలింగ్ చేపడుతున్నట్టు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈఏపీ సెట్ ప్రవేశాల కన్వీనర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో ప్రాసెసింగ్ ఫీజు, 16 వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలన, 17లోగా ఐచ్ఛికాల నమోదు, మార్పులు, 21వ తేదీన సీట్ల కేటాయింపు చేపడతామన్నారు. విద్యార్థులు 25వ తేదీలోగా సీట్లు పొందిన కళాశాలల్లో నేరుగా రిపోర్టు చేయాలని సూచించారు.

### 'అక్షయ గోల్డ్' కుంభకోణంపై ఈడీ చార్జిషీట్

**దొండపర్తి (విశాఖ దక్షిణ):** అక్షయ గోల్డ్ కుంభకోణంపై ఈడీ అధికారులు విశాఖపట్నం మెట్రోపాలిటిన్ సెషన్స్ కోర్టులో మంగళవారం చార్జిషీట్ దాఖలు చేశారు. అక్షయ గోల్డ్ సంస్థ డైరెక్టర్లు భోగి సుబ్రహ్మణ్యం, దేవకి హరనాథ్ బాబు, ఎం.సుధాకర్ రావుపై ఈ చార్జిషీట్ దాఖలు చేశారు. చార్జిషీట్‌ను కోర్టు విచారణకు స్వీకరించింది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల్లో అక్షయగోల్డ్‌పై నమోదైన కేసుల ఆధారంగా ఈడీ విచారణ చేపట్టింది. ఈ కేసులో రూ.268.24 కోట్ల విలువైన ఆస్తులను ఇప్పటికే అటాచ్ చేసినట్లు ఈడీ తెలిపింది.

# పరాకాష్టకు టీడీపీ శవ రాజకీయం

**సాధారణ మరణాలను బాబు అరెస్టుకు ముడిపెడుతున్న వైనం**

**ఇదేం విడ్డూరం అంటూ నవ్వుకుంటున్న జనం**


ఆవేదనతో గుండె బద్దలై..
చంద్రబాబు అరెస్టు, రిమాండు వార్తలు చూసి 22 ... గుండెపోటు, మృతి

**సాక్షి నెట్‌వర్క్ :** చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక తెలుగుదేశం పార్టీ అభిమానులు ప్రాణాలు విడుస్తున్నట్లుగా ప్రజలను నమ్మించడానికి టీడీపీ విఫలయత్నం చేస్తోంది. అభూత కల్పనలు, అసత్య ప్రచారాలతో సహజ మరణాలను సైతం చంద్రబాబు అరెస్టు, జైలుకు ముడిపెట్టి శవ రాజకీయం కొనసాగిస్తోంది. ఈ విషయానికి పెద్ద ఎత్తున ప్రచారం కల్పించి, సానుభూతి పొందేందుకు పచ్చ బ్యాచ్ తెగతాపత్రయ పడుతోంది. నిజానికి.. 'పచ్చ' మీడియా పేర్కొన్న వారంతా అనారోగ్య కారణాలతో మరణిస్తున్నా 'బాబు అరెస్టును తట్టుకోలేక..' అంటూ నానా హడావుడి చేస్తోంది. టీడీపీ, ఎల్లో మీడియా భజనతో గ్రామాల్లో ప్రజలు నివ్వెరపోతున్నారు. మొత్తానికి 'సాక్షి' పరిశీలనలో తేలిన వాస్తవాలివి.

| పేరు | ఊరు | మృతికి అసలు కారణం |
|---|---|---|
| వెంకటేష్ | చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలం కొడతనపల్లె | కొంత కాలంగా అనారోగ్యం |
| వెంకటరమణయ్య | శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెం | నిర్లక్ష్యంతో బీపీ మాత్రలు వేసుకోక కళ్లు తిరిగి కిందపడి.. |
| శంకరప్ప (50) | చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గం పెద్దపంజాణి మండలం కత్తార్లపల్లి | - |
| సరిపూడి కోటేశ్వరరావు | పల్నాడు జిల్లా అమరావతి మండలం లింగాపురం | దీర్ఘకాలికంగా అనారోగ్యం |
| పెద్దచెన్నకేశవరావు (56) | గుంటూరు జిల్లా బేతపూడి శివారు రేగులగడ్డ | నాలుగేళ్లుగా అస్వస్థత |
| వేమూరి పార్థసారథి (74) | విజయవాడ ఆటోనగర్ | చంద్రబాబు అరెస్ట్‌కు ముందు రోజు నుంచే గ్యాస్ సమస్య |
| కుంచం సుబ్బారావు | ఎన్టీఆర్ జిల్లా తిరువూరు | సుదీర్ఘ కాలంగా కిడ్నీ సమస్య |
| జి.అప్పారావు (73) | విజయనగరం జిల్లా తెర్లాం మండలం టీకటిపేట- మోదుగువలస | వృద్ధాప్య సమస్యలు |
| ఇజ్జురోతు పైడితల్లి (67) | విజయనగరం జిల్లా గజపతినగరం మండలం జిన్నాం | పదేళ్లుగా హృద్రోగ సమస్య |
| కుక్కల ప్రకాశరావు (60) | ఎన్టీఆర్‌జిల్లా జగ్గయ్యపేట మండలం గౌరవరం | ఏడాదిగా మలమూత్ర విసర్జనలో తీవ్ర ఇబ్బంది |
| రాజులపాటి పరశురామయ్య (83) | పమిడిముక్కల మండలం గురజాడ | కొంతకాలంగా అనారోగ్యంతో మంచానికే పరిమితం |
| సపావత్తు వాల్యా నాయక్ (80) | కృష్ణాజిల్లా గన్నవరం మండలం వీరపనేనిగూడెం | భోజనం చేస్తూ ఉన్నట్లుండి కిందపడి |
| ఆర్ఆర్ రహీం (80) | శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ | వృద్ధాప్య సమస్యలు |
| రామచంద్ర (70) | శ్రీ సత్యసాయి జిల్లా ఓడీచెరువు మండలం గాజుకుంటపల్లి | రెండేళ్లుగా అనారోగ్యం |
| తలారి వంద్రప్ప (55) | అనంతపురం జిల్లా కణేకల్లు మండలం గోపులాపురం | అనారోగ్యం |
| బోయ శ్రీరాములు (64) | అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం ముద్దినాయనపల్లి | ఏడాదిగా ఆస్తమా |
| ఆంజనేయులు (60) | అనంతపురం జిల్లా గుత్తి మండలం ధర్మాపురం | కొద్ది రోజులుగా హై బీపీ |
| తోడికోడళ్లు విల్లూరి అప్పలనరసమ్మ (91), విల్లూరి మంగయమ్మలు(86) | అనకాపల్లి జిల్లా మునగపాక మండలం వాడ్రాపల్లి | ఏడాదిగా వృద్ధాప్య సమస్యలు |
| సుర్ల నారాయణమ్మ (58) | అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలంలోని జె.పి.అగ్రహారం | రెండేళ్లుగా కిడ్నీ వ్యాధి, ఉబ్బసం |
| సుందరరావు | నెల్లూరు జిల్లా ఉలవపాడు మండల పరిధిలోని టెంకాయచెట్లపాలెం | దంపతుల మధ్య గొడవలతో బలవన్మరణం |
| ఏసన్న | వైఎస్సార్ జిల్లా రాజుపాళెం మండలంలోని కుమ్మరపల్లె | చాలా సేపటిగా కట్టెలు కొడుతూ గుండెపోటు |
| జొన్నకూటి రాజు (51) | డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం నల్లూరు | కాలేయ సంబంధిత వ్యాధి ముదిరి |
| వీరన్న(54) | కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం అల్వాల | కిడ్నీ సమస్య, యూరిన్ ఇన్ఫెక్షన్ |
| సి. సుభాన్(32) | కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలం ఎస్.ఎర్రగుడి | వారం రోజులుగా మలం, మూత్రం రాక.. |
| సాదె లింగమయ్య(62) | నంద్యాల జిల్లా గోస్పాడు ఎస్సీ కాలనీ | రెండేళ్లుగా ఊపిరితిత్తుల సమస్య |
| చిన్నమాసుం(90) | నంద్యాల జిల్లా మిడుతూరు మండలం నాగలూటి | బీపీ, షుగర్, వారం రోజులుగా తీవ్ర అయాసం |
| తాడేపల్లి శేఖర్ (45) | పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి | కొద్ది రోజులుగా అనారోగ్యం |
| భీమడోలు వెంకయ్య (42) | జంగారెడ్డిగూడెం మండలం పేరంపేట | కొంత కాలంగా తీవ్ర అనారోగ్యం |
| గుడివాడ పిచ్చి లింగం (76) | కొయ్యలగూడెం మండలం యర్రంపేట | వయోభారంతో కొంత కాలంగా అనారోగ్యం |

# అరకు కాఫీ రుచి చూసిన జి 20 సమ్మిట్

**అంతర్జాతీయంగా మరోసారి ప్రాధాన్యం**


జి20 సమ్మిట్‌లో అరకు వ్యాలీ కాఫీ ప్రదర్శన

**సాక్షి, అమరావతి:** అంతర్జాతీయ గుర్తింపు కలిగిన అరకు కాఫీకి మరోసారి అరుదైన ప్రాధాన్యత దక్కింది. న్యూఢిల్లీలో రెండు రోజులపాటు జరిగిన జీ20 సమ్మిట్‌లో అరకు వ్యాలీ కాఫీ ప్రదర్శనకు అవకాశం రావడమే ఇందుకు కారణం. సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌లో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) గిరిజన ఉత్పత్తులను ప్రదర్శించింది. ఈ ఎగ్జిబిషన్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజన రైతులు పండించిన, ప్రత్యేకమైన, అధిక నాణ్యత ప్రమాణాలు కల్గిన కాఫీని ప్రదర్శించడం గమనార్హం. ఈ గ్లోబల్ ఈవెంట్‌లో అరకు వ్యాలీ కాఫీ ప్రదర్శన ద్వారా ప్రీమియం కాఫీ బ్రాండ్‌గా మాత్రమే కాకుండా వాణిజ్య పరంగా సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఉపయోగపడుతుందని జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి సాక్షికి తెలిపారు. జీ20 శిఖరాగ్ర సమావేశాలకు వచ్చిన పలు దేశాల ప్రతినిధులకు అరకు కాఫీ రుచిని పరిచయం చేయడం సంతోషంగా ఉందన్నారు. జీసీసీకి ఇంతటి గొప్ప అవకాశం కల్పించిన ప్రధాని మోదీ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శోభా స్వాతిరాణి, మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. కాగా అతిథులకు ఇచ్చే బహుమతుల్లో అరకు కాఫీని సైతం అందజేయడం విశేషం.

# రూ.కోట్లు కొట్టేసిన హ్యాకర్

- తప్పుదారి పట్టిన ఐటీ ప్రతిభ
- చిత్తూరుకు చెందిన ట్రిపుల్ ఐటీ పట్టభద్రుడి అరెస్ట్


సైబర్ హ్యాకర్ లక్ష్మీపతి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు నగలను పరిశీలిస్తున్న కమిషనర్ దయానంద్

**బనశంకరి (బెంగళూరు):** ట్రిపుల్ ఐటీలో చదివి సాఫ్ట్‌వేర్ రంగంపై మంచి పట్టు సాధించాడు. ప్రయత్నిస్తే పెద్ద కంపెనీలో సులువుగా ఉద్యోగం దొరికి రూ.లక్షల్లో జీతం వచ్చేది. కానీ.. ప్రతిభ పక్కదారి పట్టింది. హ్యాకర్‌గా మారి రూ.కోట్లను కొల్లగొట్టాడు. బెంగళూరు పోలీస్ కమిషనర్ బి.దయానంద్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం .. చిత్తూరుకు చెందిన లక్ష్మీపతి (27) అనే యువకుడు రివార్డ్స్ పాయింట్స్ వెబ్‌సైట్‌ను హ్యాక్ చేసి రూ.కోట్ల విలువైన బంగారు నగలు, ఖరీదైన వస్తువులను కొనుగోలు చేశాడు. నిందితుడి నుంచి రూ.4 కోట్ల 16 లక్షల విలువ చేసే 5.2 కేజీల బంగారు నగలు, 27 కేజీల వెండి, రూ.11.13 లక్షల నగదు, రూ.12 లక్షల విలువైన 7 ద్విచక్ర వాహనాలు, రూ.26 లక్షల విలువైన ఫ్లిప్‌కార్ట్ వ్యాలెట్లు, 2 ల్యాప్‌టాప్‌లు, 3 మొబైల్స్ తదితరాలను స్వాధీనం చేసుకున్నామని పోలీస్ కమిషనర్ తెలిపారు.

**బీటెక్ పూర్తి చేసి..**

ఒంగోలు ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తిచేసిన లక్ష్మీపతికి ఐటీ రంగంపై పట్టు ఉంది. దుబాయ్ వెళ్లి కొంతకాలం పనిచేసి తిరిగి బెంగళూరుకు వచ్చాడు. కాలేజీ రోజుల్లో నేర్చుకున్న హ్యాకింగ్ ద్వారా సైబర్ నేరాలు చేసి విలాసవంతమైన జీవితం గడిపేవాడు. రివార్డ్స్ 360 కంపెనీ వెబ్‌సైట్‌ను హ్యాక్‌చేసి ఓచర్లు కొట్టేసి ఈ-కామర్స్ కంపెనీల ద్వారా కోట్లాది రూపాయల విలువ చేసే బంగారు, వెండి, ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసినట్టు తేలింది. రివార్డ్స్ 360 కంపెనీ డైరెక్టర్ తమ కస్టమర్లకు అందించే ఓచర్లను ఇంకా లబ్ధిదారులకు అందజేయకముందే ఎవరో హ్యాక్‌చేసి వినియోగిస్తున్నట్టు బెంగళూరు ఆగ్నేయ విభాగం సీఈఎన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇది హ్యాకర్ల పని అని నిర్ధారించి సాంకేతికత సాయంతో దర్యాప్తు జరిపి లక్ష్మీపతిని అరెస్ట్ చేశారు. కేసు విచారణలో ఉందని కమిషనర్ తెలిపారు.

# గగన్‌యాన్ తరహాలో 'సముద్రయాన్'

**రేణిగుంట/ఏర్పేడు(తిరుపతి జిల్లా):** గగన్‌యాన్ తరహాలో సముద్రయాన్‌కు భారత శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారని, వచ్చే ఏడాది ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించే అవకాశం ఉందని కేంద్ర ఎర్త్ సైన్సెస్ సెక్రెటరీ, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ రవిచంద్రన్ తెలిపారు. డీప్ ఓషన్ టెక్నాలజీ మిషన్‌లో భాగంగా సముద్ర వనరులు, సముద్రగర్భంలోని జీవ వైవిధ్యంపై అధ్యయనం చేసేందుకు ఈ ప్రాజెక్ట్‌ను చేపడుతున్నట్లు చెప్పారు. తిరుపతి ఇన్నోవేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ, విజ్ఞానభారతి సంయుక్తంగా తిరుపతి ఐఐటీలో మంగళవారం నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ మిషన్‌పై నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో రవిచంద్రన్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ..ముగ్గురు ఆక్వానాట్స్‌తో ప్రయాణం చేయడానికి అనువైన జలాంతర్గామిని ఈ పరిశోధనకు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఆయిల్ అండ్‌గ్యాస్, మెటల్స్ వంటి సముద్ర ఆర్థిక వనరులను సమగ్రంగా గుర్తించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు.


రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో నాలుగో ప్లాట్‌ఫారం

**ఔటర్‌లో ఆగాల్సిన పనిలేదు**

రైల్వేస్టేషన్‌లో నాలుగు,ఐదు ప్లాట్‌ఫారాల నిర్మించడంతో ఔటర్‌లో రైళ్లను నిలపాల్సిన పనిలేదు. దీని వలన ప్రయాణికులకు ఎంతగానో వెసులుబాటు కల్గుతుంది. నెలరోజుల్లో ఫ్లాట్‌ఫారాల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురానున్నాం.

–ఎం.గంగాప్రసాద్, స్టేషన్‌సూపరింటెండెంట్, రైల్వేస్టేషన్,రాజమహేంద్రవరం.

# ఔటర్‌లో వెయిటింగ్‌కు చెక్

## రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో 4,5 ఫ్లాట్‌ఫారాలు ప్రారంభం

| నెలరోజుల్లో పూర్తికానున్న పనులు | కొత్త ప్లాట్‌ఫారాలతో తీరనున్న 'ఔటర్' సమస్య | రోజూ ఈ స్టేషన్ మీదుగా 150 రైళ్లరాకపోకలు |
|---|---|---|


నాలుగు,ఐదు ప్లాట్‌ఫారాల వద్ద మెట్ల నిర్మాణం

**అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్):** హమ్మయ్య గోదావరి వంతెన దాటేశాం..ఇంకేముంది రాజమహేంద్రవరం వచ్చేసినట్టే..రైలు గోదావరి వంతెన దాటుతున్నప్పుడు ప్రయాణికుల ఫీలింగ్ ఇది. కానీ వంతెన దాటాక రైలు వేగం నెమ్మదిగా తగ్గుతూ రైల్వే స్టేషన్ ఔటర్‌లో అగిపోతుంది. కారణం స్టేషన్లో ప్లాట్‌పారమ్స్ తక్కువగా ఉండటమే. సిగ్నల్ త్వరగా రాదు. స్టేషన్లో ఖాళీ ఉండదు. ఇది రోజూ ఔటర్లో ప్రయాణికులకు ఎదురయ్యే అనుభవం. కొద్ది రోజుల్లోనే ఈ సమస్యకు పరిష్కారమవుతోంది. రైలు ప్రయాణికులకు సంతోషకరమైన సమాచారం ఇది. ఈ నిరీక్షణ సమస్యకు రైల్వేశాఖ చెక్ పెడుతోంది.

**ఇప్పటివరకూ మూడే**

రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం మూడు ప్లాట్‌ఫారాలు ఉన్నాయి. దీంతో పాటు అదనంగా నాలుగు,ఐదు ప్లాట్‌ఫారాలను నిర్మించారు. ఈ కొత్త ప్లాట్‌ఫారాల నుంచి మంగళవారం రైళ్ల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. కొత్త ప్లాట్‌ఫారాలను రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ లాంఛనంగా ప్రారంభించారు. దీంతో ఔటర్‌లో రైళ్ల నిలపాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ రైల్వే స్టేషన్‌కు ప్రత్యేకమైన చరిత్ర ఉంది. ఇది దక్షిణమధ్య రైల్వే జోన్, విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోకి వస్తుంది. 1900లో ప్రారంభమైంది. 1980-81 మధ్యలో ఎలక్ట్రిఫికేషన్ ప్రారంభించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా ప్రయాణికులకు అత్యంత సౌకర్యవంతమైన ప్రదేశం. కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, ఏజెన్సీ తదితర జిల్లాల ప్రజలు ఈ స్టేషన్ ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు.

**కొత్త ప్లాట్‌ఫారాలపై వసతులు**

ఇన్నాళ్లూ మూడు ప్లాట్‌ఫారాలు మాత్రమే ఉండటం ప్రయాణికులు ప్రధాన సమస్యగా ఉండేది. ఎక్కువ రైళ్లు ఈ మార్గంలో రాకపోకలు సాగించడం వల్ల కొన్నింటిని స్టేషన్‌లో ప్లాట్‌ఫారం దొరికేవరకూ ఔటర్‌లో నిలిపేయాల్సి వచ్చేంది. దీంతో ప్రయాణికుల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. గత ప్రభుత్వంలో రూ.6 కోట్లతో నాలుగు,ఐదు ప్లాట్‌ఫారాల నిర్మాణానికి ఆమోదం లభించినా పనులు ముందుకు సాగలేదు. ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఈ విషయంలో చొరవ తీసుకున్నారు. విజయవాడ డీఆర్ఎంతోను, రైల్వేశాఖామంత్రి దృష్టికి తీసుకువెళ్లి పనులను వేగవంతమయ్యేలా చర్యలు చేపట్టారు. రూ.8.89 కోట్లకు పనుల బడ్జెట్‌ను సవరించేలా కృషి చేశారు. ఎప్పటికప్పుడు రైల్వే ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షిస్తూ త్వరితగతిన ప్లాట్‌ఫారాలు ప్రారంభమయ్యేలా చూశారు. మరో నెలరోజుల్లో పూర్తిస్థాయిలో పనులు పూర్తవుతాయి. అప్పుడు కొత్తవి ప్రయాణికులకు అందుబాటులో రానున్నాయి. ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఆగని దూర ప్రాంతాల రైళ్లు ఈ ప్లాట్‌ఫారాల మీదుగా వెళ్లవచ్చు. ఇక్కడ టాయిలెట్లు, తాగునీటి వసతి కల్పించారు. షెల్టర్,లిఫ్ట్, వెయిటింగ్‌హాల్స్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

**స్టేషనుకు విశేష ప్రాధాన్యత**

- రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ నుంచి దేశవ్యాప్తంగా ఎక్కడికైనా ప్రయాణించే వీలుంది.
- ఢిల్లీ, కన్యాకుమారి, అసోం, దిబ్రూగఢ్, గుజరాత్, భావనగర్ తదితర సుదూర ప్రాంతాలకు ప్రయాణించవచ్చు.
- దేశంలోనే అత్యధిక దూరం (4,189 కిలోమీటర్లు) నడిచే దిబ్రూగఢ్-కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ కూడా ఈ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగిస్తోంది.
- పరిమిత స్టేజ్‌లు ఉన్న కోరమండల్ సూపర్ ఫాస్ట్ లాంటి ట్రైన్లకు ఇక్కడ హాల్టింగ్ ఉందంటే ఏ మేరకు ప్రాధాన్యత ఉందో అర్థం అవుతుంది.
- ఇటీవల పాపులర్ అయిన వందేభారత్ కూడా ఈ స్టేషన్లో ఆగుతుంది.
- రోజూ ఈ స్టేషన్ మీదుగా 150 రైళ్లు వెళుతున్నాయి. 70 రైళ్లు ఆగి రాకపోకలు సాగిస్తుంటాయి.
- వీటిలో రోజుకు 12 వేల మంది ప్రయాణిస్తుంటారు.
- పండుగల సీజన్‌లో ఆ సంఖ్య 15 నుంచి 16 వేలకు చేరుతుంటుంది.
- హౌరా-చెన్నై మెయిన్ లైన్‌లో రైల్వే స్టేషన్ ఉండటంతో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# సత్యగిరిపై స్మార్త ఆగమ విద్యా సౌరభం

## ఇక్కడ విద్యనభ్యసించిన ఆరుగురికి పరిచారక ఉద్యోగాలు

- స్టైపెండ్ నెలకు రూ.వేయి నుంచి రూ.మూడు వేలకు పెంపు
- దేవస్థానం ధర్మకర్తల మండలి తీర్మానాలు
- గురుకులాల మోడల్‌లో ఆగమ పాఠశాల
- ప్రస్తుతం 34 మంది విద్యార్థులు


చదువు చెబుతున్న ఉపాధ్యాయుడు నర్సింహమూర్తి, పర్యవేక్షణ చేస్తున్న వేద పండితుడు ముష్టి పురుషోత్తం

**అన్నవరం:** శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలోని సత్యగిరిపై నిర్వహిస్తున్న శ్రీసత్యదేవ స్మార్త ఆగమ పాఠశాలలో విద్యార్థులకు దేవస్థానం ధర్మకర్తల మండలి శుభవార్త తెలిపింది. ఇక్కడ విద్య పూర్తి చేసుకున్న ఆరుగురు విద్యార్థులను దేవస్థానంలో 'సంభావన పురోహితులు'గా నియమించేందుకు తీర్మానం చేసింది. ఇక్కడ విద్యార్థులకు నెలనెలా చెల్లిస్తున్న ఉపకార వేతనం రూ.వేయి నుంచి రూ.మూడు వేలకు పెంచుతూ తీర్మానించారు. దీంతో ఇక్కడ స్మార్త, ఆగమ విద్యనభ్యసిస్తున్న 34 మంది విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. అన్నవరం దేవస్థానంలో సోమవారం ధర్మకర్తల మండలి చైర్మన్ ఐవీ రోహిత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఈ మేరకు ప్రతిపాదన ప్రవేశపెట్టగా ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్రప్రసాద్, సభ్యులు ఈ తీర్మానాలను ఆమోదించారు.

**నెరవేరిన మంత్రి హామీ**

రూ.ఐదు కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీసత్యదేవ, స్మార్త, ఆగమ పాఠశాలను గత ఏడాది ఆగస్టు 13వ తేదీన డిప్యూటీ సీఎం, దేవదాయ, ధర్మాదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. ఆ సందర్భంగా మంత్రి సత్యనారాయణ మాట్లాడుతూ ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులకు ఇక్కడే ఉపాధి చూపిస్తామని ఈ దేవస్థానంతో బాటు ఇతర దేవస్థానాలలోపరిచారకులు, అర్చకులు, పురోహితులుగా నియమిస్తామని తెలిపారు. ఏడాది తిరక్కుండానే ఆ హామీ నెరవేరింది. దీంతో ఆ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**రాష్ట్రంలోనే తొలిసారిగా గురుకులం మోడల్‌లో పాఠశాల నిర్మాణం**

స్మార్త, ఆగమ, వైదిక పండితులను తయారు చేసేందుకు సత్యగిరిపై శ్రీ సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాలను నిర్మించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా రూ. ఐదు కోట్ల వ్యయంతో ఐదు ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. టైల్స్ వంటి ఇటుకలతో గోడలు నిర్మించి పెంకుతో పై కప్పు ఏర్పాటు చేశారు. వేడి రాకుండా మధ్యలో మళ్లీ ఆ ఇటుకలతోనే అటకల మాదిరి ఏర్పాటు చేశారు. వెలుపల నుంచి చూస్తే ఓ అందమైన రిసార్టులా ఇది దర్శనమిస్తుంది. వాస్తవానికి 2017 లోనే ఈ భవనాలకు రూపకల్పన చేసినా 2019 వరకు పనులు నత్తనడకన సాగాయి. 2019 నుంచి పనులు వేగవంతమై 2022 మే నెలాఖరు కల్లా పూర్తయ్యాయి. మొత్తం పది భవనాలు నిర్మించారు. ఇక్కడే గురువులకు నివాస భవనం, విద్యార్థులకు వసతి భవనం, యాగశాల, మంచినీటి సౌకర్యం, విశాలమైన రోడ్లు నిర్మించారు. ఒకసారి పాఠశాలలో అడుగు పెట్టిన విద్యార్థి చదువు పూర్తయ్యాక మాత్రమే బయటకు వెళ్లేలా అన్ని ఏర్పాట్లు చేశారు.

**12 సంవత్సరాల నుంచి రత్నగిరిపై ఆగమ పాఠశాల నిర్వహణ**

అన్నవరం దేవస్థానంలో 12 సంవత్సరాల క్రితమే శ్రీసత్యదేవ స్మార్త ఆగమ పాఠశాలను స్థాపించి విద్యార్థులను స్మార్త, ఆగమ పండితులుగా తీర్చిదిద్దుతున్నారు. ఐదేళ్ల బ్యాచ్‌కు 12 మంది చొప్పున ఇప్పటి వరకు సుమారు నాలుగు బ్యాచ్‌లలో 35 మంది విద్యార్థులకు ఉచితంగా స్మార్త, ఆగమ విద్య బోధించారు. ప్రస్తుతం నూతన స్మార్త, ఆగమ పాఠశాలలో 34 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి ప్రతి నెలా రూ.వేయి స్కాలర్‌షిప్పును వారి పేరున బ్యాంకులో జమ చేస్తూ వస్తున్నారు. ఆ మొత్తం ఇప్పుడు రూ.మూడు వేలకు పెంచారు. విద్య పూర్తయ్యాక సర్టిఫికెట్‌తో బాటు ఐదేళ్ల స్కాలర్‌షిప్పు మొత్తాన్ని వడ్డీతో అందజేయనున్నట్లు ఈఓ అజాద్ తెలిపారు.

**ప్రణాళికాబద్ధంగా చదువు... ఆహారం..క్రీడలు**

పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా వివిధ వైదిక కార్యక్రమాలకు సంబంధించిన విద్య బోధించడం, పౌష్టిక ఆహారం అందించడం, సాయంత్రం వ్యాయామం కోసం క్రీడలు నిర్వహిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆరాధ్యుల లక్ష్మీనృశింహం తెలిపారు. ప్రతీ రోజు ఒక వేద పండితుడు ఇక్కడ విద్యార్థులకు స్మార్త,ఆగమ పాఠ్యాంశాలపై సందేహాలు నివృత్తి చేస్తున్నారని తెలిపారు. దేవాలయాలలో జరిగే వైదిక కార్యక్రమాలు, ఇతర పండగలు, ఉత్సవాలు, కార్యక్రమాల్లో పూజలు, అర్చనల్లో కూడా విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

## క్లుప్తంగా

### 25 చోరీ బైక్‌ల స్వాధీనం



స్వాధీనపరుచుకున్న చోరీ బైక్‌లతో పోలీసు అధికారులు

కంప్లి: గ్రామాల్లో చోరీలకు పాల్పడిన ద్విచక్ర వాహనాల దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి 25 బైక్‌లను కురుగోడు పోలీసులు స్వాధీనపరచుకున్నట్లు జిల్లా ఎస్పీ రంజిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాన నిందితుడు బళ్లారి శాంతినగర్ నివాసి శ్యాంసుందర్‌ను అరెస్ట్ చేసి అతడి నుంచి బళ్లారి కౌల్‌బజార్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన 3 బైక్‌లతో సహా రూ.17.50 లక్షల విలువ చేసే 25 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ బైక్‌లను నిందితుడు ఓర్వాయి గ్రామానికి చెందిన కరీం అనే వ్యక్తికి తక్కువ ధరకు విక్రయించాడని పోలీసుల దర్యాప్తులో తేలిందని తెలిపారు. ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

### బస్టాండ్ పనుల సత్వర పూర్తికి సూచన

రాయచూరు రూరల్: కొత్త బస్టాండ్ నిర్మాణ పనులను త్వరగా ముగించాలని చిన్న నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఎస్.బోసురాజు ఆర్టీసీ అధికారులకు సూచించారు. సోమవారం సిరివారలో బస్టాండ్ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రెండేళ్లు గడుస్తున్నా పనులు జాప్యం కావడాన్ని తప్పుబట్టారు. మంత్రి వెంట మాన్వి ఎమ్మెల్యే హంపయ్య నాయక్, అధికారులున్నారు. కాగా రాత్రి నగరంలోని కిల్లే బృహన్మఠంలో శ్రావణమాస పురాణ ప్రవచన కార్యక్రమంలో మంత్రిని శాంతమల్ల శివాచార్య స్వామీజీ సన్మానించారు.

### బస్సు సర్వీసు ప్రారంభం

కంప్లి: హగరిబొమ్మనహళ్లి నుంచి 3 కి.మీ.ల దూరంలోని మినీ విధానసౌధకు గాళెమ్మ దేవస్థానం నుంచి ఏర్పాటు చేసిన బస్సు సౌకర్యాన్ని ఎమ్మెల్యే కే.నేమిరాజ్ నాయక్ సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షేత్ర అభివృద్ధికి శ్రీకారం లభించిందన్నారు. రైతులు, సామాన్య ప్రజల సౌకర్యార్థం ఈ సిటీ బస్సు ప్రతి 30 నిమిషాలకు ఒకసారి రాకపోకలు సాగిస్తుందన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మొక్కలతో పచ్చదనం వృద్ధి



మొక్కను నాటుతున్న అధికారులు

హొసపేటె: మన చుట్టుపక్కల ప్రాంతంలో మొక్కలను నాటి పెంచి పోషించి పచ్చదనం, ఉత్తమ వాతావరణాన్ని నెలకొల్పాలని తాలూకా విద్యా శాఖ అధికారి చెన్నబసప్ప తెలిపారు. ఆయన మంగళవారం నగరంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సస్యశ్యామల కార్యక్రమాన్ని మొక్కకు నీరు పోసి ప్రారంభించి మాట్లాడారు. సమాజ అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం అక్కమహాదేవి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### రైల్లో ప్రయాణికులకు అస్వస్థత

సాక్షి బళ్లారి: బెళగావి జిల్లాలో నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైల్లో పలువురు ప్రయాణికులు అస్వస్థతకు గురైన ఘటన మంగళవారం జరిగింది. గోవా నుంచి ఢిల్లీకి వెళ్తున్న నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్‌లో 8 మంది యువకులు స్పృహ తప్పి పడిపోయారు. దీంతో రైల్వే పోలీసులు వారిని బెళగావి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే ఎవరికీ ప్రాణహాని లేదని చికిత్స అనంతరం వైద్యులు విజయ్‌కుమార్ తెలిపారు.

### వార్తా శాఖ సీనియర్ ఏడీగా జడియప్ప



బాధ్యతలను స్వీకరించిన జడియప్పను అభినందిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: బళ్లారి వార్తా శాఖ నూతన సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా జడియప్ప మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఉన్న ఇన్‌చార్జ్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన తుకారాం రావ్ చిత్రదుర్గకు బదిలీ అయ్యారు. జడియప్ప ఇంతకు ముందు వార్తా, ప్రజా సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఆయనను ప్రభుత్వం పదోన్నతి కల్పించి సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్(న్యూస్ అండ్ పబ్లిక్ రిలేషన్స్)గా బళ్లారికి బదిలీ చేసింది.

### బాల కార్మికులకు విముక్తి

హొసపేటె: బాలకార్మికుల రక్షణ టాస్క్‌ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో తాలూకాలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం దాడులు చేసి ఐదుగురు బాలురను రక్షించినట్లు కార్మిక అధికారి సూర్యప్ప దొంబర్మత్తూరు తెలిపారు. వివిధ శాఖల అధికారుల సహకారంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో గ్యారేజీలు, బేకరీలు, హోటళ్లు, మెకానిక్, పండ్ల, కిరాణా తదితర దుకాణాల్లో అధికారుల బృందం దాడి చేసి ఐదుగురు బాల కార్మికులను పని నుంచి విముక్తి కల్పించి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. అంగళ్ల యజమానులపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.

# కందిబేడల ధరలకు రెక్కలు

- కలబుర్గి, బీదర్ జిల్లాల్లో విస్తారంగా పంట సాగు
- త్వరలో రూ.200 దాటుతుందంటున్న వ్యాపారులు



సాక్షి, బళ్లారి: అన్ని రంగాల్లోనూ వ్యాపారుల మాయజాలమే కనిపిస్తోంది. వ్యవసాయ రంగంలో అయితే మరీ దారుణం. రైతులు పంట పండించే వరకే. పంట పండించిన తర్వాత వ్యాపారులదే పైచేయిగా మారుతోంది. ఆరుగాలం కష్టపడి పని చేసి, వేలాది రూపాయలు అప్పులు చేసి పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర కోసం పోరాటాలు చేస్తే, రైతుల వద్ద కొనుగోలు చేసిన వ్యాపారులు, రైతులు వద్ద స్టాక్ లేదని తెలిసిన మరుక్షణమే ధరలను ఆకాశాన్నంటించడం పరిపాటిగా మారింది. కర్ణాటకలో కంది పంటకు పేరొందిన కలబుర్గి, బీదర్ జిల్లాల్లో విస్తారంగా లక్షలాది ఎకరాల్లో కంది పంటను సాగు చేస్తారు. ప్రతి ఏటా ఈ రెండు జిల్లాల్లో దాదాపు 13 లక్షల ఎకరాల్లో కంది సాగు చేస్తారని అంచనా. కళ్యాణ కర్ణాటక జిల్లాల్లోనే పెద్ద ఎత్తున రైతులు కందిని పండించడంతో దేశ, విదేశాలకు కూడా కలబుర్గి కందిని ఎగుమతి చేస్తారు. ఈ రెండు జిల్లాల్లో పండించిన కందిబేడలు తినడం వల్ల పౌష్టికాహారంతో పాటు మంచి ఆరోగ్యం కూడా లభిస్తుందని చెబుతుంటారు. అయితే రైతులు పండించినప్పుడు గిట్టుబాటు ధరల కోసం పెద్ద ఎత్తున పోరాటం చేసినా వారికి కనీసం క్వింటాల్ కందికి రూ.6 వేలు నుంచి రూ.7 వేలు కూడా దక్కలేదు.

**ప్రస్తుతం కిలో ధర రూ.180 దాటిన వైనం**

ఈ రెండు జిల్లాల్లో గత ఏడాది పండించిన కందిని పూర్తిగా విక్రయించేశారు. వ్యాపారుల వద్దకు చేరింది. ఉన్నఫళంగా నెల రోజుల నుంచి కంది బేడలు కొండెక్కిస్తున్నారు. గత ఏడాది ఇదే సమయానికి కంది బేడల ధర రూ.100 నుంచి రూ.120 లోపు మాత్రమే ఉంటే ప్రస్తుతం రూ.170 నుంచి రూ.180ల ధర వరకు కంది బేడలను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో కంది బేడల ధర రూ.200లు దాటే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొంటున్నారంటే వారి చేతుల్లోనే కంది బేడల ధరల మాయజాలం ఉందన్నమాట. కంది బేడల ధర ఏకంగా కిలో రూ.200 దాటితే సామాన్యుడికి కందిపప్పు తినడం కష్టతరంగా మారుతుంది. మంచి బలవర్ధక ఆహారంలో ఒకటైన కందిబేడల ధర కిలో రూ.200 వరకు చేరుకుంటే తాము ఎలా తినాలని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి వర్షాలు కూడా అంతంత మాత్రంగానే కురవడంతో కంది పంట సాగు చేసిన రైతులు కూడా పంట పండుతుందా? లేదా? అని భయాందోళన చెందుతున్నారు.

**వర్ణనాతీతంగా ప్రజల బాధలు**

ఒక వేళ పంట పండినా కంది పంట చేతికొచ్చే సరికి మరో మూడు నెలలు పడుతుంది. కంది పంట పండిన తర్వాత వాటిని ఆరబోసి, కందిని తీసి, బ్యాళ్లు చేసే సమయం మరో నెల రోజులు ఆలస్యం అవుతుంది. ఈ ఏడాది సాగు చేసిన కంది బేడలు మార్కెట్‌కు వచ్చే వరకు వ్యాపారుల దగ్గర ఉన్న కంది ధరను ఎంతకు పెంచినా గత్యంతరం లేక కొనుగోలు చేయాల్సిందేనన్న మాట. కంది బేడల ధర రోజురోజుకు పెరుగుతుండటంతో వినియోగదారుల బాధలు వర్ణించలేని విధంగా ఉన్నాయి. మొన్న రెండు నెలల పాటు టమాటా, కూరగాయల ధరలు కొండెక్కి కూర్చొని పేదలు కన్నీరు కారిస్తే, ప్రస్తుతం కంది బేడల ధరలు పేదలకు కన్నీరు తెప్పిస్తున్నాయి. కంది బేడల ధరలు కిలో రూ.180లు పలుకుతున్నా రైతులకు కిలోకు రూ.60 నుంచి రూ.70లు మాత్రమే దక్కిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది పంట చేతికొచ్చిన తర్వాత తమకు క్వింటాల్ గరిష్ట ధర రూ.10 వేలు కూడా దక్కకుండా పంట పండిన తర్వాత మళ్లీ అమాంతంగా తగ్గించేస్తారని రైతులు పేర్కొంటున్నారు.

## 22 ఏళ్లప్పుడు చోరీ..80 ఏళ్లప్పుడు అరెస్ట్.!

- బీదర్ జిల్లాలో ఘటన

సాక్షి,బళ్లారి: ఏదైనా నేరం చేస్తే ఎప్పటికైనా దొరుకుతారనేది నిరూపితమైంది. అయితే తప్పు చేసిన వ్యక్తిని ఏకంగా 58 ఏళ్ల తర్వాత పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు..1965 ఆగస్టు 25న బీదర్ జిల్లా మహాకర్ గ్రామంలో మాణిక్ రావ్ కులకర్ణి అనే వ్యక్తి తన రెండు గేదెలు, ఒక దూడను దొంగిలించారని ఫిర్యాదు చేయడంతో అప్పట్లో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన కిశన్ చందర్, గణపతి విఠల్ అనే యువకులను అరెస్ట్ చేసి బెయిల్‌పై విడుదల చేశారు. నిందితుల్లో ఒకడైన గణపతి విఠల్ వయస్సు 22 ఏళ్లు. అయితే కోర్టుకు చెప్పిన సమయానికి హాజరు కాకుండా, ఎన్నిసార్లు వారెంట్లు జారీ చేసినా ఇద్దరు కాలయాపన చేస్తూ వచ్చారు. ఈ కేసులో ఒక నిందితుడైన కిశన్ చందర్ 2006 ఏప్రిల్‌లో మృతి చెందాడు. మరో నిందితుడి కోసం వారెంట్లు జారీ అవుతూనే ఉన్నాయి. ప్రస్తుతం బీదర్‌కు వచ్చిన ఎస్పీ చెన్నబసవణ్ణ జిల్లాలోని లాంగ్ పెండింగ్ రిపోర్ట్(ఎల్‌పీఆర్) కేసులను సీరియస్‌గా తీసుకుని నిందితులను అరెస్ట్ చేయాలని ఆదేశించారు. ఈ ఎల్‌పీఆర్‌తో 22 ఏళ్ల వయస్సులో రెండు గేదెలను దొంగిలించి కోర్టుకు హాజరుకాకపోవడంతో ప్రస్తుతం 2023 సెప్టెంబర్‌లో 80 ఏళ్ల వయస్సుగల వృద్ధుడైన నిందితుడిని అరెస్ట్ చేయాల్సి వచ్చిందని పోలీసులు తెలిపారు.

## హాస్టల్ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు

గంగావతి: కుష్టిగిలోని కొప్పళ రోడ్డులో బీసీఎం విద్యార్థుల హాస్టల్ భవన నిర్మాణానికి కొప్పళ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివరాజ్ తంగడిగి మంగళవారం భూమిపూజ నెరవేర్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం పాటు పడుతోందన్నారు. విద్యార్థులకు ప్రధానంగా వసతి సౌకర్యాన్ని కల్పించే దిశగా కుష్టిగిలో సొంత హాస్టల్ భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, కుష్టిగి ఎమ్మెల్యే దొడ్డనగౌడ పాటిల్, బీసీఎం శాఖ అధికారులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీలు నగరంలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బళ్లారి రేంజ్ ఐజీ లోకేష్‌కుమార్, కొప్పళ జిల్లా ఎస్పీ యశోద, డీఎస్పీ, సీఐ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తులకు అన్నసంతర్పణ

హొసపేటె: శ్రావణమాసం చివరి సోమవారం పురస్కరించుకుని హంపీలో విరుపాక్షేశ్వర స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకొన్నారు. కాగా హంపీ అతిథిగృహ మార్గదర్శనం నుంచి విరుపాక్షేశ్వర ఆలయం వరకు పూజలకు విచ్చేసిన భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నసంతర్పణ జరిపారు.


### ప్రభుత్వ స్థలాల కబ్జా తగదు

రాయచూరు రూరల్: నగరసభ ఆధీనంలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమార్కులు పార్కులు, గుడులను నిర్మించడం తగదని సామాజిక కార్యకర్త మారెప్ప ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాణిక్ ప్రభు కాలనీలో నగరసభ పరిధిలోని ఉద్యానవనాలకు కేటాయించిన స్థలాలను స్వాధీనం చేసుకుని పెద్ద భవనాలు నిర్మించుకుంటున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు మౌనం వహించారని ధ్వజమెత్తారు. ఆక్రమణదారులపై చర్యలు చేపట్టి స్థలాలను స్వాధీనపరుచుకోవాలని డిమాండ్ చేశారు.

### డెంగీపై జాగృతి జాతా

రాయచూరు రూరల్: నగరంలో డెంగీ వ్యాధిపై జాగృతి జాతాకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మలేరియా సూపర్‌వైజర్ సంధ్యా పిలుపునిచ్చారు. మంగళవారం లాల్ బహదూర్ శాస్త్రినగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో జాతాను ప్రారంభించి ఆమె మాట్లాడారు. మురికివాడల్లో చికెన్ గున్యా, డెంగీ వ్యాధులపై ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు.

### వాసవీ ఆలయ కార్యవర్గం ఎంపిక



నూతన అధ్యక్ష, పదాధికారులను అభినందిస్తున్న దృశ్యం

బళ్లారిఅర్బన్: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ పాలక మండలి నూతన కార్యవర్గాన్ని మంగళవారం బెంగళూరు రోడ్డులోని దేవస్థానంలో కమిటీ సభ్యుల సమక్షంలో ఎంపిక చేశారు. 2023 నుంచి 2026 వరకు దేవస్థానం మేనేజింగ్ ట్రస్ట్ అధ్యక్షులుగా గాదెం గోపాలకృష్ణ, పదాధికారులుగా విట్టా కృష్ణకుమార్, అశ్వత్ నారాయణశెట్టి, జయంతి కిషోర్‌కుమార్ జాయింట్ ట్రస్టీలుగా ఎంపికయ్యారు. కాగా నూతన కార్యవర్గాన్ని సభ్యులు, పదాధికారులు అభినందించారు.

### వర్షాల కోసం పూజలు



అలంకరణలో మారికాంబ అమ్మవారు

మాలూరు: తాలూకాలో వానలు బాగా కురిసి రైతులకు మేలు జరగాలని ప్రార్థిస్తూ మంగళవారం దిన్నేరి హారోహళ్లిలోని పురాతన మారికాంబ ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు నారాయణాచారి నేతృత్వంలో ఈ పూజలను నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. మహిళలు ఆరతి తంబిట్టు దీపాలను అమ్మవారికి సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. హెచ్‌టీ కెంచప్ప, టి.వెంకటప్ప, వి.నారాయణస్వామి, హెచ్ఎన్ నారాయణస్వామి, హెచ్ఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అర్హులకు ఇళ్లను కేటాయిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూపా శశిధర్

కేజీఎఫ్: నగరంలో నివసిస్తున్న ఎల్‌ఐజీ, ఆర్థికంగా బలహీన వర్గాల వారి కోసం 1979లో కర్ణాటక గృహ మండలి నుంచి ఆశ్రయ పథకంలో భాగంగా మంజూరైన 83 ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందిస్తామని ఎమ్మెల్యే రూపా శశిధర్ తెలిపారు. మంగళవారం నగరంలోని మస్కంలో నివాసం ఉంటున్న లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఆమె మాట్లాడారు. 15 ఏళ్ల క్రితం రూ.25 వేలు ఉన్న డిపాజిట్ మొత్తాన్ని నేడు రూ.2 లక్షలు చేశారన్నారు. ఇక్కడ నివాసం ఉంటున్న వారందరూ పేదలు కావడం వల్ల గతంలో నిర్ణయించిన రూ.25 వేలనే డిపాజిట్‌గా తీసుకోవాలని గృహమండలికి విన్నవిస్తున్నట్లు తెలిపారు. నగరసభ సభ్యుడు కోదండ, శాలిని నందకుమార్, కరుణాకరన్, కర్ణాటక గృహ మండలి ఏఈఈ భవ్య, నగరసభ కమిషనర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### సరళంగా శ్రీకృష్ణ జయంతి

రాయచూరు రూరల్: నగరంలో మంగళవారం శ్రీకృష్ణ జయంతిని సరళంగా ఆచరించారు. తైత్ర సిద్ధాంత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు జరిపి బాలలతో శ్రీకృష్ణుని పాత్రలు వేయించారు. నగర వీధుల గుండా శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఊరేగించారు. హిందూ సనాతన ధర్మాలను, త్రైత సిద్ధాంతాలను గురించి ప్రచారం చేశారు.

## ఘనంగా తాయమ్మదేవి జాతర మహోత్సవం



పూర్ణకుంభాలతో భక్తుల ఊరేగింపు



ఎమ్మెల్యే జనార్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గంగావతి: నగరంలోని మురహరినగర్‌లో తాయమ్మదేవి 51వ జాతర మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఎమ్మెల్యే గాలి జనార్ధన రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అమ్మవారికి దేవస్థాన అభివృద్ధికి తన సొంతంగా రూ.15 లక్షలను అందిస్తానని భరోసా ఇచ్చారు. కాగా ఉదయాన్నే అమ్మవారికి పలు అభిషేకాలు, విశేష అలంకరణ పూజలు జరిపారు. అనంతరం అమ్మవారిని మహిళలు కుంభాలతో ఊరేగించారు. కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, మాజీ ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి, మాజీ ఎమ్మెల్సీ హెచ్ఆర్.శ్రీనాథ్, దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శి, పదాధికారులు పాల్గొన్నారు.

## జ్ఞానంతో కూడిన విద్య అవసరం



ప్రారంభిస్తున్న యశ్వంత్ భూపాల్ తదితరులు

సాక్షి బళ్లారి: జ్ఞానం అలవర్చుకోవడంతోనే ఉత్తమ సమాజ స్థాపన సాధ్యమని టీఈహెచ్ఆర్‌డీ ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌జేవీ మహిపాల్ అన్నారు. మంగళవారం ఆయన బీఐటీఎం కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బీఐటీఎం ఇంజినీరింగ్ కళాశాల కళ్యాణ కర్ణాటకలో మంచి పేరు గడించడంతో పాటు ఈ ప్రాంత విద్యార్థులకు బంగారు బాట వేస్తోందన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పలు విద్యాసంస్థలు నడుస్తున్నాయన్నారు. వేలాది మంది విద్యార్థులకు విద్యాబోధన కల్పిస్తున్నామన్నారు. కళాశాల అధ్యక్షుడు యశ్వంత్ భూపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు శ్రద్ధ, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి ఉత్తమ భవిష్యత్తుకు సంస్థ నాంది పలుకుతుందన్నారు. అమర్‌రాజ్ భూపాల్, వీ.జే.భరత్, డాక్టర్ రాఘవేంద్ర జోషి, డాక్టర్ వి.సి. పాటిల్, డాక్టర్ టి.మాచప్ప, డాక్టర్ సురేష్, డాక్టర్ ఎస్.మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# కోలారు వార్తలు...

## అమరవీరులకు ఘన నివాళి



స్మారకానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కోలారు: వన్యప్రాణులను రక్షిస్తున్న అటవీ శాఖ సిబ్బంది ప్రథమ కర్తవ్యం అని జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి శుక్లాక్ష పాలన్ తెలిపారు. మంగళవారం అటవీశాఖ కార్యాలయంలో జాతీయ అమరవీరుల దినోత్సవం సందర్భంగా అమరవీరుల స్మారకానికి పుష్పార్చన గావించి మాట్లాడారు. అటవీశాఖ సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి వన్యజీవులను రక్షిస్తున్నారన్నారు. వారి సేవలు శ్లాఘనీయమన్నారు. అటవీ, వన్యజీవుల సంరక్షణ కోసం ఎంతో మంది ప్రాణాలను కూడా కోల్పోయారన్నారు. వారి పేర్లు అటవీ శాఖలో చిరస్థాయిగా నిలిచి పోయాయన్నారు. నేడు అటవీ సంపదను కొంత మంది ఆక్రమించుకుని కొల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అటవీ సంపదను నాశనం చేయడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తాయన్నారు. ఫస్ట్ గ్రేడ్ జేఎంఎఫ్‌సీ జడ్జి శ్రీనివాస్ ఎస్‌పాటిల్, కలెక్టర్ అక్రం పాషా, సీఈఓ పద్మ బసవంతప్ప, ఎస్పీ ఎం నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర ప్రయత్నంతోనే విజయం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: నిరంతర ప్రయత్నం ద్వారానే విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధ్యమని జ్ఞాన గంగోత్రి పోటీ పరీక్షల శిక్షణా సంస్థ డైరెక్టర్ ఎస్.సురేష్ తెలిపారు. మంగళవారం చెన్నయ్య రంగమందిరంలో వివేక్ ఇన్ఫోటెక్ పోటీ పరీక్షల శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వివేక రత్న అవార్డు ప్రదాన కార్యక్రమంలో అవార్డును స్వీకరించి ఆయన మాట్లాడారు. అభ్యర్థులు మొదటి నుంచి పరీక్షల కోసం అన్ని విధాలుగా సిద్ధమైతేనే విజయం సాధ్యమని అన్నారు. ఇతర పనులను పక్కన బెట్టి కేవలం పోటీ పరీక్షలకు సిద్ధం కావడంలో విద్యార్థులు నిమగ్నం కావాలన్నారు. సంస్థ డైరెక్టర్ ఎ ప్రమోదకుమార్ మాట్లాడుతూ పోటీ పరీక్షల శిక్షణలో వివేక్ ఇన్ఫోటెక్ సంస్థ అత్యధిక ఫలితాలను సాధించి తనదైన గుర్తింపు పొందిందన్నారు. అనంతరం వివేకరత్న పురస్కృత సురేష్‌ను సన్మానించారు. సంపన్మూల వ్యక్తి ఎస్.కిరణ్‌కుమార్, ఎన్‌కె నాగేష్ పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలపై నిరసన



నిరసన తెలియజేస్తున్న జేడీఎస్ కార్యకర్తలు

కోలారు: విద్యుత్ కోతలను ఖండిస్తూ జేడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని బెస్కాం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీఎస్ కార్యకర్తలు మాట్లాడుతూ అప్రకటిత విద్యుత్ కోతలతో విద్యుత్ సరిగా సరఫరా కాక రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గృహాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ప్రభుత్వం వ్యవసాయ పంప్‌సెట్లకు విద్యుత్ సరిగా సరఫరా చేయకపోతే ఎలా? అని ప్రశ్నించారు. ఇదే విధంగా కొనసాగితే భవిష్యత్తులో జేడీఎస్ ఆధ్వర్యంలో భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ధర్నాలో జేడీఎస్ నాయకులు సీఎంఆర్ శ్రీనాథ్, జేడీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు బణకనహళ్లి నటరాజ్, తాలూకా అధ్యక్షుడు బాబు మౌని, వక్కలేరి రాము, శ్రీరాం, పాలాక్షగౌడ పాల్గొన్నారు.

### అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రైతు మల్లేశప్ప(ఫైల్)

రాయచూరు రూరల్: అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన కలబుర్గి జిల్లాలో జరిగింది. చించోళి తాలూకాకు చెందిన మల్లేశప్ప(63) అనే రైతు పంటల సాగు కోసం కర్ణాటక గ్రామీణ బ్యాంక్, ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంక్‌ల్లో రూ.8 లక్షలను అప్పు చేశాడు. అయితే అనావృష్టితో వేసిన పంటలు చేతికందలేదు. దీంతో అప్పుల బాధ తాళలేక చివరికి ఇంటిలోనే విషం తాగాడు. అతనిని కలబుర్గి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు.

### పెట్రోల్ బంక్‌లో కారుకు మంటలు

సాక్షి, బళ్లారి: బెళగావిలోని నెహ్రూ కాలనీలో పెట్రోల్ బంక్‌లో మంగళవారం కారులో మంటలు చెలరేగాయి. శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ సమీపంలోని పెట్రోల్ బంక్‌లోకి ఓ వ్యక్తి కారుతో పెట్రోల్ కోసం రాగా ఉన్నఫళంగా కారులో మంటలు వ్యాపించాయి. వెంటనే సిబ్బంది అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందిని రప్పించడంతో త్రుటిలో పెను ముప్పు తప్పింది.

### కళా నాటక రంగాలపై పరిశోధనలు జరగాలి

కంప్లి: జానపద కళలు, బయలు నాటక రంగంపై విరివిగా పరిశోధనలు జరగాలని హగరిబొమ్మనహళ్లి ఏకీకరణ ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ సుజాత అక్కి అన్నారు. ఆమె హగరిబొమ్మనహళ్లి తాలూకాలోని తంబ్రహళ్లిలో బండె రంగనాథ స్వామి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా మంగళవారం బయలు నాటక ప్రాయోజిత అధ్యయన కేంద్రం ప్రారంభోత్సవానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ కేంద్రాన్ని ప్రారంభించే అవకాశం తనకు లభించడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

### భార్య హత్య కేసులో భర్తకు శిక్ష

హుబ్లీ: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్న భార్యను హత్య చేసిన ముద్దాయికి 3వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. ధార్వాడకు చెందిన గణేష్ అనే వ్యక్తి 2020 ఆగస్టు 11న రాజీవ్‌గాంధీ నగర్‌లో నిర్మాణ దశలో ఉన్న కట్టడంలో వివాహేతర సంబంధం నెరుపుతున్న వ్యవహారాన్ని పసిగట్టిన అతడి భార్య శిల్పను ఆమె భర్త ఇనుప కడ్డీతో కొట్టి హత్య చేశాడు. కేసు నమోదు చేసుకున్న విద్యాగిరి సీఐ మహంతేష్ కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించారు. కేసు విచారణ చేసిన సదరు కోర్టు న్యాయమూర్తి సుబ్రమణ్య పై మేరకు శిక్ష విధించారు. ప్రశాంత్ తోరగల్ ప్రభుత్వం తరపున కేసును వాదించారు.

### విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి బుగ్గి

హుబ్లీ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అంగడిలో ఆకస్మికంగా అగ్నిప్రమాదం వాటిల్లి లక్షలాది రూపాయల విలువ చేసే వస్తువులు ఆహుతైన ఘటన మంగళవారం జనతా బజార్‌లో చోటు చేసుకుంది. శివప్ప నాయకకు చెందిన పోలీస్ స్టోర్‌లో ఈ ప్రమాదం వాటిల్లింది. అక్కడ పోలీస్ శాఖకు సంబంధించిన యూనిఫాం తదితర సామగ్రిని తయారు చేసే వారు. సోమవారం అర్ధరాత్రి అంగడిలో ఎవరూ లేని సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. ఘటనపై ఉప నగర పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


### 17న కళ్యాణ కర్ణాటక దినోత్సవం



మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ అనురాధ

హొసపేటె: నిజాం పాలన నుంచి ఇండియన్ యూనియన్‌లో విలీనమైన రోజును కళ్యాణ కర్ణాటక దినోత్సవంగా జరుపుకుంటున్నామని డిప్యూటీ కలెక్టర్ జి.అనురాధ తెలిపారు. కళ్యాణ కర్ణాటక దినోత్సవంపై జిల్లాధికారి కార్యాలయ హాలులో మంగళవారం నిర్వహించిన ముందస్తు ఏర్పాట్ల సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. కళ్యాణ కర్ణాటకలో భాగమైన విజయనగర జిల్లాలో కూడా దినోత్సవం జరపాలని సూచించారు. ఈనెల 17న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జెండా ఆవిష్కరణ, సర్దార్ వల్లభాయి పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారన్నారు. కవాతు నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని జిల్లా స్టేడియంలో ఉదయం ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమం, అధ్యక్ష ఉపన్యాస కార్యక్రమం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జెడ్పీ డిప్యూటీ సెక్రటరీ భీమప్ప లాలీ, సబ్ డివిజనల్ అధికారి నొంగ్జై మహమ్మద్ అలీ అక్రమ్ షా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### వైభవంగా మహంత ఆరాధనోత్సవాలు



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు, కళాకారులు

రాయచూరు రూరల్: బాగల్‌కోటె జిల్లా ఇలకల్‌లో చిత్తరిగి విజయ మహంత స్వామి ఆరాధనోత్సవాలు స్వాముల మఠంలో జరిగాయి. సోమవారం మఠంలో స్వామి మూల విరాట్‌కు ఊంజల సేవలు జరిగాయి. భక్తుల సందడి మధ్య రథోత్సవం నిర్వహించారు. రథోత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు పాల్గొని తమ కళాప్రతిభతో భక్తులను మెప్పించారు. ఐదు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో నిత్యం దాసోహం చేశారు. రాజోళి నారాయణ రావ్, శ్రీకాంత్ గుళ్లేద్, అంబన్న, తిరుపతి దీపా సాలిమఠ్ తదితరులు పాల్గొన్నారు.